క్రాంతి 25 సం॥ల ప్రత్యేక సంచిక

# క్రాంతి

### లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| సెప్టెంబర్ 11 దాడులు... | 6 |
| ప్రభుత్వంతో చర్చలు... | 16 |
| ఫీల్డ్ రిపోర్టులు... | 20 |
| పత్రికల గురించి... | 22 |
| చైనా 'సోషలిజం'... | 35 |
| ఆర్టీసీ సమ్మె... | 37 |


భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 25 సంచిక : 5 సెప్టెంబరు-అక్టోబరు 2001 వెల : ఐదు రూపాయలు

# విజయవంతమైన 25వ సం॥లోకి అడుగిడిన 'క్రాంతి'కి విప్లవ జేజేలు పలుకుదాం!

## పోరాటాల పొత్తిళ్లలో పుట్టింది 'క్రాంతి'!!

## సమరశీల ప్రజాపోరాటాలే అన్నపానీయాలుగా, సాయుధ విప్లవోద్యమమే ఊపిరిగా ఎదుగుతూ వచ్చింది 'క్రాంతి'!

## ప్రజాపోరాట వేదికగా దీన్ని మరింత బలోపేతం చేద్దాం!!

## పార్టీ చేతిలోని సిద్ధాంత, రాజకీయ ఆయుధంగా దీన్ని మరింత పదును పెడదాం!!!

### విప్లవకర ప్రజాపంథాలో 'క్రాంతి' ఆవిర్భావం!

భారతదేశంపై 'వసంత మేఘగర్జన'గా అభివర్ణించబడిన మహత్తర నక్సల్‌బరి సాయుధ రైతాంగ తిరుగుబాటు అనేది భారతదేశ కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ఒక కీలకమైన మలుపనే చెప్పాలి. 'ఒక చిన్న నిప్పురవ్వ దావానలంగా రగులుతుంది' అనే మావో బోధనని అక్షరాలా రుజువు చేస్తూ నక్సల్‌బరి నిప్పురవ్వ అనతికాలంలోనే శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట జ్వాలగా రగిలింది. ఈ నేపథ్యంలోనే 'విప్లవకర పార్టీలేనిదే విప్లవం లేదు' అనే లెనిన్ సూక్తిని అనుసరిస్తూ నక్సల్‌బరి నిర్మాత కా॥ చారుమజుందార్ నేతృత్వంలో 22-4-1969న భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆవిర్భవించింది. చైనాలానే మన దేశ సామాజిక వ్యవస్థ అర్ధవలస అర్ధభూస్వామ్య స్వభావంతో కూడినదనే సరైన విశ్లేషణ ప్రాతిపదికగా ఇక్కడ సైతం అనుసరించాల్సిన వ్యూహం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహంగా వుంటుందని; ఆ వ్యూహాన్ని అమలు చేయడానికి సాయుధ పోరాట ఎత్తుగడల పంథానే తప్ప పార్లమెంటరీ ఎన్నికల పంథా మార్గం కాదని 1970ల నాటి తన ప్రథమ కాంగ్రెస్‌లో భా.క.పా (మా-లె) తీర్మానించింది. 1970ల నాటి మన ఎత్తుగడల పంథా (దీన్నే సాధారణంగా పార్టీ పంథా అని వ్యవహరిస్తుంటాం) అంటే సాయుధ పోరాటపంథా, మౌలికంగానూ ప్రధానంగాను సరైందే అయినప్పటికీ అందులో ప్రజాయుద్ధానికి ప్రాణం వంటి ప్రజాపంథా (మాస్‌లైన్) లోపించిన కారణంగా పార్టీ నేతృత్వంలోని రైతాంగ విప్లవోద్యమం వెనుకడుగేసింది. ఉద్యమం వెనుకతట్టు పట్టడంతో పార్టీ చీలికలకు గురై పార్టీలో విచ్ఛిన్నకర శక్తులు విజృంభించి పార్టీ నాయకత్వంపైన ఉద్యమపంథా పైన అవకాశవాద దాడులకి దిగారు. ఒకపక్క ఈ దాడుల్ని తిప్పికొడుతూ ఇంకోపక్క పార్టీ ఉద్యమాలని అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి బయటపడవేసి, విప్లవకర ప్రజాపంథా పునాదిపై వాటిని పునర్నిర్మించే కర్తవ్యం ఆనాడు ప్రధానంగా ముందుకొచ్చింది. ఈ కర్తవ్య నిర్వహణకు సంబంధించిన కృషి దేశంలో ఇంకెక్కడ కంటే కూడా ఆంధ్ర రాష్ట్రంలో మరింత చురుగ్గాను నిర్మాణయుతంగానూ జరగిందని చెప్పాలి. కా॥ కె.ఎస్ నాయకత్వంలోని అప్పటి ఆంధ్రరాష్ట్ర పార్టీ ఎమ్.ఎల్ పార్టీ, ఉద్యమాలని; వాటికి నాయకత్వం వహించిన కా॥మజుందార్ నాయకత్వ పాత్రని స్వంతం చేసుకుంటూ; వాటి విప్లవాంశను గొప్ప వారసత్వ సంపదగా స్వీకరిస్తూ; అదే సందర్భంలో పార్టీ, వుద్యమాలని అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి బయట పడవేయాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగానే గుర్తిస్తూ తదనుగుణమైన కార్యాచరణ ప్రణాళిక గూర్చి నిశితంగా ఆలోచిస్తూ వచ్చింది. పార్టీ పంథాపై తిరోగమనవాదులు,

రివిజనిస్టులు, విచ్ఛిన్నకులు చేస్తుండిన అవకాశవాద దాడుల్ని తిప్పికొడుతూ; సాయుధ పోరాట మౌలికపంథాని ఎత్తిపడుతూ 'పిలుపు' పక్షపత్రిక ద్వారా సునిశిత సిద్ధాంత రాజకీయ పోరాటం నిర్వహించింది.

ఇలాంటి కృషి ఒక రూపం తీసుకుంటున్న సమయంలో ఎమర్జెన్సీ చీకటి పాలన విధించబడింది (1975 జూన్ 26). దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఎమర్జెన్సీ పాలనని ఛీకొట్టిన ఫలితంగా జరిగిన ఎన్నికలలో ఇందిరా నియంతృత్వ కాంగ్రెస్ ఓడి కలగూరగంప జనతా ప్రభుత్వం ఏర్పడింది. ఇది ఎమర్జెన్సీ దుష్పరిపాలనే ప్రధాన ప్రచారాస్త్రంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అయినందున పరిస్థితిలో కొంత వెసులుబాటు ఏర్పడింది. ఈ తాత్కాలిక వెసులుబాటు స్థితిని సాధ్యమైనంతగా విప్లవోద్యమ పునర్నిర్మాణానికి వినియోగించుకోవాలని నాటి పార్టీ ఆంధ్రరాష్ట్రకమిటీ భావించింది. ఈ ఆలోచనకి ప్రతిబింబమే 1977నాటి తెలంగాణ రీజియనల్ కాన్ఫరెన్స్ తీర్మానం. ఇది ప్రముఖంగా 'సాయుధ పోరాట విరమణ తీర్మానం'గా పిలవబడినప్పటికీ ఆచరణలోను, అంతఃస్సారంలోనూ అది సాయుధ పోరాటాన్ని మరింత సరిగాను సమర్థవంతంగానూ నిర్వహించడానికి వీలుగా మన ఎత్తుగడల పంథా అయిన సాయుధ పోరాటపంథాని ప్రజాపంథా పునాదిపై నిలబెట్టనుద్దేశించిందేనని చెప్పాలి! ఇదే నిజమని తదనంతర మన ఆచరణే రుజువు చేసింది. విప్లవకర ప్రజాపంథా పునాదిపై పార్టీ వుద్యమాల పునర్నిర్మాణ కృషిని ముందుకు తీసుకుపోవడానికి తనది అయిన ఒక కేంద్ర పత్రిక కలిగి వుండటం అవసరమని పార్టీ భావించింది. అలాంటి అవసరంలోంచి ఆలోచనలోంచి పుట్టుకొచ్చినదే 'క్రాంతి'! ఇదీ క్లుప్తంగా, 'క్రాంతి' ఆవిర్భావం వెనుకుండిన నేపథ్యం! ఈ నేపథ్యంతో 1977 అక్టోబర్ నెలలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, అంతర్జాతీయ కమ్యూనిస్టు విప్లవనేత అయిన కా॥ మావో స్మృత్యర్థ సంచికగా మహత్తర అక్టోబర్ విప్లవ జ్ఞాపకార్థ సంచికగా 'క్రాంతి' తొలిసంచిక వెలువడటం కేవలం యాదృచ్ఛికం కాదు. మా–లె–మా మార్గదర్శక సిద్ధాంత ఆయుధంగా స్వీకరించి, బోల్షివిక్ స్ఫూర్తితో పార్టీ ఉద్యమాల్ని పునర్నిర్మించే బృహత్తర కర్తవ్యాన్ని భుజాన్నెత్తుకున్న పార్టీ అధికార పత్రికకు అది సముచితమూ సందర్భోచితమూ అయిన ప్రారంభమే!

ప్రారంభించినది మొదలు నిత్య నిర్బంధాల మధ్యనే ప్రయాణం చేస్తూ, ప్రజల పోరాటాల దర్పణంగా నిలుస్తూ, శత్రు అణచివేతని అధిగమిస్తూ పురోగమిస్తూనే వచ్చింది 'క్రాంతి'! విప్లవకర ప్రజాపంథాకి ప్రాతినిధ్యం వహించే ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో కూడిన సమరశీల ప్రజాపోరాటాలకి దర్పణంగా పనిచేస్తూ వచ్చింది 'క్రాంతి'! గతంలో మనం అనుసరిస్తుండిన అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి మన పార్టీ వుద్యమాలు బయటపడగలిగాయి అనేదానికి నిదర్శనంగా రంగం మీదికొచ్చిన కరీంనగర్ (జగిత్యాల) ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల వాణిగా పనిచేసింది 'క్రాంతి'! ఆ పోరాటాల క్రమంలో రంగం మీదికొచ్చిన 'సాంఘిక బహిష్కరణ' లాంటి నూతన పోరాట రూపాలకి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పిస్తూ వచ్చింది. 'నూతన ప్రాంతాలకి పోరాటాల్ని విస్తరింపజేయాలి' అనే పార్టీ విధాన నిర్ణయానికి అనుగుణంగా పార్టీ నిర్మాణ వుద్యమాలులేని కొత్త ప్రాంతాలలో ఏ చిన్న ప్రజాందోళన జరిగినా దానికి ప్రాచుర్యాన్ని యిస్తూ ఆ రకంగా కొత్త ప్రాంతాలకి పార్టీ నిర్మాణ ఉద్యమాలు విస్తరించడానికి ఎంతగానో సహకరిస్తూ వచ్చింది 'క్రాంతి'. ఆ రకంగా ఆదివాసీ ప్రాంతాలలోకి విస్తరించిన మన పార్టీ, అక్కడి ప్రజా సమస్యలపై చేపట్టిన అనేక పోరాటాలకి గొప్ప ప్రచారవాహికగా పనిచేసింది క్రాంతి. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణాలో సమరశీల భూ పోరాటాలు ఊపందుకున్నాయి. వందల వేల ఎకరాలను రైతాంగ పేదలు స్వాధీన పరచుకున్నారు. దోపిడీ దొరలను గ్రామాలనుంచి తరిమేసారు. పార్టీ వుద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రం అయిన నేపథ్యంలో సహజంగానే రంగంమీదికి వచ్చిన 'కిడ్నాపింగ్', 'ప్రభుత్వ ఆస్థుల విధ్వంసం' లాంటి పోరాట రూపాలను విస్తృతంగా ప్రచారం చేసింది క్రాంతి. ఈ తీరులో పార్టీ నాయకత్వం క్రింద రైతాంగ పోరాటాలు క్రమంగా విస్తరిస్తూ బలం పుంజుకొంటున్నకొద్దీ పార్టీ యంత్రాంగంపై అందులో భాగంగా 'క్రాంతి' యంత్రాంగంపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రమైంది. ఇలాంటి నిర్బంధకాండ మధ్యనే నిలద్రొక్కుకుంటూ ఎదుగుతూ వచ్చిన తన ప్రయాణ క్రమాన్ని 1987 అక్టోబర్ నాటి దశాబ్ది సంచికలో 'క్రాంతి' ఈ క్రింది విధంగా సమీక్షించుకుంది.

## దశాబ్ది సమీక్ష

''గ్రామసీమలలో కేంద్రీకరించి కా॥ మావో బోధించిన ప్రజాపంథాలో ప్రజా సమస్యలను పరిష్కరించి, వారిని పోరాటానికి ఉత్తేజపరిచి, గ్రామీణ పీడిత ప్రజలపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పాలి. ఇంతవరకూ మనకు గ్రామాలతో అలాంటి సజీవ సంబంధాలు లేకపోవడమూ, గ్రామాలలో తగిన ప్రజాపునాది లేకపోవడమూ మన పార్టీ అభివృద్ధికి పెద్ద అవరోధంగా వుంది. కేవలం ప్రజల అభిమానమే చాలదు. పీడిత ప్రజలపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పాలి'' అంటూ పార్టీ చేపట్టిన ఆ కర్తవ్య నిర్వహణలో క్రాంతి తన వంతు పాత్ర పోషిస్తూ ''ఉద్యమ అవసరాల రీత్యా సమన్వయాన్ని సాధించే పోరాట వేదికగా విప్లవ పత్రికను స్థాపించడం తక్షణ అవసరంగా ముందుకురాగా'' అలాంటి అవసరాన్ని తీరుస్తూ రంగం మీదికొచ్చిన ''క్రాంతి పత్రికను తమదిగా స్వీకరించిన ప్రజలు అది నిలద్రొక్కుకోవడానికి వీలుగా ఎంతో చైతన్యంతో ముందుకు వచ్చి చందాలు కట్టారు. ఆర్థిక వనరులు సేకరించడంలో ఎంతోమంది కామ్రేడ్స్ కృషి చేసారు. రచనా వ్యాసంగాల ద్వారా పత్రిక కొనసాగడానికి మేధావులు తోడ్పడ్డారు..... ఆ విధంగా క్రాంతి పత్రిక మనుగడ ఒక సమిష్టి కృషిగా కొనసాగింది. ఎందరో ఎన్నో విధాలుగా నిమగ్నమైన కారణంగా క్రాంతి ఆవిర్భవించింది. అశేష పీడిత ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించగలుగుతోంది. ఒకటి, రెండు వేలతో ప్రారంభమైన దాని సర్క్యులేషన్ కొద్ది సంవత్సరాలలోనే ఆరువేలకు చేరుకుంది... పోరాట నివేదికలు పంపేవారు, క్రమం తప్పకుండా పత్రికను చదివి సలహాలు, సహాయ సహకారాలు అందించేవారు, వ్యాసాలు రాసేవారు, సంపాదక వర్గం, నిర్వాహకులు, పత్రిక ముద్రణ, పంపిణీలకు బాధ్యత వహించేవారు, దాన్ని ప్రజల్లోకి తీసుకుపోయే వారు–వీరందరి వెచ్చటి పొత్తిళ్లలోనే క్రాంతి రూపురేఖలు దిద్దుకుని, శ్రామికుల పోరాట సంస్థగా పెంపొందింది''.

సునిశిత సిద్ధాంత రాజకీయ పోరాట నిర్వహణలో 'క్రాంతి' పోషిస్తూ వచ్చిన పాత్రని గూర్చి దశాబ్ది సమీక్ష ఏమని చెప్పిందంటే ''భారత విప్లవోద్యమంలో సరైన సిద్ధాంత రాజకీయ పోరాటానికి ఒరవడి దిద్దిన ఆనాటి 'పిలుపు' పత్రిక సంప్రదాయాన్ని ఎమర్జెన్సీ తరువాత 'క్రాంతి' జయప్రదంగా కొనసాగించింది..... క్రాంతిలో ప్రచురితమైన వ్యాసాలు పార్టీ శ్రేణుల్లోను, పీడిత ప్రజానీకంలోనూ మార్క్సిజం–లెనినిజం పట్ల లోతైన అవగాహనను పెంపొందించాయి. విభిన్న ఆంతరంగిక పోరాటాల ద్వారానే పీపుల్స్‌వార్ పార్టీ అభివృద్ధి అయి నేటి స్థితికి చేరుకుంది... ఆ అభివృద్ధి క్రమంతో క్రాంతి సహజంగానే విడదీయరాని విధంగా పెనవేసుకుపోయింది''. పత్రికపై విరుచుకుపడిన నిర్బంధం, దాన్ని అధిగమిస్తూ క్రాంతి నిలద్రొక్కుకొచ్చిన తీరు గూర్చి దశాబ్ది సమీక్ష ఏం చెప్పిందంటే ''ప్రజాస్వామిక హక్కులన్నింటినీ కాలరాచి వేసినట్లే పత్రికా స్వేచ్ఛపై దాడిచేస్తూ ఎన్.టి.ఆర్. ప్రభుత్వ పోలీసులు 1985 నవంబర్ 16 రాత్రి దొంగల్లా క్రాంతి కార్యాలయంపై దాడిచేసి విప్లవ సాహిత్యాన్ని, పత్రికా ప్రతులను, పత్రిక రికార్డులను ఎత్తుకుపోయారు. పత్రిక ప్రచురణపై నిఘా పెంచారు. దీనితో క్రాంతి పత్రికను రహస్యంగా నిర్వహిస్తే తప్ప అది నిలవలేని పరిస్థితి ఏర్పడింది. తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో పార్టీ ప్రచార యంత్రాంగాన్ని రహస్యంగా నిర్వహించడం

విప్లవోద్యమ క్రమంలో ఒక ఆవశ్యకమైన అవసరంగానే రూపొందుతుంది. నానాటికీ తీవ్రమవుతున్న నేటి ఫాసిస్టు నిర్బంధ పరిస్థితుల్లో పీడిత ప్రజానీకానికీ–పత్రికకూ బలమైన సంబంధాలు ఏర్పడి పత్రిక కొనసాగడానికి ప్రజల సహకారం, అండదండలు ఇంకా ఎంతో అవసరం. ఎంతటి నిర్బంధ పరిస్థితులలో కూడా ప్రజలకు పత్రికను అందించడం ధ్యేయంగా పెట్టుకుని కృషి కొనసాగాలి''.

''గ్రామీణ పీడిత రైతాంగంలో విప్లవ చైతన్యాన్ని రగిలించి, పోరాటపథంలో వారిని సంఘటితపరిచి నడిపించాలనే లక్ష్యంతో ఆరంభమైన విప్లవ కృషి తొలిదినాలలో పుట్టింది 'క్రాంతి'! ఆ పోరాట తరంగాలలోనే ఎదిగింది 'క్రాంతి' అంటూ పది సంవత్సరాలపాటు విప్లవ పోరుబాటలో విజయవంతంగా తాను చేస్తూ వచ్చిన ప్రయాణాన్ని సమీక్షించుకున్నది. క్రాంతి ''క్రాంతికి ఊపిరీ, ఉత్తేజమూ పీడిత ప్రజల పోరాటాలే! ఈనాటి జనం పోరు రేపటి ఉజ్వల భవిష్యత్తుకు నాంది.... పీడిత ప్రజల జీవితాన్ని, పోరాటాన్నీ, ఆకాంక్షల్నీ ప్రతిబింబించిన 'క్రాంతి' నాడు సాధించిన ఎన్నో విజయాలను రికార్డు చేసింది. దోపిడీ పీడనలను భూస్థాపితం చేయడానికి కొనసాగే మహాప్రస్థానంలో పీడిత ప్రజల పరంపర విజయాల గీతికగా 'క్రాంతి' ఆలాపన మారుమ్రోగాలి. అదే మా ఆకాంక్ష! అదే మా ఆరాటం! – అంతిమ విజయం మనదే'' అంటూ అచంచల ఆత్మవిశ్వాసంతో విప్లవదీక్షా సంకల్పాన్ని ప్రకటించింది దశాబ్ది సమీక్ష!

## అజ్ఞాతవాసం

1987 అక్టోబర్ అనంతర కాలంలో, అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ 13వ కాన్ఫరెన్స్ అనంతర కాలంలో క్రాంతి ప్రయాణం గూర్చి చెప్పాల్సి వస్తే– దశాబ్ది సమీక్షలో అది ప్రకటించుకున్న ఆత్మవిశ్వాసం, సంకల్పాలకి అనుగుణంగానే అది సాగుతూ వచ్చినప్పటికీ సంస్థాపరంగా కొన్ని సమస్యలు, లోపాలు, పరిమితులతో అది కొనసాగుతూ వచ్చిందని చెప్పాలి. అయినా పత్రిక అవిచ్ఛిన్నంగా ప్రచురింపబడుతూ రావడం అనేది తక్కువ ప్రాధాన్యతగల విషయం కాదని కూడా మనం గుర్తించాలి. 1985లో కార్యాలయంపై జరిగిన దాడి తరువాత ఇక పత్రికను రహస్యంగా ప్రచురించడం అనివార్యమైందనే విషయం ముందే చెప్పుకున్నాం. ఈ నిర్బంధం మధ్యనే '87 తరువాత మిలిటెంట్ ప్రజాపోరాటాలు బ్రద్ధలయ్యాయి. ఈ పోరాటాల సందర్భంగా 'కిడ్నాపింగ్', 'ప్రభుత్వ ఆస్థుల విధ్వంసం' లాంటి నూతన పోరాటాలు రంగంమీదికి వచ్చాయి. వీటికి క్రాంతి తగిన ప్రాచుర్యాన్ని కల్పిస్తూ ఉద్యమ వ్యాప్తికి దోహదపడింది. ఆ తరువాత జరిగిన అనేక భూపోరాటాలకి క్రాంతి దర్పణంగా పనిచేస్తూ వచ్చింది. 1990లలో చెన్నారెడ్డి హయాంలో పార్టీపై వుండిన నిషేధం తొలగింపుతోపాటు నిర్బంధం సడలడంతో కొంత తాత్కాలిక వెసులుబాటు పరిస్థితి ఏర్పడింది. అలా వచ్చిన లీగల్ అవకాశాలని సాధ్యమైనంతగా వినియోగించుకోవాలే తప్ప పార్టీ యంత్రాంగాన్ని పత్రికా యంత్రాంగాన్నీ లీగలైజ్ చేయరాదనే పార్టీ నిర్ణయానికనుగుణంగా 'క్రాంతి' అజ్ఞాత పత్రికగానే కొనసాగింది. లీగల్ అవకాశాలను నేర్పుగా ఉపయోగించుకుంటూ పార్టీ నిర్మించిన ప్రజాపోరాటాల, భూపోరాటాల వెల్లువకి క్రాంతి ఒక వేదికగా పనిచేసింది.

## 'క్రాంతి' యంత్రాంగం

వ్యాసాల ఎంపిక, తయారీ; పోరాట నివేదికల సంకలనం, సంపాదకత్వం; ఇతర రచనా వ్యాసంగాలకి సంబంధించిన బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్; పత్రిక, ప్రచురణలు ముద్రణకి పోయేముందు టైపింగ్, మేకప్, ప్రూఫ్‌రీడింగ్ పనులు నిర్వహిస్తూ ముద్రణకి వీలుగా వాటికి తుదిరూపమిచ్చే బాధ్యతలు చూసే కామ్రేడ్స్; పత్రిక ఇతర ప్రచురణల ముద్రణ బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్; పార్టీ శ్రేణులకి ప్రజలకి పత్రికని వివిధ ప్రచురణలని సరఫరా చేసే బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్–ఇలా వేరువేరుగా వుంటూనే పరస్పర సమన్వయంతో పనిచేసే నాలుగు విభాగాలతో కూడినదిగా క్రాంతి యంత్రాంగం వుంటోంది. పత్రిక ప్రారంభమైన '77 నుండి పార్టీకి చెందిన అనేకమంది కామ్రేడ్స్ క్రాంతి, ఇతర ప్రచురణల నిర్వహణలో తమ శ్రమ, ప్రతిభ, శక్తిసామర్థ్యాలు, అంకితభావంతో అందిస్తూ, క్రాంతి విజయయాత్రలో విడదీయరాని భాగస్వాములవుతూ వచ్చారు, వస్తున్నారు.

పత్రిక ప్రచురణ యంత్రాంగం కొన్ని సమస్యలు, కొన్ని లోపాలతో తీసుకుంటూ నడుస్తూ వస్తోందని ముందొక సందర్భంలో చెప్పుకున్నాం. పార్టీ ఆంధ్ర రాష్ట్రకమిటీ తన 1995 నాటి రాజకీయ నిర్మాణ సమీక్షలో వీటిని ఈ క్రింది విధంగా గుర్తించింది. ''పార్టీలో కొనసాగిన వ్యక్తిగత ఫంక్షనింగ్ ప్రభావం ఏ.పి.సి. (ఏజిటేషన్ అండ్ ప్రోపగాండా కమిటీ)లోనూ, ప్రెస్ యూనిట్‌లోనూ మరింత కొట్టొచ్చినట్టు ప్రతిబింబించింది.... ఈ యూనిట్ల నిర్వహణను చెక్ చేయడంలో రాష్ట్రకమిటీ ఒక కమిటీగా పెద్దగా పట్టించుకోక పోవడం.... ఇవన్నీ ఈ శాఖను నిర్వహించడంలో గతంలో మన లోపాలనీ, వైఫల్యాలనీ చాటి చెబుతున్నాయి. ఈ లోపాలు సరిదిద్దడానికి రాష్ట్రకమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలి''. ఇలా సమీక్షించుకున్న తరువాత కూడా 'ప్రత్యేక శ్రద్ధ' అనేది అనుకున్నంతగా పెట్టలేదని రాష్ట్రకమిటీ యొక్క 2001 నాటి రాజకీయ నిర్మాణ సమీక్ష తెలియజేస్తోంది. ఈ సమీక్షలోని సంబంధిత వ్యాఖ్యల్ని చూద్దాం! ''1995 సమీక్షలో తీసుకున్న అంశాలు ఏవీ ఈ మధ్యకాలంలో అమలు కాలేదు... ఈ విషయాలను సీరియస్‌గా తీసుకుని మన కమిటీలు పనిచేస్తే పత్రికలపై అభిప్రాయాలు పంపడంగానీ, పంపిణీ పరిస్థితిని చక్కదిద్దుకోవడంగానీ సాధ్యపడేది''. ''పత్రికకు రిపోర్టులు పంపడం ఈమధ్య కాలంలో మనం సాధించిన అభివృద్ధి. ఇది మంచి పరిణామమే! అయితే రిపోర్టులలోని విషయాలలో సమగ్రత వుండటం లేదు.... ఆయా రీజియన్‌లలోని ఉద్యమాభివృద్ధిని, ఆటుపోట్లనూ మరింత నిర్దిష్టంగా, సమగ్రంగా రాయడంలో ఇంకా పరిణతి సాధించాల్సి వుంది''. ''ఈ మధ్యకాలంలో ఏడు రాజకీయ ప్రచార బుక్‌లెట్లు, నాలుగు కాన్ఫరెన్సుల కవితా సంపుటాలు, మూడు ఇతర పుస్తకాలు ప్రచురించాం. 1995 కాన్ఫరెన్స్‌ల సందర్భంగా వెలువడిన 25 వివిధ రకాల డాక్యుమెంట్లను, పుస్తకాలను తెచ్చాం!.... నిజానికి ఈ ప్రచురణలు మన రాజకీయ అవసరాలను ఏ మాత్రం తీర్చలేవు. రాసేవారి కొరత, అనువాదాల సమస్య మనం ఎదుర్కొంటున్నాం''. ''పత్రిక, ప్రచురణల డబ్బులు ప్రజల నుండి మనం వసూలు చేస్తున్నట్టు ఎక్కడా రిపోర్టులు వుండటం లేదు''. ''ఈమధ్య కాలంలో క్రాంతిని మనం రెగ్యులర్‌గా తేగలిగాం. పత్రిక పేజీలు పెంచి అనేక రాజకీయ, ఆర్థిక వ్యాసాలు, సిద్ధాంత రాజకీయ చర్చా వ్యాసాలు అందించగలిగాము''. ''రాష్ట్ర, రీజినల్ కమిటీ సభ్యులు నిర్దిష్ట సమస్యలపైనా, ఉద్యమ రాజకీయ కర్తవ్యాలపైనా, సిద్ధాంత రాజకీయ చర్చా వ్యాసాలను క్రాంతికి పంపాలి''.

## ప్రచురణలు

పత్రిక ప్రారంభకాలం నుంచే అనేక విప్లవ సిద్ధాంత రాజకీయ గ్రంథాలను, ఉద్యమ సాహితీ సాంస్కృతిక గ్రంథాలను 'క్రాంతి ప్రచురణలు'గా తీసుకొస్తుండేవాళ్లం! అయితే 'క్రాంతి' యంత్రాంగంపై ప్రారంభం నుండి సాగుతూ వచ్చిన నిఘా, నిర్బంధాల కారణంగాను, ప్రత్యేకించి '85 తరువాత 'క్రాంతి'ని అజ్ఞాత పత్రికగానే నడపాల్సి వచ్చిన పరిస్థితుల్లోనూ 'క్రాంతి ప్రచురణల' వరుసక్రమాన్ని పాటించడంగానీ, పాటించిన మేరకు ప్రచురణల సంఖ్యను నిర్దిష్టంగా తేల్చడంగానీ సుమారుగా అసాధ్యమైపోయిన పరిస్థితి నెలకొంది. అసమగ్రంగా అందుబాటులో వున్న సమాచారం మేరకే 1977 నుండి సంవత్సరానికి సగటున పదికి తక్కువ

కాకుండానే క్రాంతి ప్రచురణలు వెలువడుతుండేవని చెప్పవచ్చు. 1979 నాటికి 29గా వుండిన క్రాంతి ప్రచురణల సంఖ్య '83 నాటికి 60గాను, '84 నాటికి 70గాను, '85 నాటికి 77 గాను తేలాయి. '85 నుండి ప్రచురణ సంఖ్య లేని అనేక పుస్తకాలు విడుదల అయ్యాయి.

పార్టీ మౌలిక పంథాకి సంబంధించి- ''వ్యవసాయిక విప్లవం భారత ఆర్థిక వ్యవస్థ-అర్ధవలస అర్ధభూస్వామ్య విధానం'', 'చారుమజుందార్ రచనలు', 'చారుమజుందార్‌పై విచ్ఛిన్నకుల విమర్శ-ఒక మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణ' అనేవి ముఖ్యమైన ప్రచురణలు. మార్క్సిస్టు సిద్ధాంత రాజకీయ ప్రామాణిక గ్రంథాల విషయానికి వస్తే ''అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం-ప్రపంచ సోషలిస్టు విప్లవ పథం'', 'తత్త్వశాస్త్రం మాయాజాలం కాదు', 'చైనా తాత్వికరంగాన మూడు ప్రధాన పోరాటాలు', 'సోవియట్ ఆర్థికం-విమర్శనాత్మక పరిశీలన', 'గోథా కార్యక్రమం', 'లుడ్విగ్ ఫ్యూయర్‌బా', 'ఏం చేయాలి?' 'ప్రతిపక్షం', అనేవి ముఖ్యమైన ప్రచురణలు. సోవియట్ రివిజనిజాన్ని ఎండగడుతూ-'పెరిస్త్రోయికా, గ్లాస్‌నాస్త్ అంటే 'పంట' (చైనాకథలు), 'లాంగ్‌మార్చ్ కథలు', 'ఎర్రమందారాలు' (చైనా నవల), ముఖ్యమైన ప్రచురణలు. అలానే చరిత్రకు సంబంధించి-'ఆధునిక ప్రపంచ చరిత్ర', 'బోల్షివిక్ పార్టీ చరిత్ర'; దేశంలోని జాతుల పోరాటాలపై 'కేంద్ర, రాష్ట్ర అసమ సంబంధాల సమస్య జాతుల సమస్యలో అంతర్భాగమే', 'కాశ్మీర్ సమస్య-బొమ్మా, బొరుసూ', 'రగులుకొనే రాక్షసి బొగ్గు'; మన ఉద్యమం, ఉద్యమంపైని దమనకాండలని వివరించే 'మునుముందుకు సాగుతున్న రైతాంగ పోరాటాలు-చుట్టుముడుతున్న ప్రభుత్వ దమనకాండ'; దేశంలోని అవకాశవాద రివిజనిస్టు పంథాలను ఎండగడుతూ వచ్చిన 'పాలకవర్గాల పాదసేవలో పైలా ముఠా ప్రజాపంథా', 'విమోచన దివాళాకోరుతనం'; పార్టీ ఉద్యమాలలోని అతివాద ఒంటెత్తు పెడధోరణిని విమర్శిస్తూ వచ్చిన 'ప్రజాపోరాటాలకి మద్దత్తునివ్వనివారు పీడిత ప్రజలకు మిత్రులు కాజాలరు' అనేవి ముఖ్యమైన క్రాంతి ప్రచురణలు. అలాగే 'మహిళా ఉద్యమం' (లెనిన్), 'అమరవీరుల జీవిత చరిత్రలు - 1, 2, 3, భాగాలు' అనేవి మరికొన్ని ముఖ్యమైన క్రాంతి ప్రచురణలు.

## 'క్రాంతి'కారుడికి 'క్రాంతి' నివాళి

పత్రికా ప్రచురణ రంగంలో కా॥ ప్రకాశ్ మాస్టారు నిర్వహించిన పాత్ర కొంత ప్రత్యేక ప్రశంసకి అర్హమైందనే చెప్పాలి. క్రాంతి ప్రారంభానికి ముందు నడుస్తుండిన 'పిలుపు' పత్రిక నిర్వహణలో సైతం కా॥ కె.ఎస్.కి చేదోడువాదోడుగా పనిచేస్తూ వచ్చిన కా॥ ప్రకాశ్ మాస్టారు గట్టి పునాదిపై క్రాంతి పత్రికను స్థాపించే విషయంలోనూ, అచిర కాలంలోనే అది పార్టీ శ్రేణుల్లోకి ప్రజల్లోకి దూసుకుపోయే విధంగా దాన్ని తీర్చిదిద్దడంలోనూ కీలకమైన పాత్రనే పోషించారు. క్రాంతి నిర్వహణా బాధ్యతలతో ప్రత్యక్ష సంబంధం లేని కాలంలో కూడా క్రాంతి, క్రాంతి ప్రచురణల విషయంలో కా॥ ప్రకాశ్ మాస్టారి పాత్ర ప్రభావాలు ప్రశంసనీయమైనవిగా వుంటూ వచ్చాయని చెప్పాలి. (సుమారుగా '80-88' మధ్యకాలం) '88 నుంచి తిరిగి క్రాంతి నిర్వహణ ప్రధాన బాధ్యత కా॥ ప్రకాశ్ మాస్టారే చేపట్టారు. 1991లో పార్టీలో తలెత్తిన రెండవ ఆంతరంగిక సంక్షోభం, కొన్ని మాసాలపాటే అయినా, ప్రెస్ యూనిట్‌పైనా, క్రాంతి నిర్వహణపైనా తన దుష్ప్రభావాన్ని వేసి గందరగోళ పరచిందనే చెప్పాలి. ఆ సమయంలో పార్టీతో సంబంధాలు తెగిపోయి వుండిన ఆ యూనిట్‌తో తిరిగి సంబంధాలు పునరుద్ధరించుకున్న కా॥ ప్రకాశ్ మాస్టారు సంక్షోభ దుష్ప్రభావం నుంచి ఆ కామ్రేడ్స్‌ని పూర్తిగా బైటపడవేసి, వారి నైతిక ధృతిని నిలబెట్టి, వారిలో రెట్టించిన ఉత్సాహ, ఉత్తేజాలని కల్పించడంలో కీలకపాత్ర నిర్వహించారు. సమాచార సాంకేతిక రంగాలలో వస్తుండిన అభివృద్ధిని, దాని ప్రాధాన్యతని ఆకళింపు చేసుకుంటూ, మన అవసరాలకి తగ్గట్టుగా దాన్ని వినియోగించుకునే ప్రణాళికలు రూపొందిస్తూ, తదనుగుణంగా సంబంధిత కామ్రేడ్స్‌ని తర్ఫీదు



చేయడంలో కూడా కా॥ ప్రకాశ్ మాస్టారు ప్రశంసనీయమైన కృషి చేసారు. సాంకేతిక పరిజ్ఞానం పరికరాల కొరత కారణంగా శ్రమ, కాలం వెచ్చిస్తున్నా, మందకొడిగానే నడుస్తుండిన ప్రెస్ పనిలో చురుకుదనాన్ని తీసుకొచ్చి దానికి నూతన జవసత్వాలందించిన కృషి కా॥ ప్రకాశ్ మాస్టారిదే! తీవ్ర నిర్బంధం ఒక ప్రక్క, తీవ్ర అనారోగ్యం మరోపక్క-అయినా అనుకున్నదే తడవుగా అతితక్కువ వ్యవధిలో అఖిల భారత స్పెషల్ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన (1995) స్పెషల్ బులెటిన్‌ని ఇంగ్లీషు, తెలుగుల్లో ఏకకాలంలోనే ప్రచురించి పంపిణీ చేయించడం లోనూ; 'దండకారణ్య అమరవీరుల జీవిత చరిత్రలు' అలానే 'జాతుల సమస్య' అనే ప్రచురణలను ఇంగ్లీషు, తెలుగుల్లో ప్రచురించి అందించడంలో ప్రకాశ్ మాస్టారు కనబరిచిన శ్రద్ధాశక్తులు, బాధ్యతాయుత వైఖరి, నిర్వహించిన ప్రత్యక్ష పాత్ర అనేవి శ్లాఘనీయం! పార్టీ పంథా, కార్యక్రమాలు; పార్టీ విధాన నిర్ణయాలు, పార్టీ ఆధ్వర్యంలోని విప్లవోద్యమ క్రమాభివృద్ధి-వీటన్నింటికీ 'క్రాంతి'ని ఒక నిలువుటద్దంగా తీర్చిదిద్దడంలో కా॥ ప్రకాశ్ మాస్టారు పోషించిన పాత్ర ఎంతో ప్రశంసనీయమైనదనే చెప్పాలి. దారుణ నిర్బంధం మధ్య అజ్ఞాతంలో వుంటూ, ప్రాణాంతక కేన్సర్ వ్యాధి బారిన పడి మరణశయ్యపై వుంటూ కూడా తన తుదిశ్వాస వరకూ 'క్రాంతి'కి శ్వాసగా పనిచేస్తూ తన శ్వాసని క్రాంతికి అర్పణ చేసిన కా॥ప్రకాశ్ మాస్టారు అమరస్మృతికి, విజయవంతమైన 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న 'క్రాంతి' తన అక్షర నివాళినర్పిస్తోంది.

క్రుశ్చేవ్ యొక్క మూడు శాంతి సూత్రాల చరమదశే', 'నూతన జారుల పరిపాలనలో సోవియట్ రష్యా', 'నిరంకుశ రివిజనిస్టు పాలనకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున్న చెలరేగుతున్న తూర్పు యూరప్ ప్రజా వుద్యమాలు', 'సోవియట్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ' అనేవి ముఖ్య ప్రచురణలుగా వచ్చాయి. కళా సాహిత్య రంగాలకి సంబంధించి-'కళలు, సారస్వతం ఎవరికోసం?', 'నాట్యాలు-నాట్య రూపాలు' (జె.యన్.యం.), 'జె.యన్.యం. పాటలు',

### మా-లె-మా బావుటాని ఎత్తిపడుతూ!

ఇవన్నీ ఒకెత్తుకాగా, మావో రచనలన్నింటినీ ఇంగ్లీషు, తెలుగుల్లో ప్రచురించే బృహత్తర కర్తవ్యాన్ని 'క్రాంతి' విజయవంతంగా నెరవేర్చడమనేది గొప్ప విషయంగా చెప్పాలి. విశేష ప్రాముఖ్యతని సంతరించుకున్న గొప్ప కృషి ఇది అనవచ్చు. ఇంగ్లీషులో అన్ని సంపుటాలు ఇప్పటికే వెలువడగా, తెలుగు

అనువాదాలు 8 సంపుటాలు విడుదల అయ్యాయి. 9వ సంపుటి అనువాదం పూర్తయి అచ్చులో వుంది. 'క్రాంతి' 25వ వార్షికోత్సవంలో అడుగిడుతున్న సందర్భంగా అది విడుదల కాబోవడమనేది ఒక విశేషంగానే వుండగలదు.

గడచిన 25 సంవత్సరాల నుంచి పోరుబాటలో 'క్రాంతి' విజయవంతంగా కొనసాగుతూ వస్తున్న తీరుతెన్నులు ఇవీ! మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్, మావోలు ఆయా సందర్భాల్లో వివరించినట్టు పార్టీ పత్రిక అనేది ఒక శక్తివంతమైన ఆర్గనైజర్ పాత్రని, గొప్ప బోధకుడి పాత్రని, (గొప్ప శిక్షకుని పాత్రని), గొప్ప ఆందోళనాకారిణి పాత్రని నిర్వహించాలనే దానికి తగ్గట్టుగా మన క్రాంతి మరింత అభివృద్ధి కావడానికి–పార్టీ రాష్ట్రకమిటీ ఈ విషయమై ఇప్పటికే సమీక్షించి నిర్ధారించిన అవసర చర్చలు, కర్తవ్యాలు గతంలో లాగ ఉదాసీనతకు గురికాకుండా, ఖచ్చితంగా అమలుపరచబడాల్సి వుంటుంది. కాగా, పార్టీ సమీక్షలు, తీర్మానాలు, సర్క్యులర్లు లాంటివన్నీ 'క్రాంతి' ద్వారా వివరించబడుతుండాలి. అన్నింటికీ మించి క్రాంతి నిర్వహణకి సంబంధించి నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించుకోవాల్సి వుంటుంది.

ఎన్ని లోపాలతో వుంటున్నా, ఇంకెన్ని సమస్యలతో తీసుకుంటున్నా క్రాంతి సాధిస్తూ వస్తున్న మంచి ఫలితాలే ప్రధానం అని చెప్పాలి. ఇన్ని అననుకూలతలు, పరిమితులు, నిర్బంధాల మధ్య కూడా 'క్రాంతి' తన లక్ష్యపథంలో విజయవంతంగా దూసుకుపోతోందనే చెప్పాలి. క్రాంతి సాధించిన, సాధిస్తున్న ఈ విజయాల వెనుక ఎంతోమంది కామ్రేడ్స్ సమిష్టి శ్రమ, కృషి ఇమిడి వున్నాయి.

పోరాటాల పొత్తిళ్లలో పురుడు పోసుకున్న 'క్రాంతి' నిత్య నిర్బంధాల నడుమనే, సమరశీల ప్రజాపోరాటాలే అన్నపానీయాలుగా, సాయుధ విప్లవోద్యమమే ఊపిరిగా ఎదుగుతూ వచ్చింది. ప్రజలకి విప్లవం మునుపెన్నటి కంటే కూడా ఎక్కువ అవసరంగా మారుతున్న నేటి పరిస్థితుల్లో 'క్రాంతి మరింత శక్తివంతం కావడం అనేది ఒక సహజ పరిణామం! పత్రికా యంత్రాంగంపు సమిష్టి కృషి పునాదిగా పార్టీ నాయకత్వ కమిటీ అందించే విలువైన మార్గదర్శకత్వంతో ప్రజాపోరాట వేదికగా పత్రికను మరింత అభివృద్ధి చేద్దాం! పార్టీ చేతిలో సిద్ధాంత రాజకీయ అక్షరాయుధంగా 'క్రాంతి'ని మరింత పదును పెడదాం! 'క్రాంతి' విజయవంతమైన 25వ సం॥లోకి అడుగిడుతున్న ఉత్సాహకరం, ఉత్తేజకరం అయిన ఈ విశేష సందర్భంగా దీన్ని లక్ష్యంగా స్వీకరిద్దాం! ❑

## శ్రామికవర్గపు కంటిపాప పత్రిక

శ్రామిక వర్గానికి పత్రికల ప్రాముఖ్యత గురించి మావో పలు సందర్భాలలో రాస్తూ ఉద్యమ పత్రికలను 'శ్రామికవర్గపు కంటిపాప'గా వర్ణించాడు. శ్రామికవర్గ పత్రికలను ఎందుకు ప్రారంభించాలో, ఎందుకు వాటిని సమర్ధవంతంగా నడపాలో, ఎందుకు జనం ఆ పత్రికల్ని కంటిపాపలా కాపాడుకోవాలో మావో ఆ వ్యాసాల్లో వివరించాడు. మన ఉద్యమ పరిస్థితులకు వాటిని వర్తింపజేసి చూద్దాం.రాష్ట్రంలో ఈనాటికీ పెట్టుబడికీ, కట్టుకథకూ పుట్టిన పత్రికలే విశేష ప్రచారంలో వున్నాయి. వాటి వెనుక పెట్టుబడి వుంది. పాలకవర్గాలున్నాయి. జనాన్ని మాయలో ముంచేయగల, యజమానులూ, సంపాదకులూ, సాహిత్యకారులూ వున్నారు. అంతకు మించి సమాచార విప్లవం, మల్టీమీడియా పేరుతో దూసుకువస్తున్న ప్రపంచీకరణ తళుకుబెళుకు లెన్నో వున్నాయి. పైగా వాటి ఎడిషన్లు విస్తృత స్థాయిలో స్థానికీకరింపబడుతున్నాయి. వాటి సర్క్యులేషన్ ఒక్కొక్కటి లక్షలలో వుంది. ఈ స్థితిని బద్దలుకొట్టి మనం కూడా పాఠకుల స్థాయి, ఉద్యమావసరాలకు అనుగుణంగా అనేక విడి పత్రికలను స్థాపించుకోవలసి వుంది. జనంలో మన పత్రికలకు విస్తృత ప్రచారం ఇవ్వాల్సి వుంది. ఇలా ఒకవైపు ప్రచార కార్యక్రమాలు, పత్రికల విస్తృతిని పెంచే కార్యక్రమాలు చేపడుతూనే పత్రికను స్థిరపర్చే, బలోపేత చేసే ప్రయత్నం చేయాలి. అంటే పత్రికను ఆర్థికంగా స్వయం సంపూర్ణం చేయాలి. చందాలు క్రమంతప్పకుండా చెల్లించాలి. బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చూడాలి. మన పరిధిలో వున్నవాళ్లందరూ చందాలు, బకాయిలు సక్రమంగా చెల్లించేటట్లు చూడాలి. ఈరెండు పనులకు తోడుగా పత్రికల గురించి మనపై మరొక బాధ్యత కూడా వుంది. అదేమిటంటే...

''విప్లవ సిద్ధాంతమూ, చరిత్ర జ్ఞానమూ, రాజకీయ ఉద్యమం గురించి లోతైన అవగాహన లేనిదే ఏ రాజకీయ పార్టీ కూడా విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడపటం సాధ్యంకాదు. యావత్తు ఉద్యమాన్నీ, దాని అభివృద్ధినీ అధ్యయనం చేయడం నిత్యం మనం శ్రద్ధ వహించవలసిన కర్తవ్యం. ఈ సమస్యలను తీవ్రంగా, శ్రద్ధగా అధ్యయనం చేయడానికి తిరస్కరించే వాళ్లెవరూ మార్క్సిస్టులు కారు'' అని మావో చెప్పారు. కాబట్టే మనం పత్రికను తీవ్రంగా, శ్రద్ధగా అధ్యయనం చేయాల్సివుంది. అసంఖ్యాక గ్రామీణ ప్రజానీకానికి చదివి వినిపించాల్సి వుంది. పత్రికలు తమ లక్ష్యం కొరకు మరింత ఎక్కువగా పని చేయడానికి వీలుగా ఎప్పటికప్పుడు పత్రికల మీద మన అభిప్రాయాలు పంపాల్సి వుంది. ఈ పనులు చేయటం ద్వారానే పత్రికల ప్రాముఖ్యతను మనం అర్థం చేసుకోగలం. తద్వారా విప్లవ ప్రయోజనాలకు మనం మరింత ఎక్కువగా ఉపయోగపడగలం.

## క్రాంతి 25వ వార్షికోత్సవ కార్యక్రమాల నిర్వహణ

2002 సంవత్సరం ఏప్రిల్ 22 (పార్టీ ఆవిర్భావ దినం) నుండి మే 22 వరకు నెలరోజులపాటు పార్టీకి చెందిన అన్ని యూనిట్లు 'క్రాంతి' 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించాలి. ఈ సందర్భంగా ఈ క్రింది కార్యక్రమాలను చేపట్టాలి.

1. క్రాంతిని పథకం ప్రకారం మరింత విస్తృతంగా విప్లవ ప్రజానీకంలోకి తీసుకుపోయే కార్యక్రమం.
2. క్రాంతి అమ్మకాల్ని, చందాదారుల్ని పెంచే కార్యక్రమం.
3. విప్లవ సాహిత్యాన్ని మరింత విస్తృతంగా ప్రజలలోకి తీసుకుపోవటం.
4. ప్రజల నుండి – ప్రజల వద్దకు అనే ప్రజాపంథా ప్రాతిపదికగా మన పార్టీకి చెందిన అన్ని యూనిట్లు 'క్రాంతి'పైనా, విప్లవ సాహిత్యంపైనాన సభ్యుల నుండి, ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి పైకమిటీలకు పంపే కార్యక్రమం.

**ఏ.పి. రాష్ట్రకమిటీ తీర్మానం నుండి.**

*ఫాసిజం, స్టేట్ టెర్రరిజం, మార్కెట్ ఫండమెంటలిజం, ఆధిపత్యవాదాల 'మేలుకలయిక'గా వుంటున్న అమెరికన్ సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువు, ప్రధాన శత్రువు!*

# అమెరికా సామ్రాజ్యవాద దురహంకారంపై చెంపదెబ్బ సెప్టెంబర్ 11 దాడి!!

## ప్రపంచ ప్రజాభిప్రాయం అమెరికా దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకం!!!

సెప్టెంబర్ 11వ తేదీన అమెరికా దేశం వాషింగ్టన్ నగరంలోని ప్రపంచ వాణిజ్య కేంద్రానికి చెందిన రెండు భవనాలపైన, న్యూయార్క్ నగరంలోని 'పెంటగన్' (సైనిక కేంద్రం) భవనంపైన అనూహ్యమైన విమాన దాడులు జరిగాయి. ఈ దాడులతో అమెరికా, అమెరికా అడుగులకి మడుగులొత్తే నాటోకూటమి దేశాల పాలకవర్గాలు ప్రభుత్వాలు అవాక్కయిపోగా ప్రపంచ ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలకి లోనయ్యారు. ప్రపంచ వాణిజ్య కేంద్ర భవన సముదాయంపై దాడి అంటే సామ్రాజ్యవాద ఆర్థిక దురహంకారం, అజమాయిషీలపై దాడి అన్నమాట. మరీ ప్రత్యేకించి ప్రపంచ ప్రజల మూల్గులు పీలుస్తున్న అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక ఆధిపత్యం ముఖంపై చాచికొట్టడమన్నమాట! పెంటగన్ భవనంపై దాడి అంటే–అజేయం, అప్రతిహతం అనుకునే అమెరికా సామ్రాజ్యవాద సైనిక గర్వాతిశయంపై వేసిన నిరసన సమ్మెటదెబ్బ అన్నమాట! అన్నింటికి మించి అద్వితీయం అని చెప్పబడే అమెరికా సమాచార, సాంకేతిక వ్యవస్థ అభాసుపాలైంది. తన డేగకళ్ల నుంచి ఏ చిన్న విషయం తప్పించుకోజాలదని డంబాలుపోయే అమెరికా గూఢచార వ్యవస్థ నవ్వులపాలైంది. కుట్రలు, హత్యలు, డాలర్ సంచుల ప్రలోభాలే గొప్ప గూఢచారి పాటవంగా చెలాయించుకుపోతున్న అమెరికా గూఢచారి వ్యవస్థ అపహాస్యం పాలైంది. జరిగింది ఇంతేనా? కాదు. అమెరికా రాజకీయ వ్యవస్థ ఘోర పరాభవానికి గురైంది. అగ్రరాజ్య అధినేత, అధ్యక్షుడు బుష్ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని శక్తివంతమైన సైనిక విమానాల పహారా మధ్య 48 గంటల కాలం తనని తానే బందీ చేసుకున్నాడు. ప్రపంచమంతా తనదనుకుని విర్రవీగే ఈ ప్రపంచ పోలీసుదొర ప్రదర్శించిన పిరికితనాన్ని, అభద్రతా స్థితిని, తన మట్టిని, తన ప్రజల్ని తానే నమ్మలేని అతడి అసహాయ స్థితిని, ఆత్మన్యూనతా వైఖరిని చూసి యావత్ ప్రపంచం విస్తుపోయింది. అనుక్షణం విపరీత రద్దీతో వుండే ప్రపంచ వాణిజ్య కేంద్ర భవన సముదాయం కుప్పకూలిపోవడంతో వుద్యోగులు కష్టమర్లతో కూడిన సామాన్య పౌరులు సుమారు మూడువేల మంది చనిపోయారు. ఇది బాధాకరమైన విషయమే. అమెరికన్ పౌర సమాజం అల్లల్లాడింది. ఈ దాడి సృష్టించిన విషాదం, భయోద్విగ్నతల నుంచి తప్పించుకోడానికి వారు అసాధారణమైన తీరులో బార్లకి అతుక్కుపోయి, మద్యం మత్తులో మునిగి తేలుతూ అరుపులు గెంతులు ఆర్భాటాలతో గడిపారని వార్తలు. ఆ కారణంగా తమ వ్యాపారాలు మరింత జోరుగా సాగినందుకు అమెరికా క్షుద్ర వ్యాపారులు సంతోషించే వుంటారు.

### అమెరికా ఘోర నేరాల పర్యవసానమే సెప్టెంబర్ 11 దాడి!

దోపిడీ పాలకులపై ధ్వజమెత్తి, పడగనీడలాంటి వారి పాలన నుండి విముక్తి కావడమే యిలాంటి విషాదాలకి విరుగుడు కాగలదని అమెరికా జనసామాన్యం గ్రహించాల్సి వుంటుంది. సెప్టెంబర్ 11 దాడి అమెరికా పాలకవర్గాల 'పాప' ఫలితమేననేది కాదనలేని సత్యం. ఈ సత్యాన్ని ఎందుకంగీకరించాడో, అంగీకరిస్తూ అలా ఎందుకు మాట్లాడాడో, అలా మాట్లాడడంలో అతడి నిజాయితీ ఎంతో, అతడాశించే ప్రయోజనం ఏమిటో స్పష్టం కాలేదుగాని–అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటనే స్వయంగా 'అమెరికా పాపాల ఫలితమే ఈ దాడులు' అని వ్యాఖ్యానించాడు. అయితే ఆ పాపాల చిట్టా ఏమిటో, అవెంతటి జగుప్సాకరమైనవో అతడు వివరించలేదు. ఆ వివరణ జోసెఫ్ స్టిగ్‌లిట్జ్ యిచ్చాడు. ఇతడూ అమెరికన్ పౌరుడే. సాధారణ పౌరుడు కాదు! 2001 సంవత్సరానికి ఆర్థిక శాస్త్రంలో నోబుల్ బహుమతి అందుకున్న ప్రముఖుడు. అంతేకాదు, ఇటీవలి వరకు ప్రపంచబ్యాంకుకి ముఖ్య ఆర్థిక సలహాదారుడుగా పనిచేసిన ప్రముఖుడు. ప్రపంచబ్యాంకు ముందుకు నెట్టే ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనేవి కాకుల్ని కొట్టి గెద్దలకి వేసే తీరులో యితర దేశాల్ని కొల్లగొట్టి అమెరికా కార్పోరేట్ పెద్దల గుళ్లు నింపడానికేనని స్టిగ్‌లిట్జ్ ఇల్లెక్కి కేకలేయడంతో బ్యాంకు అతడికి 1999లో ఉద్వాసన చెప్పింది.

'ప్రపంచమంతా అమెరికాను ఎందుకు ద్వేషిస్తుంది?' అనే ప్రశ్నను లాడెన్ ఉదంతం మరోసారి మరింత విస్తృతంగా చర్చకు తీసుకొచ్చింది అంటాడితడు. ఈ ప్రశ్నకు స్టిగ్‌లిట్జ్ పదునైన సమాధానమే యిచ్చాడు. ''వివిధ దేశాల్లో తన బ్యాంకులు, కార్పోరేషన్లు లాభాలు గుంజుతూ సంపదలు పోగేసుకున్నంతకాలం ఆయా దేశాల్లో ప్రజలు చచ్చారా బ్రతికారా అనే విషయాన్ని అమెరికా అసలు పట్టించుకోదు'' అంటాడితడు. ప్రపంచబ్యాంకు ప్రవచించే 'ప్రైవేటీకరణ' అనేది 'లంచగొండీకరణ' (briberisation) తప్ప వేరు కాదంటాడు స్టిగ్‌లిట్జ్. ఆయా దేశాల భ్రష్ట పాలకనేత లందరికీ శాతాలవారీగా ముడుపులు చెల్లిస్తూ వాటిని వారి వారి స్విస్ బ్యాంకు ఖాతాలకు మరీ ప్రపంచబ్యాంకు జమ చేయిస్తుంటుందని దాని ప్రైవేటీకరణ ముసుగుని చీల్చి చూపాడు. ప్రపంచబ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలందించే అప్పులు, సహాయ ప్యాకేజీల తుదిఘట్టం ''ప్రపంచ ద్రవ్యనిధి సృష్టించే కల్లోలం'' (IMF RIOT) గానే వుంటుందని; నీరు, ఆహారం విద్య, వైద్యం సమస్తం మార్కెట్ సరుకులైపోయి, ప్రజలకు అందనంత దూరం పారిపోయి ఇక వాటికోసం ప్రజలు దొమ్మీలకి దిగడం అనివార్యమైపోతుందని సోదాహరణంగా వివరిస్తాడు స్టిగ్‌లిట్జ్. ఐ.ఎమ్.ఎఫ్ తాఖీదుతో ఆహార, ఇంధన సబ్సిడీలు రద్దుకావడంతో 1998లో ఇండోనేషియాలోను; సాగునీటి తాగునీటి ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయినందున 2000 సం।లో బొలీవియాలోను; ప్రపంచబ్యాంకు హుకుంనామాతో వంటగ్యాస్ ధర విపరీతంగా పెరిగిపోయినందున ఈ సంవత్సరం ఈక్వెడార్‌లోనూ జరిగిన దొమ్మీలను యిందుకు సాక్ష్యంగా చెబుతాడు ఇతడు. తమ 'సంస్కరణలు' ('ప్రపంచీకరణ' భాషని ఎంత భ్రష్టు పట్టిస్తోంది! వీటిని 'సంస్కరణలు' అని అనాల్సిరావడం ఎంతటి విచారకరమో ఇంకోమాటలో వీటిని చెప్పుకోలేకపోవడం అంతటి విషాదకరం!) ''తప్పనిసరిగా సాంఘిక అశాంతికి దారితీస్తాయి' అని అధికారయుతం గానే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకులు అంగీకరిస్తాయి. అయితే ఈ 'అశాంతి'కి అవి సూచించే పరిష్కారం మాత్రం 'రాజకీయ దృఢచిత్తం'తో 'ఎదుర్కోవడమే'! సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పదకోశంలో 'ఎదుర్కోవడం' అంటే 'అణచేయడం' అని అర్థం! (ఆంధ్ర రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు ఏజెంట్ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ ఆందోళనని 'ఎదుర్కొన్నట్టు') ''ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలు, నిర్ణయాల వలన మూడవ ప్రపంచ దేశాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారా?! అందుకు మనం చేయగలిగేదేమీ లేదు.

కాని, బతికున్న వాళ్లు ఆందోళనలు, తిరుగుబాట్లు చేయకుండా రాజకీయ దృఢచిత్తంతో అణచేయాలి'' అని యివి సలహాలిస్తాయని తాను పనిచేసిన కార్పోరేషన్ల వ్యవహార శైలిని ఎండగట్టాడు స్టిగ్‌లిట్జ్.

## ఇది న్యాయాన్ని అంతం చేసే యుద్ధం-స్వేచ్ఛకి ముగింపు చెప్పే యుద్ధం!

అంటే అమెరికా సామ్రాజ్యవాద బందిపోట్ల దృష్టిలో మనుషుల ప్రాణాలకి (మనుషులంటే మళ్లీ అందరూ కాదు, బలహీన బడుగువర్గాలవారే!) ఎలాంటి విలువా లేదు. మనుషుల మనసులు, శరీరాలు, అనుభూతులు, ఆశలు, ఆశయాలు, రాగద్వేషాలు, భయాందోళనలు, రోగాలు, అవిద్య, అజ్ఞానం, అసమానతలు మతం, కళలు, సాహిత్యం కరువుకాటకాలు, యుద్ధాలు ప్రకృతి వైపరీత్యాలు-సమస్తమూ తమకి లాభాలనార్జించి పెట్టే సరుకులు గానే వుండాలనేది సామ్రాజ్యవాద అమానుష వికృత తాత్విక నీతి! ఒక్క మార్కెట్ విలువ గుర్తింపు తప్ప యింకే విలువల గుర్తి వారికి తెలీదు, పట్టించుకోరు. (ఒక్క టూరిజంతప్ప యివాళ యింకే ఇజమూ లేదనే చంద్రబాబులాగ!) మరి ఇలాంటి అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రపంచమంతా ద్వేషించకుండా ఎలా వుంటుంది? అలా గూడు కట్టిన ప్రపంచ ప్రజల తీవ్ర ద్వేషం, ప్రతీకారాల వ్యక్తీకరణే సెప్టెంబర్ 11 దాడి. ఈ వాస్తవాన్ని అమెరికా అంగీకరిస్తుందా? అంగీకరించదు. అంగీకరించిన నాడిక అది ఒక సామ్రాజ్యవాద శక్తిగా మనజాలదు. కనుకనే సెప్టెంబర్ 11 దాడిని రకరకాల అబద్ధాలతో వక్రీకరిస్తోంది. ఇది మానవ నాగరికతపైనా, ప్రపంచ శాంతిపైనా చేసిన దాడి అంది; ప్రపంచంలోనే పేరెన్నికగన్న తన దేశ ప్రజాస్వామ్యం పైనేగాక ప్రపంచ ప్రజాస్వామ్యమంతటిపై జరిగిన దాడి ఇది అంది; ఇది పరమ అమానుషం అంది; మానవ సమాజాన్ని మధ్యయుగాల్లోకి నెట్టేసే లక్ష్యంతో జరిగిన దాడి యిది అంది; ఈ దాడి ప్రపంచ ఉగ్రవాద శక్తుల (టెర్రరిస్టుల) కుట్ర అంది; ఆ శక్తులెవరో తనకు తెలుసునంది; ముస్లిం ఛాందసవాద సంస్థ ఆల్‌కాయిదా, దాని అధినేత ఒసామా బిన్‌లాడెన్‌లే ఈ దాడి వెనుక కుట్రదారులంది; మరికొన్ని ముస్లిం దేశాల్లోని, ప్రత్యేకించి ఇరాక్, పాలస్తీనాలలోని ఉగ్రవాద సంస్థల భాగస్వామ్యం కూడా ఈ దాడి కుట్రలో వుండొచ్చునంది; ఈ సంస్థలు శక్తులన్నింటినీ తుడిచిపెట్టడమే తన లక్ష్యమంది; ఇది ప్రపంచ ఉగ్రవాదంపై పోరు అంది; ప్రపంచ మానవాళి మనుగడకి, ప్రజాస్వామ్య మనుగడకి తలపడుతున్న పోరు యిది అంది; ప్రపంచ ఉగ్రవాదంపై పోరు తన జన్మహక్కంది; దాడికి కారకులు అని తాను తేల్చి చెబుతుండే బిన్‌లాడెన్‌ని అతడి ఆల్‌కాయిదా సహచరుల్ని తనకి అప్పజెప్పి తీరాలని ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్ అధినేత ముల్లా ఒమర్‌ని ఆదేశించింది అమెరికా. అప్పచెప్పకపోతే ఆ దేశంపై యుద్ధం తప్పదని హెచ్చరించింది అమెరికా ప్రభుత్వం.. జరిగిన దాడిలో బిన్‌లాడెన్ పాత్ర వుందని చెప్పే ఖచ్చితమైన సాక్ష్యాధారాలు చూపెడితే లాడెన్‌ని అప్పగిస్తానన్నాడు ఒమర్: ''సాక్ష్యాధారాలన్నీ మా దగ్గరున్నాయి. తగిన సమయంలో వెల్లడిస్తాం. ముందతణ్ని అప్పజెప్పండి అని హుంకరించింది అమెరికా. ''అప్పజెప్పేది లేదు'' పొమ్మన్నాడు ఒమర్. ఎంత గొప్ప ధిక్కారం! అన్యాయమైన తన ఫాసిస్టు యుద్ధంలో రేపు అమెరికా సాధించబోయేదే మైనప్పటికీ, యుద్ధ ప్రారంభానికి ముందే, తమ ధిక్కారంతోనే అమెరికా ఆధిపత్య దురహంకారాలపై తమ విజయాన్ని చాటుకున్నారు లాడెన్, ఒమర్‌లు. అన్యాయం పక్షాన నిలిచిన బలవంతుడైన శత్రువుతో తలపడే యుద్ధంలో కొన్ని సందర్భాలలో కేవల ధిక్కారమే యుద్ధంగాను, యుద్ధ విజయంగానూ కూడా వుంటుంది కదా!

ప్రపంచ ప్రజాభిప్రాయం తన పక్షానే వుందని చాటుకోడానికి, యుద్ధప్రారంభానికి ముందు మూడు వారాలు అమెరికా పడరానిపాట్లు పడింది. తాను చేస్తున్న యుద్ధం కొందరు వ్యక్తుల మీదా, కొన్ని దేశాల మీదా కాదంది; ప్రపంచ టెర్రరిజంపైనే తాను యుద్ధం చేస్తోంది గనుక ఈ యుద్ధంలో ప్రపంచ ప్రజలంతా, అన్ని దేశాలూ తనకండగా నిలవాలంది; తాను తలపెడుతున్న యుద్ధం 'నిలకడైన స్వేచ్ఛకోసం (operation enduring freedom) 'అనంత న్యాయం కోసం' (Operation infinit Justice) చేస్తున్న యుద్ధమని ఆర్భాటంగా ప్రచారం లంకించుకుంది. కాని, ప్రపంచ ప్రజలు దీన్ని 'న్యాయాన్ని అంతం చేసే యుద్ధం' (Operation fininshing Justice) గానే, 'స్వేచ్ఛకి ముగింపు చెప్పే యుద్ధం' (Operation ending freedom) గానే చూసారు. ప్రపంచ ప్రజల సాధారణ అభిప్రాయం తన యుద్ధ ప్రతిపాదనకి అనుకూలం కాదన్న సంగతి అమెరికా నేతలకి అర్థం అయిపోయింది. కనుక, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని చీల్చి తనకి దక్కే భాగాన్ని గట్టిపరచుకుని ఆ రకంగా తనది అయిన ఒక శిబిరాన్ని కూడగట్టే కుస్తీపట్లకి దిగింది. ప్రగతిశీలం-ప్రగతి వ్యతిరేకం అయిన రెండు నాగరికతల మధ్య యుద్ధంగా తన యుద్ధాన్ని ప్రచారం చేయించింది. భిన్న నాగరికతల మధ్య వైవిధ్యం వుంటుంది. ఆ వైవిధ్యంలోనే వాటి మధ్య సయోధ్య, సమన్వయం సాగాల్సి వుంటుంది. అంతే తప్ప వాటి మధ్య వైరుధ్యాలు, వైషమ్యాలు వాంఛనీయం కాదు. ఒకదాన్నొకటి పరస్పరం ప్రభావితం చేసుకుంటూనే ఒకదాన్నొకటి ఇముడ్చుకుంటూనే ప్రపంచంలో విభిన్న నాగరికతలు అభివృద్ధి అయాయి. మానవ నాగరికత ఈలాగునే వికాసించుకుంటూ వచ్చింది. అది మరింత అభివృద్ధి కావాల్సిన సరైన క్రమం కూడా యిదే. కనుకనే-'రెండు నాగరికతల మధ్య యుద్ధం' అనే అమెరికా సామ్రాజ్యవాద పండితుల అశాస్త్రీయ వాదాన్ని ప్రపంచవ్యాప్తంగా బుద్ధిజీవులంతా తీవ్రంగా నిరసించారు. దీంతో ముఖం వాచిపోయిన అమెరికా బుద్ధి తెచ్చుకోడానికి బదులు మరింత సంకుచితం విచ్ఛిన్నకరం అయిన వాదంతో ముందుకొచ్చింది. సెప్టెంబర్ 11 దాడి పశ్చిమ రాజ్యాలన్నింటిపై ముస్లిం రాజ్యాల దాడిగా అభివర్ణిస్తూ ఆ రకంగా పశ్చిమ దేశాలన్నింటినీ రెచ్చగొట్టి ఒక కూటమిగట్టే ప్రయత్నానికి సైతం పాల్పడింది. ఇవేవీ పనిచేయక పోవడంతో తన కుటిల దండనీతిని ఆశ్రయించింది. బరితెగింపు బెదిరింపుల తోనూ, భారీ లంచాలతోనూ (అప్పులు, సహాయాలు, రాయితీలు) వివిధ దేశాల పాలకవర్గ ప్రభుత్వాలు తన ఆదేశాలకి ఇష్టంగానో అయిష్టంగానో తలవంచేట్టు చేసుకోవడం ప్రారంభించింది. ఈ ఒత్తిడులతో తన యుద్ధ నిర్ణయానికి వివిధ దేశాల పాలక ప్రభుత్వాలు గంగిరెద్దుల్లా తలలూపడంతో యిక ప్రపంచమంతా తనకి మద్దతునిస్తోందని దబాయించేస్తూ ఆఫ్ఘనిస్తాన్‌పై అక్టోబర్ 7న భారీ యుద్ధానికి దిగిపోయింది అమెరికా.

## ఈ యుద్ధం అంతర్జాతీయ న్యాయసూత్రాలకి పూర్తి విరుద్ధం!

అమెరికా యుద్ధ ప్రతిపాదన ఐక్యరాజ్య సమితిలో చర్చించబడాలని, ఆ వేదిక అనుమతి పొందాలని, లేకుంటే ఈ యుద్ధం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకి విరుద్ధమవుతుందనే వాదనని మొరటుగా తిరస్కరిస్తూ, తనకు అప్పటికే ఐ.రా.స. ఆమోదం వుందని దబాయించింది. ఇందుకు సాక్ష్యంగా సమితి భద్రతామండలి ఈ సందర్భంగా చేసిన రెండు తీర్మానాలని ముందుకి తెచ్చింది అమెరికా. సెప్టెంబర్ 11 నాటి దాడి బిన్‌లాడెన్ అమెరికాపై ఎక్కుపెట్టిన యుద్ధమని, సాయుధ ఘర్షణ అని అమెరికా వాదించింది. ఈ వాదనని 'నాటో' కూటమి ఔనౌనంది. కాని, 1949నాటి 'జెనీవా ఒడంబడిక' (జెనీవా కన్వెన్షన్) ప్రకారం అమెరికా వాదన తప్పు. ఏమంటే-జెనీవా ఒడంబడిక ప్రధానంగా రెండు దేశాల మధ్య సాగే ఘర్షణల గుర్తి మాత్రమే చెబుతూ ఒక్క సాధారణ అధికరణం 3 ప్రకారం మాత్రమే ఒకే దేశంలోని రెండు గ్రూపులు పరస్పరంగా సాయుధ అంతఃఘర్షణలకి దిగిపోయినపుడు కూడా

అంతర్జాతీయ స్పందన న్యాయసమ్మతమేనని చెప్పింది. ఇక్కడ బిన్‌లాడెన్ ప్రత్యేకంగా ఏ దేశ ప్రతినిధీ కాడు; సరికదా, ఏ దేశానికీ అధికారయుత అధినేత అంతకంటే కాడు. పోతే సమితి భద్రతామండలి టెర్రరిజం, భద్రతలపై చేసిన రెండు తీర్మానాలూ అమెరికా యుద్ధాన్ని సమర్థించేవి కావు. భద్రతామండలి సెప్టెంబర్ 12న, 1368వ నెంబర్ తీర్మానం సెప్టెంబర్ 28న 1373వ నెంబర్ తీర్మానం రెండు తీర్మానాలు చేసింది. ఇందులో ఏ ఒక్క తీర్మానం కూడా 1990లో కువైట్‌పై ఇరాక్ దాడి చేసిన సందర్భంగా భద్రతామండలి చేసిన 678 నెంబర్ తీర్మానం లాగ ''తీర్మానం అమలుకి అవసర చర్యలన్నీ చేపట్టి అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడాలి'' అంటూ సమితి సభ్య దేశాలను 'అనుమతించి'నట్టు ఇప్పుడీ తీర్మానాలు అనుమతించలేదు. ''టెర్రరిస్టు చర్యలు అంతర్జాతీయ శాంతికి, భద్రతకి భంగం కలిగించేవి'' అని మాత్రమే అవి చెప్పాయి. అయినా ఈ తీర్మానాలని సమితి అనుమతిగా అమెరికా వ్యాఖ్యానం చేయడమంటే–అమెరికా అబద్దాలని ఖండించలేని మెతకదనంతో సమితి పడుండటమే కారణం. ఐ.రా.స. అమెరికా చేతిలో రబ్బర్‌స్టాంప్ అన్న సంగతి అందరికీ తెలిసిందే. అయినా కూడా లాంఛనంగా దాని ఆమోదముద్ర వేయించుకోడంతో కూడా పనిలేకుండా; ప్రపంచ ప్రజల మనోభావాల్ని అసలు పట్టించుకోకుండా యింత బరితెగింపుగా, యింత మొరటుగా ఒక చిన్న, పేద దేశంపై యింత భారీ వినాశకర యుద్ధానికి తలపడిపోవడమనేది ఆశ్చర్యం కలిగించే విషయమే. కాని, అమెరికా సామ్రాజ్యవాద దురహంకార పూరిత, దురాక్రమణపూరిత, నీతిబాహ్యమైన చరిత్ర తెలిసిన వారికి మాత్రం యిది ఏమాత్రం ఆశ్చర్యం కలిగించదు.

### మానవ చరిత్రలో అమెరికా ఆవిర్భావమే పెను దుర్ఘటన!

అసలు మానవ చరిత్రలో అమెరికా ఆవిర్భావమే ఒక వినాశకర ఘటనగా చెప్పవచ్చు. ఆదివాసులైన రెడ్ ఇండియన్‌లను ఊచకోతలతో సమూలంగా నిర్మూలించేస్తూ అరకొరగా మిగిలిన వారిని తన్ని తరిమేసి మరీ వారి భూభాగాల్ని ఆక్రమించుకున్న అమానవీయ దుష్టచరిత్ర అమెరికాది. అలాంటి అమెరికా మొదట్లో ఒకవలసగా వుంటూ (బ్రిటీష్ వలస) 18వ శతాబ్ది చివరిలో జార్జివాషింగ్‌టన్ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం పొందింది 1860లలో అబ్రహాంలింకన్ నాయకత్వంలో సాగిన అంతర్యుద్ధ ఫలితంగా బానిసత్వం రద్దుకాగా (ఒక వ్యవస్థగా) ఉత్పత్తి శక్తులు విడుదలై వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది అమెరికా. మొదటి ప్రపంచయుద్ధ కాలంలోనే అమెరికా ప్రముఖ దేశంగా ఎదిగింది. ఆ యుద్ధంలో అది నేరుగా పాల్గోలేదు, కాని యుద్ధకొల్లలో వాటా మాత్రం చిక్కించుకుంది. 1920ల నాటికే ప్రముఖ పారిశ్రామిక దేశంగా మారింది. దాని పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. 1929ల నాటి 'పెనుమాంద్యం'తో దాని ఆర్థిక పరిస్థితి కొంత క్షీణించినా తిరిగి త్వరలోనే కోలుకుంది. 'పెనుమాంద్యం' పర్యవసానంగా 1939లో 2వ ప్రపంచ యుద్ధం కమ్ముకుంది. ఈ యుద్ధంలో కూడా చివరిదాకా అంటీముట్టని తీరులోనే వుంటూ, యుద్ధ వాతావరణంలో తన ఆయుధాలమ్ముకుని లాభాలార్జించడం మీదనే కేంద్రీకరించిన అమెరికా యుద్ధం ముగియక ముందే, 1944లోనే యుద్ధ ఫలాల పంపకానికి తహతహలాడిపోయింది (బ్రెట్టన్‌వుడ్ సమావేశం ద్వారా). రాజకీయంగా ఐక్యరాజ్యసమితి ఏర్పాటుకు, ఆర్థికంగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐ.ఎం.ఎఫ్), గాట్‌ల ఏర్పాటుకి రంగం సిద్ధం చేసుకుంది. యుద్ధం దాదాపుగా ముగిసిపోయినా కూడా, తానేమీ అలసిపోని ఆ యుద్ధంలో తన 'మొనగాడి'తనాన్ని చాటుకుని ఆ రకంగా మిత్ర రాజ్యాలను (allied forces) అలానే ఓడిన దేశాల్ని కూడా తన ఆధిపత్యం కిందకి తెచ్చుకునే దుష్ట సంకల్పంతోనే అనవసరంగా జపాన్‌లోని హిరోషిమా నాగసాకీలపై అణుబాంబులు ప్రయోగించి మానవచరిత్ర అంతదాకా ఎరుగనంతటి పెనుమారణ హోమాన్ని సృష్టించింది. జర్మనీని సోవియట్ యూనియన్ దురాక్రమిస్తుందనే కుంటిసాకుతో ఆ దేశాన్ని యుద్ధంలోకి ఈడ్చి, పశ్చిమ జర్మనీ ఏర్పాటుతో ఆ దేశాన్ని నిలువునా చీల్చింది. మధ్య ఆసియాలో తన ఆధిపత్యం నిరాటంకంగా సాగడానికి వీలుగా పాలస్తీనాను లేకుండా చేయడానికి ఇజ్రాయిల్‌ని సృష్టించింది. 'మార్షల్ ప్రణాళిక' పేరుతో యుద్ధంలో గెలిచిన బ్రిటన్, ఫ్రాన్స్‌లలో పునర్నిర్మాణ కార్యక్రమం చేబడుతున్నానంటూ వాటి మార్కెట్లను గుంజుకుంది. ఓడిన జపాన్ జర్మనీ, ఇటలీలలో తన పెట్టుబడులని ప్రవహింపజేసింది. ఇంకోపక్క బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, జర్మనీల పాతవలసలైన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోకి తన పెట్టుబడుల్ని ప్రవహింపజేసింది (కెనీషియన్ సూత్రం). ఈ క్రమంలో అమెరికా 1950ల తరువాత సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా అవతరించింది.

వివిధ దేశాల్లోని తన పెట్టుబడుల రక్షణకై ప్రపంచ వ్యాప్తంగా నాటో, సీటో, సెంటో లాంటి సైనిక కూటాలను ఏర్పర్చుకుంది. ఆసియాలో న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, డిగోగార్షియా, ఇజ్రాయిల్‌లలోను; దక్షిణాఫ్రికాలో పెరూ, అర్జెంటీనాల్లోనూ సైనిక స్థావరాలేర్పరచి ఆ దేశాలకి ప్రజలకి, జాతులకి పెనుముప్పుగా వుంటోంది అమెరికా. అరబ్–ఇజ్రాయిల్ యుద్ధం రగిల్చి మధ్య ఆసియానంతటినీ గుప్పెట్లో వుంచుకుని, అక్కడి చమురు సంపదలపై పెత్తనం చెలాయిస్తూ జపాన్ యూరోప్ దేశాలను కూడా చమురుతో బ్లాక్‌మెయిల్ చేస్తోంది. అంగోలా, మొజాంబిక్, జింబాబ్వేలలో రగిలిన స్వాతంత్ర్య పోరాటాలకు వ్యతిరేకంగా ప్రతీఘాతుక ముఠాలను (ఉదా॥కు యూనిటీ) ఉసిగొల్పింది. ఎల్‌సాల్వేడార్, ఈక్వేడార్, డొమినికన్ రిపబ్లిక్ ప్రభుత్వాలను తన గూఢచార సంస్థ సి.ఐ.ఏ పడగనీడన పెట్టుకుంది. ఇక క్యూబాపై సాగిన కుట్రలకి అంతే లేదు. ఇథియోపియా, సోమాలియా, హైథీ, బురుండీ, రువాండాలలో ప్రభుత్వాలని పదేపదే అస్థిరపరిచింది. నికరాగువాలో శాండినిస్టా ఉద్యమకారులకి (కమ్యూనిస్టు ఉద్యమకారులకి) వ్యతిరేకంగా 'కాంట్రా' విద్రోహముఠాలను సాయుధం చేసి వుసిగొల్పింది. ఫిలిప్పీన్స్‌లో మార్కోస్‌ని మచ్చిక చేసుకుని 'సూబిక్ బే'ని చేజిక్కించుకుంది. మార్కోస్ పలుకుబడి సన్నగిల్లడంతో అజ్ఞాతంలో వుండిన అక్వినోను చేరదీసి ఎన్నికల తంతుని నిర్వహింపజేసింది. అయితే మార్కోస్ అకివానోను హత్య చేయించగా (1983) అతని భార్య కొరజాన్ అక్వినోను బరిలోకి దింపింది. ఆమె దేశాధ్యక్షురాలైంది. ఆమెపై ఒత్తిడి చేసి ఫిడేల్ రామోస్‌ను అధినేతగా చేసింది. అతడూ తన సంతృప్తిమేరకి పనికిరాకపోవడంతో జోసెఫ్ ఎస్ట్రెడాను గద్దెనెక్కించింది అమెరికా. తర్వాత అవధులు మీరిన అవినీతితో ఇతగాడు అభాసుపాలవగా గ్లోరియోని ప్రజాస్వామ్య పరిరక్షకురాలిగా పైకెత్తి గద్దెనెక్కించింది. ఈజిప్ట్ అధ్యక్షుడు అన్వర్ సాదత్‌ను సి.ఐ.ఏ చేత హత్య చేయించింది. దేశంలోని పరిశ్రమలను జాతీయం చేసి స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను నెలకొల్పే ప్రయత్నం చేశాడనే దుగ్ధతో చిలీ అధ్యక్షుడు సాల్వెడార్ అలెండీ పైకి పినోచెట్‌ని వుసిగొల్పి తిరుగుబాటు చేయించింది, చివరికి సి.ఐ.ఏ చేత అలెండీని హత్య చేయించింది. అమెరికా ఘాతుకాల చిట్టా ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద గ్రంథమే అవుతుంది.

ఇంతటి నేరపూరితమైన చరిత్రని వెనకేసుకున్న అమెరికా; ప్రపంచం మొత్తంపైనే భయంకరమైన రాజ్య వుగ్రవాద శక్తిగా మారిపోయి, ప్రపంచ మానవాళి మనుగడకే పెనుముప్పుగా వుంటున్న అమెరికా–ప్రపంచంలో టెర్రరిజం అనేదాన్ని అంతం చేయడమే తన లక్ష్యమని, అందులో భాగమే ఆఫ్ఘానిస్తాన్‌పై తాను చేస్తున్న యుద్ధమని చెబితే అమెరికా చరిత్ర తెలిసినవారంతా నవ్విపోతారుతప్ప నమ్ముతారనుకోవడం భ్రమ! ప్రపంచ ప్రజలు తన మాటల్ని నమ్మటం లేదన్న సంగతి అందరికంటే అమెరికాకే బాగా తెలుసు అయితే మరెందుకీ ప్రచారం? నమ్మకపోయినా కూడా విపరీత ప్రచారంతో చేతులు దులిపేసుకుని ప్రజలంతా తనని నమ్ముతున్నారని దబాయించేసి చెలాయించుకుపోడానికే. ఇది అమెరికాకి ఒక అలవాటు. ఇది

అమెరికా సామ్రాజ్యవాద మార్కు కుసంస్కృతి. 'టెర్రరిజం' గూర్చి గొంతులు చించుకునే అమెరికాసామ్రాజ్యవాద పాలకులు గాని, దేశదేశాల్లోని వారి తైనాతీ పాలకవర్గ ముఠాలు కుహనా మేధావులుగాని 'టెర్రరిజం' అంటే ఏమిటో స్పష్టంగా నిర్ద్వంద్వంగా చెప్పగలరా? చెప్పలేరు. ఏమంటే అలా నిర్వచించుకుంటే అతిపెద్ద టెర్రరిస్టులుగా ముందు తేలేది ఈ ముష్కర మూకలే. సందేహించాల్సిన పనిలేదు. పోనీ తాను చెబుతున్న తీరులో, తాను నమ్ముతున్న తీరులోనే టెర్రరిజం అనేదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే; బిన్‌లాడెన్ అనే టెర్రరిస్టుని అతను ప్రాతినిధ్యం వహించే టెర్రరిజాన్ని అంతం చేసే లక్ష్యంతోనేనా అమెరికా ఆఫ్ఘానిస్తాన్‌పై యుద్ధానికి దిగింది? కాదు! కానేకాదు! గడచిన 25-30 సంవత్సరాల కాలంలో ఆఫ్ఘానిస్తాన్‌లో జరుగుతూ వచ్చిన పరిణామాల్ని లోతుగా పరిశీలించే వారికీ వాస్తవం చక్కగానే అర్థమవుతుంది.

## ఆధిపత్య స్థాపనే అమెరికా యుద్ధ లక్ష్యం

2,51,700 చ.కి.మీ విస్తీర్ణంతో 2.25కోట్ల పలుచని జనాభాతో కేవలం 178 డాలర్ల తలసరి ఆదాయంతో, 85శాతం ప్రజలు వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా వుండే అతిచిన్న నిరుపేద దేశం ఆఫ్ఘానిస్తాన్. ఆఫ్ఘానిస్తాన్ భౌగోళిక స్థితికి చాలా వ్యూహాత్మక ప్రాధాన్యత వుంది. మధ్య ఆసియా-మధ్య ప్రాచ్యాల మధ్య ఒక వారధిలా పనిచేస్తుంది ఈ చిన్నదేశం. దీనికుండే ఈ వ్యూహాత్మక ప్రాధాన్యత రీత్యా ఈ దేశం మీద పట్టుకోసం అప్పటి రెండు అగ్రరాజ్యాలైన అమెరికా రష్యాలు తీవ్రంగా పోటీపడుతూ ఆ దేశం నడ్డిమీద ప్రచ్ఛన్న యుద్ధ భారాన్ని మోపుతూ వచ్చాయి. అమెరికా రష్యాల మధ్య సాగిన ఈ పోటీలో, 1979లో సోవియట్ రష్యా ఆఫ్ఘానిస్తాన్‌పై దురాక్రమణకి పూనుకున్నంతదాకా ఆఫ్ఘానిస్తాన్ సుమారుగా తటస్థ వైఖరినే అవలంభిస్తూ వచ్చింది. రష్యా దురాక్రమణ తరువాత అమెరికా చురుగ్గా పావులు కదిపింది. రష్యాకి వ్యతిరేకంగా అక్కడ మొజాహిద్దీన్‌లు అనేవారిని సైన్యంగా తర్ఫీదు చేసింది. ఒసామా బిన్ లాడెన్ మొదట్లో ఒక మొజాహిద్దీన్ ఆర్గనైజర్‌గా వుంటూ రష్యాకి వ్యతిరేకంగా అమెరికా-పాకిస్థాన్, సౌదీ అరేబియాల మధ్య సంధానకర్త పాత్ర పోషిస్తూ వచ్చాడు. లక్షలాది డాలర్లు కుమ్మరించి సి.ఐ.ఏ రష్యాకు వ్యతిరేకంగా వందలాది జిహాదీలను తర్ఫీదు చేసింది. ఇలా వుండగా సోవియట్ యూనియన్ ప్రాభవం సైనికంగా కూడా తీవ్రంగా దెబ్బతినడంతో కుప్పకూలిపోవడంతో ఆఫ్ఘానిస్తాన్ నుంచి రష్యా 1989లో ఉపసంహరించుకుంది. దీంతో ఇక ఆఫ్ఘానిస్తాన్‌పై తన ఆధిపత్యానికి ఢోకాలేదని అమెరికా భావించింది. అక్కడ తన తొత్తు ప్రభుత్వం ఏర్పాటుకి డాలర్ల సంచులు సరఫరా చేసింది. అమెరికా సౌదీ అరేబియాలందించిన అపార ధనసహాయంతో అక్కడ 1992లో మొజాహిద్దీన్ ప్రభుత్వం ఏర్పడింది. కాని ఇంతలో మొజాహిద్దీన్‌లలో ముసలం బయలుదేరింది. తాలిబాన్ పేరుతో జిహాదీ పోరాటకారులతో ఒక కొత్త సంస్థ తలెత్తింది. ఇది మతావేశపరమైన ఎజెండాతో ముందుకొచ్చింది. ఒక ఉదారవాద తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పర్చుకోవాలనుకున్న అమెరికాకి ఇది ఎదురుదెబ్బే అయినా తాలిబాన్‌లని అది మచ్చిక చేసుకోడానికి కూడా ప్రయత్నించింది, ఏమంటే అప్పటికే తాలిబాన్ ఒక శక్తిగా తయారైంది. తమతో విభేదించే మొజాహిద్దీన్ శక్తుల్ని మూడు ఏళ్ళకే తన్నితరిమేసింది. 1996లో తాలిబాన్ ప్రభుత్వం ఏర్పడింది. తాలిబాన్‌ప్రభుత్వం అమెరికాకి దూరంగా వుంటూ వచ్చింది. 1998లో కెన్యా, టాంజానియాల్లోని తమ కార్యాలయాలపై జరిగిన దాడులు తరువాత ఇందుకు బాధ్యుడైన బిన్‌లాడెన్‌ని తనకి అప్పగించాలని అమెరికా తాలిబాన్ ప్రభుత్వంపై వత్తిడి చేసింది. ఈ దాడుల్లో 12 మంది అమెరికా పౌరులతోసహా 224 మంది చనిపోయారు. లాడెన్ అప్పగింతకి తాలిబాన్ అంగీకరించలేదు. ఇలా వుండగా ఇరాక్‌పై అమెరికా యుద్ధానికి తలపడిన తరువాత (1991) బిన్‌లాడెన్ కరడుగట్టిన యూదు వ్యతిరేకిగాను, అమెరికా వ్యతిరేకిగాను మారాడు. అమెరికాకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. మక్కా, మదీనాలలో అమెరికా సేనల మోహరింపుతో లాడెన్ అమెరికాపట్ల మరింత వ్యతిరేకతని పెంచుకున్నాడు.

ఊహించని ఈ విపరిణామాలతో అమెరికా ఖంగుతింది. ఆఫ్ఘానిస్తాన్‌పై తన ఆధిపత్యాన్ని నెలకొల్పి, మధ్యప్రాచ్యంపై పూర్తి అదుపుని సాధించి మధ్య ఆసియాలోని రిపబ్లిక్‌లలో అల్లకల్లోలాల్ని సృష్టించి అక్కడి చమురు నిల్వలను గుంజుకుపోవాలనుకునే అమెరికా ఆశలు తాలిబాన్, లాడెన్‌ల కారణంగా అడియాశలైపోయాయి. తాలిబాన్‌పట్ల లాడెన్‌పట్ల అమెరికా దుగ్ధకి అసలు కారణం యిది. ఆఫ్ఘానిస్తాన్‌పై అమెరికా తలపెట్టిన అన్యాయమైన యుద్ధానికి అసలు నేపథ్యం ఇదీ! ఏ టెర్రరిజాన్నయితే అమెరికా గొంతుచించుకు మరీ వ్యతిరేకిస్తున్నట్లుగా నటిస్తోందో, అదే టెర్రరిజాన్ని ఆఫ్ఘానిస్తాన్‌పై తన ఆధిపత్య స్థాపనకి అమెరికా ప్రయోగిస్తోంది. ఆఫ్ఘానిస్తాన్ లాంటి చిన్న, పేద, బలహీన దేశంపై అమెరికా లాంటి అగ్రరాజ్యం భీకర యుద్ధానికి దిగిపోవడం అనేది సెప్టెంబర్ 11 దాడికి కేవలం ప్రతీకారంగానేనా? అదీ లాడెన్ ఆ దాడికి సూత్రధారుడని తగిన సాక్ష్యాధారాలు లేకపోయినా కూడా. అమెరికా లక్ష్యం దాడికి ప్రతీకారం కానేకాదు. దాడి సాకుగా తన విధ్వంస శక్తిసామర్థ్యాలని ప్రదర్శిస్తూ హద్దులేని భయోత్పాతాన్ని సృష్టించి ఆఫ్ఘానిస్తాన్‌పై తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవాలనేదే దాని అసలు లక్ష్యం. నయానో భయానో తన ఆధిపత్యాన్ని స్థాపించుకోడానికి అమెరికా సామ్రాజ్యవాదం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ఎందుకంటే-ఆధిపత్యాన్ని వెన్నంటే ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రయోజనాలన్నీ వుంటాయి. ఆఫ్ఘానిస్తాన్‌పై అమెరికా యుద్ధాన్ని నియంత్రించే అంతఃసూత్రం ఈ ఆధిపత్యమే. అయితే కేవలం ఆఫ్ఘానిస్తాన్‌పై ఆధిపత్య స్థాపన లక్ష్యంతోనేనా అమెరికా ఆ చిన్న దేశంపై పెద్ద యుద్ధానికి దిగిపోయింది? అమెరికా తలపెట్టిన యుద్ధానికి ఈ పరిమిత లక్ష్యమే వుందనుకుంటే పెద్ద పొరపాటే! మరికొన్ని దేశాల్ని కూడా భయపెట్టి వాటిపై తన అజమాయిషీ చెలాయించే లక్ష్యం కూడా ఈ యుద్ధానికుంది. ''మా ఆత్మరక్షణ అవసరాలరీత్యా మరికొన్ని సంస్థలకి ఇంకొన్ని దేశాలకి వ్యతిరేకంగా కూడా మరికొన్ని చర్యలు మేము చేపట్టాల్సి రావొచ్చు'' అంటూ ఐరాస భద్రతామండలికి అమెరికా రాయబారిగా వుంటున్న నీగ్రోపాంటె చేసిన దురహంకార ప్రకటన అసలు సారం యిదే.

యుద్ధ నేపథ్యంగా వుంటున్న మరో కీలకాంశాన్ని గూర్చి కూడా మనం తెలుసుకోవాలి. అదేమంటే-అమెరికాకి ఆందోళన-కలిగించే ఆ దేశ ఆర్థిక దుస్థితి. సెప్టెంబర్ 7 నాటికే అమెరికా ఆర్థిక స్థితి అధ్వాన్నంగా తయారైంది. ఆగస్టు 2001కి బుష్ ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక గణాంగ వివరాల ప్రకారం ఆ దేశ జి.డి.పి వృద్ధిరేటు 0.2 శాతంగా నమోదైంది. ఒక్క మేన్యుఫ్యాక్చరింగ్ రంగంలోనే ఎనిమిది లక్షలమంది పైగా ఉపాధి కోల్పోయి వీధినపడ్డారు. జూలై నెలలో 4.5 శాతంగా వుండిన నిరుద్యోగం కేవలం ఒక్క నెల వ్యవధిలోనే 0.4 శాతం పెరిగిపోయి ఆగస్టునాటికి 4.9 శాతంగా తేలింది. సెప్టెంబర్ 7నాటి ఈ దిగ్భ్రాంతికర స్థితి సెప్టెంబర్ 11 నాటి దాడితో విపత్కర స్థితిగా మారింది. సెప్టెంబర్ 11 దాడితో అమెరికా మార్కెట్ బిలియన్ల కొద్దీ డాలర్లు నష్టపోయింది. ఒక్క విమానయాన సంస్థ నష్టాలే పది బిలియన్ డాలర్లు! వరుసగా నాలుగు రోజులు వాల్‌స్ట్రీట్ మూతపడడంతో పది రోజుల వ్యవధిలోనే దాని సెన్సెక్స్ (షేర్ మార్కెట్ సూచి) 15శాతం పడిపోయింది. ఐ.టి. సెన్సెక్స్ 17 శాతం పడిపోయింది. విమానయాన సంస్థ లక్షమంది ఉద్యోగులకి లే ఆఫ్ పలికింది. (లే ఆఫ్ : తగినంత పనిలేనప్పుడు యాజమాన్యం కార్మికులను తాత్కాలికంగా పనినుంచి తొలగించటం) ఈ పెను సంక్షోభం నుంచి బయటపడే మార్గంగానే ఆఫ్ఘానిస్తాన్‌పై యుద్ధాన్ని కింది కారణాలతో ఎంచుకుంది అమెరికా! (1) మడుగు నీరులా మారిన దేశీయ మార్కెట్లో పెద్ద చలనాన్ని తీసుకురావడానికి వీలుగా పెద్దయెత్తున ఆయుధాల

## ఇదొక రాజకీయ చర్య

అక్టోబర్ నెలలో (21-10-2001) గుంటూరు జిల్లా మంగళగిరి లోని అమెరికా బహుళజాతి కంపెనీ కోకోకోలాకి చెందిన బాట్లింగ్ యూనిట్‌పై మన పార్టీ సాయుధ గెరిల్లా దళం చేసిన దాడికి ఒక ప్రత్యేకత వుంది. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా ఎక్కుపెట్టిన దురాక్రమణపూరిత యుద్ధానికి నిరసన చర్యగా దీన్ని ప్రకటించడంలో దీని రాజకీయ ప్రాముఖ్యత వుంది. అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువని, ప్రధాన శత్రువని మనం భావిస్తాం! ఇది అనుసరించే మార్కెట్ ఫండమెంటలిజం నుంచి పుట్టుకొచ్చే ఆర్థిక రాజకీయ విధానాలు సృష్టించే అనేకానేక సమస్యలతో మనం పోరాడుతున్నాం. శత్రువుతో చేసే పోరాటంలో, శత్రు విధానాల మొఖంపై చాచి కొట్టే లాంటి పోరాట రూపాలకి చర్యలకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత వుంటుంది. అలాంటి పోరాట చర్యలనేవి చాలా చిన్నవే కావచ్చు! కానీ అవి నేరుగానూ, విస్తృతంగానూ ప్రజలకి ఒక రాజకీయ సందేశాన్ని అందించేవిగా వుంటాయి. ఇలాంటి నిరసన చర్యలు తక్షణంగా ఏవో ఫలితాలను ఇచ్చేవిగా వుండక పోవచ్చు. కానీ కాలక్రమంలో ఇవి వ్యూహాత్మక ప్రాధాన్యతని సంతరించుకొనేవిగా వుంటుంటాయి. ఆనాడు భగత్‌సింగ్ పార్లమెంట్ భవనంలో చొరబడి పొగబాంబు పేల్చి బ్రిటీషు పాలనకి వ్యతిరేకంగా కరపత్రాలు వెదజల్లడానికి వుండే ప్రాధాన్యత ఇలాంటిదే! ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ.) భవన సముదాయం పైనా, పెంటగాన్ భవనంపైనా సెప్టెంబర్ 11న జరిగిన దాడికున్న రాజకీయ ప్రాధాన్యత ఇలాంటిదే! అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విస్తృతమైన చర్చను రగిలించి ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ఎంతగానో దోహదపడే చర్య ఇది! ఈ కోణంలో చూసినపుడు కోకోకోలా బాట్లింగ్ యూనిట్‌పై మనం జరిపిన చిన్న దాడి ఘటనకి తగినంత రాజకీయ ప్రాధాన్యత వుందని చెప్పడం అతిశయోక్తి కాజాలదు. కాగా, అమెరికన్ సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థ అయిన ప్రపంచబ్యాంకు నిర్దేశించే విధానాలకి ప్రయోగశాలగా మారిపోయిన మన ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన ఈ ఘటనకి మరింత రాజకీయ ప్రాధాన్యతే వుంటుంది. కానీ, పదే పదే ఇలాంటి చర్యలకి పాల్పడితే మాత్రం అవి వాటికుండే రాజకీయ ప్రాముఖ్యతని కోల్పోతాయనే వాస్తవాన్ని సైతం మనం దృష్టిలో వుంచుకోవాలి.

## మేడ్ ఇన్ అమెరికా




ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడి చేసినందుకు ప్రతీకారంగా మంగళగిరిలోని కోకోకోలా యూనిట్‌పై నక్సలైట్లు దాడి చేసారు. ఆ మరుసటి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెక్యూరిటీని విపరీతంగా పెంచారు. ఎక్కడో వున్న ఆఫ్ఘాన్‌పై అమెరికా దాడి చేస్తే మంగళగిరిలోని కోకోకోలా బాట్లింగ్ యూనిపై పీపుల్స్‌వార్ గ్రూప్ దాడి చేయడమేమిటీ, ఆఫ్ఘాన్‌కు పీపుల్స్‌వార్, మంగళగిరి బాట్లింగ్ యూనిట్‌కు, అమెరికాకు సంబంధం ఏమిటీ చంద్రబాబుకు సెక్యూరిటీ పెంచడం ఏమిటీ అంతా గందరగోళంగా వుందనిపిస్తుంది కదూ. కానీ ఒకదాని కొకటి సంబంధం వుంది. కోకోకోలా అమెరికా కంపెనీ, మంగళగిరిలోని నక్సల్స్‌కు అమెరికా అధ్యక్షుడు అందుబాటులో వుండడు. వారికి అందుబాటులో వున్న అమెరికా కంపెనీ కోకోకోలా బాట్లింగ్ యూనిటే కాబట్టి ఆ యూనిట్‌పై దాడి చేసారు. అంతవరకు బాగానే వుందికానీ, ఆ మరుసటి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ పెంచడం ఏమిటో? ఇది నిజంగానే చాలా మందికి అర్థం కాలేదు. మంగళగిరిలో వార్ దాడి జరగగానే సచివాలయంలో ముఖ్యమంత్రి రక్షణకు సంబంధించి ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం వున్న బ్లాక్ వద్దకు గతంలో వలె అందరూ రావడానికి వీలులేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసారు. సచివాలయంలో ఇంతకు ముందెన్నడూ లేనంత బందోబస్తు ఏర్పాటు చేసారు. ముఖ్యమంత్రి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నా తప్పుపట్టాల్సిన అవసరం లేదు. వీలైనంత మేరకు రక్షణ చర్యలు పెంచాల్సిందే. దీనిలో ఎవరికీ అభ్యంతరం వుండాల్సిన అవసరం లేదు. కానీ కోకాకోలాపై దాడి జరిగిన వెంటనే ఈ చర్యలు తీసుకోవడం ఏమిటనేదే కొందరికి అర్థం కాలేదు. అయితే దీనికి కమ్యూనిస్టులు సమాధానం చెప్పారు. ''కోకాకోలా అమెరికా ప్రాడక్ట్ కదా అందుకే వార్ తీవ్రవాదులు దాడి జరిపారు. మరి మన ముఖ్యమంత్రి కూడా అమెరికా ప్రాడక్టే కదా అందుకే మంగళగిరి సంఘటన జరిగిన వెంటనే భద్రత పెంచార''న్నారు. అమెరికా కనుసన్నల్లో నడిచే ప్రపంచబ్యాంకు కనుసన్నల్లోనే మన ముఖ్యమంత్రి నడుస్తారు. జన్మభూమితో సహా మన పథకాలన్నింటికి రూపకల్పన చేసేది ప్రపంచబ్యాంకే. మన రాష్ట్రంలో ఎంత అద్భుతంగా పాలన సాగుతున్నదనే విషయం మన ప్రజలకన్నా అమెరికా పత్రికలకే ఎక్కువగా తెలుసు. చంద్రబాబునాయుడు అమెరికా ప్రాడక్ట్ కాబట్టి కోకోకోలా కంపెనీ యూనిట్‌పై దాడి జరగగానే రక్షణ పెంచారని ఇందులో తప్పు పట్టాల్సిందేమీ లేదని కమ్యూనిస్టులు హాస్యమాడుతున్నారు.

**- 'ఆంధ్రభూమి' పత్రిక నుండి**

## ‘మర్చంట్ ఆఫ్ వెనిస్’

వాడేం చేస్తే బాగుండునో మీరే చెప్పండి
వాడో దేశం కాకపాయె-వియత్నామ్‌వలె
వాడో ప్రభుత్వం కాకపాయె-క్యూబావలె
గుణపాఠం చెప్పలేకపోయినా
లిబియానో, ఇరానో, బ్రెజిలో, చిలీయో కాదాయె
నికరుగ్వా, ఎల్‌సాల్వడార్, పనామా, హైతీ
అంగోలా-దక్షిణాది ఆఫ్రికా
మధ్య, ఉత్తర అమెరికా
అంతటా వాడే
కాని ఇవ్వాళ ఏకాకి
ఏ ఒక్క పోలికా తేలేనంత అర్భకుడు
కాని మొండివాడు
ఒక్క ప్రాణంలో ఉన్న ప్రమిదలోని
దీపం వంటి కోపం తప్ప
వాడో ఇరాక్ వంటి రాజ్యమా
పాలస్తీనా వంటి ప్రతిష్ట అయినా
మిగిలిన ప్రవాస యుద్ధమా.....
వాడు అరవై ఏళ్లుగా అనుభవించిన అవమానాలు
మనకు చీమూ నెత్తురూ మిగిలితే తప్ప అర్థం కావు
వాడికో మతం పేరు పెట్టాలని
చూస్తున్నది మార్కెటు
ఇంటర్నేషనల్ మానిటరీ
ఫండమెంటలిజం నుంచి
దేశభక్తిని అప్పుతెచ్చుకుంటున్న మన పాలకులు
వాడినొక టెర్రరిస్టుగా దేశద్రోహిగా మనముందు
నిలబెడుతున్నారు
వాడి ఆక్రోశంలో పాల్ రాబ్సన్ సంగీతం లేదా
ఉరికంబమెక్కిన రోజెన్ బర్గ్ దంపతుల
ఉసురు లేదా
హిరోషిమా నాగసాకీలో పేలిన హృదయాలు
చిట్లిన నరాలు
విషాద విహ్వల వైకల్య వారసత్వ
విలాపాలు లేవా?
వియత్నామ్ యుద్ధకాలపు అమెరికా
యువతరాన్ని అడగండి
విచారణ నుంచి బయటపడడానికి పరాయి
దేశంపై బాంబులేసిన
బిల్‌క్లింటన్ నేర అంతరంగాన్ని అడగండి
(అదివుంటే).
వాడొక్కడివ్వాళ ఉన్మాదియై అమెరికా ఆకాశాన్నే అపహరించి
అమెరికా డేగ చూపునే అపహసించి
అమెరికా వాణిజ్య ఆకాశహర్మ్యాలు ధ్వంసించి
అమాయక ప్రాణాల్ని బలిగొన్నమాట
నిజమే కానీ
వాడు తన ప్రాణాన్ని ఆయుధంగా
మలచుకున్నాడు
వాడు ముందే చాలా నిబ్బరంగా తన శరీర
ధ్వంసాన్ని రాసుకున్నాడు
వాడి ద్వేషమంతా వరల్డ్‌ట్రేడ్ సెంటర్‌మీద
అది ఇవ్వాళ ప్రపంచ వాణిజ్య సంస్థ
నాడీ కేంద్రం
వాడి క్రోధమంతా పెంటగాన్‌మీద
అది ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న
సైనిక కేంద్రం
వాడి కసి వైట్‌హౌజ్‌మీద (అప్పటికే అది
బుష్‌లోకి పారిపోయింది)
అది దోపిడీ గ్లోబలైజేషన్ రాజనీతి కేంద్రం

**- వరవరరావు కవితలోంచి...**

## ఉద్విగ్నంగా...

బాధలేదు, దుఃఖమూ లేదు
అపరిమితమైన ఉద్వేగం
అనందపారవశ్యం-
కానీ, చిన్నగా భయం లోపల
తాచు తోక తొక్కినట్టు-
వద్దు వాదనలొద్దు
సంబరంలో సంవాదానికి చోటు లేదు,
వేలమంది ఛస్తే వేడుకా, అని అడక్కండి.
హిరోషిమా వికటాట్టహాసం చేస్తుంది;
నాగసాకీ కళ్లనీళ్లొచ్చేలా పడీపడీ నవ్వుతుంది;
ఇంకా క్యూబా, వియత్నాం, లిబియా...
ఇప్పటికే పాలస్తీనా ఫక్కుమనలే?
వద్దు
కేవలం మరణం గురించి మాట్లాడొద్దు-
ప్రపంచవ్యాప్తంగా కొన్ని
కోట్ల ఆత్మలు నిలదీస్తాయి
‘మా సంగతేంటని?’
కానీ, భయం వెన్నాడుతూనే వుంది
‘మ్యానీటర్’ మీసాలు గుంజినట్టు-
మరణించబోయే, మరిన్ని లక్షల ప్రాణాలు
కళ్లలో కదలాడుతున్నాయి-
అయినా, భూగోళంపై మనిషి
ఉనికిని చాటిన వారిని అభినందిద్దాం
ప్రతీకారేచ్ఛముందు
హైటెక్కుటమార విద్యలన్నీ
తుక్కుతుక్కని నిరూపించిన వారికి
ధన్యవాదాలు చెబుదాం-
నెత్తుటి రుచులు మాత్రమే తెలిసిన తెల్లపులికి
కన్నీటి విలువ తెలిపిన వారిని ముద్దాడుదాం-
మానవత్వాన్ని ఏనాడో మంటగలిపేసిన
ఆయుధ వ్యాపారి అహంమీద
దెబ్బకొట్టి, ప్రాణం తీపేనని చెప్పినవారిని
ఆలింగనం చేసుకుందాం,
జోహార్లు చెబుదాం.

**- దేశరాజు**

అమ్మకానికి రంగం సిద్ధం చేయడం (2) అదరింపు బెదిరింపులతోను, అనూహ్యమైన దాడులతోనూ వెనుకబడిన దేశాలని, మూడవ ప్రపంచదేశాలని నోరుమూయించి మరీ తన ఆర్థిక సంక్షోభ భారాన్ని వాటి మూపులపైకి నెట్టేయడం (3) కొడిగట్టుకు పోతున్న మార్కెట్ల మధ్య పోటీని తిరిగి రగిలించడం (4) తన మార్కెట్ ప్రయోజనాల్ని, తన ప్రభావ ప్రాంతాల్ని నిలుపుకోడానికి; కొత్తగా తనకి పోటీగా తలెత్తే సామ్రాజ్యవాద శక్తుల్నీ, ప్రత్యేకించి యూరోప్ సామ్రాజ్యవాద శక్తుల్ని అదుపు చేయడానికి తన కండకావరాన్ని, సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించాల్సి రావడం (5) దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న నిరుద్యోగం, పేదరికం లాంటి తీవ్ర సమస్యల నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించడానికి; ఆ సమస్యల పరిష్కారానికై ప్రజలు చేపట్టే అనేక ప్రజాపోరాటాలపై ఫాసిస్టు అణచివేతని అమలు చేయడానికి తగిన సాకు అనేది ఒకటి అవసరం కావడం–ఇవిగో ఇవీ అమెరికా తలపెట్టిన యుద్ధం వెనుక గల బలీయమైన ఆర్థిక, రాజకీయ అంశాలు, కారణాలు. అంటే అమెరికన్ పాలకులు ఏదో ఒక యుద్ధం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న సమయంలోనే ('సామ్రాజ్యవాద వాదం అంటే యుద్ధం' అన్న లెనిన్ మాట అక్షర సత్యం కదా) సెప్టెంబర్ 11 దాడి జరిగింది. అమెరికా పెట్టుబడిదారుల వాణిగా మాట్లాడే ''ఇకనామిస్ట్'' అనే పత్రిక తన సెప్టెంబర్ 22–29 నాటి సంచికలో ఏమని వ్యాఖ్యానించిందంటే ''యుద్ధకాలంలో ప్రభుత్వ వ్యయం దూసుకుపోతుంది. 2వ ప్రపంచ యుద్ధ సమయంలోని 'పెనుమాంద్యాన్ని' త్రోసిరాజంటూ దేశ ఆర్థిక స్థితి పుంజుకోవడాన్ని చూస్తాం. కొరియన్, వియత్నాం యుద్ధాలలో కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంది. విమానయాన సంస్థ భద్రతావ్యయం, సరిహద్దు రక్షణ వ్యయం, సైనిక నిర్వహణా వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఇప్పుడు కూడా అలాంటి ఫలితాలే అమెరికా ఆర్థిక వ్యవస్థలో పొడసూపవచ్చు.'' అంటే సంక్షోభ స్థితిలో పడిన అమెరికా ఆర్థిక వ్యవస్థని గట్టెక్కించే ఒక మార్గంగానే ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధాన్ని అమెరికా ఎంచుకుందన్నమాట. కనుక సెప్టెంబర్ 11 నాటి దాడి జరిగి వుండకపోయినా కూడా ఆఫ్ఘనిస్తాన్‌కి వుండే భౌగోళిక వ్యూహాత్మక ప్రాధాన్యత రీత్యాను; తనపట్ల తీవ్ర ద్వేషభావంతో పుండులా సలపరిస్తున్న లాడెన్ తాలిబాన్‌ల సమస్య రీత్యాను; ఎలాగోలా గట్టెక్కించుకోవాల్సిన తన ఆర్థిక సంక్షోభ స్థితి రీత్యాను మరి నాలుగు రోజులు ఆలస్యంగానైనా ఏదో ఒక సాకుతో ఏదో ఒక రూపంలో తప్పనిసరిగా అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధానికి దిగే వుండేది. ఆరమగ్గిపోయి పిల్లగాలి తాకిడికైనా తెగి రాలిపోవాల్సిన పండు కొమ్మపై కాకి వాలగానే రాలి నేలపడినట్టుగా ఎలాగూ ఆఫ్ఘనిస్తాన్‌పై తప్పని అమెరికా యుద్ధ బీభత్సానికి సెప్టెంబర్ 11 దాడి ఒక యాదృచ్ఛికమైన సాకు అయింది. అంతే!

సరిగ్గా ఈ కారణం చేతనే–సెప్టెంబర్ 11 దాడి విశేష ప్రాధాన్యతని సంతరించుకుందని చెప్పాలి. తమపై విరుచుకుపడబోయే భయానక యుద్ధం ఇంకా ప్రారంభం కాకముందే శత్రువు చెంప చెళ్లుమనిపించి ఆ రకంగా అనేక రెట్లు బలసంపన్నమైన శత్రువుపై బలహీనపక్షం తన తొలిదెబ్బని తీయడమే దీనికున్న విశేషం. అంతేకాదు–అమెరికాకి చెందిన ప్రముఖ ప్రగతిశీల మేధావి, సునిశిత రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నోమ్ చామ్‌స్కీ పేర్కొన్నట్లు ''1814 తరువాత మొదటిసారిగా తుపాకి మొనలు అమెరికాకి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయి'' ఈ వ్యాఖ్యతో సెప్టెంబర్ 11 దాడికి వుండే చారిత్రక ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతుంది.

## ప్రపంచ ప్రజాభిప్రాయం యుద్ధ వ్యతిరేకతే!

సెప్టెంబర్ 11 నాటి దాడి–దానికి ప్రతీకారం అంటూ అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై అక్టోబర్ 7 నుంచి ప్రారంభించిన భీకరయుద్ధం–ఈ రెండింటి పైనా ప్రపంచంలోని సామాన్య ప్రజల నుంచి వ్యక్తం అయిన అభిప్రాయం సహజమైనది, సహేతుకమైనదిగానే వుందని చెప్పాలి. పీడిత ప్రపంచ ప్రజలలో ఎక్కువశాతం సెప్టెంబర్ 11 దాడిపట్ల సంభ్రమాశ్చర్యాలే ప్రకటించారు, తమ ఆనందాన్నే వ్యక్తపరిచారు. కాగా, ఆ దాడిని ఖండించిన నిరసించిన ప్రజలతో కలుపుకుని ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజలు అమెరికా యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ రకంగా ప్రపంచ ప్రజాభిప్రాయం స్పష్టంగా నిర్ద్వంద్వంగా అమెరికా తలపెట్టిన యుద్ధానికి వ్యతిరేకం అనే తేలింది. అమెరికా సామ్రాజ్యవాదానికి అడుగులకి మడుగులొత్తే వివిధ దేశాల్లోని దోపిడీ పాలకవర్గాలు వారి అధికారిక ప్రభుత్వాలు సెప్టెంబర్ 11 దాడిపై అక్కసు వెళ్లగక్కుతూ అమెరికా తలపెట్టిన ఘోర యుద్ధానికి హారతులు పట్టడం గూర్చి చెప్పుకోవాల్సిన పనే లేదు. ఏమంటే ఆయా దేశాల ప్రజాభిప్రాయానికి అవి పూర్తి భిన్నమైన వైఖరులు గనుక! పోతే అనేక దేశాల్లోని పాలక ప్రభుత్వాలు సైతం అమెరికాకి కోపం రాకుండా జాగ్రత్తపడుతూ–ప్రపంచ టెర్రరిజంపై పోరాటం అవసరమే అన్నాయి తప్ప ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధాన్ని నిర్దిష్టంగా నిర్ద్వంద్వంగా బలపరచలేదు. యుద్ధ వ్యతిరేక గొంతులు వినిపించడం ముందుగా యుద్ధ కూటమి దేశాల నుంచే ప్రారంభం కావడం గమనార్హమైన విషయం. ''రాజకీయ లక్ష్య స్పష్టతలేని అమెరికా వైమానిక దాడుల కొనసాగింపు ముస్లిం ప్రపంచంలో తీవ్ర నిరసనను సృష్టించేది, శత్రువుపై అతి తక్కువ ప్రభావాన్ని కలిగించేదిగానే వుంటుంది'' అని బ్రిటన్‌కి చెందిన 'టైమ్స్' పత్రిక వ్యాఖ్యానించింది. ''టెర్రరిస్టు వ్యతిరేక సంకీర్ణం ప్రజల ఆలోచించే, మాట్లాడే శక్తిని నాశనం చేస్తుంది'' అని 'గార్డియన్' పత్రికలో జోనాథన్ స్మిత్ అనే యుద్ధ పరిశీలకుడు హెచ్చరించాడు. 'గార్డియన్' పత్రిక కథనం ప్రకారం ''బ్రిటన్‌లో అధికార పార్టీకి చెందిన 40మంది ఎం.పిలు యుద్ధాన్ని స్పష్టంగా వ్యతిరేకించారు'' తమ గొంతు నొక్కేస్తూ పార్టీ విప్ జారీ చేయడాన్ని వారు 'మెకార్థర్ తరహా వేట'గా అభివర్ణించారు. చిత్రం ఏమంటే–అమెరికా అధ్యక్షుడి ఆత్మగా వ్యవహరించే బ్రిటీష్ ప్రధాని టోనీబ్లెయిర్ యుద్ధోన్మాదానికి గట్టి హర్షామోదాలు వ్యక్తమైంది ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ నుంచే! 'ఏపెక్' (ఆసియా పసిఫిక్ ఇకనామిక్ కోఆపరేషన్) 'నాటో' లాగా అమెరికాకి అడుగులకి మడుగొలెత్తే మద్దతుని ప్రదర్శించలేదు. షాంఘైలో జరిగిన 'ఏపెక్' శిఖరాగ్ర సమావేశం ''టెర్రరిజానికి వ్యతిరేకంగా ఐ.రా.స. ప్రధాన పాత్ర పోషించాలి. సమితి తీర్మానాల ప్రాధాన్యతని స్వీకరించాలి'' అని మాత్రమే తీర్మానించింది. అమెరికా యుద్ధ నిర్ణయంపట్ల మౌనాన్ని పాటించింది. అమెరికా యుద్ధానికి అయిష్టంగానే మద్దతుని ప్రకటించిన రష్యా ''నిర్ణయాలన్నీ ఐ.రా.స వేదికపైనే జరగాలి. మధ్య ఆసియా రిపబ్లిక్‌లనుగాని మా వైమానిక స్థావరాలని గాని అమెరికా తన యుద్ధావసరాలకి వినియోగించడాన్ని ఆమోదించజాలం'' అని ప్రకటించింది. బెల్జియం, ఇటలీ, జర్మనీలు యుద్ధానికి దూరంగానే వుండదలచాయి. ''ఇస్లాంకి వ్యతిరేకంగా, అరబ్ ముస్లిం ప్రపంచానికి వ్యతిరేకంగా సాగే యుద్ధానికి మేం వ్యతిరేకం'' అని ఫ్రాన్స్ ప్రధాని జోసెఫిన్ ప్రకటించాడు. ''ఇది రెండు దేశాల మధ్య యుద్ధం కాదు'' అని ఇటలీ వ్యాఖ్యానించింది. ''యుద్ధం కాదు ముఖ్యం–రాజకీయ పరిష్కారం అవసరం'' అని జర్మనీ అభిప్రాయపడింది. ''అమెరికాకి వ్యతిరేకంగా సాగే యుద్ధం నాటో సభ్య దేశాలలో ప్రతి ఒక్కదానికీ వ్యతిరేకంగా సాగేదిగానే వుంటుంది'' అంటూ నాటో ఆర్భాటంగా చేసిన తీర్మానం 5వ నిబంధనని, వివిధ యూరోపియన్ దేశాల ఈ భిన్న స్వరాలు అపహాస్యం చేసాయి. ''అమెరికా గాని నిజంగా టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడదలిస్తే ముందుగా అది ఇజ్రాయిల్ స్టేట్ టెర్రరిజానికి వత్తాసు నివ్వడాన్ని మానుకోవాలి'' అని ఈజిప్టు, 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్' దేశాలు డిమాండ్ చేసాయి. ''అమెరికా ద్వంద్వ ప్రమాణాలకి స్వస్థి చెప్పాలి'' అని దాని మధ్యప్రాచ్య మిత్ర దేశాలు కోరాయి.

అమెరికా తలపెట్టిన అమానుష యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజానిరసన గురించి చెప్పాలంటే–అది అమెరికా

గడ్డనుంచే ప్రారంభమైంది. సెప్టెంబర్ 11-30 తేదీల మధ్య అమెరికాలోని ముఖ్య నగరాలన్నీ అమెరికా యుద్ధ వ్యతిరేక నిరసన ప్రదర్శనలని చవిచూసాయి. 'మేం యుద్ధం కోసం అర్రులు చాచడం లేదు.' ''సెప్టెంబర్ 11 దాడిలో హతులైన మా బిడ్డల పేరుమీద ప్రతీకారం చెలరేగరాదనే కోరుతున్నాం'' ''యుద్ధం వద్దు'' ''ఆఫ్ఘనిస్తాన్‌ని ముట్టుకోవద్దు. చిలీ, ఎల్‌సాల్వేడార్, వియత్నామ్, ఇరాక్, క్రోషియా, పనామా, క్యూబా, లెబనాన్ నికరాగువాలని మరిచిపోవద్దు'' అనే నినాదాలతో పోర్ట్‌లేండ్, శాన్‌ఫ్రాన్సిస్కో, అరెగాన్, బెర్క్‌లీ, న్యూయార్క్ నగరాలలో వందలు వేల మందితో నిరసన ప్రదర్శనలు సాగాయి. 5వేల మంది విద్యార్థులు న్యూయార్క్ యూనియన్ స్క్వేర్ వద్ద ప్రదర్శన జరిపారు. ప్రపంచ వాణిజ్య కేంద్ర భవనాలు నేలమట్టం అయిన మాన్‌హట్టన్ నగరంలో కూడా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. వాషింగ్‌టన్ నగరంలో 10వేల మందితో కూడిన ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) వ్యతిరేక ప్రదర్శన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనగా మారిపోయింది. (30-9-01). 29-9-01న ఇంగ్లండ్‌లోని లండన్, గ్లాస్‌గో, హెచ్‌డెన్, మిల్టన్, బ్రైటన్, కేంబ్రిడ్జ్ నగరాలలో వందలాది మందితో నిరసన ప్రదర్శనలు జరిగాయి. 27.9.01 ఇటలీ రాజధాని రోమ్‌లో, అలానే నేపుల్స్ నగరంలో 10వేల మందితోను; ఏథెన్స్ గ్రీస్‌లలో 8వేల మందితోను యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. జర్మనీలో 5వేల మంది విద్యార్థులతో నిరసన ప్రదర్శన జరిగింది. అలానే హేంబర్గ్, కాస్సెల్, స్టట్‌గార్ట్ నగరాలలో వేలాది ప్రజలతో యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ఆస్ట్రేలియాలోని సిడ్నీ, కేన్‌బెర్రా, హెల్‌బర్న్, ఎడలైడ్ నగరాల్లో యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. అలానే స్పెయిన్, ఆస్ట్రియా, ఐర్లెండ్‌లలో కూడా. ఇక 3వ ప్రపంచ దేశాలలో 22.9.01న పాకిస్థాన్‌లోని అన్ని ముఖ్య పట్టణాలలోనూ వేలాది మందితో మిలిటెంట్ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా నలుగురు ప్రదర్శనకారుల్ని పోలీసులు కాల్చిచంపారు. ఆగ్నేయాసియాలోని వివిధ దేశాల్లో కూడా ప్రదర్శనలు జరిగాయి. భారతదేశ రాజధాని ఢిల్లీలో వివిధ విద్యార్థి సంఘాలు, పౌరహక్కుల సంఘాలు అఖిలభారత ప్రజా ప్రతిఘటనా వేదిక (ఏఐపిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో యుద్ధ వ్యతిరేక ప్రదర్శన నిర్వహించాయి. కాని, అమెరికా సృష్టించిన ఉన్మాదపూరిత యుద్ధ వాతావరణ హోరులో ఈ ప్రజా నిరసనలు పెద్దగా కనబడకుండా మరుగున పడిపోయాయి. అమెరికా ఇంగ్లండ్‌ల అధికార గొంతులైన సి.ఎన్.ఎన్, బి.బి.సి నెట్‌వర్క్‌ల అబద్ధ ప్రచారాలే రాజ్యమేలాయి. సెప్టెంబర్ 11 దాడిపై ''మానవులు మరీ ఇంత అధమ స్థాయికి సైతం దిగజారిపోగలరా!?'' అని కపట విస్మయాన్ని ప్రదర్శించిన ఈ ఛానళ్లే ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా బేఫికరుగా చేసుకుపోతున్న ఘోర, నేర మానవమారణ హోమాల్ని 'దురదృష్టకరం' ''హృదయ విదారకమే! అయినా అవసరం, అనివార్యం''-అంటూ నాజూకు మాటలతో సమర్థిస్తున్నాయి. ఏమైనా ప్రపంచం మొత్తం మీద నిశ్శబ్ద మెజారిటీ నిస్సందేహంగా యుద్ధ వ్యతిరేకత వైపే.

## ప్రకటిత లక్ష్య సాధనలో అమెరికా ఘోర వైఫల్యం!

గడిచిన మూడు వారాలబట్టి ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా చేస్తున్న భీకర యుద్ధంలో అదిప్పటికీ సాధించినదేమిటి అంటే ఏమీ లేదనే చెప్పాలి. అక్టోబర్ 15 నాటికి 100సార్లు వైమానిక దాడులు నిర్వహించింది; 85 క్రూయిజ్ మిస్సైల్స్‌ని ప్రయోగించింది; 2000 శక్తివంతమైన బాంబుల్ని ప్రయోగించింది. అయినా తాలిబాన్ పోరాటయోధుల్ని రవ్వంత కూడా చలింపజేయలేక పోయింది. ఇది అమెరికాని నిర్ఘాంతపరిచే పరిస్థితే. ఇంకో పక్క వందలాదిగా అమాయక ప్రజలు ముఖ్యంగా పిల్లలు స్త్రీలు అమెరికా విచక్షణారహితమైన బాంబుదాడులకి బలైపోతున్నారు. తాలిబాన్ శక్తులచే గతంలో తరిమేయబడ్డ వారి 'దాయాది శక్తులై'న ఉత్తరాది కూటమి సేనలు రంగంలోకి దిగి భూతలపోరు ప్రారంభించేంత దాకా అమెరికా విమాన దాడులు యింకా తీవ్రం అయినా కూడా అవి సాధించేదేమీ వుండబోదనేది స్పష్టం అవుతోంది. ''తాలిబాన్ పోరాటకారుల్లో చీలికలు ఫిరాయింపులు ప్రోత్సహించే ఐ.ఎస్ఐ, సిఐఏల పథకాలన్నీ నీరుకారిపోయాయి'' అని 'వాషింగ్‌టన్ పోస్టు' పత్రిక పేర్కొంది. పదివేల మంది తాలిబాన్ అనుకూల గిరిజనదండు ఆధునిక సాంప్రదాయిక ఆయుధాలు పట్టుకుని సమరోత్సాహంతో పాకిస్థాన్ నుండి కాబూల్ ప్రయాణమయ్యారని వార్తలొచ్చాయి. మేజర్ నుజార్ ఆయూబ్ అనే సిఐఏ ఏజెంట్‌ని తాలిబాన్‌లు చంపేసారు. ఉత్తరాది కేడర్‌కి చెందిన ప్రముఖ కమాండర్, అమెరికాకి నమ్మినబంటు అయిన అబ్దుల్‌హక్‌ని అతడి అనుచరులు ఇద్దరినీ తాలిబాన్ పోరాటకారులు ఉరితీసి చంపేసారు. తాలిబాన్ చేతిలో హక్ హతమైపోవడం అమెరికా బ్రిటన్‌లకి ఘోరపరాభవం అని చెప్పాలి. మరో 20 మంది ఉత్తరాది కూటమి సైనికుల్ని కూడా తాలిబాన్‌లు హతం చేసారు. ''తాలిబాన్‌నేత ముల్లాఒమర్‌ని అంతంచేసినపుడే ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికాకి విజయం'' అని పాక్ తేల్చి చెప్పింది. లాడెన్‌ని అప్పగించే ప్రసక్తే లేదని ఒమర్ మరోసారి ప్రకటిస్తూ 72 గంటల ప్రపంచవ్యాప్త యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకి పిలుపునిచ్చాడు. ''పోరులో అమెరికా విఫలమైందనే పాక్ వ్యాఖ్యని అమెరికా పరోక్షంగా అంగీకరించింది'' అని 'వాషింగ్‌టన్ పోస్టు' రాసింది. ''అమెరికా అన్ని బాంబులు కురిపిస్తున్నా ఆఫ్ఘన్‌లు బతికే వున్నారంటే అందుకు వారి దృఢ సంకల్పమే కారణం'' అని వ్యాఖ్యానిస్తూ పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి, ముషారఫ్‌కి అత్యంత సన్నిహితుడు అయిన మొయినుద్దీన్ హైదర్ 27-10-01న ''మూడు వారాలుగా సాగుతున్న యుద్ధాన్ని సమీక్షించాలి'' అని కూడా సూచించారు. కాగా, యుద్ధాన్ని త్వరగా ముగించాలని పాకిస్థాన్ నసపెట్టడం ప్రారంభించింది. ఈ సంకేతాల నందుకున్న అమెరికా పాక్‌ని మరింత గట్టిగా అక్కున హత్తుకుంటూ (భారత పాలకవర్గాలకి కడుపుమంట పుట్టించేంత గట్టిగా) కోట్ల డాలర్ల పాకేజీల వరాలు వర్షించింది. ''అమెరికా వ్యూహం దెబ్బ తింది'' అని 'అబ్జర్వర్' పత్రిక వ్యాఖ్యానించింది. ''అమెరికా లాడెన్‌ని ఎందుకు పట్టుకోలేక పోతుంది?'' అంటూ 'సండేటైమ్స్' పత్రిక అమెరికన్ ఇంటలిజెన్స్ నిర్వాకాన్ని నిలదీసింది.

## లాడెన్ బూచితో లాభపడజూస్తున్న అమెరికా!

ఇదీ ఈనాటికి (29-10-'01) యుద్ధ పరిస్థితి. రేపిక జరగబోయేది ఏమిటనేది అంత అనూహ్యమైన విషయం ఏమీ కాదు. ఈ యుద్ధంలో లాడెన్, ఒమర్‌లు వారి కొద్దిమంది ఆల్‌కాయిదా పోరాటయోధులు అమెరికాను వెనక్కి తరిమి కొట్టేస్తారనే భ్రమలు ఎవరికీ వుండాల్సిన పనిలేదు. ఏమంటే-గతిలేక ఆఫ్ఘనిస్తాన్‌ని విడచిపోయిన 1989 నాటి సోవియట్ రష్యా దుస్థితిలాంటిది కాదు నేటి అమెరికా పరిస్థితి. పైగా, అమెరికాకి మించిన ద్వేష ప్రతీకారాలతో రగిలిపోతూ అవకాశం కోసం ఎదురుచూస్తున్న దేశీయ ఉత్తరాది కూటమి సైన్యాలతో తలపడాల్సి రావడమనేది తాలిబాన్ పోరాటకారులెదుర్కొనే ముఖ్య సమస్య. అమెరికా అండలేని ఉత్తరాది కూటమి తాలిబాన్‌లకి ఏమీ కాకపోవచ్చు గాని అమెరికా అండతో కూడిన వారు బలీయమైన ప్రత్యర్థిగానే వుంటారు. ఈ పరిస్థితుల్లో రేపు లాడెన్ ప్రాణాలతో అమెరికాకు పట్టుబడతాడా? లేక వీరమరణం పొందుతాడా? ఇందులో ఏది జరిగినా అమెరికాకి తీరని తలనొప్పే! ఏది జరిగినా అతడు అతడి అనుయాయులకి, భవిష్యత్ తరాలకి గొప్ప ఉత్తేజంగానే మిగిలిపోతాడు. ఈ రెండింటిలో మళ్లీ లాడెన్‌ని మట్టుపెట్టేయడానికే అమెరికా ప్రాధాన్యతనిస్తుంది. లాడెన్‌ని క్రూరంగా హత్య చేయడానికి అమెరికా తహతహలాడుతోందనడంలో సందేహం లేదు. కానీ అంతకంటే ఎక్కువగా లాడెన్ శాశ్వత అజ్ఞాతవాసంలో మగ్గి వుండిపోవడాన్నే అమెరికా కోరుకుంటుందని చెప్పాలి! ఎందుకంటే-లాడెన్ ప్రాణం కంటే కూడా లాడెన్ బూచి అమెరికాకి ఎక్కువ ఉపయోగకరం; కాదు కాదు ఎక్కువ లాభకరం! (సామ్రాజ్యవాద లెక్కలకి ఎప్పుడూ లాభనష్టాలే తప్ప

మంచిచెడులు అనేవి ప్రాతిపదికగా వుండనే వుండవు.) ఈ బూచిని అడ్డుపెట్టుకుని శాశ్వతంగా ఆఫ్ఘనిస్తాన్‌పై తన ఆధిపత్యాన్ని చెలాయించడాన్నే అది కోరుకుంటుంది. దాని అసలు లక్ష్యం అదే! ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్ట వేయడంతోపాటు 'ప్రపంచ వ్యాపితంగా టెర్రరిజాన్ని అంతం చేసే' దాని 'లక్ష్యసాధన'లో భాగంగా అది ఇరాక్, ఉత్తర ఐర్లండు, కొలంబియా, ఇంకా మరికొన్ని దేశాలపై కూడా గురిపెట్టి వుంది గనుక ఇందుకు లాడెన్ మరణం కంటే లాడెన్ బూచే బాగా ఉపయోగపడుతుంది.

తాలిబాన్‌ల మతమౌఢ్యమూ, వారి పాలనలో స్త్రీలపై సాగే దారుణమైన వివక్ష క్రూరమైన అణచివేతలనేవి ఈ సందర్భంగా విస్తృతంగా చర్చకు వచ్చాయి. సామ్రాజ్యవాద ప్రసార ప్రచార మాధ్యమాలన్నీ రాత్రింబవళ్ళు ఇందుకు సంబంధించిన అనేక కథనాల్ని విపరీతంగా ప్రచారం చేసాయి. సి.ఎన్.ఎన్. బి.బి.సి.ల వరకు పోనక్కరలేదు! అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని అక్కున చేర్చుకున్న 'ఈటీవీ' లాంటి ప్రాంతీయ ఛానళ్ళు సైతం ఈ తాలిబాన్ వ్యతిరేక ప్రచార పోరాటాన్ని గొంతు చించుకు మరీ చేసాయి. యుద్ధం ప్రారంభమైన అక్టోబర్ 7వ తేదీ మొదలు ప్రతిరోజూ ఉదయం వార్తల అనంతరం ప్రసారమయ్యే ''వార్-2001'' అనే కార్యక్రమంలో, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా రోజువారీ అమలుచేసే మానవ మారణహోమాల్ని, ఘోర నేరాలన్నింటినీ అదేదో ఒక వినోద క్రీడ అనే తరహాలో అభివర్ణిస్తూ వస్తోంది 'ఈటీవీ'! 'ఆఫ్ఘన్ ప్రజల మహిళల పాలిట అమెరికా యుద్ధం ఒక వరప్రసాదం అయింది' అంటూ 'ఈటీవీ' రోత పుట్టించే అసత్య ప్రచారం అదే పనిగా చేస్తూ వచ్చింది. ఆఫ్ఘన్ మహిళల సమస్యల్లా బురఖాయే అన్నట్టు; సినిమాలకి, అర్ధనగ్న అందాల పోటీలకి, బ్యూటీపార్లర్లకి వారు వెలిగా వుండిపోవడమే అక్కడి మహిళల సమస్యల్లా అయినట్టు ఇక వాటికి చేరువైపోవడమే అక్కడి మహిళా విముక్తి అన్నట్టు సరుకు సంస్కృతికి అమ్ముడుపోయిన ఈ టీవీలన్నీ ప్రచార వాంతులు చేసుకున్నాయి. మత ఛాందసవాదం, మహిళలపై అణచివేతలు అనేవి వాటికవిగా చర్చించాల్సిన సమస్యలు! సమాజంలో సగంగా వుండే మహిళల్ని కలుపుకోలేని, వారిని భాగస్వాముల్ని చేయలేని ఏ పోరాటమూ, ఏ సామాజిక విప్లవమూ పురోగమించజాలదనేది జగద్వితమైన చారిత్రక సత్యం! మతం పేరుతో మహిళల ప్రజాస్వామ్య హక్కులపై సాగే అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి తీరాల్సిందే! కాని, మహిళా హక్కుల పోరాటం ముసుగులో, మత ఛాందసవాదులకంటే కూడా హానికరమైన తీరులో మహిళల్ని కేవలం ఒక సరుకుగానే చెలామణి చేసే దుష్ట సామ్రాజ్యవాదాన్ని వెనకేసుకురావడం పరమ దగుల్బాజీతనం! ప్రస్తుత సందర్భంలో, తాలిబాన్ మత ఛాందసవాదాన్ని వ్యతిరేకించడం పేరుతో అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని అక్కున చేర్చుకోవడం క్షమించరాని నేరం అవుతుంది. అసలింతకీ ఇక్కడ చర్చించాల్సిందల్లా ఏమంటే-మతమౌఢ్యం నుంచి ఆఫ్ఘన్ ప్రజల్ని విముక్తి చేయడానికి, ఆఫ్ఘన్ మహిళలకి ప్రజాస్వామ్య హక్కుల్ని ప్రసాదించడానికేనా అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై దండయాత్రకి దిగింది? కానేకాదు! తాలిబాన్ బూచితో, మహిళా హక్కుల గూర్చిన మొసలికన్నీళ్లతో ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేయడానికే!

### ప్రపంచ ప్రజల ఆనందహేల సెప్టెంబర్ 11 దాడి!

మొన్నటి ముజాహిద్దీన్‌లు, నిన్నటి జిహాదీలు, నేటి తాలిబాన్‌లు-ఆల్‌కాయిదాలు వీరంతా కూడా ఒకప్పుడు అమెరికా మంత్రసానమ్మ పురుడుపోస్తే పుట్టిన బిడ్డలే! అప్పుడు తాను కోరిన విధంగా తన శత్రువుకి వ్యతిరేకంగా పోరాడిన వీరంతా దేశభక్తులు, జాతీయ విప్లవ శక్తులు అని కొనియాడింది అమెరికా! కానీ ఈనాడు తనని వ్యతిరేకించారు కనుక వారంతా ఒక్కసారిగా మతఛాందసవాదులు, ప్రగతినిరోధకులు, టెర్రరిస్టులయిపోయారు! ఇది అమెరికా మార్కు తర్కం! ఇది పరమ దుర్మార్గమైన కుతర్కం! 'అమెరికన్ సామ్రాజ్యవాదాన్నే కాదు-లాడెన్ ప్రాతినిధ్యం వహించే ముస్లిం మతఛాందసవాదాన్ని కూడా వ్యతిరేకిస్తున్నాం సుమండీ' అని చాటుకుని సంజాయిషీలు ఇచ్చుకోవాల్సిన సందర్భం కానేకాదిది. ఎందుకంటే ఫాసిజం, జాత్యహంకారం, జాతీయ దురహంకారం, రాజ్య టెర్రరిజం, విస్తరణవాదం-వీటన్నింటి 'మేలు కలయికే'-అమెరికన్ సామ్రాజ్యవాదం. కనుక ఏ మత ఛాందసవాదం గానీ మరింకే రుగ్మతగానీ దానికదిగా నిందార్హమై వుంటూ దానితో పోరాడాల్సిన అవసరం వుంటుందే తప్ప దాన్ని అమెరికా సామ్రాజ్యవాదంతో సరిపోల్చి చూడాల్సిందిగా వుండదు. అది అమెరికన్ సామ్రాజ్యవాదానికి మించిన హానికరంగానూ వుండగల అవకాశం లేదు. కనుక సెప్టెంబర్ 11 దాడి ప్రపంచ ప్రజలకి ప్రధానంగా అందించిన సందేశం అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలనేదే తప్ప ముస్లిం ఛాందసవాదాన్ని సమర్థించాలనేది కానేకాదు. కనుకనే-ఇతరత్రా దానికుండే అన్ని పరిమితులు, బలహీనతలతో కూడా సెప్టెంబర్ 11 దాడి ఒక చారిత్రక ప్రాముఖ్యతని సంతరించుకున్న ఘటనగానే వుంటుంది. ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ శక్తులకి ఉత్సాహకరమైన, ఉత్తేజకరమైన, చిరస్మరణీయమైన ఘటనగానే వుంటుంది. ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ శక్తులకి ఉత్సాహోన్నందించేదిగానే వుంటుంది. ఏమంటే-ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదం నాశనం కావడం-సోషలిజం విజయవంతం కావడం అనేది ఒక చారిత్రక నియమం. ఇది దీర్ఘకాలికం! ఈలోగా అప్పుడప్పుడు రక్తపిపాస రాబందులు బాధతో, భయంతో, అభద్రతతో, బిగుసుకుపోయి ఏడ్చే సందర్భాలని-పావురాలు ఆనందంతో పగలబడి నవ్వే సన్నివేశాలని చూడగలగడం నిజంగా సంతోషించదగ్గదే కదా!

❑

**మహత్తర అక్టోబర్ విప్లవానికి జేజేలు!**

**ప్రజా గెరిల్లా సైన్యం ప్రథమ వార్షికం సందర్భంగా**

**పి.జి.ఎ. డే ని 'ఘనంగా' జరుపుదాం!!**

**విజయవంతమైన 25వ సం॥లోకి ప్రవేశిస్తున్న**

**'క్రాంతి'ని విప్లవపథంలో ముందుకు తీసుకుపోదాం!!!**

# అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

## అమెరికా యుద్ధోన్మాదాన్ని బలపరుస్తున్న ఎన్.డి.ఏ ప్రభుత్వ వైఖరిని ఖండిద్దాం!!

సెప్టెంబర్ 11న అమెరికాలో న్యూయార్క్, వాషింగ్టన్‌లలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం, పెంటగన్ భవనాలపై జరిగిన దాడిని పురస్కరించుకుని అమెరికన్ సామ్రాజ్యవాదం ముస్లిం దేశాలపై ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధానికి కాలు దువ్వుతోంది. అమెరికాలో ప్రవాసీయులపై విచక్షణా రహితంగా దాడులుచేయడం, మసీదుల్ని ధ్వంసం చేయడం సర్వసాధారణం అయిపోయింది. చివరికి, ముస్లింలుగా పొరబడుతూ సిక్కులపై దాడులు చేసి చంపడాలు చూస్తే అమెరికాలో జాతీయోన్మాదం ఎంత తీవ్ర స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. అమెరికాలోని ప్రవాసీయుల ప్రజాస్వామిక హక్కులను సైతం అక్కడి ప్రభుత్వం కాలరాచివేస్తోంది. యూరప్ దేశాల్లో ముఖ్యంగా బ్రిటన్‌లో కూడా ముస్లిం మతస్థులపై దాడులను ముమ్మరం చేసారు. ఉగ్రవాద దాడుల్ని ఎదుర్కోవడం అనే పేరుతో అరబ్ దేశస్థులపై అమెరికాలోనూ యూరప్ దేశాల్లోనూ సామ్రాజ్యవాదులు ప్రేరేపిస్తున్న ఈ దాడులని సి.పి.ఐ (ఎం-ఎంల్) [పీపుల్స్‌వార్] కేంద్రకమిటీ నిర్ద్వంద్వంగా ఖండిస్తుంది. ఆఫ్ఘనిస్తాన్‌పై దాడికి సర్వ విధాలా సంసిద్ధమవుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని దాని తాబేదారు దేశాల్లోని ప్రభుత్వాలను వ్యతిరేకించాలని; ఆఫ్ఘన్ ప్రజలకు అండగా నిలవాలని భారత ప్రజానీకానికి 'పీపుల్స్‌వార్' కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

కేంద్రంలోని బి.జే.పి నాయకత్వంలోని దళారి ఎన్.డి.ఏ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదుల యుద్ధ చర్యలకు మద్దతునిస్తానని బాహాటంగా ప్రకటించి తన దళారి స్వభావాన్ని నగ్నంగా ప్రదర్శించుకుంది. ఉగ్రవాదాన్ని అణచివేయాలంటూ అందుకు ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులు చేయడానికి తన సంపూర్ణ మద్దతుని తెలిపింది. కాశ్మీర్‌లో పోరాటకారులను ఉగ్రవాదులుగా చిత్రిస్తూ, కాశ్మీర్ పోరాటాన్ని అణచివేయడానికి అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలు తమకు సహాయం చేయాలని కోరింది. మన దేశం ఏవిధంగానూ అమెరికన్ సామ్రాజ్యవాదులకు మద్దతు నీయరాదని, ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులకు అమెరికా తలపెట్టిన యత్నాలను ఖండించాలని భారత ప్రజలకు మా పార్టీ పిలుపునిస్తోంది. దళారీ ఎన్.డి.ఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత ప్రజానీకం ఐక్యంగా పోరాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా విశాల ఐక్యసంఘటనను నిర్మించాలి. బి.జె.పి ప్రభుత్వ వైఖరి ముస్లిం మతస్థులను టార్గెట్ చేయనుద్దేశించిందేనని, అది దేశంలో మతకల్లోలాలను సృష్టిస్తుందని ఈ విపరిణామాలపట్ల, ప్రమాదాలపట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కేంద్రకమిటీ పిలుపునిస్తుంది.

వాస్తవానికి సెప్టెంబర్ 11న న్యూయార్క్, వాషింగ్టన్‌లపై జరిగిన దాడికి బాధ్యత వహించాల్సింది అమెరికన్ సామ్రాజ్యవాద పాలకవర్గాలే! ప్రపంచంలో అతిపెద్ద ఉగ్రవాది అమెరికన్ సామ్రాజ్యవాదమే! రెండో ప్రపంచ యుద్ధకాలం నుండి అమెరికన్ సామ్రాజ్యవాదం చేస్తూ వస్తున్న అక్రమాలకు, ఆగడాలకు అంతులేదు. యుద్ధంలో జపాన్ ఓడిపోయిన విషయం స్పష్టమైనప్పటికి హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబుల్ని వేసి లక్షలాది జపాన్ పౌరుల్ని పొట్టన పెట్టుకుంది. 1965 నుండి 75 వరకు వియత్నాంలో నరమేధం కొనసాగించింది. డొమెనికన్ రిపబ్లిక్, నికరాగువా, ఎల్‌సాల్వడార్, కాంగో, అంగోలా, మొజాంబిక్, ఉత్తరకొరియా, కంపూచియా, లావోస్, సోమాలియా వగైరా దేశాలలో సైనికంగా జోక్యం చేసుకుని లక్షలాది మందిని ఊచకోత కోసింది. ఇరాక్‌పై 1991 నుండి దశాబ్దకాలంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు తలపెట్టిన దుర్మార్గ దాడులలో లక్షలాది మంది పౌరులు, సైనికులు హత్య చేయబడ్డారు. 5 లక్షల మంది పసిపిల్లలు అమెరికా విధించిన ఆంక్షలవలన, అవసరమైన మందులు అందక మృత్యువాత పడ్డారు. ఇరాక్‌లో అమెరికన్ సామ్రాజ్యవాదుల దాడులలో ధ్వంసమైన ఆస్థుల విలువ అనేక లక్షల కోట్ల రూపాయలుంటుంది. లిబియాలో ఆ దేశాధ్యక్షుడు కల్నల్ గడాఫీ ఇంటిపై బాంబువేసి చంపడానికి విఫలయత్నం జరిగింది.

మధ్యప్రాచ్యంలో అమెరికన్ సామ్రాజ్యవాదం పాత్ర అత్యంత గర్హనీయమైనది. ఇజ్రాయిల్ జియోనిస్టు దురహంకారులకు పూర్తి మద్దతునిస్తూ వాళ్ళను తమ పెంపుడు కుక్కవలె సాకుతూ అనేకమార్లు ఇరుగుపొరుగు దేశాలైన ఈజిప్టు, సిరియా, జోర్డాన్, లెబనాన్ ఇరాక్ తదితర దేశాలపై దాడులు చేయించింది. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదులు చేసిన దాడుల్లో లక్షలాది మంది పాలస్తీనీయుల శిబిరాలపై, నివాస స్థలాలపై దాడులు జరిపి అనేకమందిని ఇజ్రాయిలీ సైనికులు పొట్టన పెట్టుకున్నారు. తమ దేశాన్ని ఆక్రమించుకోడానికి ఇజ్రాయిల్ యుద్ధోన్మాదులకు మద్దతునిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదం పాలస్తీనీయుల ప్రధమ శత్రువని చెప్పాలి. మొత్తంపై గత ఐదు దశాబ్దాల తరబడిగా అమెరికన్ సామ్రాజ్యవాదం పెత్తనం దోపిడీ దౌర్జన్యాలకు గురవుతూ వస్తున్న వివిధ దేశాలలోని పీడిత జాతులు ప్రజలు ఈ దాడుల్ని మనఃపూర్వకంగా సమర్ధించడమేగాక సంతోషంతో సంబరాలు జరుపుకున్నారు.

న్యూయార్క్ వాషింగ్టన్‌లలో సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు చేసిన దాడుల్లో అనేకవేల మంది చనిపోవడం విచారమే, అయినా ఇంకా అనేక రెట్ల సంఖ్యలో ప్రజలను ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాద ప్రభుత్వం ఊచకోత కోసిందని గుర్తించుకోవాలి. దాడుల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ తన సంతాప సానుభూతుల్ని తెలియజేస్తూనే వారి మృతికి మూలకారణం అమెరికన్ సామ్రాజ్యవాదమే అని అమెరికన్ ప్రజలు, ప్రపంచ ప్రజానీకం గ్రహించాలి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది అమెరికన్ సామ్రాజ్యవాదుల దాడుల వలన బలైపోతే స్పందించని సామ్రాజ్యవాదులు, వారి తొత్తు భారత పాలకవర్గాలు వారివారి ప్రసార ప్రచార మాధ్యమాలు నేడు అమెరికన్ పౌరులు చనిపోతే మొత్తం ప్రపంచమే నాశనమైపోయినట్లుగా గగ్గోలు పెడుతున్నాయి.

సామ్రాజ్యవాదులు వివిధ దేశాల్లో అధికారంలో వుండే వారితాబేదారు పాలకవర్గాలు ప్రభుత్వాలు న్యాయమైన జాతివిముక్తి పోరాటాలను అణచివేయడానికి; ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను కాలరాచి వేయడానికి; పోరాడుతున్న వారిని ఉగ్రవాదులుగానూ, సామ్రాజ్యవాద వ్యతిరేక దాడులను ఉగ్రవాద చర్యలుగానూ చిత్రించడం పరిపాటైపోయింది. పాలస్తీనా ప్రజలు తమ దేశాన్ని ఇజ్రాయిల్ దురాక్రమణదారుల నుండి విముక్తి గావించడానికి చేస్తున్న పోరాటాన్ని ఉగ్రవాదంగా అభివర్ణిస్తున్నాయి. చెచెన్యా జాతి విముక్తి పోరాటాన్ని రక్తపుటేరుల్లో ముంచెత్తుతూ ఆ పోరాటాన్ని ఉగ్రవాదంగా రష్యన్ పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ఇరాన్, ఇరాక్, లిబియా, సిరియా, అల్జీర్స్, ఈజిప్ట్, సుడాన్ తదితర దేశాలలో సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వివిధ పార్టీలు ప్రజాసంస్థలు జరుపుతున్న పోరాటాలకు ఉగ్రవాద ముద్ర వేస్తున్నారు. పెరు, ఫిలిప్పీన్స్, నేపాల్, టర్కి వగైరా దేశాల్లో ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం

(తరువాయి 43 వ పేజీలో...)

# చర్చలు సైతం మా పోరాటంలో భాగంగానే భావించే వాళ్లం
# చర్చలకు మేం సిద్ధం!
# చర్చలకు అనువైన వాతావరణం కల్పించడమనేది ప్రభుత్వ బాధ్యత
# అది మా షరతు కాదు!!

ప్రభుత్వానికి మనకీ మధ్య చర్చలకి సంబంధించిన చర్చ చాలాకాలం బట్టే సాగుతూ వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని నక్సలైట్లతో చర్చలు జరిపి రాష్ట్రంలో సాగుతున్న హింసాయుత వాతావరణం సమసిపోయేలా చేయాలని 1998లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక తీర్పు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సలహానిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఆ సలహాని పట్టించుకోలేదు. ఇలాంటి విషయాలలో ముందుగా స్పందించాల్సింది, చొరవ చూపాల్సింది పాలనాధికారంలో వుండే ప్రభుత్వమే గనుక దాన్నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో చర్చల చర్చ సద్దుమణిగింది. 1997–98ల నుంచే రాష్ట్రంలోని పౌరస్పందన వేదిక అనే ఒక ప్రజాతంత్ర సంస్థ అటు ప్రభుత్వం ఇటు నక్సలైట్లు హింసాయుత చర్యల్ని ఆపేయాలని ఒకటికి రెండుసార్లు విజ్ఞప్తి చేస్తూ వచ్చింది. ప్రజావ్యతిరేక ప్రభుత్వం ప్రజలపై అనునిత్యం అమలు చేసే దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగానే మనం సాయుధమై ప్రతిఘటనా ప్రతిహింసకు పూనుకున్నాం. ఈ వాస్తవాన్ని పట్టించుకోకుండా, క్రూరమైన నేరపూరితమైన రాజ్యహింసని న్యాయమైన అనివార్యమైన మన ప్రతిఘటనా ప్రతిహింసని పౌరస్పందన వేదిక ఒకేగాటన కట్టడం సమంజసం కాదని మనం చెప్పాం. ఈ రకమైన విమర్శనాత్మక వైఖరితోనైనా సదరు వేదిక సలహాని మనం ఆహ్వానించాం తప్ప ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. 1999 నుంచి ఈ వేదిక ఇరుపక్షాల మధ్య (మనము– ప్రభుత్వము) చర్చలు జరగాలని ప్రతిపాదిస్తూ వచ్చింది. దీనిపై కూడా ప్రభుత్వ స్పందన శూన్యం! అయితే ఈ వేదిక పదే పదే చర్చల అవసరాన్ని నొక్కి చెబుతుండటంతో 2000 సంవత్సరంలో ఏప్రిల్ 3వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటిసారిగా నోరువిప్పాడు. వాళ్లే మన ప్రతినిధులు అన్నట్టు, విరసం నాయకులతోను, పౌరహక్కుల సంఘం నాయకులతోను నక్సలైట్ల సమస్యపై తాము చర్చలకు సిద్ధంగా వున్నట్లు ఏప్రిల్ 3న రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించాడు. అసలిలా ప్రకటించడంలోనే అతడి కుటిలనీతి, దుర్మార్గం, చర్చలపట్ల అతడి తిరస్కారం, హేళన వ్యక్తమయ్యాయని చెప్పాలి. చర్చల అవసరంపట్ల అతడికి ఏ మాత్రం నిజాయితీతో కూడిన గుర్తింపు, పట్టింపు వుండినా అందుకు తగ్గట్టుగా మన పార్టీ అధికారయుత ప్రతినిధి వర్గంతో సంప్రదించేదెలా అనే విషయంపై దృష్టిపెట్టేవాడు. అతడి ప్రభుత్వ యంత్రాంగానికిది అసాధ్యమైన విషయం ఏమీ కాదు. అందుకు బదులు సర్కారు గూండాలైన పోలీసుల చేతనే గాక ప్రైవేటు గూండాలచేత కూడా అనునిత్యం దాడులకి గురిచేస్తుండే పౌరహక్కుల నేతల్ని సాహితీ సాంస్కృతిక రంగాల నేతల్ని మన ప్రతినిధులుగా ప్రకటించడమంటే అలాంటివారిపై దాడుల్ని మరింత తీవ్రం చేయనున్నామనే సంకేతం సందేశంతప్ప అది వేరు కాదు. పురుషోత్తం హత్య, ఆజం ఆలీ హత్యలాంటి తదనంతర పరిణామాలు సరిగ్గా రుజువు చేసినది ఈ వాస్తవాన్నే!

గత సం॥రం ఏప్రిల్ 3 నాటి చంద్రబాబు ప్రకటనకి మనం ఇస్తున్న ఈ వ్యాఖ్యానం, విశ్లేషణతో ఏకీభవించలేనివారుండొచ్చు గాని, అతడి ప్రకటనలోని నిజాయితీలేమిని చెప్పడానికి ఎలాంటి వివరణలు, విశ్లేషణలు అవసరం లేదు. ఏమంటే ఆ మరునాడే, ఏప్రిల్ 4న, కేంద్ర హోంమంత్రి అద్వానీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చంద్రబాబు మన పార్టీ, ఉద్యమాలపై విషం కక్కుతూ చిందులు తొక్కాడు. ఆంధ్రలోలాగానే మిగతా రాష్ట్రాలలో కూడా మన పార్టీని నిషేధించాలన్నాడు; అసలు కేంద్ర ప్రభుత్వమే మన పార్టీపై నిషేధం విధించడం అన్నివిధాలా అవసరమన్నాడు; మన పార్టీ ఉద్యమాలని ఉక్కుపాదంతో అణచేయాలన్నాడు. అందుకు అద్వానీ కూడా సంతోషంతో తలూపాడు. దాంతో 'చర్చల చర్చ'కి తెరపడింది.

తిరిగి 2001 సంవత్సరం ఏప్రిల్ మాసంలోనే మరోసారి ఈ చర్చ రంగం మీదికొచ్చింది. ఈసారి ఏప్రిల్–జూన్ మధ్య విడతవిడతలుగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అది మరోసారి రంగంమీది కొచ్చినట్టు భావించాలి. ఏప్రిల్ 17న పౌరస్పందన వేదిక, ఏప్రిల్ 23న రాష్ట్రంలోని సీనియర్ పత్రికా సంపాదకుల బృందం, ఏప్రిల్ 30న ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుల బృందం వేర్వేరుగా అటు ప్రభుత్వానికి ఇటు మనకు చర్చల కోసం సూచించాయి. 'రాష్ట్రంలో శాంతియుత ప్రజాస్వామిక వాతావరణం నెలకొనాలని' ఆశిస్తూ వీరు ఈరకంగా విజ్ఞప్తి చేసారు. మనం వుంటుండే నిర్బంధపూరిత వాతావరణం కారణంగా ఈ విజ్ఞప్తులపై మనం సకాలానికి స్పందించలేకపోయాం. కొంత ఆలస్యంగానైనా ఈసారి కూడా తొలిగా స్పందించింది మనమే తప్ప ప్రభుత్వం కాదు. ''చర్చలకు మేమెప్పుడూ సిద్ధమే! కానీ అందుకు అనువైన వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాల్సి వుంటుంది. ఈవిషయాన్ని మేము '97 నుండి అరడజను సార్లయినా స్పష్టపరచాం'' అని మనం ప్రకటించాం. ఈ చర్చల ప్రతిపాదక మిత్రులు ప్రభుత్వాన్ని మనను ఒకే గాట కట్టేస్తూ, రాష్ట్రంలో పెరుగుతున్న హింసాయుత వాతావరణానికి ప్రభుత్వంతోపాటు మనమూ బాధ్యులమేననే వైఖరిని ప్రదర్శించడం ఎలా తప్పో మన ప్రకటనలో వివరించాం. మన పార్టీ, ఉద్యమాలనేగాక కేవల అణచివేతే పరిష్కార మార్గంగా రాష్ట్రంలోని వివిధరంగాల ప్రజల ప్రజాతంత్ర ఆందోళనలపై ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు అణచివేతను పట్టించుకోకుండా–ఇంకోపక్క మన ప్రతిఘటనను ఆపేయాలని మనల్ని కోరడం న్యాయంకాదని మన ప్రకటనలో స్పష్టం చేసాం. అర్థవంతమైన చర్చలకి అనువైన వాతావరణం కల్పించడానికి వీలుగా ప్రభుత్వం కొన్ని తక్షణ చర్యలు చేపట్టాలని కూడా మన ప్రకటనలో స్పష్టపరిచాం. గ్రామాలపై, ప్రజలపై పోలీసుదాడుల్ని; బూటకపు ఎన్‌కౌంటర్ హత్యల్ని తక్షణం విరమించడం, మన పార్టీపై నిషేధాన్ని తొలగించడం వాటిలో ముఖ్యమైనవి. నిజానికివి ఎలాంటి షరతులు కావు. చర్చలని కేవలం ఒక సంకుచితమైన ఎత్తుగడగాకాక పరిస్థితిని ఏకాస్తంతయినా మెరుగుపరిచే సాధనంగా సద్వినియోగపరచాలనే సదుద్దేశం నిజాయితీ వున్నవారెవరికీ ఇవి షరతులుగాని కనబడవు, అర్థవంతమైన చర్చలకి అవసరమైన సన్నాహక చర్యలుగానే కనబడతాయి. నిజానికి వీటి స్వభావం అలాంటిదే! రాష్ట్రంలోని పరిస్థితి రోజురోజుకి మరింత దుర్భరం అయిపోతుండడానికి ప్రధాన బాధ్యత ప్రభుత్వానిదేనని; ఇలాంటి ప్రజాకంటక ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఈ చర్చల ప్రతిపాదకులంతా పీడితప్రజలపక్షాన దృఢంగా నిలబడాలని కోరుతూ ఆ రకంగా మాత్రమే రాష్ట్రంలో ప్రజాస్వామిక శాంతియుత వాతావరణాన్ని సాధించుకోవడం సాధ్యమవుతుందని మన ప్రకటనలో చెప్పాం.

ఇదే సమయంలో, అంటే గడచిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో, 'నక్సలైట్లతో చర్చలకు సిద్ధం' అని రాష్ట్ర హోంమంత్రి దేవేందర్‌గౌడ్

ప్రకటించాడు. 'అబ్బే! అలాంటిదేం లేదు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు దేవేంద్రగౌడ్ ప్రకటనని కొట్టిపారేసాడు. దేవేందర్‌గౌడ్ నోరుమూసుకు వుండిపోయాడు. ఇది జరిగిన 3, 4 రోజుల్లోనే రాష్ట్రంలోని ఎన్నికల ప్రచారానికి వచ్చిన బి.జె.పి రాష్ట్ర నాయకుడు, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి విద్యాసాగరరావు-నక్సలైట్లతో ప్రభుత్వం చర్చించడం అవసరమని సలహా యిస్తూ ప్రకటించాడు. ''మరి ఎవరితో చర్చించాలో ఎక్కడ చర్చించాలో కూడా ఆయన్నే సూచించమనండి'' అంటూ చంద్రబాబు విలేకర్ల ముందు విద్యాసాగరరావు సలహాని ఎద్దేవా చేస్తూ, చర్చల ప్రతిపాదనపట్ల తన అయిష్టతని వెళ్లగక్కాడు. ఇది జరిగిన తరువాత మళ్లీ ''నక్సలైట్లతో చర్చలు అవసరమే, ఇందుకు ప్రభుత్వం సిద్ధమే! తెలంగాణాలో పడావుగా వున్న భూముల్ని అవసరమైన పేదలకి పంచాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది'' అంటూ రాష్ట్ర హోంమత్రి దేవేందర్‌గౌడ్ మరోసారి ప్రకటించాడు. దీనిపై విలేకరులు వివరణ అడిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు పెదవి విప్పకుండా ముఖం చాటేసాడు. అక్కడితో చర్చల చర్చ మరోసారి అర్థాంతరంగా ఆగిపోయింది. మరిదంతా కేవలం ఎన్నికల స్టంటేనా? కాదని చెప్పడానికి ఎలాంటి కారణమూ లేదు, వాదనా లేదు కనుక ఔననే అనుకోవాలి. అయినపుడు ఎన్నికల ప్రచారాంశంగా ఇది ఏవిధంగా వుపయోగపడుతుంది? అనేది ప్రశ్న! చర్చ వివరాల్లోకి వెళితే దీనికి సమాధానం దొరుకుతుంది.

ఏమైనా ఈ చర్చల చర్చ అనేది పదేపదే తలెత్తుతూ అప్పటికప్పుడే సద్దుమణిగిపోయే స్వభావంతో అలా కొనసాగుతూనే వుంటుందనేది మనం అర్థం చేసుకోవాలి. ఎందుకని? చర్చల అవసరాన్ని ఒత్తిడి చేసే పరిస్థితులు ఒకవేపు-ఆ అవసరాన్ని గుర్తించ నిరాకరిస్తూ, దాన్ని అదిమేసే ప్రయత్నం మరోవైపూ-ఈ రెండూ పరస్పరం ఘర్షించుకొంటున్న నేటి వాతావరణంలో ఇది ఒక సహజ పరిణామం! ఈ రెండింటిలో ఏదో ఒకటి కొంతకాలంపాటైనా మిగతా దానిపై స్పష్టమైన ఆధిక్యత సాధించేంత దాకా ఈ నిష్ఫలచర్చ సాగుతూనే వుంటుంది.

చర్చలకు సంబంధించి ఇంతవరకూ సాగుతూ వస్తున్న పరిణామాల నుంచి వాద ప్రతివాదాల నుంచి మనం గ్రహించాల్సిన ముఖ్య విషయాలేమిటో చూద్దాం. వీటిలో ముందుగా చెప్పుకోవాల్సింది, మిగతా అన్నింటికంటే ముఖ్యమైనది ఏమంటే-మనతోచర్చలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏమాత్రం సుముఖంగా లేడు అనేదే! చర్చల ప్రతిపాదనకి తూట్లు పొడిచే, దాన్ని పక్కతోవలు పట్టించే ప్రతిచిన్న అవకాశాన్ని, ప్రతి చిన్న సాకుని అతడు వినియోగిస్తాడు. చర్చల వాతావరణాన్ని కలుషితపరచడానికి అతడు చేయగలిగిందంతా చేస్తాడు.

ఆ స్థానంలో వుంటున్నది చంద్రబాబు కనుకనేనా ఈ స్థితి? కాదు. ముఖ్యమంత్రిగా ఇంకే పార్టీవారున్నా ఎవరున్నా సుమారుగా జరిగేదిదే. పాలకవర్గాల, పాలకవర్గ ప్రభుత్వాల అవసరాలు అవకాశాలు నియంత్రించే సమస్య ఇది. పార్టీల తేడాలు, ముఖ్యమంత్రి స్థానంలో వుండే వ్యక్తుల మధ్య తేడాలు అనేవి పెద్ద ప్రాధాన్యత గల విషయాలు కావు. పాలకవర్గాలు వారి ప్రభుత్వాలు తామెంచుకున్న దారిలో, తామెంచుకున్న తీరులో చెలాయించుకు పోగల స్థితికి మనమూ మన ఉద్యమ స్థాయి చెప్పుకోదగ్గ ఆటంకంగా పరిణమించిన పరిస్థితిలో మాత్రమే ఇక తమ యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే వారు మనతో చర్చలకి సంప్రదింపులకి దిగి వస్తారు. అంటే మన ఉద్యమ కార్యకలాపాలనేవి ప్రభుత్వ మనుగడని అసాధ్యం కాకపోయినా అనునిత్యం ఇబ్బందులకి గురిచేసేవిగానైనా వుండాలి. యుద్ధంలో ఎదురుబొదురుగా వుంటే ఇరుపక్షాల మధ్య చర్చల్ని సంప్రదింపుల్ని నియంత్రించే ప్రధానాంశం ఇదే. ఇక మిగతావన్నీ అప్రధానం. కాగా, ఇక్కడ ముఖ్యమంత్రి స్థానంలో వుంటున్న చంద్రబాబుకి సంబంధించిన ఒక అదనపు ప్రత్యేకత కూడా వుంది. ఆ మేరకు అది అదనపు ప్రభావాన్ని కలిగించే అంశంగా కూడా వుంటుంది. అదేమంటే-ఇతడు ప్రపంచబ్యాంకుకి ఎలాంటి ఊగిసలాటలేని, అతి విశ్వసనీయమైన ఏజెంట్‌గా పని చేస్తుడటం. ప్రపంచబ్యాంకు ఆదేశించే ఆర్థిక విధానాలని, పాలనా సంస్కరణలని తూ.చ. తప్పక అమలు చేసే క్రమంలో ఎదురయ్యే ఎలాంటి ప్రజా ప్రతిఘటననుగాని, ఎలాంటి సమస్యలు సవాళ్లను గాని ''రాజకీయ దృఢచిత్తంతో ఎదుర్కొంటూ'' (అంటే విద్యుత్ ఆందోళనని 'ఎదుర్కొన్నట్టు') పోయే ముఖ్యమంత్రిగా ప్రపంచబ్యాంకు చేతిలో తర్ఫీదైన వాడు ఇతడు. మనతో చర్చల విషయంలో చంద్రబాబు ప్రక్కనుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత వెనుక నున్న అసలు కారణం ఇదే!

## రెండో విషయం

మనతో చర్చలు జరిపే విషయంలో చంద్రబాబుతో పోలిస్తే దేవేందర్‌గౌడ్ వైఖరి కొంత భిన్నంగానూ, సానుకూలంగానూ వున్నట్టు కనబడుతుంది కదా! దీన్నెలా అర్థం చేసుకోవాలి? చర్చల విషయమై తమ ప్రభుత్వంపై వచ్చే వత్తిడిని తట్టుకోడానికి వారు కూడబలుక్కుని అనుసరించే ఎత్తుగడేనా అది? అలానే అనుకోవాలి! ఏమంటే-చంద్రబాబు ఆలోచనకి, ఇష్టానికి భిన్నంగా స్వతంత్రతని చాటుకోగల, తమ స్వంత ఆలోచనల్ని పాటించగల వాళ్లు ఇప్పటికింకా ఆపార్టీలో ప్రభుత్వంలో వుండగల స్థితిలేదు. ఇది ఒక కోణం! కాగా దీనికి ఇంకో కోణం కూడా వుంది. మన వుద్యమ కార్యకలాపాల కారణంగా బూర్జువా పార్టీలకి చెందిన రాజకీయ నాయకులు, ప్రత్యేకించి అధికార పార్టీ ప్రభుత్వాలకి చెందిన చోటా మోటా నాయకులంతా స్వేచ్ఛగా తిరుగాడలేని ఒక అభద్రతా స్థితిలో వుంటున్నారు. మనతో చర్చలు జరపడం ద్వారా ఈ అనిశ్చిత ఉద్రిక్త వాతావరణంలో కాస్తంతైనా వెసులుబాటు రాగలదని వారు ఆశపడుతున్నారు, ఆతృతపడుతున్నారు. చర్చలపట్ల తీవ్ర వ్యతిరేకత, నిర్లక్ష్యాలతో వుండే చంద్రబాబు సైతం అయిష్టంగానైనా, అన్యమనస్కంగానైనా, రెండు నాల్కలతోనైనా అప్పుడప్పుడూ చర్చల ప్రస్తావన చేస్తున్నాడంటే-స్వంత కొంపలో గూడుకట్టుకుని వున్న ఈ గుబులు పరిస్థితే కారణం. ఇలాంటి గుబులు వాతావరణంలో అధినాయకుడంతటి బింకాన్ని మిగతావారంతా కలిగి వుండలేరు. అయితే అధినాయకుడు ప్రదర్శిస్తున్న బింకాన్ని వారు బాహాటంగా వ్యతిరేకించలేకపోయినా ఆంతరంగికంగా అసమ్మతితో రగులుతూనే వుంటారు. ఈ రగులూ బుగులూ ఒక్కొక్క సందర్భంలో బయటపడొచ్చు కూడా. దేవేందర్ గౌడ్ ధోరణి ఇందుకు నిదర్శనం కావచ్చు, కాకపోవచ్చు. కాని ఇలాంటి గుబులు వాతావరణం అనేది ఒక వాస్తవం.

## మూడో విషయం:

పౌరస్పందన వేదిక లాంటి వాళ్ల వైఖరిని, వాదాలని, వారి పాత్రని ఎలా అర్థం చేసుకోవాలి? అనేది ఈ సందర్భంగా మనం స్పష్టత కల్పించుకోవాల్సిన ఒక ముఖ్యమైన అంశం. వీరు పూర్తిగా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకి ప్రయోజనాలకి ప్రాతినిధ్యం వహించేవారుగానూ వుండరు. అలా అని పూర్తిగా ప్రభుత్వానికి వంతపాడేవారుగానూ వుండరు. కొంత ప్రజాస్వామ్య పక్షపాతం, కొంత ప్రభుత్వానికి సమర్థింపు మరికొంత స్వంత గొంతు-ఇలా ముప్పేట లక్షణాలతో వీరుంటుంటారు. ప్రభుత్వాన్ని నిలేసే విషయంలో కొంత మెతకదనంతోటి, మనల్ని విమర్శించే విషయంలో మాత్రం కొంత అసహనంతోటి వీరు వుంటుంటారు. ఇదొక రకంగా మనం అర్థం చేసుకోదగ్గదే గాని, ఇంతకంటే ముఖ్యంగా వీరి నుంచి మనం ఎదుర్కొనే ఇబ్బంది ఏమంటే-'రాజ్యహింస సంగతి సరే! ఏదో మోతాదులో దాన్ని భరించాల్సిందే, తప్పదు! కాని, నక్సలైట్ల హింస కారణంగా రాజ్యహింస మరింత పేట్రేగిపోతుంది' అంటూ సరిగ్గా ఈ మాటల్లో కాకపోయినా ఇదే అర్థం ఇచ్చే వాదనలు ఆవేదనలు వీరు వ్యక్తపరుస్తుంటారు. రాజ్యహింసకు ప్రతిగానే మననుంచి జరిగే న్యాయమైన ప్రతిహింసను రాజ్యహింసతో సరిపోల్చి

చూడ్డమే వీరు చేసే ఒక తప్పుకాగా ఇక ఇందులో కూడా రాజ్యహింస క్రూరత్వాన్ని దాని స్థాయిని తగినంతగా పట్టించుకోకపోవడం వీరు చేసే మరో తప్పు. కాగా, ఇంతకు మించి వీరి నుంచి మనకు ఎదురయ్యే ఇంకో ఇబ్బంది ఏమంటే-ప్రత్యక్షంగా కంటికగపడుతూ కాదనలేని తీరులో విరుచుకుపడే రాజ్యహింసను తప్ప, అలా చూడలేని, చెప్పలేని, అంతకంటే ఇంకా అనేకరెట్లు ఎక్కువగా సాగిపోతుండే నిశ్శబ్ద రాజ్యహింసను గూర్చి వీరు అసలు ఏమాత్రం పట్టించుకోకపోవడం.

పెరిగిపోయిన విద్యుత్ ఛార్జీలు, నిత్యకృత్యమైపోయిన విద్యుత్‌కోత, సాగునీరందక పంటలు సర్వనాశనమవుతుండడం అనేవి జీవన్మరణ సమస్యలైపోగా కాల్దరిలో తిరుగుబాటు చేసిన సామాన్య రైతులు పోలీసు కాల్పులకు గురై నలుగురు నేలకొరిగారు. ప్రాణ నష్టమే, కాని వారి బ్రతుకు సమస్యల పరిష్కార దిశలో తాత్కాలికంగానే అయినా ఒక తక్షణ గాఢముద్రని వేయగలిగారు. కానీ అదే సమయంలో ఆంధ్ర రాష్ట్రంలో అధికార లెఖ్ఖల ప్రకారమే రోజుకి డజను తక్కువ కాకుండా పత్తిరైతుల ఆత్మహత్యలు చడీచప్పుడు కాకుండానే నమోదవుతూ వచ్చాయి. వారు తిరగబడి పోరాడి చనిపోలేదు. ఎలాంటి అలజడి ఆందోళనా చెయ్యకుండా, ప్రభుత్వానికి దాని పోలీసులకి ఎలాంటి పని కల్పించకుండా నిశ్శబ్దంగా తమని తామే చంపేసుకున్నారు. కాల్దరి రైతులపై జరిగిన పోలీసుకాల్పులు రాజ్యం ప్రత్యక్ష హింసకి నిదర్శనం. కాగా పత్తిరైతుల ఆత్మహత్యలు రాజ్యం నిశ్శబ్ద హింసకి నిదర్శనం. రాజ్యం తన నిశ్శబ్ద హింసతో అనునిత్యం పత్తిరైతులు, వేరుశెనగ రైతులు, చేనేత కార్మికులు, దళిత ఆదివాసీ రైతుకూలీలులాంటి వేలాది మందిని చంపేస్తూ వుంటుంది. ఈ రాజ్యహింసని ప్రతిఘటిస్తూ ప్రజలు తిరుగుబాట్లు చేస్తే హింసాయుత తిరుగుబాట్లు అంటూ రాజ్యం ప్రత్యక్షహింసకు దిగిపోతుంది. రాజ్యం నిశ్శబ్ద హింసకి తలొగ్గేయడం కంటే ప్రతిఘటనా ప్రతిహింసతో రాజ్యం ప్రత్యక్షహింసని సవాల్ చేయడమే ఎక్కువ గౌరవప్రదం, ప్రయోజనకరం అని పీడిత ప్రజలు స్వానుభవంగానే గ్రహిస్తున్నారు. కనుకనే ఈరోజు దండకారణ్యంలో ఆదివాసీ ప్రజలంతా మన జెండా కింద సమీకరణ అవుతున్నారు. మన జెండా నీడన జరుగుతున్న ప్రతిఘటనా వుద్యమంలో ఎంతోమంది అమరులవుతున్నారు. కావొచ్చు! కానీ అంతకు అనేక రెట్లుగా అంతకుముందు రాజ్యం అమలు చేసే నిశ్శబ్ద హింసకి బలైపోతూ వుండేవారు. కనుక ప్రతిఘటనే మేలు అనే పాఠాన్ని స్వానుభవంలో తెలుసుకున్నారు. రాజ్యం అమలు చేసే అతి అమానవీయమైన నిశ్శబ్దహింస, దాని వెన్నంటే అది పాల్పడే ప్రత్యక్షహింస-ఈ రెండు రకాల రాజ్యహింసలకి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజలకి నాయకత్వం వహించే మనం అనివార్యంగా అనుసరించే ప్రతిహింస-వీటి మధ్య నుండే సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకోని కారణంగానే పౌరస్పందన వేదికలాంటి వారు 'నక్సలైట్ల హింసతో రాజ్యహింస మరింత పెరిగిపోతోంది' అనే తప్పుడు భావాలు ఏర్పర్చుకుంటూ వుంటారు. ఈ రకంగా వీరు మనల్ని ఎక్కువపాళ్లు సమర్థించేవాళ్లుగా వుండకపోవచ్చు, సరికదా కొన్ని సందర్భాలలో మనల్ని ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తించేవారుగా కూడా వుండొచ్చు. ఏమైనా ఇలాంటి గొంతులు ఎప్పుడూ వినబడేలా మనం తగిన శ్రద్ధాశక్తులు కలిగుండాలి. ఎందుకంటే ఇలాంటి గొంతులు అసలు వినబడకుండా నొక్కేయడానికి లేదా అవి తమ గొంతులోంచే మాట్లాడేలా చేయడానికి పాలక ప్రభుత్వం ఎప్పుడూ ప్రయత్నిస్తూంటుంది.

## నాలుగో విషయం

షరతులతో కూడిన చర్చలా లేక బేషరతు చర్చలా అనేది మరో ముఖ్యమైన విషయం. సూత్రబద్ధంగా చూసినపుడు మనం బేషరతు చర్చలనే కోరుకుంటాం. ఏమంటే ఆశేష త్యాగాలతో నిరంతరం పోరాడుతున్న ప్రజలు; ప్రజల్లో విడదీయరాని భాగంగా వుంటూ వారికి నాయకత్వం వహిస్తూ రక్తార్పిత త్యాగాలతో వుద్యమిస్తూ మనం ఇప్పటికే సాధించుకున్న ఫలితాలని సంఘటిత పర్చుకోవడం, వాటికి సాధికారత కల్పించుకోవడం అనే లక్ష్యాలతోనే మనం చర్చలు ఒప్పందాలు లాంటి వాటికి సిద్ధమవుతాం. అంతేతప్ప ఇప్పటికే సాధించుకున్న వాటిని ఒదులుకోడానికి మనం ఎలాంటి చర్చల్లోకి ఒప్పందాల్లోకి అవగాహనల్లోకి పోనవసరం లేదు. ఈ వైఖరినే మనం చర్చల్లో దృఢంగా అంటిపెట్టుకుని వుంటాం. కనుక మనకు ఎలాంటి ముందస్తు షరతులతో పనిలేదు. అయితే, అర్థవంతమైన చర్చల ప్రారంభానికి పాలక ప్రభుత్వం కొన్ని తక్షణ సన్నాహక చర్యలు చేపట్టాలని కోరుతాం. వీటిని మనం విధించే షరతులుగా వైరిపక్షం వారంతా పక్కతోవ పట్టించే ప్రచారం చెయ్యొచ్చుగాని ఇవి షరతులు కావు. ఉదాహరణకి పోలీసు దాడులు, బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపేయాలనడం, మనపై నిషేధం తొలగించాలనడం, పేదప్రజలు పోరాడి సాధించుకున్న భూములు వారికి అప్పచెప్పాలనడం ఇలాంటివే.

మరి ఇలాంటి వైఖరితో వుండే మనతో ప్రభుత్వం చర్చలకి సిద్ధపడుతుందా? సిద్ధపడకపోవచ్చు. ఏమంటే-చర్చల ద్వారా అది మనల్ని ఏదోమేరకు బలహీనపరచాలని నిర్వీర్యపరచాలని, లొంగదీసుకోవాలనే చూస్తుంది. అందుకనువుగానే తన పావులు కదుపుతూంటుంది. ఇది సాధ్యం కాదు అనుకున్నపుడు చర్చల ప్రతిపాదనని నీరుకార్చడానికి, పక్కతోవలు పట్టించడానికి ప్రయత్నిస్తుంది. 'పొమ్మనలేక పొగపెట్టే' తీరులో పరమ అసందర్భం, హాస్యాస్పదం అయిన విషయాల్ని మాట్లాడుతూ విషయాన్ని పక్కతోవ పట్టిస్తుంది. మనల్ని ఆయుధాలు విడిచి పెట్టమని చెప్పడం, ప్రధాన స్రవంతి లేక జనజీవన స్రవంతిలో కలియమని చెప్పడం నిజంగా నవ్వు తెప్పించే విషయాలు. మనం ఆయుధాలెత్తింది ఇలాంటి చర్చలకి పిలిపించుకోడానికి కాదు, సమాజాన్ని సమూలంగా మార్చడానికి. రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోడానికి మనం సాయుధ పోరాటం చేస్తున్నాం. మరి ఇలాంటి చర్చల్లోనే వైరిపక్షం వాళ్లు మనకి రాజకీయాధికారాన్ని అప్పజెప్పేసే ఆలోచనతో వున్నారా? లేదు కదా! అయినపుడు మన ఆయుధాల గురించి, మన సాయుధ పోరాటం గురించి వారు మాట్లాడటం అర్థంలేని విషయం. అసలు అధికారమనేది అలా వూరకే ఇచ్చేస్తే ఇలా అనాయసంగా తీసుకోవలసింది కానేకాదు కదా! అధికారంలో వుండే వర్గాన్ని జుత్తుపట్టి మరీ ఈడ్చి లాగి లాక్కునేదే అధికారం. వారిస్తే మనం పుచ్చుకున్న అధికారం వట్టి పుచ్చు అధికారమే. మరుక్షణమో మరోక్షణమో తిరిగి వారికి అప్పజెప్పాల్సిన అధికారమే, అప్పుతీర్చాల్సిన అధికారమే తప్ప అలాంటిది స్వార్జిత అధికారం కాజాలదు. ఇంతకీ వాళ్లు అధికారం అంత తేలిగ్గా ఇచ్చేస్తారా? అలా ఇచ్చేసే వాళ్లయితే-ఆసియాలోనే అతిపెద్ద సైన్యం, దానికితోడు డజన్‌కి పైగా రకరకాల పారామిలిటరీ బలగాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు బలగం, ఇక ప్రతి రాష్ట్రంలో రకరకాల పేర్లతో వేలకొలది పోలీసులు-వీరంతా చాలక ఇంకా ప్రైవేటు సైన్యాలు, రౌడీ గ్యాంగులు, అత్యంత ఆధునికమైన ఆయుధాల గుట్టలు, దేశం నిండా జైళ్లు, రకరకాల గూఢచార వ్యవస్థలు-ఇన్నింటిని పెట్టుకోవాల్సిన అవసరం లేదు. కేంద్ర బడ్జెట్, రాష్ట్రాల బడ్జెట్లలో ఎప్పుడూ అధికారిక సింహభాగం సాయుధ బలగాలకే కేటాయింపు. ఇక బడ్జెట్‌కి వెలుపల వారికందించే రాయితీలు, నజరానాలు, అవార్డులు రివార్డుల సంగతి చెప్పనవసరం లేదు. ఇదంతా వారి అధికారాన్ని నిలబెట్టుకోడానికే! ఇందులో ఆవగింజంత కూడా ప్రజల అవసరంగాని ప్రయోజనంగాని ఏమీ లేదు. అధికారాన్ని కాపాడుకోవడం అనేది వారికెందుకింత తలభారం అయిపోయింది? ఎందుకంటే వారి అధికార ప్రయోగం అంతా ప్రజలకు వ్యతిరేకంగా వారు సాగించే దారుణ దోపిడీ అణచివేతల కోసమే గనుక, ప్రజలంతా వారి అధికార బాధితులు గనుక, వారి అధికారాన్ని అసహ్యించుకునేవారు, వ్యతిరేకించేవారు గనుక. మరి ఈ ప్రజలు ప్రజాకంటకుల కిరాయి సాయుధ బలగాల కంటే వాసిలోనూ రాసిలోనూ కూడా అనేక రెట్లు బలసంపన్నులు గనుక. అధికారం నిలబెట్టుకోడానికే ఇలాంటి ప్రజలతో అనునిత్యం యుద్ధానికి తలపడిపోయే వాళ్లు అడిగితే అధికారాన్ని

ఇచ్చేస్తారా? ఇవ్వరు. కనుకనే మనం సాయుధ పోరుకి తలపడ్డాం, జనాన్ని సాయుధం చేస్తున్నాం. ''బాబ్బాబు మీరు అధికారాన్ని వదులుకోండి'' అని మనం వారిని కోరడం ఎంత హాస్యాస్పదమో వారు మనని సాయుధ పోరాటాన్ని విరమించుకోమనడం, ఆయుధాలు విసర్జించమనడం అంత హాస్యాస్పదమే!

పోతే, 'ప్రధాన స్రవంతి'లో లేదా 'జనజీవన స్రవంతి'లో కలియాలని వాళ్లు మనల్ని కోరడం! ఇది వెగటు పుట్టించేంతటి హాస్యాస్పదమైన విషయం. జనం నుంచి ఎంతో దూరం అయిపోయి వారికెంతో భారం అయిపోయిన వీళ్లు జనం బతుకులతో బాధలతో, వారి పోరాటాలతో కలగలసిపోయి వుంటున్న మనల్ని ఇలా కోరడం దుస్సాహసమైన విషయమే! 'ప్రధాన స్రవంతి' 'జనజీవన స్రవంతి' అనేవాటికి అర్థాలు తెలిసే వీరు మాట్లాడుతున్నారా?! అనిపిస్తుంది. ఇందుకు సంబంధించి వాళ్లు మనం ఆలోచిస్తున్నంత గంభీరంగానూ లోతుగాను ఆలోచించడం లేదు. మాటలేవి ఉపయోగిస్తున్నా వాటి వెనకాల వారి ఉద్దేశ్యం మాత్రం చాలా సరళమైందనే చెప్పాలి. వాళ్ల బాధంతా మనం కూడా పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాల బురదగుంటలో దిగిపోయి వారితోపాటు చిందులేయాలనేదే! అప్పటికితప్ప మన పతనంపై వారికి నమ్మకం కుదరదు, మన పతనంతో వారు సంతృప్తి పడలేరు. కనుకనే – 'ఆయుధాలు విడచిపెట్టాలి' అని అనడంతోటే ఆగకుండా దానికి ముక్తాయింపుగా 'ప్రధానస్రవంతి'లోకి రావాలి అని కూడా అంటూ వుంటారు. అంటే మనం ఆయుధాలు విడచేసి బుద్ధిగా కూర్చుంటామన్నా వారికి నమ్మకం చాలదు, సంతృప్తి వుండదు. అదీ అసలు సంగతి!

అసలెందుకీ డొంకతిరుగుడంతా! 'మీతో చర్చలేంటి? పొండి!' అని ప్రభుత్వం తెగేసి చెప్పదెందుకని? ఇదొక ఆసక్తికరమైన ప్రశ్న. ప్రభుత్వం అలా చెప్పజాలదు, కనుక చెప్పదు. 'ప్రజా ప్రభుత్వం'గా 'పౌర ప్రభుత్వం'గా అది తన 'విశ్వసనీయత'ని, 'జవాబుదారీతనాన్ని', 'సాధికారత'ని చాటుకోవాల్సి వుంటుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచబ్యాంకు విధానాల అమలులో ఇదొక అవసర అంశం. అంతకంటే ముఖ్యంగా దేశదేశాల్లోని కమ్యూనిస్టు విప్లవ పోరాటాల్ని, జాతుల పోరాటాలని అణచేయడానికి, విచ్ఛిన్నం చేయడానికి అమెరికా సామ్రాజ్యవాదం అనుసరించే విప్లవ ప్రతీఘాతుక 'మంద్రస్థాయీ యుద్ధ తంత్రం'లో ఇది కీలకమైన అంశం. విప్లవోద్యమాలని, ప్రజా పోరాటాలని, జాతుల పోరాటాలని అణచేయడానికి దోపిడీ పాలకవర్గ ప్రభుత్వాలు తీవ్ర హింసకి పాల్పడడంతోపాటు 'ఈ దోపిడీ అణచివేతలను అరికట్టలేం, ఏదో రకంగా సర్దుకుపోవాల్సిందే' అనే ఒక రకమైన నిరాశా నిర్లిప్తతలని ప్రజల్లో కల్గించడానికి కూడా తగిన ప్రాధాన్యతనిచ్చి అందుకు అన్ని రకాలా ప్రయత్నిస్తాయి. ఆ రకంగా తమ దోపిడీ అణచివేతలకి ప్రజామోదం వుందని దబాయించేస్తూ సాధికారతను కల్పించుకుంటాయి. అణచివేతను ఆపకపోవడం సంగతలా వుంచి, ఇంకా దాన్ని అధికం చేసేస్తూ రాజీలకు రమ్మంటుంటాయి. అలా కుదుర్చుకున్న రాజీలే వారికి ప్రయోజనకరంగా వుంటాయి, ఎందుకంటే–అలాంటి రాజీలన్నీ సాధారణంగా ఎదిరిపక్షం యొక్క లొంగుబాటుతోటే ముగుస్తుంటాయి గనుక! ఆ రకంగా చర్చల ద్వారా సాధ్యమైనంతగా లబ్ది పొందడానికే వైరిపక్షం చూస్తుంటుంది. ఇక మన పక్కనుంచి మనమూ అంతే! అంటే చర్చలు అనేవి ఉభయపక్షాలకి కూడా ఇరుపక్షాల మధ్య సాగే యుద్ధంలో భాగమేనని మనం అర్థం చేసుకోవాలి. కనుక చర్చలు, చర్చలలో కుదరగల అవగాహనలు, అంగీకారాలు అనే వాటిపై దృష్టి పెడతాంతప్ప ముందస్తు షరతులకి పట్టుబట్టం, ప్రాధాన్యత నివ్వం! ఇదీ మనం అనుసరించాల్సిన సూత్రబద్ధ వైఖరి.

## ఐదో విషయం:

మనతో చర్చలు అవసరమే, సిద్ధమే అని ఒక పక్క అంటూ, ఇంకో పక్క ప్రభుత్వం అందుకవసరమైన ఎలాంటి చొరవనీ ప్రదర్శించడం లేదు సరికదా, చర్చల ప్రతిపాదనని ఏ రకంగా నీరుగార్చాలా అనే ఆలోచిస్తోంది. చిత్రమైన విషయం ఏమంటే ఈ రెండింటి వెనుకగల వాస్తవ కారణం ఒక్కటే కావడం. మన వెనుక నిజంగా ప్రజలు సమీకరణ అయి వుంటున్నారనేదే ఆ వాస్తవ కారణం. దోపిడీ పాలక ప్రభుత్వం, దాని ప్రచార యంత్రాంగం అనునిత్యం తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు మన వెనుక ప్రజలు లేకపోవడమనేదే నిజమైతే ప్రభుత్వం మనతో సంతోషంగా, నిస్సంకోచంగా చర్చలకు సిద్ధమై మనల్ని నయానా భయానా మెత్తబరుచుకుని తన తలనెప్పి తగ్గించుకుంటుంది, ఆ మేరకి మనకి స్వేచ్ఛని యిచ్చేస్తుంది, ఇవ్వడం ద్వారా అది కోల్పోయేది ఏమీ వుండదు. కాని, మనకు ఏ కాస్తంత వెసులుబాటు ఇవ్వడానికి చంద్రబాబు ప్రభుత్వం ధైర్యం చేయలేకపోతోంది. మనపై బిగించిన నిర్బంధపు భల్లూకపు పట్టుని ఏ కాస్తంత సడలించడానికి ఈ ప్రభుత్వం వెరచుకుపోతోంది. ఏమంటే '90-91నాటి మన ప్రజా బలప్రదర్శనలు వారికిప్పటికీ వెన్నులో చలి పుట్టించేవిగానే వున్నాయి.

## ఆరో విషయం:

అయితే గియితే దోపిడీ 'దొర-బాబు'ల ప్రభుత్వం మనతో ఎందుకు చర్చలకు సిద్ధపడుతుంది? ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రజల శాంతి, ప్రజల కష్టనష్టాలు వీటిని దృష్టిలో పెట్టుకునే చర్చలు అవసరమని అభివృద్ధి నిరోధక దోపిడీ పాలకవర్గ పార్టీలు వారి ప్రచార ప్రసార మాధ్యమాలు పెద్ద డంబాకోరు, దగాకోరు, అసత్య విషప్రచారం చేస్తున్నాయి. మన పార్టీ వుద్యమాల కారణంగా ప్రజలు ఎదుర్కొనే కష్టనష్టాలు ఏమీ లేవు; ఇందువల్ల ప్రజా సంక్షేమానికి జరుగుతున్న హాని అంటూ రవ్వంత కూడా ఏమీ లేదు. మన ఉద్యమాన్ని అణచేయడానికి మన వెనకుండే ప్రజలపై పడి దారుణ నిర్బంధకాండకి గురిచేస్తోంది ప్రభుత్వం. ఇవన్నీ మన ఉద్యమ కారణంగా ప్రజలెదుర్కొంటున్న కష్టనష్టాలుగా చిత్రించ ప్రయత్నిస్తోంది. పోనీ ఈ వక్రభాష్యం, ఈ తప్పుడు చిత్రీకరణ ప్రకారంగానే అయినా చర్చలు జరిపి తద్వారా మన వుద్యమ ఉధృతిని తగ్గించి ఆరకంగా ప్రజలకి ఉపశాంతి కలిగించాలనేదేనా ప్రభుత్వ ధ్యేయం. కాదు, ఎంతమాత్రం కాదు. ప్రజల కష్టాల పేరుతో తమ కష్టాల్ని కాస్త తగ్గించుకోవాలనే తపనే ఇదంతా! తమ ఒంటికి నొప్పి కలుగుతోంది కనుకనే ఈ తయారీ. చెంచురామయ్యలు వ్యాస్‌లు, మాధవరెడ్డిలు, ఉమేశ్‌చంద్రలు వీరి జాబితాలో ఇంకెందరో చేరిపోకుండా వీరు పడే జాగ్రత్తని ఆతృతని ప్రజల కష్టాల మాటున దాచ ప్రయత్నిస్తారు. అయితే వారి ఈ అభద్రతాస్థితి మాత్రమే ఇందుకు కారణం అని భావించలేం. ప్రపంచీకరణ, ప్రపంచబ్యాంకు సంస్కరణల నేపథ్యంలో రైతాంగం, కార్మికులు, పట్టణ నిరుద్యోగ యువత, దళితులు, ఆదివాసీలు మరీ ప్రత్యేకించి ఈ రంగాలన్నింటిలోని మహిళలు– వీరందరి పరిస్థితి రోజురోజుకీ మరీ దుర్భరంగా తయారవుతూ వారంతా తీవ్ర అసంతృప్తికి, అస్థిమితానికి, అసహనానికి గురవుతున్నారు. సామాజిక ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇక ఈ భారీ ఆయుధాగారాన్ని పేల్చే డెటనేటర్‌లా మన ఉద్యమం వుండనే వుంది. ఈ పరిస్థితి విస్ఫోటించిపోకుండా అసలుకే ఎసరు ఏర్పడకుండా ఏకాస్తంతయినా దీన్ని ఉపశమింప జేయాల్సిన అవసరం పాలకులకుంది, వాళ్ల మనుగడకు అది అవసరం. కనుక వారు చర్చలకు తయారవుతారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఈ చర్చలు ఇప్పటికిప్పుడే జరిగే అవకాశాలెంతగా వున్నాయో అవి ఎప్పటికప్పుడు సద్దుమణిగిపోయే అవకాశాలు అంతే వున్నాయి. కనుక ఈ చర్చల చర్చ తిరిగి తిరిగి రంగం మీదికొస్తూ వెంటవెంటనే తెరమరుగవుతుండే క్రమం ఇంకా కొనసాగుతుంది అనేది మనం దృష్టిలో పెట్టుకోవాలి.

ఇదీ చర్చల విషయంలో మనం కలిగుండాల్సిన అవగాహన. చర్చలంటూ జరిగితే మనం ఆశించే కోరికలు ప్రతిపాదనలు సాధించుకోగలమా లేదా అనేదాన్ని అలా వుంచి అసలు ఇంతకీ మన డిమాండ్లు ఏమిటి అనేదానిపై మనకి స్పష్టత వుండాలి కదా! అవును. వుండాలి, మనకి వుంది. ఆ వివరాలు వచ్చే సంచికలో చర్చిద్దాం! ❑

# గెరిల్లాజోన్ సన్నాహక దశ కర్తవ్యాలను పూరించుకునే దిశలో సాగుతున్న రాయలసీమ డివిజన్-II

### శత్రువు దూకుడును కళ్లెం వేయటానికి చేసిన 'ఆంబుష్' ప్రతిఘటన

రాయలసీమ డివిజన్‌లో ప్రతిఘటనా క్యాంపెయిన్‌లో భాగంగా, విచ్చలవిడిగా గ్రామాలపై దాడులు చేస్తూ, దళం కొరకై గాలింపులు చేస్తున్న పోలీసులను ప్రతిఘటించి, వాళ్ళ దూకుడుకు కళ్ళెం వేయటానికిగాను, చిత్రావతి దళం ఏరియాలో పోలీసులను దళం ఆంబుష్ చేసింది. ఎర్రోనిపల్లి ధర్మవరం రోడ్డులో అందుకోసం మందుపాతరలు అమర్చింది. ఒక మందుపాతర వైర్ బయటకు కనపడేటట్లు చేయడం ద్వారా పోలీసులకు ఎరవేసి రప్పించాలని ప్లాన్ చేసుకుంది. కానీ, ఆర్.ఓ.సి.కి చెందిన దళ సభ్యుడు వీరశేఖర్ (మనకు వ్యతిరేకమైనవాడు) ఆ వైర్లను చూసి, మందుపాతరను ఎత్తుకెళ్ళాలని చూశాడు. అతను, తన స్నేహితుడు గంగినేనిపల్లికి చెందిన నరసింహులును కలుపుకుని ఆ మందుపాతర తీసే ప్రయత్నంలో చేసిన పొరపాటు కారణంగా అది పేలి, ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు; జూలై 7 వ తేదీన ఆ సంఘటనా స్థలానికి చెన్నేకొత్తపల్లి నుండి 12 మంది పోలీసులు 6 మోటారు సైకిళ్ళపై వచ్చి తిరిగి వస్తుండగా, ఆంబుష్ పార్టీ మందుపాతరలు పేల్చింది. ఆ పేలుడుకు పెడబొబ్బలు పెడ్తూ మోటార్ సైకిళ్ళపై నుండి పడిపోయారు. అయితే వాళ్ళకి తీవ్రగాయాలు కాకపోవటంతో, తేరుకుని ఆంబుష్ పార్టీ వున్నవేపు కాల్పులు జరిపారు. ఆంబుష్ పార్టీ కూడా, 4 రౌండ్లు కాల్పులు జరిపి, తన పథకంలో భాగంగా రిట్రీట్ అయింది. గాయపడ్డ పోలీసుల్లో ఒకడు తీవ్ర ప్రమాదస్థితిలో వున్నాడని యస్.పి. అంజనా సిన్హా ప్రకటించింది.

ఈ మందుపాతర పేలిన దెబ్బకు, వెంటనే కూంబింగ్‌లు ఆపుకుని, అదనపు బలగాల కోసం, మరిన్ని మెరుగైన ఆయుధాల కోసం హైద్రాబాద్‌కు కబురు పెట్టింది యస్.పి.. ఈ ఘటనలో తీవ్రంగా దెబ్బతీయ లేకపోయినా, శత్రువు దూకుడును, వాడి కదలికలను నియంత్రించటానికి ప్రజల మద్దతుతో మరిన్ని పథకాలు రూపొందించుకుంటోంది ప్రజాగెరిల్లా సైన్యం.

### కనుంపల్లి ఎన్‌కౌంటర్‌కు నిరసనగా.....

2000 సం॥లో ఆగస్టు 2వ తేదీ తెల్లవారుజామున తోటలో మాటుగాసిన స్పెషల్ పోలీసులు దళంపై రాపిడ్ ఫైరింగ్ చేశారు. ఆ ఫైరింగ్‌లో పెన్నహోబిళం దళ కమాండర్ కా॥ మల్లికార్జున (ఆనంద్) తో పాటు దళసభ్యుడు కా॥ గణేష్, మిలిటెంట్స్ కా॥ శివ (ప్రభాకర్), కా॥ సరోజులు తీవ్రంగా గాయపడగా; వారిని పట్టుకుని తీవ్ర చిత్రహింసలు పెట్టి పోలీసులు కాల్చిచంపారు. అందుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఊరేగింపులు, సంస్మరణ సభలతో పాటు పెన్నహోబిళం ఏరియా జల్లిపల్లి, ఆమిద్యాల, ఎర్రగుంట్ల ఎక్స్చేంజీలు; రామగిరి ఏరియాలో కుంటిమద్ది ఎక్స్చేంజి, కురాకులపల్లి మార్‌ఫోన్, కంబదూర్ మండల ఆఫీసులను పేల్చి వేశారు. చిత్రావతి ఏరియాలో కృష్ణాపురం ఎక్స్చేంజిని ధ్వంసం చేశారు. ఈ ధ్వంసాలన్నీ మిలిటెంట్ల నాయకత్వంలో జరిగినవే.

### కలగళ్ళ భూస్వామి గోపాల్ రెడ్డి మన యాక్షన్ టీం చేతిలో ఖతం

అనంతపురం జిల్లా, కలగళ్ళ భూస్వామి నారాయణరెడ్డి ఊర్లోనే కాక ప్రక్క గ్రామాల్లోనూ కరడుగట్టిన భూస్వామి. గ్రామంలో ఆధిపత్యం కోసం పదుల సంఖ్యలో హత్యలు చేయించాడు. కల్లు అంగళ్ళ కోసం, ఈత చెట్ల కోసం, కలగల్ల యుద్ధం అని పేరు గాంచిన ఘర్షణలో 70, 80 మందిని చంపించిన క్రూరుడు. గ్రామంలో తన ఆధిపత్యం నిలుపుకోవడానికి నిరంతరం ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించేవాడు. గ్రామాల్లోని ముఠా ఘర్షణల్లో తన ప్రత్యర్థుల అనుచరుడైన ఎరికిలతన్ని చంపినాడు. తరువాత ఎరుకల వారు తన మాట వినలేదని, ప్రత్యర్థి ముఠాకు మద్దతునిచ్చి ఎరుకల వారిపై దాడి చేయించాడు. కేసు కొట్టి వేయించాడు. అలాంటి భూస్వామ్య గ్రామంలో పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో కార్యక్రమాలు ప్రారంభమైనప్పటి నుండి కుట్రలు, కుతంత్రాలు, దాడులు ప్రారంభించాడు. సంఘంలోని తన ఏజెంట్ల ద్వారా సంఘాన్ని మధ్యతరగతి వారిపైన మళ్ళించే ప్రయత్నం చేశాడు. వాడి కుట్రను అర్థం చేసుకున్న సంఘం వాడి ఆధ్వర్యంలో వున్న ఇండ్ల స్థలాలను, శివాయిజమా భూమిని స్వాధీనం చేసుకొంది. తరువాత '98 లో 25 ఎకరాల పట్టాభూమిని స్వాధీనం చేసుకున్నారు. అంత వరకు సంఘానికి, ప్రజలకు వ్యతిరేకంగా వుండనని చెప్పుకొన్న భూస్వామి నారాయణరెడ్డి తన అసలు రూపాన్ని బయట పెట్టాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి సంఘనాయకులపై దాడి చేయించాడు. ఆస్తులు ధ్వంసం చేయించి, అరెస్టులు చేయించాడు. దీనికి ప్రతిఘటనగా ప్రజలు, సంఘ నాయకత్వాన వీడి మోటార్లు పగుల గొట్టారు.

అప్పటినుండి తండ్రిని మించిన తనయుడిగా నారాయణరెడ్డి కొడుకు గోపాల్‌రెడ్డి రంగంమీదికి దూసుకొచ్చాడు. పోలీసులను తీసుకొచ్చి, ప్రజలు ఆక్రమించి పంటబెట్టిన భూముల్లో పంట కోసుకోకుండా అడ్డుకున్నాడు. లక్షల రూ॥ల నష్టం కలిగించాడు. ఆ తర్వాత వీడు మోసకారితనంతో లొంగిపోతానని ప్రజల్లో ప్రచారం చేస్తూనే, మరోవైపు దాడులు చేయించాడు. అప్పటిదాకా ప్రజలమీద, సంఘం మీద చేసిన దాడులకు, కలిగించిన నష్టానికి, ప్రజలకు క్షమాపణ చెప్తానని, నష్టపరిహారం మూడున్నర లక్షలు ఇస్తానని, ప్రజలు ఆక్రమించిన భూమిని వదిలిపెడ్తాననే షరతులతో గోపాల్‌రెడ్డి గ్రామంలో ప్రజలముందు లొంగిపోయాడు. వాడంతట వాడు లొంగి వచ్చినందుకు ప్రజలు కూడ అందుకు ఒప్పుకోగా, గ్రామంలో ప్రజలందరి ముందు ఆ విషయాలు ప్రకటించాడు. వాడు లొంగివచ్చినట్లు నటించి దళాన్ని దెబ్బతీయటానికి వీడు

అపాయింట్‌మెంట్ పెట్టుకొని, ఆ ఏ.పి.టి. ప్రదేశాన్ని, టైమ్‌ను ముందే పోలీసులకు తెలియజేసి, ఏమీ ఎరుగని వాడిలాగా డబ్బు ఇవ్వటానికి వచ్చాడు. దళం వస్తే మాటు దాడి చేయించి దళాన్ని అంతం చేయాలన్ని పన్నిన కుట్ర ఫలించలేదుగానీ, డబ్బు కొరకు వెళ్ళిన సంఘ నాయకుడిని, గోపాల్‌రెడ్డి నుండి డబ్బు తీసుకున్న క్షణమే అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. తరువాత డి.యస్.పి. అశోక్ కుమార్ నాయకత్వంలో పోలీసులు గ్రామంలో ఊరంతా జీపుల్లో తిరిగి మరోమారు తమకు అడ్డువస్తే ఇదే గతి పడుతుందని హెచ్చరించాడు. అనంతపురంలో వుంటూ కూడా తన ఏజెంట్ల ద్వారా గ్రామ సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు అందజేస్తూ, ఉద్యమం మీద కత్తికట్టాడు. ఇక వీడి ఆగడాలు భరించటమంటే ప్రజలకు ఆత్మహత్యా సదృశ్యంగా మారిపోయింది. దాంతో అనంతపురంలో పోలీసు పహారాలో ''సురక్షితంగా'' వుంటున్న గోపాల్‌రెడ్డిని, వాడి ఇంటిదగ్గరికి జూలై 22వ తేదీన యాక్షన్ టీం వెళ్ళి ఖతం చేసి వచ్చింది. గ్రామంలోని ప్రజలమీద భూస్వామ్య ముఠా ఆధిపత్యం వహించి, అణగదొక్కి, అక్రమ కేసులు పెట్టించి, వాళ్ళ శ్రమ సైతం వాళ్ళకు దక్కకుండా చేసిన గోపాల్‌రెడ్డి ''వెయ్యి గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకే నేలకూలినట్లు' వాడి ఇంటిదగ్గరే కుక్కచావు చావడం అనంతపురం జిల్లాలోని ప్రజానీకాన్ని, ముఖ్యంగా పెన్నహోబిళం దళం ఏరియాలోని ప్రజానీకానికి మరింత పోరాట స్ఫూర్తిని ఇచ్చింది.

## ప్రచారం

### పి.జి.ఏ. అవతరణ దినం సభలు

పాపాగ్ని దళం ఏరియాలో కా॥ శ్యాం, మహేష్, మురళీలను స్మరిస్తూ ప్రజాగెరిల్లా సైన్యంలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజాగెరిల్లా సైన్యం గురించి పోస్టర్లు, కరపత్రం ద్వారా పిలుపునివ్వడం జరిగింది.

డిసెంబర్ 2 సందర్భంగా రాయచోటి మండలం, మాధవరం గ్రామంలో దళం కొయ్యూరు అమరులను స్మరిస్తూ ప్రజాగెరిల్లా సైన్యం ఏర్పాటు గురించి చెప్పడం జరిగింది. గ్రామంలో ఊరేగింపు, బహిరంగ సభకు 200 మంది ప్రజలు పాల్గొన్నారు. దళసభ్యుడు, దళ కమాండర్, జిల్లాకమిటీ సభ్యుడు బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ మన ప్రియతమ నాయకులైన కేంద్రకమిటీ సభ్యులను పొట్టన బెట్టుకున్న ఫాసిస్టు ప్రభుత్వం పాలనను ధిక్కరిస్తూ ప్రజలందరూ సైన్యంలో చేరాల్సిందిగా పిలుపునిచ్చారు. ''భూస్వాములను ప్రజల్ని దోపిడీ చేస్తూ దేశాన్ని తెగనమ్ముతున్న వాళ్ళు దేశద్రోహులను, సంఘ వ్యతిరేకులను, పాలకవర్గాలను వాళ్ళ సాయుధ బలగాలతో వున్న బలమైన శత్రువును ఎదుర్కొనడానికి ప్రజాగెరిల్లా సైన్యం అవసరం గురించి వివరించారు. మన పార్టీ ప్రజా రాజ్యాధికార అంగాలను కాపాడుకోవడానికి, గ్రామాలలోకి వచ్చే పోలీసుదాడులను ఎదుర్కోవడానికి ప్రజలు తామంత తాము రక్షించుకోవడానికి, విప్లవం విజయవంతం చేయడానికి ప్రజలందరు ప్రజాగెరిల్లా సైన్యంలో భాగమవ్వాలని కోరినారు. ఈ సభలో ప్రజలు ఉత్తేజంగా పాల్గొని అమరుల ఆశయాలను కొనసాగిస్తామని నినదించారు.

### డిసెంబర్ 2న కొయ్యూరు అమరుల సంస్మరణ దినాన్ని పి.జి.ఏ. ఆవిర్భావ దినం సందర్భంగా సభలు

కనగానపల్లి మండలం ముత్తువ కుంట్ల గ్రామంలో ప్రజలు వి.ఆర్.సి.యస్. సంఘ నాయకత్వంలో 20 కాగడాలతో ఊరేగింపు చేసి డిసెంబర్ 2న కేంద్రకమిటీ నాయకులు, కొయ్యూరు అమరుల సంస్మరణ సభ జరుపుతూ ప్రజా గెరిల్లా సైన్యం ఆవిర్భావ దినంగా సభ జరిపారు. ఇందులో 200 మంది పాల్గొన్నారు. గ్రామ సంఘ నాయకుడు మాట్లాడుతూ అమరుల త్యాగాలను కొనియాడాడు. ప్రజలు పోరాడి సాధించుకున్న పోరాట ఫలితాలను నిలబెట్టుకోవాలంటే ప్రతిఘటించాలని ఇందుకోసం ప్రజాగెరిల్లా సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు.

మనదేశంలో భూస్వాముల, దళారీ బూర్జువాల, సామ్రాజ్యవాదుల దోపిడీ దౌర్జన్యాలను కూలదోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఎన్నో ప్రజా పోరాటాలను నిర్వహిస్తున్నాం. దోపిడీదారుల ప్రతినిధుల ప్రభుత్వం ప్రజాపోరాటాలపై రక్తపుటేరులు పారిస్తూ, వేలాదిమందిని చంపివేస్తూ, వల్లకాడుగా చేస్తూ, చిత్రహింసలకు గురిచేస్తూ పోరాటాలను తన పోలీసు బలగాలతో పాశవికంగా అణచి వేయాలని చూస్తోంది. విప్లవం విజయవంతం కావాలంటే ప్రజా సమైక్యత, పోరాటంతో పాటు ప్రజాసైన్యం అవసరం వుంది. ప్రజాగెరిల్లా సైన్యం నిర్మించాలన్న సెంట్రల్ కమిటీ పిలుపుతో పాపాగ్ని ఏరియాలో నిర్బంధాన్ని ప్రతిఘటించండని, ప్రజాగెరిల్లా సైన్యం నిర్మాణం అవసరం చెబుతూ అందులో చేరండి అనే లక్ష్యంతో క్యాంపెయిన్ చేపట్టింది. పాపాగ్ని దళ ఏరియాలో 4-6-2001 నుండి 15-6-2001 వరకు క్యాంపెయిన్ దళం ఆరుగురితో (ఒక మహిళా కామ్రేడ్) మొదలయి 10 మందికి చేరుకొని (ముగ్గురు మహిళలు) దాదాపు 25 పల్లెల్లో నినాదాలతో, పాటలతో ఊరేగింపు జరిపి మీటింగ్‌లు నిర్వహించింది. ఈ మీటింగ్‌లకు 50 నుండి 300 మంది వరకు ప్రజలు హాజరయినారు. అంతేకాకుండా గ్రామాలలో వాల్‌రైటింగ్ చేపట్టింది. పి.జి.ఏ.లో చేరండి, మద్దతు తెల్పండి అనే కరపత్రాలు 2వేల సంఖ్యలో పంచింది. క్యాంపెయిన్ దళం కడప జిల్లాలోని గాలివీడు మండలం అరవీడు, నూలివీడు, చీమల చెరువుపల్లి, గుండ్ల చెరువు, పేరంపల్లి మొదలగు గ్రామాల్లో; రాయచోటి మండలంలోని గుంటి మడుగు, మాధవరం, పెద్దమండెం మండలాల్లోని కనుమోల్లోల్ల పల్లి, లక్కిరెడ్డిపల్లి, చాకిబండ మొదలగు గ్రామాల్లోని పల్లెల్లో నిర్వహించారు. క్యాంపెయిన్ దళంకి కావలసిన నిత్యావసర వస్తువులు నూనె, సబ్బులు ఇచ్చి ప్రజలు ఆదరించారు. ఫించా దళం ఏరియాలోని సుండుపల్లి మండలంలో 7గురితో కూడిన ప్రచార దళం జూన్ 15 నుండి 20 వ తేదీ వరకు క్యాంపెయిన్ చేశారు. పల్లె పల్లెల్లో సభలు నిర్వహిస్తూ, కరపత్రాలు పంచటం, చేతితో రాసిన పోస్టర్లు, వాయిస్‌లు వేయడం, బ్యానర్లు కట్టడం ద్వారా విస్తృతంగా క్యాంపెయిన్ చేయడం జరిగింది.

యల్లమంద పోలీసు స్టేషన్‌పై పి.జి.ఏ. దాడి తరువాత పోలీస్

(తరువాయి 25వ పేజీలో...)

# విప్లవ పత్రికలపై మార్క్సిస్టు

## పత్రిక సమిష్టి ఆర్గనైజర్

''పార్టీ పత్రిక సమిష్టి ప్రచారం, సమిష్టి ఆందోళనతోనే సంతృప్తి పడకుండా సమిష్టి ఆర్గనైజర్‌గా కూడా అది పనిచేస్తుంది;

''ఒక బలీయమైన రాజకీయ సంస్థకు చక్కని రాజకీయ శిక్షణ గరపాలంటే విస్తృతంగా వెలువడే, నిర్మాణయుతంగా పంచబడే మంచి పత్రిక ద్వారాతప్ప వేరే మార్గం లేదు.''

''అనుక్షణం పోరాటాన్ని నడప సిద్ధంగా వుండే విప్లవ పార్టీని ఒడిదుడుకులు లేకుండా అభివృద్ధి చేయాలన్నా, పునాదులు గట్టిపర్చాలన్నా, విస్తృతం చేయాలన్నా దేశవ్యాపిత రాజకీయ పత్రిక మనకు మార్గదర్శకంగా వుండితీరాలి.''

''వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పెక్కు సంఘటనలను కేంద్రీకరించి మన ప్రజల కందరకూ ఒకే విప్లవ మార్గాన్ని చూపించడానికీ, ఉత్సాహాన్ని అందించడానికీ, ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి నిజమైన సన్నిహిత సంబంధం ఏర్పర్చడానికి దేశవ్యాపిత పత్రికతప్ప మరో సాధనం లేదు.''

''ఒక ప్రాంతంలో జరిగే విప్లవ కార్యక్రమం చూసి మరో ప్రాంతంవారు బోల్షివిక్ పోటీతో పనిచేయడానికి, దేశ రాజకీయ విషయాలపై రాసే విమర్శలతో మన విప్లవకారుల సిద్ధాంత జ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని దశల్లోనూ పత్రిక ఒక్కటే ముఖ్యాయుధం.''

''రాజకీయ పత్రిక లేనిదే ఆధునిక యూరప్‌లో నిజమైన రాజకీయ ఉద్యమం అసంభవం''

''ఈ రోజుల్లో సజీవమైన రాజకీయ పరిజ్ఞానం ద్వారానే 'సజీవమైన రాజకీయ కార్యక్రమం' అమలు జరుగుతుంది. అఖిల రష్యన్ రాజకీయ పత్రిక ఒకటి లేనిదే ఈ రాజకీయ పరిజ్ఞానం లభించదు. అట్టి పత్రిక తరచుగా పాఠకుల కందజేయబడాలి. సక్రమంగా పంచిపెట్టబడాలి.''

''ప్రతి నిరసననూ, ప్రతి పోరాటాన్నీ ఎప్పటికప్పుడు బలపర్చగల విప్లవ సంస్థను మనం ఎడతెగకుండా అభివృద్ధి చేయాలి. ప్రజల్లో అది గాఢంగా నాటుకునేటట్లు చేయాలి. అన్ని వర్గాలకూ, అన్ని ప్రాంతాలకూ అది వ్యాపించేటట్లు చూడాలి. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో మనకు అఖిల రష్యన్ రాజకీయ పత్రిక మార్గం చూపుతుంది. ఎటునడవాలో సూచించడానికి అదొక పొడవైన గీతవలె వుపయోగపడుతుంది.''

''మనం స్థానికంగా బలీయమైన రాజకీయ సంస్థలను నిర్మించకపోతే, అఖిల రష్యన్ పత్రికను ఎంత చక్కగా ఆర్గనైజు చేసినప్పటికీ ప్రయోజనం వుండదనేమాట నిజమే. కాని ఇప్పుడు మనం తెలుసుకోవలసిన విషయం ఏమంటే, అఖిల రష్యన్ రాజకీయ పత్రిక ద్వారా తప్ప మరోవిధంగా మనం బలీయమైన రాజకీయ సంస్థలను తయారు చేయలేం.''

''అన్ని ప్రాంతాలకు ఉపయోగపడే పత్రిక వున్నపుడే, ఒక ప్రాంతానికి, మరో ప్రాంతానికి మధ్య నిజమైన సంబంధాలు ప్రారంభమౌతాయి. అట్టి పత్రిక రష్యాకంతకూ ఒకటే వుండాలి. అది రెగ్యులర్‌గా వస్తూ వుండాలి. అందులో వివిధ కార్యకలాపాల ఫలితాలన్నిటినీ క్లుప్తంగా వివరించాలి. దీని ద్వారా మన ప్రజలు అసంఖ్యాకమైన విప్లవ మార్గాలలో విధీ, విరామం లేకుండా ముందడుగు వేస్తూ పురోగమించేటట్లు ప్రోత్సహించగల్గుతాం.''

''పార్టీ సమిష్టి ఆశయం స్వరూపం, స్వభావం, పరిమాణం పత్రిక ద్వారా తెలుస్తాయి. రష్యా మొత్తం మీద మన కార్యకలాపాలలో ఏయే ప్రమాదకరమైన లోపాలున్నాయో, పత్రికల ద్వారా తెలుసుకోవచ్చు. ఏ ప్రాంతంలో, రాజకీయ ఆందోళన తక్కువగా వుందో ఎక్కడ సమన్వయం బలహీనంగా వుందో పత్రికల ద్వారా తెలుస్తుంది. బ్రహ్మాండమైన మన నిర్మాణ యంత్రంలో ఏ చక్రాన్ని మరమ్మత్తు చేయవలసి వుందో, ఏ చక్రాన్ని తొలగించి మంచిదాన్ని నిర్మించాలో, దాని ద్వారా తెలుసుకోవచ్చు. పని చేయడం ఇంకా ప్రారంభించని గ్రూపు అప్పుడు పనిని ప్రారంభించడానికి వీలు కలుగుతుంది. ఆ గ్రూపు ఇతర ప్రపంచంతో సంబంధంలేని గ్రూపుగా పని చేయడం పోతుంది.''

''... విప్లవం అంటే ఏదో ఒకనాడు అకస్మాత్తుగా జరిగే ఘటన కాదు. బ్రహ్మాండమైన తిరుగుబాట్లు వరుసగా అనేకం జరగాలి. ఒకదానికి, మరొక దానికి మధ్య ప్రశాంత పరిస్థితులేర్పడ్డం సహజం. కనుకనే బ్రహ్మాండమైన తిరుగుబాట్ల సమయంలోనూ, ప్రశాంతమైన వాతావరణంలోనూ కూడా ఏ కార్యక్రమం అవసరమో, ఏది సాధ్యమో దాన్ని మనం నెరవేర్చగలగాలి. ఇదే మన కార్యకలాపాలకు మూలం. అంటే అర్థం రష్యా అంతటా మనం వివిధ కేంద్రాలతో సన్నిహిత సంబంధం వుంచుకుంటూ రాజకీయ ఆందోళన జరపాల్సి వుంది. అది ప్రజల జీవితాన్ని అన్నివిధాల వుత్తేజపర్చేలా వుండాలి. అన్ని తరగతులు ప్రజలకు అది వ్యాపించేటట్లు చూడాలి. కాని మనం ఈ కర్తవ్యాన్ని అఖిల రష్యన్ పత్రిక లేనిదే ప్రస్తుత పరిస్థితుల్లో నెరవేర్చలేం. అది అప్పుడపుడు కాకుండా, తరచుగా ప్రచురింపబడుతూ వుండాలి.

**- లెనిన్ ('ఏంచేయాలి' నుండి)**

---

## పార్టీ కార్యకలాపాల కేంద్రం పత్రిక

''రష్యా అంతటా వ్యాపించివున్న సంస్థలను వుమ్మడి పార్టీ కార్యకలాపాలపై ఆధారపడి మాత్రమే సమైక్యపర్చటం సాధ్యమవుతుంది. కాని స్థానిక సంస్థల అనుభవాన్ని ఒక వుమ్మడి కేంద్రంలో సేకరించి దాని నుండి సాధారణ పార్టీ అనుభవాన్ని అన్ని స్థానిక సంస్థలకు వికేంద్రీకరించనిదే వుమ్మడి పార్టీ కార్యకలాపాలు అసాధ్యమవుతాయి. అఖిల రష్యా వార్తాపత్రిక ఇలాంటి కేంద్రంగా వ్యవహరించగలదు. అది పార్టీ కార్యకలాపాలకు మార్గదర్శకత్వం వహించి వాటిని సమన్వయపరిచి, పర్యవేక్షించగల కేంద్రం కాగలదు. కాని పార్టీ కార్యకలాపాలకు నిజంగా మార్గదర్శకత్వం వహించాలంటే దానికి స్థానిక సంస్థల నుండి సలహా సంప్రదింపులు, ప్రకటనలు, లేఖలు, సమాచారం ఫిర్యాదులు, నిరసనలు పని నిర్వహణ పథకాలు, ప్రజలను వుద్రేకపరుస్తున్న సమస్యలు వగైరా పరంపర నిరంతరం అందుతూ వుండాలి. పత్రికకు, స్థానిక సంస్థలకు మధ్య సన్నిహితమైన, నిలకడ గల సంబంధాలుండాలి. ఈవిధంగా సరిపడిన సమాచారాన్ని సేకరించి, అవసరమైన సమస్యలను సకాలంలో గుర్తించి, వాటిపై వ్యాఖ్యానించి, వాటిని విశ్లేషించాలి. ఈ సమాచారం నుండి అవసరమైన మార్గదర్శక సూత్రాలనూ, నినాదాలనూ వడపోసి, వాటిని యావత్తు పార్టీ, అన్ని పార్టీ సంస్థలకూ తెలియజేయాలి. ఈ పరిస్థితులు లేనిదే పార్టీ పనిలో నాయకత్వం వుండజాలదు. పార్టీ పనిలో నాయకత్వం లేకపోతే సంస్థలను శాశ్వతంగా సమైక్యపర్చటం అసాధ్యం అవుతుంది. అందుకే అఖిల రష్యా వార్తాపత్రిక (విదేశాల్లో ప్రచురితంకానిది) అవసరాన్ని, నాయకత్వం వహించగల వార్తాపత్రిక (కేవలం ప్రజాదరణ పొందినది కానిది) అవసరాన్ని నొక్కి చెప్పటం జరుగుతోంది.'' **-స్టాలిన్**

# మహోపాధ్యాయుల వ్యాఖ్యలు

### పత్రిక – ప్రజాపంథాపై

"పత్రిక ఒక రాష్ట్రంలోని ప్రజలందర్నీ సంఘటితపర్చి, ఉత్సాహపర్చి, వారికి ప్రేరణ నందించి, విమర్శించి వారి కృషికి ఊతాన్నిచ్చేందుకు తోడ్పడుతుంది."

"పత్రిక వాడిగా ఘాటుగా, స్పష్టంగా వుండాలి. చిత్తశుద్ధితో దాన్ని నడపాలి. మన పార్టీ నడిపే వార్తా పత్రికలు, మన పార్టీ ప్రచార కార్యక్రమం యావత్తు స్ఫుటంగా స్పష్టంగా వాడిగా వుండాలేకాని, గొణుగుతూ సణగడం వుండకూడదు. విప్లవ కార్మికవర్గానికి సరితూగే సరైన సమరశీల శైలి ఇదే."

"పత్రిక అంటూ మొదలు పెట్టిన తర్వాత దానిని చైతన్య పూర్వకంగానూ చక్కగానూ నడపాలి. ఇది పత్రికా వుద్యోగులు, పాఠకులు యిరువురి బాధ్యత కూడా. పాఠకులు తమకు ఏది నచ్చిందో ఏది నచ్చలేదో వివరిస్తూ సూచనలు, చిన్న చిన్న వుత్తరాలు వ్యాసాలు పత్రికకు పంపాలి. ఇది చాలా ముఖ్యం. పత్రికను విజయవంతంగా నడపడానికి ఇదొక్కటే మార్గం."

"పార్టీ కార్యక్రమాన్ని, పార్టీ పంథాను, పార్టీ సాధారణ, నిర్దిష్ట విధానాలను, కర్తవ్యాలను, పని పద్ధతులనూ ప్రజల ముందుకు అతి త్వరితంగాను, అతి విస్తృతంగానూ తేగల సామర్థ్యంలోనే వార్తాపత్రికల పాత్ర, వాటి శక్తి వున్నది."

"ఒక వార్తాపత్రికను బాగా నడపడం, దాన్ని ఆసక్తిదాయకంగానూ, మనస్సుకు హత్తుకునేట్టుగానూ రూపొందించటం వార్తా పత్రికల్లో పార్టీ సాధారణ, నిర్దిష్ట విధానాలకు సరైన ప్రచారం ఇవ్వటం, వార్తాపత్రికల ద్వారా పార్టీకి ప్రజలతోటి సంబంధాలను పటిష్టం చేయటం–మన పార్టీ పనిలో యిది ఒక ముఖ్యమైన సూత్రపరమైన సమస్య. దీన్ని తేలిగ్గా తీసుకోగూడదు."

"ప్రతి రాష్ట్ర పత్రికకూ తనదైన సొంత విశిష్ట లక్షణాలుండాలి. ప్రతిదీ తన చర్చలకు తన రాష్ట్రంలోని పరిస్థితిని ప్రధాన ప్రాతిపదికగా తీసుకోవాలి. అవి చైనా గురించి లేదా యావత్ ప్రపంచాన్ని గురించి విశ్వాన్ని గురించి ఆఖరికి సూర్యుడు పాలపుంతల గురించి కూడా చర్చించవచ్చు.

వార్తా పత్రికను నడపడం అన్నది మిగిలిన అన్ని పనులలాంటిదే. దానిని చక్కగానూ సజీవంగానూ నడపాలంటే, దాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలి. వార్తా పత్రిక విషయంలో కూడా వాటిని నడపడానికి మనం అందరిమీద ఆధారపడాలి. ప్రజాబాహుళ్యం మీద, పార్టీ అంతటి మీదా ఆధారపడాలి. తలుపులేసుకుని గదుల్లో కూచుని పనిచేసే కొద్దిమంది మీద మాత్రమే ఆధారపడరాదు.

ప్రజలకు నేర్పాలంటే, వార్తాపత్రిక సిబ్బంది ముందుగా తాము ప్రజల నుండి నేర్చుకోవాలి."

"వార్తాపత్రికలలో పనిచేస్తున్న కామ్రేడ్లు కూడా నిరంతరం కింది నుండి వస్తున్న విషయాలను అధ్యయనం చేసి క్రమంగా, తమ ఆచరణాత్మక విజ్ఞానాన్ని సుసంపన్నం చేసుకుని అనుభవజ్ఞులు కావాలి. ఈ విధంగా అయితేనే ప్రజలకు అధ్యయనం గరిపే కర్తవ్యాన్ని వారు తమ భుజాల కెత్తుకోగలుగుతారు."

"యుద్ధ సమయాల్లో చిన్నచిన్న వ్యాసాలు మనకు అవసరం అన్నమాట నిజమేకాని, అంతకంటే ముఖ్యంగా మనకు విషయం వున్న వ్యాసాలు అవసరం. విషయంలేని వ్యాసాలు అత్యంత అభ్యంతరకరమైనవి. ఇది ఉపన్యాసాలకు కూడా వర్తిస్తుంది. పనికిరాని సుదీర్ఘ ఉపన్యాసాలను మనం కట్టిపెట్టాలి."

"మూసపోత రచనలు లక్ష్యంలేనివి కావడమేకాక, అవి పాఠకులను పరిగణనలోకి తీసుకోవు."

"నిజంగా ప్రచారం చేయదల్చిన కమ్యూనిస్టులు తమ వ్యాసాలు, నినాదాలు చదివే, వుపన్యాసాలు వినే శ్రోతల్ని దృష్టిలో పెట్టుకోవాలి. అట్లా చేయకపోతే తాము రాసినదాన్ని, చెప్పినదాన్ని ఎవరూ వినకుండా చదవకుండా చేయటమే అవుతుంది."

"బాణం వేసినపుడు లక్ష్యాన్ని గురిచూడాలి. పిల్లనగ్రోవి ఊదినపుడు వినేవాడిని దృష్టిలో పెట్టుకోవాలి. అలాంటిది–పాఠకుల్ని శ్రోతల్ని గమనంలోకి తీసుకోకుండా ఎవరైనా వ్యాసాలు ఎలా రాస్తారు? ఉపన్యాసాలు ఎలా ఇస్తారు?"

"భాషమీద పట్టు సంపాదించటం అంత తేలిక కాదు. దానికోసం చాలాశ్రమపడాలి. ముందు మనం ప్రజల భాష నేర్చుకుందాం. మనలో చాలామందికి భాష మీద పట్టులేదు. కాబట్టే మన రచనలు, వుపన్యాసాలు సజీవంగా, శక్తివంతంగా భావస్ఫోరకంగా వుండటం లేదు."

"ఒక వ్యాసంగాని, వుపన్యాసంగాని ముఖ్యమైనది అయి, మార్గదర్శకం కావాలంటే అది ఒక ప్రత్యేక సమస్యను ముందుంచాలి. తర్వాత దాన్నివిశ్లేషించి, సమస్య స్వభావాన్ని సూచించాలి. ఆ తర్వాత దాని పరిష్కార విధానాన్ని అందించాలి. దీంట్లో లాంఛనప్రాయ పద్ధతులు నిష్ప్రయోజనకరం."

"సరిగా చెప్పలేనివి చెప్పకండి. అది ఇతరుల ఆలోచనలపై, చర్యలపై ప్రభావం చూపగలదని ఎప్పుడూ గుర్తుంచుకోండి."

"చాలా మంది అధ్యయనం చేయకుండా ముందుగా తయారవకుండా వ్యాసాలు రాస్తారు. ఉపన్యాసాలిస్తారు. వ్యాసం రాసాక (ముఖం కడుక్కున్నాక అద్దంలో చూసుకున్నట్లుగా) ఆ వ్యాసాన్ని పలుమార్లు చదువుకోవడం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా దాన్ని ఏకంగా, ప్రచురణకు పంపేస్తారు. దాని పర్యవసానం **"కలం నుండి వెయ్యిపదాల ధార, కానీ విషయానికి పదివేల పదాల దూరం."**

"పాఠకులను, వినేవాళ్లను దృష్టిలో పెట్టుకోకుండా మన యిష్టానుసారం లక్ష్యం లేకుండా వ్యవహరించకూడదు. మన అభిప్రాయాలే సరైనవి అనుకోవటం, గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి."

**"ప్రజలకు పరిచయముండి, అర్థమయ్యే ఉపమానాలను వాడుతూ, సామాన్యంగా, నిర్దిష్టంగా మాట్లాడటం మనకు ఎల్లప్పుడూ కుదరదు. మనం కంఠస్థం చేసిన ఆ నిర్దిష్ట సూత్రాలు వాడకుండా ఆపుకోవడం మనకు యింకా సాధ్యపడటం లేదు. నిజానికి మన పత్రికలు, తీర్మానాలు, సిద్ధాంత పత్రాలు చూస్తే అవి సాధారణంగా ఎంత క్లిష్టమైన పద్ధతిలో రాసి వుంటాయంటే పార్టీ శ్రేణులమాట అటుంచి మన పార్టీ ముఖ్యులకే అవి అర్థమవటం కష్టం."**

"ఒక ముఖ్యమైన వ్యాసాన్ని ప్రచురించేముందు దాన్ని పదిసార్లకంటే ఎక్కువే చదివి, దాన్ని చైతన్యయుతంగా సరిచూడాలి. వ్యాసాలు భౌతిక

**వాస్తవికతకు ప్రతిబింబాలు. ఆ భౌతిక వాస్తవికత సంక్లిష్టమైనది. దాన్ని సరిగ్గా ప్రతిబింబించాలంటే, పదే పదే అధ్యయనం చేయాలి. ఈ విషయంలో అజాగ్రత్తంగా వుండటమంటే రాతకు చెందిన ప్రాథమిక అంశాలు కూడా తెలీవనే అనుకోవాలి.''**

''ఏదైనా రాయాలంటే మీమీద ఒత్తిడి వుండాలి. గాడిదపై ఎవరో ఒకరు స్వారీ చేయాల్సి వుంటుంది.''

''పార్టీ కార్యదర్శులు స్వయంగా వార్తాపత్రికలను పర్యవేక్షించాలి. వ్యాసాలను రాయాలి.''

''సమగ్రమైన నివేదికలో, విషయంలో క్లుప్తత, మాటల్లో పొందికలను పాటించి, సమస్యలను లేదా వివాదాస్పదమైన విషయాలను సూచించాలి.''

''పార్టీ లోపల, వెలుపలగల ప్రజలు చదవడానికి వీలుగా, 'న్యూస్ ఫర్ రిఫరెన్సు' పత్రిక సర్క్యులేషన్‌ను 2వేల నుండి 4 లక్షలకు పెంచాలని మేమిపుడు నిర్ణయం చేశాం. సామ్రాజ్యవాదం కోసం ఒక కమ్యూనిస్టు పార్టీ ఒక వార్తాపత్రికను ప్రచురించే ఒక వ్యవహారం ఇది. ఎందుకంటే, మనమీద బురదజల్లే అభివృద్ధి నిరోధక సమాచారాన్ని కూడా అది ప్రచురిస్తుంది. మనం ఇది ఎందుకు చేయాలి? విషపు కలుపుమొక్కలను మార్క్సిస్టేతరమైనదాన్ని, మార్క్సిస్టు వ్యతిరేకమైనదాన్ని మన కామ్రేడ్స్ ముందు, ప్రజారాశుల ముందు, ప్రజాస్వామిక ప్రముఖుల ముందు వుంచి, వారిని రాటుదేల్చడం అన్నదే ధ్యేయం. విషయాలను కప్పిపెట్టకండి, లేకపోతే, అది ప్రమాదకరమవుతుంది. ఈ విషయంలో మన వైఖరి, సోవియట్ యూనియన్ వైఖరికి భిన్నమైనది. వాక్సినేషను ఎందుకు అవసరమవుతుంది? ఒక మనిషికి రోగ నిరోధక శక్తిని సంతరించి పెట్టడానికిగానూ, అతడికి వ్యతిరేకంగా ''విషక్రిమి యుద్ధతంత్రం'' సల్పడానికిగానూ, అతడి శరీరంలోకి ఒక వైరస్ కృత్రిమంగా ప్రవేశపెట్ట బడుతుంది. కేడర్లు మరియు ప్రజారాశుల రాజకీయ రోగనిరోధక శక్తిని వృద్ధి చేయడానికి, 'న్యూస్ ఫర్ రిఫరెన్సు' తదితర నెగిటివ్ బోధనా సమాచారాలు ప్రచురించబడుతున్నాయి.''

''ఈనాడు వస్తున్న అనేక వ్యాసాలు, అతి పటాటోపంగా వుంటాయి. కానీ, సమస్యలకు సంబంధించి ఏ విశ్లేషణగానీ లేదా సహేతుకమైన వాదంగానీ లేకుండా డొల్లగా వున్నాయి, అవి పనికిమాలినవి. ఈ రకపు వ్యాసాలు ఎంత తక్కువుంటే అంత మంచిది. ఒక వ్యాసాన్ని రాసేటప్పుడు 'నేనెంత తెలివైనవాడి/తెలివైనదాన్ని!' అని ఎన్నడూ కూడా ఆలోచించకూడదు. తన పాఠకులతో సమాన స్థాయిలో తన్ని తాను నిలబెట్టుకోవాలి. నీవు విప్లవంలో సుదీర్ఘ కాలంనుండి వుండవచ్చుగాక, కానీ నీవేమైనా తప్పు మాట్లాడితే, ప్రజలు దాన్ని లెక్కచెయ్యకుండానే తప్పును తిరస్కరిస్తారు. నీవు ఎంత గొప్పలకుపోతే, ప్రజలు అంత తక్కువగా దాన్ని భరిస్తారు, నీ వ్యాసాలను చదవడానికి అంత తక్కువ శ్రద్ధ పెడతారు. మనం నిజాయితీతో పనిచేయాలి, విశ్లేషణాత్మక వైఖరి తీసుకోవాలి, నచ్చచెప్పే విధంగా రాయాలి. ప్రజలను దబాయించడానికి ప్రయత్నించకూడదు''.

''ఒక సుదీర్ఘ వ్యాసంలో ఏకపక్షతను నివారించుకోవచ్చుగానీ, ఒక చిన్న వ్యాసంలో అది అనివార్యమని కొందరంటారు. ఒక చిన్న వ్యాసం తప్పకుండా ఏకపక్షంగా వుండాల్నా? (ఏకపక్షత అంటే శుద్ధ విషయం-ప్యూరిటానిక్-దృష్ట్యా ఆలోచించటం. అంటే సమస్యల పట్ల అధిభౌతిక దృక్పథాన్ని అవలంభించటం. మన పనికి సంబంధించిన అంచనాలో ప్రతిదాన్ని నొక్కి చెప్పటంగానీ లేదా ప్రతిదాన్ని తిరస్కరించడంగానీ ఏకపక్షత అవుతుంది. ప్రతిదాన్ని నొక్కి చెప్పటమంటే, మంచిని మాత్రమే చూసి చెడును చూడక పోవడం, పొగడ్తను మాత్రమే ఆహ్వానించటం, విమర్శను ఆహ్వానించక పోవటం, మన పని అన్నివిధాలుగా మంచిగానే వుందన్నట్లుగా మాట్లాడటం ప్రతిదీ మంచిగానే వుందన్నది నిజం కాదు, అలాగని ప్రతిదీ చెడ్డదే అన్నది కూడా నిజం కాదు. అది కూడా వాస్తవాలతో పొసగనిది.) నేనిప్పుడే అన్నట్టు, ఏకపక్షతను నివారించుకోవడం మామూలుగా కష్టమే. అది కొంతమేరకు చోటు చేసుకుంటే, అదేం పెద్ద ప్రమాదమవదు. ఒక శుద్ధమైన, సమగ్రమైన పద్ధతిలో సమస్యలను చూడాల్సి వుంటుందని ప్రతి ఒక్కర్ని కోరితే, విమర్శ దెబ్బతింటుంది. ఏది ఏమైనా, సాపేక్షికంగా సమగ్రమైన పద్ధతిలో సమస్యలను చూడటానికి ప్రయత్నించమని, సుదీర్ఘ వ్యాసాలలోనూ, సంక్షిప్త వ్యాసాలలోనూ కూడా ఏకపక్షతను నివారించుకోడానికి ప్రయత్నించమని మనం తప్పనిసరిగా ప్రతిఒక్కర్ని కోరుతాం. కొన్ని వందలు లేదా వెయ్యి, రెండువేల పదాల వ్యాసంలో విశ్లేషణ ఎలా సాధ్యం? అని కొందరు వాదిస్తారు. ఎందుకు చేయలేం? అని నేనంటాను. లూక్సన్ చేయలేదా? గతితర్కం అంటే, విశ్లేషణాత్మక పద్ధతే. విశ్లేషణ అంటే, వస్తువులలోని వైరుధ్యాలను విశ్లేషించమని అర్థం. జీవితం గురించి లోతైన విజ్ఞానం లేకుండా, సంబంధిత వైరుధ్యాల గురించి వాస్తవ అవగాహన లేకుండా సజీవమైన విశ్లేషణ సాధ్యం కాదు. లూక్సన్ యొక్క మలినాటి వ్యాసాలు ఎంతో లోతుగాను, ఎంతో శక్తివంతంగానూ వుంటాయి. అయినప్పటికీ, ఏకపక్షతకు అతీతంగా వుంటాయి. ఎందుకంటే, అప్పటికతడు గతితర్కాన్ని అవగాహన చేసుకొన్నాడు. లెనిన్ మహాశయుడి వ్యాసాలను కూడా సంక్షిప్త వ్యాసాలుగా పేర్కొనవచ్చు. అవి వ్యంగ్యంగానూ, సునిశితంగానూ వుంటాయి, అయితే ఏకపక్షత వుండదు. లూక్సన్ వ్యాసాలు దాదాపుగా అన్ని కూడా శత్రువుకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినవే. లెనిన్ వ్యాసాలలో కొన్ని శత్రువును వుద్దేశించినవి, కొన్ని కామ్రేడ్లను ఉద్దేశించినవి. ప్రజల శ్రేణుల లోపలి తప్పులకు, లోటుపాట్లకు వ్యతిరేకంగా లూక్సన్ తరహా వ్యాసాన్ని వాడవచ్చునా? వాడవచ్చుననే నేననుకుంటున్నాను. అయితే, మనం, మనకు శత్రువుకు మధ్య తేడాను చూడాలి. మనం కామ్రేడ్స్ పట్ల శత్రుపూరిత వైఖరినీ అవలంభించకూడదు. శత్రువుతో మనమేవిధంగా వ్యవహరిస్తామో, ఆ పద్ధతిలో వారితో వ్యవహరించకూడదు. ప్రజల ఆశయాన్ని సంరక్షించే వాంఛతో, హృదయపూర్వకంగానూ, నిజాయితీగానూ మాట్లాడాలి, వారి రాజకీయ చైతన్యాన్ని పెంచాలి, అవహేళనకుగానీ, దాడికిగానీ పూనుకోరాదు.

ఎవరైనా రాయడానికి సాహసించకపోతే? తాము ప్రజలను నొప్పించి, విమర్శించబడతామేమోనని, తాము చెప్పాల్సింది వున్నప్పటికీ తాము రాయడానికి సాహసించడం లేదని కొందరంటారు. అటువంటి చింతలను పక్కకు పెట్టెయ్యచ్చునని నేననుకొంటున్నాను. జనతా ప్రజాస్వామ్య రాజ్యం మనది, ప్రజల సేవలో రాయడానికి అనువైన వాతావరణాన్ని అది సమకూరుస్తుంది. వంద పుష్పాలను వికసింపనీయండి, వంద ఆలోచనా స్రవంతులను పోటీ పడనీయండి అనే విధానం. విజ్ఞాన శాస్త్రం, కళలు వికసించడానికి అదనపు హామీలను ఇస్తోంది. నీవు చెప్పేది సబబైనదే అయితే, నీవు విమర్శకు భయపడనవసరం లేదు. చర్చ ద్వారా నీ సరియైన భావాలను నీవు మరింత విడమర్చి చెప్పవచ్చు. నీవు తప్పు చెబితే, నీ తప్పుల్ని సరిదిద్దుకోడానికి విమర్శ సహాయపడగలదు. దాంట్లో చెడ్డేమీలేదు. మన సమాజంలో, వైరుధ్యాలను బైటపెట్టి పరిష్కరించడానికి, విజ్ఞాన శాస్త్రాన్ని, కళలను అభివృద్ధి చేయడానికి, మన పని అంతటిలోనూ విజయాన్ని ఖాయం చేసుకోడానికి వాడబడిన ఒక మంచి పద్ధతి సమరశీల విప్లవాత్మక విమర్శ, ప్రతి విమర్శ''.

**-మావో** ❑

(21వ పేజీ తరువాయి...)

స్టేషన్లో పోలీసుల సంఖ్య పెంచుకొని కార్యక్రమాలు జరుగుతున్న సమాచారం కొద్దిగా దొరికినా ఆ కార్యక్రమాల్ని అడ్డుకోవడానికి పోలీసులు సిద్ధంగా వున్న సమయంలో ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, సమయస్ఫూర్తితో వ్యతిరేకిస్తూ ప్రచార దళాలు ఈ క్యాంపెయిన్ను విజయవంతం చేసి, ప్రజలలో నూతనోత్సాహాన్ని నింపినాయి.

## కరువు, శత్రు నిర్బంధాన్ని ప్రచారం చేస్తూ రెండు క్యాంపెయిన్ దళాలు

అనంతపురం జిల్లాలో రైతులకు వేరుశెనగ పంటే ప్రధాన జీవనాధారం. 2000-2001 సం॥లో వర్షాలు సరిగ్గా పడక, వేరుశెనగకు ముప్పతెగులు సోకి, పంట పూర్తిగా నష్టపోయారు. పంట నష్ట పరిహారం చెల్లించాలని రైతాంగం డిమాండు చేయడంతో ఇదేదీ పట్టించుకోని తెలుగుదేశం ప్రభుత్వం గ్రామాలలో ప్రజా ఉద్యమాలు కొనసాగకుండా ప్రజలపై, సంఘాలపై తీవ్ర నిర్బంధం కొనసాగిస్తూ అరెస్టులు చేసి, నెలల తరబడి చిత్రహింసలు పెడుతూ, లక్షలాది రూ॥లు లంచాలుగా వసూలు చేస్తూ, అక్రమ కేసులు బనాయించి, జైళ్ళలో తోస్తున్నారు. కరువుతో ప్రజానీకం నలిగిపోతుంటే, డబ్బులు కట్టమంటూ, పోలీసులు, రాజకీయ నాయకులు చేస్తున్న దాడిని చంద్రబాబు పథకాల డొల్లతనాన్ని ప్రచారం చేస్తూ చిత్రావతి ఏరియాలో 12మంది 8 రోజులు 19 గ్రామాలలో ప్రచారం చేశారు. రామగిరి ఏరియాలో 8-12 మంది 12 రోజులు 25 గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ క్యాంపెయిన్లో ఆర్.యస్.యు., వి.యం.యస్., వి.ఆర్.సి.యస్. కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాకిబండలో మతోన్మాద వ్యతిరేక బహిరంగ సభ

హిందూ మతోన్మాద బి.జె.పి. సంఘపరివార్ నాయకత్వంలో బాబ్రీమసీదును కూలగొట్టిన దినమైన డిసెంబర్ 6న మతోన్మాద వ్యతిరేక దినంగా పాటించమని పాపాగ్ని దళం ఏరియాలో పోస్టర్లు వేసి విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. దీనితోపాటు చిన్నమండెం మండలం చాకిబండ గ్రామంలో దళం ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. సభకు ముందు గ్రామంలో 300 మందితో ఊరేగింపు జరిగింది. సభలో దళ సభ్యులు, శాక్‌సభ్యులు మాట్లాడారు. అధికారం కొరకు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, బాబ్రీమసీదును కూలగొట్టి బి.జె.పి. దేశంలోని ముస్లింలలో అభద్రతా భావం కలగచేశాయని, అప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడ, బాబ్రీమసీదును రక్షించడంలో విఫలమై మైనారిటీలను మోసగించిందని చెప్పారు. లౌకికవాదిలా కాంగ్రెస్ చెప్పుకోవటం బూటకమని చెప్పారు. ఇవాళ అధికారంలో వున్న బి.జె.పి. ప్రభుత్వం ముస్లింల మీదనేగాక క్రిష్టియన్‌లపై కూడ దాడులు చేస్తూ, ఫాసిస్టు స్వభావాన్ని చాటుకుంటూ దానిమాటున సామ్రాజ్యవాదులకు సేవ చేస్తున్నదని వివరించారు.

ఇక రాష్ట్రంలో చంద్రబాబు లౌకికవాదిలా ఫోజుకొడ్తూ బి.జె.పి.తో చేతులు కలిపాడని, రాష్ట్రంలో చర్చిలపై, మసీదుల్లో బాంబులు వేయటంపై ఐ.యస్.ఐ. కారణమని, చర్చిలలో వున్న ముఠా తగాదాలే కారణమని మాట్లాడుతూ క్రిష్టియన్లకు, ముస్లింలకు మధ్య; దళితుల్లోనే మాల మాదిగలకు మధ్య వైరుధ్యం పెంచే ప్రయత్నం చేస్తున్నాడు. బి.జె.పి. హిందూ మతోన్మాదాన్ని, సంఘపరివార్ మైనార్టీలపై చేస్తున్న దాడుల గురించి పల్లెత్తు మాట్లాడకుండా సంఘ వ్యతిరేక శక్తులు తన ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ఈ పనులు చేస్తున్నాయని మాట్లాడుతున్నాడనీ పత్రికలు, ముస్లిం సంస్థలు, ప్రతిపక్షాలు సమస్యను గోరంతను కొండంత చేస్తున్నాయని విమర్శించాడని మాట్లాడారు.

హిందూ మతోన్మోదానికి వ్యతిరేకంగా మైనార్టీలు తమ ప్రజాస్వామిక హక్కుల కొరకు పోరాటం చెయ్యాలని చివర్లో పిలుపునిచ్చారు. ముస్లింలే మెజార్టీగా వున్న ఆ గ్రామంలో ప్రజలు ఎంతో ఉత్సాహంగా సభా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## నిర్బంధం - ప్రతిఘటన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త కమాండ్‌ను ఏర్పాటు చేసి మన పార్టీ నాయకత్వాన జరుగుతున్న విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పూనుకున్న విషయం తెలిసిందే. సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని భూస్వామ్య దళారీ, నిరంకుశ బూర్జువా వర్గ దోపిడీని, సామ్రాజ్యవాద దోపిడీకి కుక్కలా కాపలాకాస్తూ సామ్రాజ్యవాదులు రూపొందించిన లో ఇంటెన్సిటీ వార్ విధానాన్ని అమలుచేస్తూ విప్లవోద్యమంపై ముప్పేట దాడి చేస్తున్నది. అందుకోసం తీవ్ర నిర్బంధంతోపాటు ఇన్‌ఫార్మర్‌లను తయారు చేసుకోవడం, కోవర్టులను తయారు చేయడం, కౌన్సిలింగ్‌లు జరపడం, ఉద్యమం మీద తప్పుడు ప్రచారం చేయించడం వంటివి చేస్తున్నాడు. వర్గ పోరాటం తీవ్రంగా వున్న, తీవ్రతరం అవుతున్న ప్రాంతాల్లో ఇది మరింతగా అమలు చేస్తున్నాడు. రాయలసీమ డివిజన్‌లో కూడా శత్రువు ఉద్యమాన్ని అణచడానికి అదే విధంగా కొనసాగిస్తున్నాడు. రక్తపుటేరులు పారించైనా ఉద్యమాన్ని అణచటానికి తీవ్ర నిర్బంధం అమలు చేస్తున్నాడు.

రాయలసీమ డివిజన్‌లోని 3 జిల్లాల్లో సాయుధ ముఠా నాయకులకు, భూస్వాములకు వ్యతిరేకంగా తీవ్రతరమవుతున్న వర్గపోరాటాన్ని, మన ఉద్యమాన్ని అణచటానికి పెద్ద ఎత్తున శత్రువు అణచివేత చర్యలకు పూనుకున్నాడు. జిల్లాలోని సాయుధ, భూస్వామ్య ముఠాల పీడన నుండి తరాలుగా ప్రజల్ని విముక్తి చేయలేని రాష్ట్ర ప్రభుత్వం, దానిపోలీస్ యంత్రాంగం ఉద్యమం మీద దాడిచేస్తూ, ప్రజల్ని అణచిపెట్టి వుంచటానికి కంకణం కట్టుకొంది. పార్టీ సంఘాల నాయకత్వంలో సంఘటితపడుతూ, చైతన్యవంతులౌతూ కూలీరేట్ల పోరాటాల నుండి పట్టాభూముల ఆక్రమణల వరకు చేస్తూ, ప్రజా పంచాయితీల ద్వారా భూస్వాముల, పెత్తందార్ల, గూండాల మెడలు వంచుతూ, మహిళలపై జరుగుతున్న అన్నిరకాల అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలను కదిలిస్తూ, పితృస్వామ్యాన్నీ, పురుషాధిక్యాన్నీ నడిరోడ్లో పంచాయితీ చేసి చెప్పులతో కొట్టి ఊరేగిస్తూ పోరాటం ద్వారానే తమ జీవితాలకి విముక్తి అని అన్ని సెక్షన్ల ప్రజలు ముందుకు

కదిలి వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ప్రజలకు చుక్కానిలా వున్న పార్టీని, స్థానికంగా నాయకత్వం వహిస్తున్న సంఘాల్ని దెబ్బతీయకుండా ఉద్యమాన్ని అణచివేస్తామని, దళాల్ని మట్టుపెట్టడానికి, సంఘాల్ని దెబ్బతీయటానికి పూనుకున్నారు.

### అనంతపురం జిల్లాలో నిప్పులు చెరుగుతున్న నిర్బంధం

జిల్లాలో మన ఉద్యమ ప్రాంతంలోని సాయుధ భూస్వామ్య ముఠా నాయకులు పరిటాల రవి, పయ్యావుల కేశవ్ చిత్తూరు, కడప జిల్లాల్లో మహేశ్వరరెడ్డి, రవీందర్‌రెడ్డి మొదలగు తెలుగుదేశం నాయకులు కూలిపోతున్న తమ ఆధిపత్యం నిలబెట్టుకోవటం కోసం జిల్లా యస్.పి. అంజనా స్విన్హతో కలిసి మరింతగా పన్నాగాలు పన్నుతూ, దారుణమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు.

### ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్ట పరుచుకోవడం

రోజుల తరబడి కూంబింగ్ చేసినా, తగినంత ఫలితం లేకపోగా, రహస్య ఏజెంట్లను తయారు చేసుకుంటున్నాడు. గ్రామాలలో వుండే లంపెన్స్‌తో ఐ.డి. పోలీసులు సన్నిహితంగా వుంటూ వారికి కావాల్సినంత డబ్బు ఖర్చు చేస్తున్నారు. మోటారు సైకిళ్ళు ఇచ్చి సమాచారం కోసం తిరగమంటున్నారు. ఒకరిద్దరు పోలీసులకు మూడు, నాలుగు గ్రామాలు కేటాయించి; ఆ గ్రామాలలో వ్యక్తిగత పరిచయాలు పెంచుకుంటూ నిరంతరం ఆ గ్రామాలలోనే సివిల్‌లో వుంటూ సమాచారం సేకరిస్తున్నారు. ప్రధానంగా ఇన్‌ఫార్మర్‌లను తయారు చేసుకోవడమే వాళ్ళ పని.

1. గ్రామాలలో వుండే ముఠాల నుండి సమాచారం సేకరిస్తున్నారు.

2. క్రికెట్ ఆటగాళ్ళతో సన్నిహితంగా వుంటూ ఏ ఊర్లో క్రికెట్ జరిగినా అక్కడికి కానిస్టేబుళ్ళు పోయి వారితో స్నేహం చేస్తూ, మీ ఊరి సమాచారం వాకీటాకీలో చెప్పమని, ఎంత డబ్బైనా ఇస్తామని ప్రోత్సహిస్తున్నారు. అక్కడికి వచ్చినవారు ఏ ఊరు వారో వివరాలు తెలుసుకోవడం చేస్తున్నారు.

3. అరెస్టయిన సంఘ సభ్యులను, మిలిటెంట్లను, దళాన్ని పట్టివ్వమని ఒత్తిడి చేస్తున్నారు. డబ్బు ఆశ చూపుతున్నారు. డబ్బుకు లొంగకపోతే, చిత్రహింసలు పెడుతూ అప్పటికీ లొంగకపోతే చంపుతామని, బెదిరించి సైడ్‌కు ఫైర్ చేయడం చేస్తున్నారు. అరెస్టయిన కొంత మందికి ఛార్జీలు ఇస్తూ తిండి పెట్టించడం లాకప్పుల్లో వుంచకుండా మంచిగా చూస్తున్నట్లు నమ్మించి, స్లోగా ఇన్‌ఫార్మర్‌గా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సంఘాలలో బలహీనమైన వారి వ్యక్తిగత సమస్యలను పట్టించుకొని పరిష్కరించడం చేస్తున్నారు. అనారోగ్యం పేర లోన్‌లు ఇప్పించి, ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

4. ఇన్‌ఫార్మర్స్‌గా పనిచేసేవాళ్ళు పోలీస్ స్టేషన్‌కు రానవసరం లేకుండా, వాకీటాకీలు సెల్‌ఫోన్స్ ఇస్తున్నారు. ఇవి ఇవ్వని చోట ఉత్తరాలు ఒకరినుండి ఒకరికి (చైన్ మాడల్) అందేలా చేస్తున్నారు. వ్యాన్ జీపు డ్రైవర్లతో సన్నిహితంగా వుంటూ వారిచే ఉత్తరాలు తెప్పించుకోవడం చేస్తున్నారు. మైత్రీ సంఘాలు పెట్టి వాటినుండి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. అంతేగాకుండ ఐ.డి. పోలీసులు వివిధ వస్తువులు అమ్మేవారిగా ఎద్దుల శనక్కాయల వ్యాపారులుగా తిరుగుతున్నారు. ఈ అనేక పద్ధతుల్లో రామగిరి, పెన్నహోబిళం, చిత్రావతి ఏరియాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టపరుచుకుంటున్నాడు. అనంతపురం టౌన్‌లో హోటళ్ళ దగ్గర వుండి గమనించటం, ఇంజనీరింగ్ కాలేజీలో కుక్కర్స్, వాచ్‌మెన్‌లను ఇన్‌ఫార్మర్స్‌గా ఉపయోగపడేవారిని మార్చుకోవటం చేస్తున్నారు. అనుమానం వున్న అన్ని ఫోన్లను ట్యాప్ చేస్తున్నాడు. పార్టీతో సంబంధం వున్న విద్యార్థులనే అనుమానంతో రోజుల తరబడి ఫాలో అవుతూ నాయకత్వం దొరుకుతుందేమన్న ఆశతో ఎదురుచూస్తున్నాడు.

### తీవ్రమైన కూంబింగ్

దళాల కొరకు ప్రతిరోజు వివిధ రకాలవి ఒక్కో వాహనాన్ని ఉపయోగిస్తూ పగలంతా తిరగడం, అనుమానం వుంటే ఆ ప్రాంతాలలో, దారులలో నడవడం చేస్తున్నారు. ప్రధానంగా ఈ మధ్య ఒకరిద్దరు యస్.టి.యఫ్. పోలీసులు పిస్టోల్స్ తీసుకొని బైక్‌లలో సివిల్‌లో పోయి మిలిటెంట్లపై ఆకస్మాత్తుగా దాడిచేసి అరెస్టు చేసి ప్రధాన టీంకు అప్పగిస్తారు. రాత్రులందు 15 మంది టీంగా పోయి మన మకాంలలో మాటుగాయడం, ఇరుకుదారులలో ఆంబుష్ ఏర్పాటు చేయడం, మూడు నాలుగు బ్యాచ్‌లు సమన్వయం చేసుకుంటూ ఏరియా అంతటా కూంబింగ్ చేస్తున్నారు.

1. ఈ మధ్య మన క్యాంపెయిన్ దళం ఏరియాలో తిరుగుతుంటే ఒకేసారి 200 మందితో పేరూరులో క్యాంప్ పెట్టి విస్తృతంగా తిరిగినాడు.

2. కొన్నిచోట్ల ప్రజలకు కనపడకుండా తిరుగుతూ ఇంకా కొన్నిచోట్ల అన్నలు తప్పిపోయారని మీ దగ్గరకు రమ్మన్నారని చెప్పి ప్రజలను మోసగించడం చేస్తున్నారు. బద్ధలాపురం, పిచ్చిరెడ్డి కొట్టాల గ్రామాల్లో స్థూపాల దగ్గర మీటింగ్ పెట్టి, పాటలు పాడటం చేస్తున్నారు.

3. మన దళాల్లోని కామ్రేడ్స్ పేర్లతో పిలుచుకుంటూ ప్రజలను నమ్మించేలా తిరుగుతున్నాడు.

4. ఈ మధ్య రామగిరిలో కర్ణాటక, ఆంధ్ర పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఏరియాలో నాలుగుచోట్ల క్యాంపులుపెట్టి కూంబింగ్ నిర్వహించారు.

5. చిత్తూరు జిల్లా యల్లమంద అవుట్‌పోస్ట్‌పై దాడి చేసిన తరువాత ఆ తుపాకులు ఏ.పి.టి.కి వచ్చినాయని పేరుతో తిమ్మమ్మ మర్రిమాను ఏరియాలో, చిత్రావతి ఏరియాలో కూంబింగ్ చేస్తూ, యస్.పి. కదిరిలో 5 రోజులు మకాం వేసి సమన్వయం చేయడం.

6. రాత్రి సమయాల్లో గ్రామాల్లో క్రీనీడల్లో వుంటూ సంఘ నాయకత్వాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

7. చాలా సందర్భాల్లో డి.యస్.పి., ఏ.యస్.పి. డైరెక్టుగా కూంబింగ్‌లలో పాల్గొంటు నాయకత్వం వహిస్తున్నారు.

**కౌన్సిలింగ్‌ల పేరుతో కుటుంబాలను సమావేశపర్చడం**

అనంతపురం జిల్లాలో యస్.పి. అంజనా స్విన్హ ఒకవైపు తీవ్ర నిర్భంధాన్ని అమలుచేస్తూ ఇంకొకవైపు మిలిటెంట్ల, పి.ఆర్.ల తల్లిదండ్రులను జిల్లా హెడ్‌క్వార్టర్‌కు రండి అక్కడ వాళ్ళకు లోన్లు ఇప్పిస్తామని, కేసులు పెట్టము, కొట్టము, మీరే మీ వారిని పిలుచుకురండి, మీ వెంటే పిలుచుకు పోదురు అని చెప్పుతూ తల్లిదండ్రులతో చాలా గౌరవ మర్యాదలతో మాట్లాడుతూ, వారికి అప్పటికి ఛార్జీలకు, తిండి ఖర్చులకు అన్నీ వారే ఇస్తూ పోలీసులు మంచి వారు అనే అవగాహన కల్పించడానికి నానాతంటాలు పడుతున్నారు.

ఇప్పటివరకు జిల్లాలో 16 మంది పూర్తి కార్యకర్తల కుటుంబాలను పి.ఏ.డి. ఏరియాలో ఐదు కుటుంబాలను రామగిరి ఏరియాలో 10 కుటుంబాలను సమావేశపరిచి ఒక్కొక్కరి నుండి పేపర్లో ఇంటర్వ్యూ ఇప్పించి లొంగిపొమ్మని తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నట్లుగా స్టేట్‌మెంట్‌లు ఇప్పిస్తున్నారు. ఇండ్ల సామానులు ధ్వంసం చేస్తూనే కౌన్సిలింగ్ పేరుతో అతి మర్యాదగ వ్యవహరించడంలోనే నక్కజిత్తుల వ్యవహారం నడుస్తోందని అర్థమవుతుంది.

కొన్ని సందర్భాలలో ఇతర గ్రూపుల కంటే గణపతి గ్రూపు సరైందని వారి రాజకీయాలు సమర్థనీయమని, కానీ దాంట్లో వున్నవారు సరైన వ్యక్తులు కారని వివిధ రకాల స్టేట్‌మెంట్లతో ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. ఈ విధంగా మన సానుభూతిపరుల, కామ్రేడ్స్ కుటుంబాలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

మైత్రీ సంఘాల పేరుతో ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవడం జిల్లాలో మన ఉద్యమ ప్రాంతంతోపాటు, ముఠా గొడవలు వున్న గ్రామాల్లో కూడ మైత్రీ సంఘాలు యస్.ఐ., సి.ఐ., డి.యస్.పి.ల నాయకత్వంలో ఏర్పరుస్తున్నారు. మన ఉద్యమ ప్రాంతంలోని మైత్రీ సంఘాల ద్వారా, గ్రామాలలో జరుగుతున్న పోరాటాలు దానికి నాయకత్వం వహిస్తున్న సంఘ సభ్యుల గురించి కనుక్కోవడం. ఎక్కడ పడుకొంటారు, దళం ఎప్పుడెప్పుడు ఎక్కడికి వస్తుంది. అనే విషయాలు ప్రధానంగా కనుక్కోవడం చేస్తున్నారు. ఫించా ఏరియాలో కూడా కౌన్సిలింగ్ చేశారు. వీటితో పాటు గ్రామాలను దత్తత తీసుకుంటామని, వివిధ పథకాల ద్వారా గ్రామాభివృద్ధి చేస్తామని ప్రకటనలు ఇస్తున్నారు. వాళ్ళకు అనుకూలంగా వున్నవారికి ఇండ్లు, ఉచితంగా బోర్లు శాంక్షన్ చేయించడం చేస్తున్నారు. అందులో దూకుడుగా వున్నవారిని రాత్రి గ్రామాల్లో తిరగమని ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం రామగిరి ఏరియాలో కుంటిమద్ది, న్యామద్దెల గ్రామాల్లో, పెన్నహోబిళం ఏరియాలో కలగళ్ళ, మరుట్ల గ్రామాల్లో బలంగా పనిచేస్తున్నాయి. మిగతా గ్రామాల్లో వాటి గురించి చేసిన ప్రచారం వల్ల అవి నాశనం అయినాయి.

**పునరావాసం కల్పించడం :** ఉద్యమంలో పనిచేయలేక పోలీసులకు లొంగిపోయిన వారికి ట్రాక్టర్లు, భూములు, టౌన్‌లలో ఇండ్ల స్థలాలు ఇప్పించి పార్టీ సమాచారం సేకరించమని ప్రోత్సహిస్తున్నారు.

**పార్టీపై, సంఘ నాయకులపై తప్పుడు ప్రచారం :** పార్టీలో వుంటున్న సంఘ నాయకులు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నారని సి.ఐ. పోలేపల్లిలో బహిరంగ మీటింగ్‌లో చెప్పాడు. కరపత్రాలు వేస్తామని చెప్పారు. పార్టీ లెవీలు అడగడం వల్ల రామగిరి గాలిమరలు ఎత్తిపోతున్నాయని తప్పుడు ప్రకటనలు ఇవ్వడం, సంఘ నాయకులు అక్రమ వసూళ్ళు చేస్తున్నారని ప్రకటనలు ఇప్పించడం చేస్తున్నారు. క్వారీలలో పనులు లేకున్నా, ఉద్యోగాలు ఇప్పించి ఫ్రీ జీతాలు ఇప్పించి సోమరులను తయారు చేస్తోందని ప్రకటనలు ఇవ్వడం, ఇలా అనేక రకాల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.

**సంఘనాయకుల ఇండ్లపై దాడులు, అరెస్టులు, ధ్వంసాలు**

గ్రామాలలో సంఘాలను, వాటి నాయకత్వాన్ని దెబ్బతీయడం కోసం చేస్తున్న దాడులు; పెడుతున్న చిత్రహింసలు నాజీలను మించిపోతున్నాయి. భూమిలేని నిరుపేదలు, పేద రైతాంగమే సంఘంలో సంఘటితపడి, నాయకత్వంగా ఎదిగి ప్రజలకి, పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారు. సాయుధ భూస్వామ్య ముఠా నాయకులను ప్రతిఘటిస్తున్నారు. జిల్లాలో ఒక ప్రక్క దళాలను దెబ్బతీయటానికి ఎన్‌కౌంటర్‌లు చేస్తూనే (హంసాయపల్లి, కనుంపల్లి ఎన్‌కౌంటర్‌లు) సంఘ నాయకత్వాన్ని నిర్వీర్యం చేయడానికి, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయటానికి దుర్మార్గంగా దాడులు చేస్తున్నారు. భూస్వాముల ప్రభుత్వం ప్రజలమీద, సంఘాలమీద జరిపే దాడులను, అణచివేతలను ప్రతిఘటించడానికి ప్రజలు భూస్వాముల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, దేహశుద్ధులు చేస్తే ''మతిలేని హింస'' వారిది అంటూ ప్రభుత్వంతో పాటు, విషం కక్కుతూ ప్రజాస్వామ్యాన్ని బోధించే పత్రికలు, టీవీలు, రాజకీయ పక్షాలు మొ॥నవాళ్ళు ప్రజలమీద, సంఘాల మీద అమలయ్యే అణచివేత గురించి మాత్రం నోరెత్తరు. పయ్యావుల కేశవదో, పరిటాల రవిదో, మరో భూస్వామి ఆస్తి ధ్వంసమో, దేహశుద్ధో, ఎక్స్ఛేంజి పేల్చివేతో ప్రముఖ వార్తలుగా రాసి ''దారితప్పిన'' హింస అని మాట్లాడేవాళ్ళు, రాసేవాళ్ళు ప్రజలమీద జరుగుతున్న హింస గురించి మాట్లాడనే మాట్లాడరు. అవి వాళ్ళ కళ్ళకు కనబడవు, చెవులకు వినబడవు. అందుకు నిదర్శనం అనంతపురంలో జరుగుతున్న దాడులే.

గ్రామాల్లో వి.ఆర్.సి.యస్. పేర్లను ప్రకటించి వాళ్ళు ఫలానా రోజులోపు లొంగిపోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వివిధ వ్యక్తుల ద్వారా లొంగిపొమ్మని ఒత్తిడి చేస్తున్నారు. ముఖ్యంగా సంఘ నాయకుల కోసం గాలింపు చేస్తూ, వాళ్ళ ఇండ్లను ధ్వంసం చేస్తున్నారు. వాళ్ళు దొరకలేదని ఒక్కో ఇంటిని రెండుసార్లు ధ్వంసం చేస్తున్నారు. దాడి చేసిన ప్రతిసారీ ఇంటిలోని వంటసామాను, ధాన్యాన్ని కలిపి వాటిలో కిరోసిన్, నీళ్ళు, శనగనూనె, కలుపుతూ, కళ్ళం లాగా చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. ఇండ్లలో వున్న బట్టలన్నింటిని తగలబెడుతున్నారు. ఉన్న కొద్దిపాటి డబ్బు,

బంగారం, టేప్‌రికార్డర్‌లు బందిపోటు దొంగల్లాగ ఎత్తుకుపోతున్నారు. భూమి పట్టా, పాస్‌బుక్కులు, బ్యాంకు బుక్కులు తీసుకుపోయి, వాటికొరకు స్టేషన్ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇంటికున్న తలుపులు పగలగొడుతున్నారు. ఫోన్‌లు ధ్వంసం చేస్తున్నారు. సంఘ నాయకుల, సభ్యుల కుటుంబాల్లోని మహిళలను అసభ్య పదజాలంతో తిడుతూ నీచంగా అవమానిస్తున్నారు. సంఘ నాయకులు దొరకలేదని, వాళ్ళ కుటుంబ సభ్యులను పట్టుకొనిపోయి, సంఘ నాయకులు లొంగిపోతే వారిని వదిలేస్తామని హెచ్చరిస్తున్నారు. అరెస్టు చేసిన సంఘ సభ్యులను నాయకులను గ్రామంలోనే పోలీసులు వలయంగా ఏర్పడి మధ్యలో సంఘ నాయకులను పడవేసి లాఠీలతో, కాళ్ళతో దారుణంగ కొట్టి, సంఘం వాళ్ళకుగాని దళాలకుగాని తిండిపెడితే ఇదే గతి అని ''హెచ్చరిస్తూ'' ప్రజలలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నారు. పోలీస్ యాక్షన్ టీం సభ్యులు ఇద్దరు సివిల్ డ్రస్సులో పిస్టల్స్‌తో గ్రామాల్లోకి మోటార్ సైకిల్‌పై వచ్చి సంఘ నాయకులను సభ్యులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొని పోయి థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో చిత్రహింసలు పెడుతున్నారు. చేతివేళ్ళు విరుస్తున్నారు, గోళ్ళలో సూదులు గుచ్చుతున్నారు. మర్మావయాల దగ్గర వెంట్రుకలు పీకుతూ, హీనమైన పద్ధతుల్లో చిత్రహింసలు పెట్టారు. కొందరు సంఘ నాయకులని గ్రామాల్లో, మండల సెంటర్లలో డ్రాయర్లమీద కొట్టుకుంటూ ఊరేగించి, సంఘంలో చేరితే మీకు కూడా ఇదే గతి అని హెచ్చరిస్తున్నారు. ఈ దాడుల్లో అరెస్టయి, బెయిల్‌పైన బయటకు వచ్చిన వాళ్ళను తిరిగి అరెస్టు చేస్తామని బెదిరిస్తూ, వేల రూపాయల లంచాలు గుంజుతున్నారు. వీరితోపాటు ఒక విప్లవ మహిళా సంఘం కార్యకర్తను అరెస్టు చేసి ఆమె తొడలమీద గడారు (గడ్డపార) వేసి అటూ, ఇటూ ఇద్దరు పోలీసులు గడారుమీద నిలబడి చిత్రహింసలు పెట్టారు. ఈ విధంగా దాడులు, అరెస్టులు, చిత్రహింసలు పెడుతూ లొంగిపోకపోతే చంపుతామని బెదిరిస్తూ, వివిధ పోరాటాల్లో పాల్గొని అక్రమ కేసులు బనాయించబడి వున్న సంఘ సభ్యులు, సానుభూతిపరులు, సాధారణ ప్రజానీకం, మొత్తం 500 మందిని పోలీసులు సరెండర్ చేసుకొని 500 మంది లొంగిపోయారని, సంఘాలకు సంఘాలే, ఊర్లకు ఊర్లే లొంగిపోయారని ఆర్భాటపు ప్రచారం చేశారు. మరో 100 మందిని అరెస్టు చేసి కొందరిచేత లొంగిపోయినట్లుగా ప్రకటనలు ఇప్పించారు. కొందరిచేత పార్టీ వ్యతిరేక ప్రకటనలు ఇప్పించి పెద్ద ఎత్తున పత్రికలు, టీ.వీ.ల ద్వారా ప్రచారం చేశారు.

అయితే బ్రతుకు పోరాటంలో వున్న ప్రజలకు నిర్బంధం కొత్తకాదు, కొన్ని నిర్బంధ పద్ధతులు మారినప్పుడల్లా, దాన్ని అర్థం చేసుకొని తేరుకోవటానికి కొంత సమయం పట్టడము సహజమే, ఇక్కడి ప్రజలు ఆ స్థితిలోనే వున్నారు అయితే ప్రజలు నివురుగప్పిన నిప్పులా వున్నారన్నది సత్యం.

**ఫించా దళం ఏరియాలో :**

ఫించా దళం తిరుగుతున్న చిత్తూరు జిల్లా ప్రాంతం వరకు, కడప జిల్లా ప్రాంతంలోను పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో బలంగా వున్న భూస్వాములు, కడప జిల్లాలోని భూస్వామ్య, ముఠా నాయకులు మన ఉద్యమం వేళ్ళూనుకుంటే తమ మనుగడకు, ఆధిపత్యానికి చరమగీతం పాడుతుందని ముందునుండే నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. గ్రామంలోకి దళం వచ్చి వెళ్ళిన వెంటనే భూస్వాములు, ముఠా నాయకులు, పెత్తందారులు పోలీసులకు సమాచారం పంపి, గ్రామాలపై దాడులు చేయించి, సంఘ సభ్యులను, సానుభూతిపరులను, ప్రజలను అక్రమంగా అరెస్టు చేయడం, కేసులు పెట్టడం చేస్తున్నారు. యల్లమంద గ్రామంలో భూస్వామి మహేశ్వరరెడ్డి ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా మహేశ్వరరెడ్డి ఇంటిని పేల్చివేయడం జరిగింది. అప్పటినుండి వాడి ఆస్థులను కాపాడటానికి యల్లమంద గ్రామంలో 16 మంది యస్.టి.యఫ్. పోలీసులతో ఔట్‌పోస్ట్ పెట్టారు. యర్రావారిపాలెంలో 10 మంది, కె.వి.పల్లిలో 11 మందిని యస్.టి.యఫ్. పోలీసులను పోలీస్ స్టేషన్లో వుంచి, యస్.ఐ. సురేష్‌కుమార్ నాయకత్వంలో దళం కోసం తీవ్రంగా కూంబింగ్ చేశారు. తలకోన అడవి లోపల కూడ తీవ్రంగా గాలించారు. ఇక యల్లమంద గ్రామంలో ఔట్‌పోస్ట్ అయితే ఆ గ్రామ ప్రజలకు నరకమే చూపించింది. రాత్రి 7 దాటిన తరువాత గ్రామంలో ఎవరూ బయటికి రాకుండా అప్రకటిత కర్ఫ్యూ అమలు చేశారు. రాత్రిపూట పనిమీద బయటకు ఔట్‌పోస్ట్ ముందుగా వెళ్ళిన ప్రజలపై కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురిచేశారు. సివిల్ డ్రస్సుల్లో పోలీసులను గ్రామాల్లోకి పంపి ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. యస్.టి.యఫ్. యస్.ఐ. సురేష్ కూడా గ్రామాల్లో తిరుగుతూ కొందరు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకొని, వాళ్ల ద్వారా సమాచారం సేకరించే ప్రయత్నం చేసేవాడు. గిరిజన గ్రామాల్లో ''త్రీటెంటు'' ప్రోగ్రాం అమలుచేసి, గిరిజనులను అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఏరియాలోని అంగన్‌వాడీ టీచర్లను వారానికొకసారి సమావేశాలు జరిపి, వాళ్ళలో కొందరిని ఇన్‌ఫార్మర్స్‌గా మార్చుకొనే ప్రయత్నం చేశారు. గుండాలబైలు గ్రామానికి చెందిన ప్రతిపల్లెకు వెళ్ళి 10, 20 మంది పేర్లను ప్రకటించి ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి వేస్తామని బెదిరించారు. పల్లెలకు సబ్సిడీ బియ్యం, కరెంట్ సౌకర్యాలను రద్దు చేస్తామని బెదిరించారు. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా, ప్రజా ప్రతిఘటనలో పి.జి.ఏ. యల్లమంద ఔట్‌పోస్ట్‌పై దాడిచేసి తుపాకులు తెచ్చిన తరువాత దళం ప్రాంతంలోని అటు పీలేరు ఏరియాలోనూ ఇటు రాయచోటి ఏరియాలోనూ తీవ్ర నిర్బంధం అమలు చేశారు. సంఘ సభ్యులను, సానుభూతిపరులను తీవ్రంగా కొట్టారు. సుండుపల్లి ప్రాంతం నుండి రెయిడ్‌కు జీపులు తెచ్చారు అన్న అనుమానంతో కొందరు జీపు డ్రైవర్లను, జీపు యజమానులను అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి, కేసులు బనాయించినారు. 3 జీపులను స్వాధీనం చేసుకొన్నారు. దీనితోపాటు సుండుపల్లి ప్రాంతంలో సంఘ సభ్యులపై, సానుభూతిపరులపై విరుచుకుపడ్డారు. గ్రామాలపై దాడులు చేసి, అనేకమందిని కొట్టి అరెస్టు చేశారు. ఎంత డబ్బైనా ఇస్తాం, ఇన్‌ఫార్మర్‌లుగా, కోవర్టుగా పనిచేయండి అని ప్రలోభ పెట్టారు. స్థానిక ముఠా నాయకుడు తెలుగుదేశం పార్టీకి చెందిన రవీందర్ రెడ్డి ఈ దాడులు చేయమని ప్రోద్భలం ఇచ్చి, తిరిగి పెద్ద మనిషిలాగా మహిళా సంఘ సభ్యులను, సానుభూతిపరులను, ప్రజల్ని 30 మందిని పోలీసులకు సరెండర్ చేయించి, ఆదుకున్నట్లు నటించాడు. ఇంకా జిల్లా యస్.పి.

జిల్లాలో ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని తయారు చేసుకోవాలని పోలీసులకు ఒక సర్క్యులర్‌ను జారీ చేశాడు. మాజీలను, లంపెన్‌లను ఇతరులను డబ్బు వెదజల్లి ఇన్‌ఫార్మర్లగా తయారు చేసుకోవాలని, ఏరియా చుట్టుప్రక్కల టౌన్ సెంటర్లలో మాజీలను హోటళ్ళు, బస్టాండ్స్ మొ॥న సెంటర్లలో నిఘా వుంచి పార్టీ వాళ్ళను పట్టుకోవాలని సూచించాడు. ఈ విధంగా అనేక పద్ధతుల ద్వారా ఏరియాలో ఉద్యమం అభివృద్ధి కాకుండా చేయాలని, దళాన్ని దెబ్బకొట్టాలనీ తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. పాలకులు ఎంతటి నిర్బంధాన్ని అమలు చేసినా కరువు కాటకాల్లో, భూస్వామ్య సాయుధ ముఠాలలో పీడింపబడుతున్న ప్రజానీకం ప్రజా పోరాటాలను తీవ్రతరం చేస్తూ, అవసరమైన ప్రతిఘటనా చర్యలు చేపడుతూ ఉద్యమం ముందుకెళ్తోంది.

**పాపాగ్ని దళ ఏరియాలో :**

చిత్తూరు జిల్లా పెద్దమండెం మండలం కనుమలపల్లి, సాకలపల్లి, గొల్లపల్లి, పల్లెలకు భూస్వామి అయిన చంద్రప్పనాయుడు పోలీసులకు ఇన్‌ఫర్మేషన్ ఇవ్వడం వల్ల దాదాపు ప్రతిసారీ 30, 40 మంది పోలీసులు వచ్చి ఇండ్లు చెక్ చేస్తున్నారు. రామాంజనేయులు, గిత్తమల్లయ్య అనే ఇద్దరిని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి విడిచిపెట్టారు. కడప జిల్లాలో గాలివీడు మండల సెంటర్‌లో ఫిబ్రవరి 5న మిలిటెంట్ భాషాను అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారు. రాయచోటి మండలం కంచరపల్లిలో ఫిబ్రవరి 8న సాకలి వెంకటరమణ ఇంటిపై దాడిచేసి వస్తువులు ధ్వంసం చేశారు. 150 తూటాలు, కొంత సాహిత్యం, బైనాక్యులర్స్ ఎత్తుకు పోయారు. అలాగే ఫిబ్రవరి 2న అరెస్టు పేరుతో పోలీసులకు లొంగిపోయిన దళసభ్యురాలు సావిత్రిని బెదిరించి, లొంగదీసుకుని బాహుదా, పాపాగ్ని దళం ఏరియాల స్థలాలను చూపించుకొని కూంబింగ్ చేస్తున్నారు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లి మండలాల్లోని రోడ్లపై నిరంతరం పెట్రోలింగ్ చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో మార్చి 5న యల్లమందలో రెయిడ్ చేసిన తరువాత రాయచోటి, గాలివీడు, చినమండెం, పెదమండెం, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లి మండలాల్లోని గ్రామాలలో, పరిసర ప్రాంతాలలో కొండలు, గుట్టలు, ప్రజాసంఘ నాయకులను కూడ అరెస్టు చేసి చిత్రహింసలు పెడుతున్నారు, అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

## తూర్పు కనుమల్లో విజయవంతమైన పి.జి.ఏ. క్యాంపెయిన్

కాంగ్రెసు యిచ్చిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో తూర్పు కనుమలలో ప్రజలు, ప్రజామిలీషియా, గెరిల్లా బలగాల సమన్వయంతో పి.జి.ఏ. క్యాంపెయిన్ విజయవంతమైంది.

ఈ క్యాంపెయిన్‌లో కలిమెల, మోటు, మారేడుమిల్లి లాంటి పెద్దపెద్ద ఘటనలతో పాటు అనేక చిన్నచిన్న ఘటనలు కూడా జరిగాయి. వాటి వివరాల్లోకి వెళితే వరుస క్రమంలో యివీ.

విశాఖ జిల్లా గూడెం మండలంలో సిరిబాల-కోరాపల్లి గ్రామాల మధ్య 28 ఫిబ్రవరి 2001 నాడు గూడెం నుండి బయలుదేరి పోలీసు బలగాలు దళాన్ని వెతుక్కుంటూ వచ్చాయి. సిరిబాల వచ్చి తిరుగు ప్రయాణంలో సిరిబాలను దాటి కోరాపల్లికి మధ్యన నడుస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఏ.ఎన్.ఎస్., ఏ.పి.ఎస్.పి. బలగాలు సుమారు ఇరవై మంది ఎస్.ఎల్.ఆర్.లు, స్టెన్‌లు, .303లు ధరించిపోతున్న టీమ్‌పై కోరుకొండ ఎల్.జి.ఎస్. జరిపిన అపార్చునిటీ ఆంబుష్‌లో ఇరువైపులా ఎలాంటి నష్టాలు లేవు కానీ, మనం చేసిన చొరవకు శత్రువు బెంబేలుచెంది కకావికలై పోయాడు. వాడు భయంతో చెల్లాచెదురై దూరంగా పారిపోయి వందలాది తూటాలను, మనం ఫైరింగ్‌చేసినవైపు కాల్చి వెళ్ళిపోయారు. అలా గూడెంకు దగ్గర్లో వున్న ఆర్.వి.నగర్‌కు కొత్తవెదురుపల్లె మధ్యకు చేరగానే కాఫీతోటల్లో మాటువేసిన మన ఆర్మ్‌డ్ మిలీషియా క్లైమోర్‌మైన్స్ పోలీస్ నష్టాలేమీ లేవుగానీ ఒకేరోజులో టీమ్‌కు ఉదయం, సాయంకాలం ఒకే దారిలో రెండుచోట్ల దాడులు జర్గ్గా మిగలిన కొన్ని తూటాలను కూడా అక్కడే కంగారుపడి కాల్చేసి వట్టి తుపాకులతో గూడెంకు చేరుతుండగా చింతపల్లి నుండి అప్పుడే వచ్చిన అదనపు బలగాలు వారిని రక్షించి గూడెం చేర్చాయి.

బుటారి రంగయ్య 1994లో కోరుకొండ దళం రావడాన్ని చూసి, పోలీసులకు చేరవేసి, గొండపల్లిలో స్వయంగా తన యింట్లోనే పోలీసులను దాచిపెట్టాడు. ఊరిలోకి వచ్చిన దళంపై కాల్పులు జరిపించాడు. ఆ కాల్పుల్లో కామ్రేడ్ ప్రభాకర్, కా॥ దుర్గన్నలు అమరులయ్యారు. బుటార రంగడిపై మార్చి 19న జి.మాడుగుల మండలం పులుసుమామిడి గ్రామం వద్ద ఆర్మ్‌డ్ మిలీషియా దాడిచేసి గొడ్డళ్ళతో నరికిచంపారు. అనంతరం పెద్దయెత్తున నినాదాలిచ్చి వచ్చారు.

శ్యామగడ్డ ఎన్‌కౌంటర్ : మార్చి 28, 2001న విశాఖ జిల్లా గూడెం మండలం శ్యామగడ్డ గ్రామంలోకోరుకొండ ఎల్.జి.ఎస్. సమాచారం తెలుసుకున్న ఏ.పి.ఎస్.పి. బలగాలు దళం దగ్గరకు వచ్చాయి. సెంట్రీకి అతి సమీపానికి రాగా చొరవతో మొదటి ఫైరింగ్ కా॥విజయ్ చేశాడు. శత్రువు గుండెకు తూటా తగిలి కానిస్టేబుల్ ఆనంద్‌గౌడ్ పడిపోయాడు. రెండోవాడికి తూటా చేతికి దూసుకుపోయింది. ఆ దెబ్బతో మొత్తం గాబరాలోపడి తేరుకోలేక ఎక్కడివాడు అక్కడే పడిపోయి ఎటుబడితే అటు ఫైరింగ్ చేశారు. దగ్గర్లో వున్న గొడ్డుకు తూటా తగిలి గాయపడింది. ఈలోపు కమాండర్ కా॥ విజయ్ దళాన్ని లేపి క్షేమంగా రిట్రీట్ చేశాడు.

బిల్డింగ్ పేల్చివేత : మార్చి 16, 2001న గూడెం మండలం పెదవలస గ్రామంలో ఆర్మ్‌డ్ మిలీషియా, బేసిక్ మిలీషియాలు ప్రతిఘటనలో భాగంగా ఏ.పి.ఎఫ్.డి.సి. బిల్డింగ్‌ను పేల్చి వచ్చారు. పెరుగుతున్న నిర్బంధానికి నిరసనగా యీ చర్య చేశారు.

సింగవరం అపార్చునిటీ ఆంబుష్ : తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం మండలం సింగవరం గ్రామ సమీపాన వై.రామవరం నుండి లోపలి గ్రామాలకు వస్తున్న ఏ.ఎన్.ఎస్., ఏ.పి.ఎస్.పి. బలగాలపై ఆర్మ్‌డ్ మిలీషియా మాటుగాసి సోప్‌బాంబులు విసరగా

ఇరువైపులా ఎలాంటి నష్టాలూ లేకపోయినప్పటికీ వెంటనే శత్రువు కకావికలమైపోయి, తూటాలు చాలాసేపు కాల్చి, వెనక్కి వెళ్ళిపోయారు.

**తోటంచెల్క ఆపార్చునిటీ ఆంబుష్ :** తూర్పుగోదావరి జిల్లా పలకజీడి, కోనలోవ, నాగులకొండ ఎల్.జి.ఎస్.లు మరియు మిలీషియా కలిసి చేసిన దాడి యిది. లోపల గ్రామాల నుండి వై.రామవరం బలగాలపై ఏ.ఎన్.ఎస్., ఏ.పి.ఎస్.పి. గ్రేహౌండ్స్ నడిచివస్తున్న జరిపిన సోప్‌బాంబుల దాడి, ఫైరింగ్‌తో వాడి చొరవ దెబ్బతిని గరువుల నుండి చెదిరిపోయాడు. ఒక పోలీసు బట్టలు విప్పి పడేసి తుపాకి పారేసి చెట్ల పొదల్లో దాక్కుని వుండిపోయాడు. తిరిగి రాత్రి సమయంలో వాడి బలగాలు వచ్చి గ్రామస్థుల సహాయంతో దివిటీలు వెలిగించి, రాత్రి 2 గం॥ల సమయంలో వెతగ్గా తుప్పల్లో కూర్చుని దొరికాడు. వాడిని తిరిగి వై.రామవరం తీసుకెళ్ళారు. గుండెచెదిరిన పోలీసులకు అధికారులు నానా తంటాలుపడి ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. కాగా మన క్యాడర్‌లో, మిలీషియాలో, ప్రజల్లో ఉత్సాహం వెల్లివిరుస్తుంది.

**గూడెం స్టేషన్‌పై కాల్పులు :** 14, ఏప్రిల్ 2001 నాడు ఉదయం 4.45 గం॥లకు విశాఖ జిల్లా, గూడెం మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్, ఏ.పి.ఎస్.పి. క్యాంపులపై కోరుకొండ ఎల్.జి.ఎస్., గాలికొండ ఆర్మ్‌డ్ మిలీషియాలు కాల్పులు జరిపాయి. దాడి జరుగుతున్నట్లుగా భయపడిన పోలీసులు సుమారు రెండు గంటల పాటు బైటకు కాల్పులు చేస్తూ కేకలువేసి బెంబేలు పడిపోయారు. పది తూటాలు మాత్రమే ఫైరింగ్ చేసి రెప్పపాటులో రిట్రీట్‌లై క్షేమంగా వెళ్ళిపోయింది దళం.

**రేవులకోట అపార్చునిటీ ఆంబుష్ :** విశాఖజిల్లా కొయ్యూరు మండలం పలకజీడి సమీపాన రేవులకోట వద్ద కాలినడకన వస్తున్న 70 మంది ఏ.ఎన్.ఎస్., ఏ.పి.ఎస్.పి., గ్రేహౌండ్స్ బలగాలపై సుమారు దారిలో మాటువేసి, పలకజీడి, కోనలోవ దళాలు మిలీషియా కలిసి సోప్‌బాంబులు విసిరి ఫైరింగ్ చేయగా, బెదిరిపోయి చెల్లాచెదురై చాలాసేపు ఫైరింగ్ చేసి వెనక్కి వెళ్ళిపోయారు.

**చింతగరువుపాలెం డెలిబరేట్ ఆంబుష్ :** వాళ్లే ఏప్రిల్ 19, 2001న వై.రామవరం మండలం చింతగరువుపాలెం సమీపాన రోడ్డుపై నడిచివస్తున్న ఏ.ఎన్.ఎస్., గ్రేహౌండ్స్ బలగాలపై కోనలోవ, నాగులకొండ, పలకజీడి ఎల్.జి.ఎస్.లతోపాటు మిలీషియా కలిసి డెలిబరేట్ ఆంబుష్ చేసింది. ఒక ఎస్.ఐ.తో సహా నలుగురు చావగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు, మనవైపు ఎలాంటి నష్టాలు లేకుండా దళం రిట్రీట్‌లైంది. దూకుడుగావస్తున్న బలగాలను దెబ్బకొట్టి వాడి మనోనిబ్బరాన్ని ఓడించారు.

**తూర్పుమామిడి డెలిబరేట్ ఆంబుష్ :** గూడెం మండలం తూర్పుమామిడి గ్రామానికి, నేరెళ్ళబందకు మధ్యన అమర్చిన మందుపాతర్లను మే 15న, గూడెం నుండి లోపలికొచ్చి చింతపల్లి వైపు వెళ్తున్న ఏ.ఎన్.ఎస్., ఏ.పి.ఎస్.పి. బలగాలపై జరిపిన సింగిల్‌మాన్ ఆంబుష్‌లో ఒక స్పెషల్ పోలీసు చావగా యిద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరు ఇన్‌ఫార్మరు. మనవైపు ఎలాంటి నష్టాలు లేవు. వెంటవెంటనే జరిగిన ఈ దాడులు శత్రువును భయ భ్రాంతులకు గురిచేశాయి.

**దుశ్చర్తి పాత పోలీసుస్టేషన్ పేల్చివేత :** మేనెల 2001లో తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల మండలం, దుశ్చర్తి గ్రామంలో ఏ.పి.ఎస్.పి. బలగాలు ఖాళీచేసిన బిల్డింగును స్థానిక కోనలోవ, పలకజీడి ఎల్.జి.ఎస్.లు మిలీషియాతో కలిసి పేల్చివేసి నేలమట్టంచేశాయి.

**కలిమెల, మోటు :** మల్కన్‌గిరి జిల్లాలో కలిమెల, మోటులు రెండు బ్లాక్ సెంటర్లు. రెండుచోట్ల పోలీసు స్టేషన్లు వున్నాయి. ఒరిస్సా స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీసు క్యాంపులువున్నాయి. ఏ.ఓ.బి., డి.కె.ల పి.జి.ఏ. ప్రధాన, ద్వితీయ, బేసిక్ మిలీషియా బలగాల సమన్వయంతో ఆగష్టు 9 సాయంత్రం 8.30 గం॥లకు ఒకేసారి జరిపిన జంట రెయిడ్లలో కలిమెల విజయవంతంగా 43 తుపాకులు స్వాధీనం చేసుకుంది. ముగ్గురు పోలీసులు చనిపోయి దాదాపు అందరికీ గాయాలయ్యాయి. మనవైపు యిద్దరికి పాక్షికంగా గాయాలయ్యాయి. అదే టైమ్‌లో అక్కడకు 60 కి.మీ. దూరాన గల మోటు దాడిలో యిద్దరు పోలీసులు చనిపోయి, చాలామందికి గాయాలు కాగా, మనవైపు కా॥ క్రాంతి రణదేవ్, కా॥ విజయ్, కా॥ మల్లేష్‌లు అమరులయ్యారు. మనవైపు ప్రాణనష్టం జరిగినా గానీ ఒరిస్సాలోని పోలీసు బలగాల్లో ఈ దాడులు వణుకుపుట్టించాయి.

### జులై 28 అమరుల సంస్మరణ సభలను భగ్నం చేయడానికి వచ్చిన పోలీసు బలగాల్ని బెంబేలెత్తించిన ప్రజామిలీషియా

జులై 28, 2001న విశాఖ జిల్లా, గూడెం మండలం, కొత్త వెదురుపల్లి సమీపంలో అమరవీరుల సంస్మరణ సభను భగ్నంచేయడానికి వచ్చిన సుమారు 30 మంది సి.ఆర్.పి.ఎఫ్. బలగాలపై స్థానిక ఆర్మ్‌డ్ మిలీషియా దాడిచేసింది. వాడు మకాంచేసిన దగ్గర రెండు సోప్‌బాంబులు వేయగా వారి తిండిసామాన్లు మొత్తం అక్కడే వదిలి పారిపోయారు. 29న సంస్మరణ సభ విజయవంతంగా జరుపుకున్నారు.

సంస్మరణ సభ జరిపిన తర్వాత మండలకేంద్రమైన గూడెం దగ్గర్లోని ఆర్.వి.నగర్‌లోని ఫారెస్టు బిల్డింగ్‌ను నిర్బంధానికి నిరసనగా ఆర్మ్‌డ్ మిలీషియా పేల్చివచ్చారు.

**గూడెం మండలాఫీసు పేల్చివేత :** ఆగష్టు 19 రాత్రి 2 గంటలకు స్థానిక ఆర్మ్‌డ్ మిలీషియా గూడెం మండలాఫీసును పేల్చివేశారు. అందులోని కంప్యూటర్ మిషన్లు, ఫైళ్ళు ధ్వంసం అయ్యాయి. ప్రజలపైదాడులను నిరసిస్తూ, అరెస్టులను ఖండిస్తూ ఈ చర్య చేశారు.

**ధారకొండ పోలీసు స్టేషన్ బిల్డింగు పేల్చివేత :** సెప్టెంబరు 6న స్థానిక ఆర్మ్‌డ్ మిలీషియా, బేసిక్ మిలీషియా మరియు కోరుకొండ ఎల్.జి.ఎస్.లు మొత్తం 40 మంది గునపాలతో వెళ్ళి పోలీసు స్టేషన్ బిల్డింగును కూల్చివేశారు. విశాఖజిల్లా గూడెం మండలం జాతీయ రహదారిపై 2000 ఫిబ్రవరిలో మనం

దాడిచేసిన ధారకొండ ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టు పాత బిల్డింగ్‌ను, కొత్తగా నిర్మించిన మరొక బిల్డింగ్‌ను కూల్చివేశారు. నేలమట్టం అయిన తర్వాత చెక్కలు, సిమెంటు రేకులు కాల్చి బూడిద చేశారు.

మారేడుమిల్లి మందుపాతర : సెప్టెంబరు 9న పగలు 11 గంటలకు రంపచోడవరం నుండి మారేడుమిల్లికి వెళ్ళే జాతీయ రహదారిపై అమర్చిన మందుపాతరను మన పి.జి.ఏ. ప్రధాన, ద్వితీయ బలగాలు, 21 మంది సి.ఆర్.పి.ఎఫ్. బలగాలతో వస్తున్న వ్యాన్‌ను పేల్చివేయగా అక్కడికక్కడే ఐదుగురు చావగా, తీవ్రమైన గాయాలతో 14 మంది ఆసుపత్రిపాలయ్యారు. దీంతో పోలీసు బలగాల్లో మరింత కలవరం మొదలైంది.

తూర్పు కనుమల్లో పి.జి.ఏ. క్యాంపెయిన్‌ను విజయవంతంచేసిన ప్రజామిలీషియాకు, ప్రజలకు ఆయా సందర్భాల్లో జరిగిన సభల్లో విప్లవ జేజేలు చెప్పారు.

### మార్చి 8 అంతర్జాతీయ మహిళాదినం

కలిమెల ఏరియాలో మహిళాసంఘాలు పోరాటంలో చురుగ్గా పాల్గొంటున్నాయి. రోజురోజుకు వారి చైతన్యం పెరుగుతున్నది. ఏరియాలో మార్చి 8ని మహిళలే స్వయంగా నిర్వహించుకునేటట్లు ఆలోచించి, మహిళాసంఘాల ఏరియా కమిటీలను సమావేశపర్చి కార్యక్రమాలను అప్పజెప్పాము. మహిళా సమస్యలపై 12 మందికి ఒకరోజు పాటు, అవగాహన క్లాసు నిర్వహించడం జరిగింది. ఆదివాసీ ప్రాంతాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పోరాటంలో మహిళల అమరత్వం గురించి రెండు బ్యాచ్‌లుగా ఐదు రోజులు క్యాంపెయిన్ నిర్వహించారు. గొందుగూడ గ్రామంలో సుమారు పది గ్రామాలకు చెందిన 150 మంది మహిళలు ఎర్రజెండాలు, బేనర్లు పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన సభలో ఏరియా కమిటీ సభ్యులు ఉపన్యసించారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాల గురించి మహిళలు ఐక్యంకావాలని, బలవంతపు పెళ్ళిళ్ళు, చిన్నవయస్సులో పెళ్ళిళ్ళకు వ్యతిరేకంగా పోరాడాలని సమస్యలు పరిష్కారం కావాలంటే సాయుధ పోరాటం చేయాలని సభ పిలుపునిచ్చింది.

### ఏప్రిల్ 22 పార్టీ పుట్టినరోజు

ఏప్రిల్ 22 పార్టీ పుట్టినరోజు గురించి పోస్టర్లు, బేనర్ల ద్వారా ప్రచారం నిర్వహించి ఏప్రిల్ 22న సుమారు ఐదు గ్రామాల స్త్రీ పురుషులు, పిల్లలు సమావేశం అయ్యారు. 12 గం॥ ప్రాంతంలో 250 మంది ప్రజానీకం ఎర్రజెండాలు, బేనర్లు పట్టుకుని ఊరేగింపు నిర్వహించి సభాస్థలికి చేరుకున్నారు. పార్టీ జెండాను కా॥ రామన్న ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా ఎర్రజెండా కోసం అమరులైన వీరులను గుర్తుచేశాడు. ఆ తర్వాత ఏరియా కమిటీ అధ్యక్షుడు కా॥నాగన్న సభను ప్రారంభించాడు. కలిమెల ఎల్.జి.ఎస్. కమాండర్ కా॥లోక్‌నాథ్ మాట్లాడుతూ పార్టీ ఏరియాలో అడుగుపెట్టినప్పటి నుండి చేసిన పోరాటాలు గుర్తుచేస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం ప్రజాసైన్యం యొక్క ఆవశ్యకతను అర్థంచేయిస్తూ యువతీ యువకులు ప్రజాసైన్యంలో కలవాలని పిలుపునిచ్చాడు. ఆ తర్వాత కా॥ దామోదర్ కలిమెల ఏరియా కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ ఎర్రజెండా కోసం చికాగో నగరంలో 8 గంటల పనికోసం రక్తతర్పణం గావించినప్పటి నుండి నేటి వరకు ఎంతోమంది వీరులు ఎర్రజెండాని పోరాట జెండగా నిలిపారని. మార్క్స్, ఏంగెల్స్ సిద్ధాంతం యొక్క గొప్పతనాన్ని, కార్మికవర్గానికి సిద్ధాంత ఆయుధం అంచున మార్క్స్, ఏంగెల్స్ కార్మికుల కోసం ఎలా సాయపడ్డారో వివరించాడు. లెనిన్ పుట్టినరోజే, పార్టీ పుట్టిన విషయాన్ని వివరించాడు. రష్యాలో రివిజనిజంగా మారినా, చైనా రివిజనిజంగా మారినా కమ్యూనిజం అంతరించదని వివరించాడు. ఉపన్యాసాల అనంతరం జననాట్యమండలి కామ్రేడ్స్ నాటకాన్ని ప్రదర్శించారు. దాంట్లో నాయకుల మోసం గురించి వివరిస్తూ విప్లవం కోసం దళాల్లోకి చేరండి అంటూ పిలుపునిచ్చారు. ఈ నాటకం వారికి ఎంతో ఉత్సాహాన్ని కల్గించింది.

### కాంట్రాక్టర్, పోలీసు ఇన్‌ఫార్మర్ 'నోరి'కి దేహశుద్ధి

బెంగాలీ క్యాంపు 126లో కాంట్రాక్టర్ 'నోరి' కాంగ్రెసు పార్టీలో కీలకపాత్ర నిర్వహిస్తూ గ్రామాల్లో అనైక్యతను సృష్టిస్తూ తగవులను రెచ్చగొట్టడం, తన స్వార్థ ప్రయోజనాలకోసం వారిని ఉపయోగించుకునేవాడు. 1998లో కలిమెల దళం వీడి రాజకీయాలను, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల్ని చీలదీయడం గురించి మీటింగు నిర్వహించి హెచ్చరించింది. అయినా తన పద్ధతులు మార్చుకోక పోగా బెంగాలీ క్యాంపు 71 మరియు 126 క్యాంపుల మధ్య వున్న దేవుడిమాన్యం భూమి తగాదాను రెచ్చగొట్టి రెండు ఊర్లవారు తగవులు పెట్టుకునేటట్లు చేసి 71వ క్యాంపులోని 11 మందిపై కేసులు పెట్టించాడు. అవసరాల కోసం డబ్బు అడిగి తీసుకుని కూడా ఎగ్గొట్టడం చేశాడు. తనకు ఎదురు తిరిగితే పోలీసులతో కేసు పెట్టించి నక్సలైట్స్‌తో సంబంధాలు పెట్టుకున్నారంటూ ప్రచారం చేసేవాడు.

71వ క్యాంపు ప్రజలతో మీటింగు నిర్వహించి కేసులు ఎత్తివేయించాలని, ఆస్తులకు జరిగిన నష్టపరిహారం యిప్పించాలని డిమాండుచేస్తూ నెలరోజుల సమయం యివ్వడం జరిగింది. అయినప్పటికీ మరింత రెచ్చిపోయి పోలీసులతో దాడులుచేయించి 71వ క్యాంపు ప్రజల్ని భయభ్రాంతులకుగురిచేశాడు. మరోసారి 126 క్యాంపు ప్రజలతో 'నోరి' విషయాన్ని వివరించి కేసులు ఎత్తివేయడం, నష్టపరిహారం యివ్వడంకోసం మళ్ళీ 15 రోజులు సమయం యివ్వడం జరిగింది. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో దళం, మిలీషియా కామ్రేడ్స్ వెళ్ళి ప్రజలముందు విచారించి దేహశుద్ధి చేసి గ్రామబహిష్కారం చేయడమైంది.

### మే 31న కలకత్తా మీటింగ్ పై ప్రచారం

నక్సల్బరీ పోరాటానికి గుర్తుగా కలకత్తాలో జరిగే మీటింగును విజయవంతం చేయడంకోసం అఖిల భారత కాంగ్రెస్ యొక్క తీర్మానాలను ప్రచారం చేయడంకోసం విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేయడం జరిగింది. సుమారు 15 గ్రామాల్లో ముఖ్యమైన గ్రామ సంఘ నాయకుల్ని 33 మందిని బస్సులో కలకత్తాకు పంపించాము.

## బేసిక్ మిలీషియాకు మిలిటరీ శిక్షణ

కలిమెల ఏరియా కమిటీ నవంబరులో తీసుకున్న నిర్ణయం ప్రకారం కలిమెల దళంలోని దళసభ్యులకు మిలిటరీ పరిజ్ఞానం అంతగా లేకపోవడంతో మిలిటరీపరంగా బలహీనంగా వుండడంవల్ల రీజియన్ మిలిటరీ క్యాంపు విషయాలను, దళసభ్యుల వరకు తీసుకు వెళ్ళాలనే డి.సి. తీర్మానం వెలుగులో దళసభ్యులకు మరియు రిక్రూట్ చేసుకోవాల్సిన వారికి ఐదు రోజులు మిలిటరీ శిక్షణ యివ్వడం జరిగింది. ఇందులో మిలీషియా మరియు దళసభ్యులు కలిసి 22 మందికి శిక్షణ యిచ్చారు. దీంట్లో నిర్ణయించుకున్న సిలబస్ ప్రకారం క్లాసులు, మిలిటరీ శిక్షణ యివ్వడం జరిగింది. అలాగే పి.జి.ఏ.పై క్లాసు కూడా జరిపారు.

ఫిబ్రవరిలో తీసుకున్న నిర్ణయం ప్రకారం పి.జి.ఏ. నిర్మాణ కేంపెయిన్‌లో భాగంగా ఆర్మ్‌డ్ మిలీషియా, బేసిక్ మిలీషియాకు మిలిటరీ శిక్షణ యివ్వాలని నిర్ణయించుకోవడమైనది. ఇందులో ప్రధానంగా రెండు ఆర్మ్‌డ్ మిలీషియా దళాలకు శిక్షణ యివ్వాలని అనుకోవడం జరిగింది. ఐదు రోజులు సిలబస్ నిర్ణయించుకుని 26 మందికి శిక్షణ యిచ్చాం. ఇందులో 12 మంది ఆర్మ్‌డ్ మిలీషియా వారు కాగా, మిగతావారు బేసిక్ మిలీషియావారు. రెండు రోజులు పి.జి.ఏ.పై క్లాసులు చెప్పాము.

ఫిబ్రవరిలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఏప్రిల్‌లో 25 మందికి బి.ఎమ్.సి.లకు మూడు రోజులు మిలిటరీ శిక్షణ యిచ్చాం.

ఏరియాలో చాలా గ్రామాల్లో మహిళా బి.ఎమ్.ఎస్.లను ఏర్పాటుచేయడం జరిగింది. వీటికి కూడా మిలిటరీ శిక్షణ యివ్వాలని నిర్ణయించుకుని 22 మంది మహిళలకు మూడు రోజులు మిలిటరీ శిక్షణ యిచ్చాము. ఈ శిక్షణ జరిగిన తర్వాత వారిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అన్ని మిలిటరీ క్యాంపుల్లో పెట్రోల్ బాంబు, సోప్‌బాంబు, మైన్స్ పెట్టడం గురించిన పరిజ్ఞానం చెప్పాము. కానీ దానికి సంబంధించిన సామాన్లు సకాలంలో సమకూర్చుకోక పోవడంవల్ల సమర్ధవంతంగా చెప్పలేకపోయాం.

## ఇప్పపువ్వు రేటు పెరుగుదలకై పోరాటం

కలిమెల ఏరియాలో ఎండాకాలంలో ఇప్పపువ్వులు ఆదివాసీలు ఏరి, ఆరబెట్టి షావుకార్లకు అమ్ముతారు. ప్రతీ సంవత్సరం ఇప్పపువ్వు రేటుకోసమై ప్రజలు పోరాడడం జరుగుతున్నది. 2001 సం॥లో ఇప్పపువ్వు రేటు గత సంవత్సరం కంటే తక్కువ రేటుకు కొంటున్నారు. దీనికి కారణం అడిగితే, మార్కెట్‌లో రేటులేదని బుకాయిస్తూ ప్రజల్ని దోపిడీ చేస్తున్నారు. దీనిపై పోరాటం నిర్వహించడంకోసం ఇప్పపువ్వు రేటు నిర్ణయించడంలో ప్రభుత్వం యొక్క ప్రమేయం లేకపోవడం, షావుకార్ల దోపిడీకి అవకాశం కల్పించడం యొక్క కుట్రను బహిర్గతపరుస్తూ 25 మందికి అవగాహనా క్లాసు ఒక రోజు నిర్వహించాం. పోస్టర్ల పచారం, గ్రామాల్లో ప్రచార క్యాంపెయిన్ మూడు రోజులు నిర్వహించారు. అయినప్పటికీ రేటు విషయంలో మార్పు లేకపోవడం దృష్టిలో ఉంచుకుని 200 మందితో సభ నిర్వహించి షావుకార్లతో రేటు విషయంలో (దళం సమక్షంలో) చర్చలు జరిపారు. చర్చల తర్వాత రూ॥ 2.50పైసల నుండి రూ. 3.50 పైసలకు రేటు నిర్ణయమైంది.

## పొదుపు సంఘాలపై రిపోర్టు

నల్గొండ జిల్లాలోని 2 గ్రామాలలోని పొదుపు సంఘాల రిపోర్టు. ఒక్కొక్క పొదుపు సంఘంలో 20 దాకా సభ్యులున్నారు. మొదటి సంఘంలో ప్రతి ఒక్కరు నెలకు 50 రూ॥లు జమ చేస్తుంటే రెండవ దానిలో ఒక్కొక్కరు 10 రూ॥లు జమ చేస్తున్నారు. మొదటిదాంట్లో ఎక్కువమంది చేనేత కార్మిక మహిళలు, రెండవదాంట్లో గౌండ్లు, కొంత వ్యవసాయం జరుగుబాటు వున్నవాళ్లు. ఇలాంటి 20 సంఘాలను కలిపి ఒక MAC సొసైటీ ఒకటి వుంటుంది. దాంట్లో ప్రతి సంఘం నుండి ఇద్దరేసి సభ్యుల చొప్పున 40 మంది సభ్యులుంటారు. 'మ్యాక్' సొసైటీ పేరుతో ఒక సూపర్ బజార్ పెట్టారు. దానికి రెండు లక్షలు గ్రామీణ బ్యాంకు రుణం ఇచ్చింది. ఒక మండలంలో 4 లేక 5 మ్యాక్ సొసైటీలు వున్నాయి. మ్యాక్ సొసైటీ బాధ్యులు గతంలో సారా వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఒక మ్యాక్ సొసైటీ బాధ్యురాలు సారా వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నది. ఈమె టి.డి.పి.కి చెందిన యం.పి.పి. సభ్యురాలు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి మ్యాక్ సొసైటీ సభ్యులందరూ విధిగా హాజరు కావాలి. ప్రతి పొదుపు సంఘం నుండి విధిగా ఇద్దరు హాజరు కావాలి. దీనికయ్యే ఖర్చును పొదుపు సంఘం నుండే తీసుకుంటారు. సంఘాన్ని బట్టి రెండు సంవత్సరాల పొదుపు తర్వాత గ్రామీణ బ్యాంకులో వాళ్ల మొత్తం+ప్రభుత్వ రుణం మొత్తం నూటికి నెలకు 1.25 పై॥చొప్పున తీసుకుని తమ సభ్యుల అవసరాలకైతే రూ॥ 2.50 కు, బయటి వారికైతే రూ॥3.00 కు వడ్డీకిస్తారు. ఒక విధంగా ఈ పొదుపు సంఘాలు వడ్డీని సంపాదించే సంఘాలుగా వున్నాయి. రాజకీయంగా ప్రభుత్వానికి కానీ ఖర్చు లేకుండా తమ రాజకీయ సభలకు జనాల్ని తరలించడానికి వుపయోగపడుతున్నాయి. ఖర్చులన్నీ పొదుపుసంఘం ఖర్చులుగా చూపిస్తున్నారు కాబట్టి అది ఎక్కువ మందిని సమీకరించడానికి వుపయోగపడ్తున్నది. దీంట్లో కూడ కేవలం ఆర్థికపరమైన సమస్యలనే చర్చిస్తున్నారు. కానీ సామాజిక, రాజకీయ సమస్యలను చర్చించడం లేదు. ప్రతి ఒక్కరికి పాస్‌బుక్‌లు ఇస్తున్నా వివరాలు సరిగా రాయడం లేదు. తిరిగి మ్యాక్ సొసైటీ బాధ్యులే వీటిని చూస్తున్నారు. ఇప్పటి వరకు లోన్ వసూళ్ళు సక్రమంగానే జరుగుతున్నాయి. ఎగవేతలు తక్కువ. కొన్ని పాత సంఘాలలో ఎగవేతలు అక్కడక్కడ చోటు చేసుకుంటున్నాయి. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర 5, 6 రూ॥ల వడ్డీకి బదులు 3 రూ॥లకే వీటిలో అప్పు దొరుకుతుండటంతో ప్రస్తుతం ఈ పొదుపు సంఘాలు సక్రమంగానే నడుస్తున్నాయి. మ్యాక్ సొసైటీ బాధ్యులు మాత్రం ఎక్కువగా అధికారపార్టీ కార్యకర్తలుగా వుంటూ పాలకవర్గాల ప్రయోజనాలకు బాగా వుపయోగపడుతున్నాయి.

## జంటనగరాల్లో నిర్బంధం

సామ్రాజ్యవాద ఏజెంటుగా పనిచేసే ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విదేశీ పెట్టుబడులను

ఆహ్వానించి రాష్ట్రాన్ని బహుళజాతి సంస్థలకు తాకట్టు పెట్టాడు. కేంద్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా నేరుగా రాష్ట్రానికే విదేశీ పెట్టుబడులు వచ్చేటట్టుగా ఒప్పందాలు చేసుకున్న ప్రథమ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1000 కి.మీ.ల తీర ప్రాంతంతో సహజ సంపదలు పుష్కలంగా వున్న ప్రాంతం కావడం వల్ల సామ్రాజ్యవాదుల దృష్టిని ఆకర్షించింది. బలమైన విప్లవోద్యమం వారి దోపిడీకి ప్రధాన అడ్డంకి కాగలదన్న అభిప్రాయంతో ఇక్కడి విప్లవోద్యమాన్ని అణచి వేయకుండా తమ పెట్టుబడులకు రక్షణ లేదని భావించి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వంతో ఆ మేరకు బహిరంగంగానే ఒప్పందాలు చేసుకుని విప్లవోద్యమ అణచివేతకు సహాయ సహకారాలు అందించ సాగాయి. ఈ నేపథ్యంలో '97 నుంచీ విప్లవోద్యమంపై మొదలైన 'లో ఇంటెన్సిటీ వార్ ఎత్తుగడ'తో నూతన దాడి ప్రారంభమయ్యింది. ఈ దాడి స్వభావాన్ని మనం అర్థం చేసుకొనేలోపు అనేక నష్టాలకు మనం గురయ్యాం. అమూల్యమైన మన కామ్రేడ్స్‌ను కోల్పోయాం.

విప్లవోద్యమాన్ని అనేక రూపాలలో అణచివేయడానికి రంగం సిద్ధం చేసుకున్న శత్రువు ఒక బలమైన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పరచుకోవడం, కోవర్ట్‌లను తయారు చేసుకోవడం, విప్లవ ద్రోహులతో ప్రజాసంఘాల నాయకత్వంపై దాడులు, హత్యలు చేయించడం; బెదిరించడం వంటి రూపాలలో కొనసాగుతున్నది.

కా॥ పురుషోత్తం హత్యానంతరం జంట నగరాలలోని వివిధ ప్రజాసంఘాల నాయకుల ఇళ్ళకు ఫోన్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతు విప్పితే పురుషోత్తానికి పట్టినగతే పడుతుందని హెచ్చరించారు. ఈ ఫోన్లు చేసేటప్పుడు కుటుంబ సభ్యులు ఫోన్ రిసీవ్ చేసుకుంటే వాళ్ళను విపరీతంగా బూతులు తిట్టి, మీ కుటుంబంలోని ఫలానా వ్యక్తిని సంఘం నించి రాజీనామా చేయమని చెప్పండని హెచ్చరించారు. టార్గెట్‌గా ఎంచుకున్న వ్యక్తులే ఫోన్ రిసీవ్ చేసుకున్నపుడు వాళ్ళని బూతులు తిట్టడం సంఘం పనులు మానుకోమని హెచ్చరించడంతో పాటు చిత్రహింసలు పెడ్తున్నపుడు పెట్టే హృదయ విదారకమైన కేకలు, అరుపులు వినిపించేవారు. ఈ విధంగా మానసికంగా అభద్రతాభావం కల్పించే ప్రయత్నం చేశారు. ఇంకా అనేక రూపాలలో ఈ ఒత్తిడి కొనసాగుతోంది.

అరెస్టయి అనంతరం లొంగిపోయిన వ్యక్తులను సంఘాలలో పనిచేస్తున్న వాళ్ళ దగ్గరకు పంపి పార్టీ కాంటాక్టు అడిగించడం, లొంగిపోయిన వాళ్ళకు తాము గతంలో పనిచేసినపుడు వున్న పరిచయాలను పురస్కరించుకుని పార్టీ కాంటాక్టు కోసం ప్రయత్నించడం చేశారు.

శత్రువు కేంద్రీకరించాలనుకున్న వ్యక్తి ఇంటిపక్కనే ఇంటెలిజెన్స్ వ్యక్తులు ఇల్లు తీసుకుని మొత్తం కదలికలు గమనించడం మరో పద్ధతి. ఒకప్పుడు ఆర్.వై.యల్. కార్యకలాపాలు సాగించిన బస్తీ పై దీర్ఘకాలికంగా వాచ్ వుంచుతున్నాడు. ప్రస్తుతం అక్కడ ఆర్.వై.యల్. కార్యకలాపాలు ఏమీ లేకపోయినా నిఘా వుంచుతున్నాడు. మైత్రి సంఘాల పేరిట కొంతమందిని ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకుంటున్నాడు. అందులో భాగంగానే ఆ బస్తీలో వుండే ప్రజా టెలిఫోన్ బూత్ నడిపే వ్యక్తిని మైత్రీసంఘం సభ్యుడిగా చేసుకుని అక్కడి ఫోన్ల దగ్గరకు వచ్చి మాట్లాడే విషయాలు విని అందించడం, అక్కడ కూర్చుని బస్తీలోకి కొత్త వ్యక్తులెవరైనా వస్తున్నారా పరిశీలించడంతో పాటు అక్కడ వ్యక్తుల గురించి అంచనాలు సేకరించడం కూడా చేస్తున్నాడు. ఈ మైత్రీ సంఘం సభ్యుడు అక్కడ సంఘంలో పనిచేసే వ్యక్తులలో కొంత బలహీనంగా వున్న వ్యక్తిని కలిసి కోవర్ట్‌గా మారమని అడిగాడు. నెలకు 3 వేలు జీతం ఇచ్చి నమ్మకంగా పనిచేస్తే సెల్‌ఫోన్ ఇచ్చి సౌకర్యాలు కల్పించి జీతం పెంచుతామని చెప్పాడు. అతడు ఆ సంఘంలో యథాతథంగా పనిచేస్తూ తమకు పనిచేసి పెట్టాలని అడిగాడు.

ఒకరి దగ్గరకు ఆర్.ఎ.డబ్ల్యు. నుంచి వచ్చిన వ్యక్తి ''స్నేహపూర్వకంగా'' డీల్ చేసే ప్రయత్నం చేశాడు. తనని తాను RAW నుంచి వచ్చిన వ్యక్తిగానే పరిచయం చేసుకున్నప్పటికీ బంధువునో, మిత్రుడినో కలిసినట్టుగా కలిసి ఆ రకంగా చర్చలు చేయడానికి వివరాలు రాబట్టడానికి ప్రయత్నం చేశాడు.

ప్రత్యేక తెలంగాణా కోసం పనిచేస్తున్న కార్యకర్తపై దాడిచేసి కొట్టి తెలంగాణా కోసం పనిచేయడం మానకపోతే 'ఆజం' కి పట్టినగతే పడ్తుందని హెచ్చరించాడు.

పురుషోత్తం హంతకులని వాడు అరెస్టు చేసిన వ్యక్తులు 'రంగారెడ్డి యస్.పి.కి మరో తలని బహూకరించేదుంది' అని కోర్టు బయట బహిరంగంగా ప్రకటించడం ద్వారా ఒక అభద్రతా భావాన్ని సృష్టించాడు. శత్రువు టార్గెట్ అని ప్రకటించిన వ్యక్తి పిల్లలను ఆటోడ్రైవర్‌గా ఫాలో అవడం, కార్యక్రమాలు మానుకొమ్మని బెదిరించడం చేశాడు.

కత్తుల సమ్మయ్య కొంతమంది లొంగిపోయిన వాళ్ళను చేరదీసి తాము చంపాలనుకున్న వ్యక్తిని చంపితే 5 లక్షలిస్తామని చెప్పి అడ్వాన్సుగా 3 లక్షలిచ్చి పంపారు. సమ్మయ్య చావడంతో పైసలు తీసుకున్నవాడు భయపడి విషయాన్ని బయటికి చెప్పాడు.

ఆజంఆలీని హత్యచేసిన తర్వాత టార్గెట్ వ్యక్తి ఇతను కాదనీ, మరో వ్యక్తి అనీ అతను రాకపోవడంతో ఆజంని చంపారనీ ప్రచారం చేయడం ద్వారా మరికొంత మందిలో భయం సృష్టించే ప్రయత్నం చేశారు. హంతక ముఠాల వ్యతిరేక కమిటీలో పనిచేస్తున్న వ్యక్తులకు ఫోన్‌చేసి ఇటువంటివి మానుకోవాలని బెదిరించారు.

ప్రజల్లోనూ, ప్రజాసంఘాల కార్యకర్తల్లోనూ టెర్రర్ సృష్టించడానికి శత్రువు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రజలు తమ ప్రియతమ నాయకుల హత్యలపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తూ వేల సంఖ్యలో కదిలారు. నిరసన ప్రదర్శనలు చేశారు. నిర్బంధాన్ని ధిక్కరించి బహిరంగ సభలలో వేలాదిగా పాల్గొన్నారు. ప్రభుత్వ కిరాయి హంతక ముఠాలను పెంచి పోషిస్తున్న తీరుని ఖండిస్తూ మేధావులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల నాయకత్వాన్ని హత్యలు కావించడం, బెదిరించడంపై రచయితలు, కళాకారులు, మేధావులు తీవ్రంగా స్పందించారు. తమ నిరసనను తెలియజేశారు.

శత్రువు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి వేస్తున్న ఎత్తుగడలను సకాలంలో అర్థం చేసుకుంటూ వాటిని తిప్పికొట్టాలి. విస్తృత ప్రజాపునాదిని ఏర్పరచుకుంటూ మన శక్తులు బహిర్గతం

కాకుండా ఉక్కు క్రమశిక్షణ గల పార్టీగా తీర్చిదిద్దుకోవడం ద్వారానే శత్రుదాడిని తిప్పిగొట్టగలం.

## అమరుల రిపోర్టు

**కా॥ వేణు (నాని, ప్రకాష్)**

1975లో హైద్రాబాద్‌లోని మచ్చుబొల్లారంలో ఒక పేద దళిత కుటుంబంలో పుట్టాడు. వారి కుటుంబం పార్టీకి సానుభూతి పరులు. కంటోన్మెంట్ ఏరియాలో మన పార్టీ కార్యకలాపాలు చురుగ్గా కొనసాగుతున్న వాతావరణంలో పుట్టి పెరిగిన వేణు చిన్నప్పటి నుండే విప్లవ రాజకీయాలవైపు ఆకర్షితుడైనాడు. చదువుకుంటున్న రోజుల్లోనే పార్టీ ఆర్గనైజర్లకు ప్రేమపాత్రుడుగా వుంటూ కొరియరింగ్ పనిచేసేవాడు. 10వ తరగతి పూర్తి చేశాక '92లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. అప్పటికే ఆ ఏరియాలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకుని మిలిటెంట్‌గా వుండేవాడు. కొన్నాళ్ళు కొరియర్‌గా వుంటూ నిత్య నిర్బంధం మధ్యనే పోలీసుల కన్నుగప్పి చాకచక్యంగా పనిచేశాడు. ఎప్పుడూ చురుగ్గా వుండేవాడు. తర్వాత ఆర్గనైజేషన్‌లోకి అవసరాల రీత్యా మార్చారు. ప్రధానంగా ప్రైవేటు ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తూ యూత్‌నూ ఆర్గనైజ్ చేసేవాడు. ఎంతో విస్తృతమైన సంబంధాల్లోకి వెళ్లి యువకుల్నీ, కార్మికుల్నీ ఆర్గనైజ్ చేశాడు. ఎంతో చొరవగా ప్రజల్లో కలిసిపోయేవాడు. కవర్ యూనియన్లను అసంఘటిత రంగంలో నిర్మించి చాకచక్యంగా నడిపించేవాడు. ఆ తర్వాత కొన్ని సమస్యలు రావడంతో కొన్నాళ్ళు పార్టీ ఆయనను పనినుండి దూరంగా వుంచాల్సి వచ్చింది. ఆ కాలంలో కూడా అమరుల ఆశయాల్ని మరవక ఒక ఫ్యాక్టరీలో కార్మికుడిగా కష్టపడి పనిచేస్తూ తిరిగి పార్టీ పిలుపుకై ఆతృతగా ఎదురుచూస్తూనే వున్నాడు. తనను తాను ఆచరణలోనే తిరిగి రుజువుచేసుకోవడంతో పార్టీ ఆయనను త్వరలోనే తిరిగి ఆర్గనైజేషన్‌లోకి తీసుకున్నది. తనకు ఎంతో సన్నిహితంగా వుండి తనను గైడ్ చేసిన కామ్రేడ్స్ రామేశ్వర్, కృపాల్‌ల మరణం కా॥ వేణులో మరింతగా వర్గకసిని పెంచింది. దెబ్బతిన్న సిటీ ఉద్యమాన్ని తిరిగి నిర్మించడంలో తన వంతు పాత్రను నిర్వహిస్తానని ముందుకు వచ్చాడు. కొంత కాలం యూత్‌లో పనిచేశాడు. ఆ క్రమంలోనే గూండా నర్సింగరావ్‌గౌడ్ యాక్షన్‌లో పాల్గొన్నాడు. శత్రువు తీవ్రంగా వెంటబడడంతో సిటీలో ఆ కామ్రేడ్‌ను కాపాడుకోవడం కష్టం అని భావించి పార్టీ ఆయనను గ్రామీణ ప్రాంతానికి పంపింది. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట, పానగల్ దళాల్లో వుంటూ గ్రామీణ ప్రాంత అనుభవాల్ని సంపాదించుకోవాలని పార్టీ చెప్పిన విషయాన్ని మనస్ఫూర్తిగా అమలు పరిచాడు. తనకు రాత్రిపూట కళ్ళు సరిగా కనిపించని సమస్య వున్నప్పటికీ కార్మికవర్గ చైతన్యంతో దాన్ని అధిగమిస్తూ రాత్రిళ్ళే ఎన్నో పనులు చేసుకువచ్చేవాడు. క్రమంగా రూట్లమీదా పట్టు సాధించాడు. పానగల్ దళ శాక్‌మెంబర్‌గా వుంటూ ఆ సం॥ కాలం ఆ ప్రాంత ఉద్యమంలో మంచి పాత్రను నిర్వహించాడు. ఈ తాత్కాలిక రిట్రీట్‌నుండి వచ్చి తిరిగి సిటీ పనుల్లో చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపునందుకుని ఆ పనుల్లో తిరుగుతున్న క్రమంలోనే శత్రు వలలో చిక్కి జనవరి 23న అరెస్టయినాడు. శత్రువు ఎన్నో క్రూరమైన చిత్రహింసలు పెట్టినప్పటికీ నోరు మెదపలేదు. కీళ్లు విరిచి, కాళ్ళు నరికి శత్రువు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ తనకు స్ఫూర్తినిచ్చిన ఎందరో సిటీ అమరుల వలెనే ఆయనా ఒక్క రహస్యం కూడా చెప్పకుండా జంట నగరాల అమరుల గొప్ప విప్లవ సాంప్రదాయాన్ని నిలబెట్టాడు. ఆఖరుకు తాను తిరిగి సిటీ పనులు చేస్తున్న విషయం కూడా ఆయన శత్రువుకు తెలియనివ్వలేదు. నూతనంగా సిటీ నిర్మాణంలో వచ్చిన కొన్ని మార్పులు తనకు తెలిసినప్పటికీ శత్రువును పక్కదారి పట్టించాడు.

ప్రజల కష్టాలను, ముఖ్యంగా స్త్రీల బాధలను చూసి ఎంతగానో చలించిపోయే కా॥ వేణు ఎన్నో పాటలు, కవితలు కూడా రాశాడు. సిటీ ఉద్యమంలోనూ, తన జీవితంలోనూ సంభవించిన అనేక ఒడిదుడుకుల్ని తట్టుకుని నిలబడి ఆశయం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన కమ్యూనిస్టు కా॥ వేణు. కా॥ వేణులో కార్మికవర్గతత్వం ఎంతగా మూర్తీభవించివుందంటే తనకు ఎంతో సన్నిహితంగా వుండిన కామ్రేడ్ నకిలీగా మారినప్పుడు ఆయనను తానే వెంటనే 'కంట్రోల్ చేస్తానని' మాట్లాడాడు. వర్గ సంబంధానికి మించిన స్నేహాలు ఏవీ వుండవని నిరూపించాడు. కార్మికుల కష్టాల గురించి నిరంతరం ఆలోచించేవాడు. వారిని ఆర్గనైజ్ చేసే వివిధ పద్ధతుల గురించి చర్చించేవాడు. తాను పనిచేసిన ఫ్యాక్టరీల కార్మికుల స్థితిగతులను వంద ప్రశ్నల ఆధారంగా విశ్లేషించి రాశాడు. అతి చిన్న వయస్సులోనే పార్టీలోకి వచ్చి అమరుడైన కా॥ వేణు జీవితం ఆదర్శప్రాయం. ❑

**"ప్రపంచవ్యాప్తంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న వివిధ రకాల పోరాటాలను మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయటం ద్వారా పాఠకుల జ్ఞానాన్ని పెంచడానికి పత్రిక దోహదపడుతుంది. తీవ్ర నిర్బంధం కొనసాగుతూ తాత్కాలికంగా పోరాటాలు నిలిచిపోయిన ప్రాంతాల ప్రజలకు, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న పోరాటాలు, నిర్బంధ కాలంలో వస్తున్న నూతన పోరాట రూపాలలో తెలియజేయటం ద్వారా ఆ ప్రాంత ప్రజల మనోస్థైర్యాన్ని నిలబెడుతూ నిర్బంధ కాలంలోనూ తగిన పద్ధతులను ఎంచుకుని పోరాటాన్ని పురోగమింప చేయడానికి మార్గదర్శకత్వం వహిస్తుంది. అందుకే పత్రిక ఒక సమిష్టి ఆర్గనైజర్ పత్రికకున్న ఈ ప్రాధాన్యత రీత్యా ఎన్ని అడ్డంకులెదురైనప్పటికీ పత్రికను క్రమం తప్పకుండా సజీవంగా తీసుకురావటం, పంపిణీ చేయటం కోసం కృషి చేయాలి."**

**- ఎన్.టి.ఎస్.జెడ్.సి. పి.ఓ.ఆర్, 1995.**

**"మన పత్రికలు సరైన బాటలో నడిస్తే కనుక వాటి ప్రచురణ ప్రారంభమైన తర్వాత అవి బాగానే పనిచేస్తాయి.. పత్రికలను నడపటం మొదలు పెట్టగానే, మనం సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేయడమూ, సమస్యల గురించి ఆలోచించడమూ, రచనకు ఉపక్రమించటమూ తప్పనిసరిగా చేపట్టవలసి వస్తుంది. ఇదంతా మన సిద్ధాంత స్థాయిని పెంచుతుంది. ప్రతి రాష్ట్రం ఒక పత్రికను నిర్వహించగలదు. ఆ విధంగా ఒక రకపు ఘర్షణను ప్రవేశపెట్టవచ్చు."**

**- మావో**

## కార్మికవర్గ పార్టీలో క్యాపిటలిస్టులకు సభ్యత్వం!

## 150 ఏళ్ళ కమ్యూనిజాన్ని తలకిందులు చేయగల పరిణామాలపై....

# చైనాను కుదిపివేస్తున్న చర్చ

*(మావో అనంతర చైనాలో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ గురించి, రివిజనిస్టు పార్టీగా పతనమైపోయిన చైనా కమ్యూనిస్టు పార్టీ భ్రష్టత్వం గురించి మన పార్టీ, అలానే వివిధ దేశాల్లోని విప్లవ కమ్యూనిస్టు పార్టీలు 1980ల లోనే తేల్చి చెప్పేసాయి. కాగా ఇందుకు నిదర్శనంగా చైనాలో సాగుతున్న కొన్ని తాజా పరిణామాలపట్ల విస్మయపడిపోతూ ఈ వ్యాసరచయిత అవేవో చైనాలో ఇప్పుడే ప్రారంభమైనట్లు వ్రాస్తున్నాడు. చై.క.పా. పతనం పరాకాష్టని చూపే తాజా కథనంగా వుంటుంది గనుక 9-10-2001 తేదీ నాటి 'వార్త' దినపత్రికలో డా॥ ఎమ్.కోదండరాం వ్రాసిన వ్యాసాన్ని ఇక్కడ యధాతథంగా ప్రచురిస్తున్నాం.-'క్రాంతి' సంపాదకవర్గం)*

సెప్టెంబర్ చివరి వారంలో మూడు రోజులపాటు సాగిన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ ప్లీనరీ సమావేశం కొన్ని కీలకమైన నిర్ణయాలను తీసుకొన్నది. పార్టీలో వ్యాపారస్థులకు, పెట్టుబడిదారులకు సభ్యత్వం ఇవ్వాలని కేంద్రకమిటీ మొదటిసారిగా నిర్ణయించింది. 1989లో జరిగిన తియాన్‌మెన్ ఘటనల తర్వాత పార్టీ కేంద్ర కమిటీ ప్రైవేటు సంస్థల యజమానులకు సభ్యత్వం ఇవ్వకూడదంటూ తీసుకున్న నిర్ణయానికిది పూర్తిగా విరుద్ధమైనది కావటం గమనించదగ్గ విషయం. పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య దోపిడీ సంబంధమే వుంటుంది కాబట్టి పెట్టుబడిదారులకు సభ్యత్వం ఇస్తే పార్టీ స్వభావమే మారిపోతుందని ఆనాటి కేంద్రకమిటీ భావించింది. నేటి దేశాధ్యక్షుడు, పార్టీ అగ్రనాయకుడు జియాంగ్‌జెమిన్ కూడా ఆనాడు పార్టీ నిర్ణయాన్ని బలపరిచినవారే. అందుకు భిన్నంగా పార్టీ సభ్యత్వాన్ని విస్తృతపర్చాలని ఈసారి జియాంగ్‌జెమిన్ స్వయంగా ప్రతిపాదించారు. జియాంగ్ గత ఫిబ్రవరిలో 'మూడు ప్రాతినిధ్యాలు' అనే సిద్ధాంతాన్ని ప్రవచించారు. పార్టీ 80వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 1నాడు చేసిన ప్రసంగంలో జియాంగ్ ఈ సిద్ధాంతాన్ని వివరించారు. మారుతున్న పరిస్థితులను తట్టుకుని నిలబడాలంటే పార్టీ 1) మెజారిటీ ప్రజలకు, (2) సాంస్కృతిక రంగంలో ఆధునిక అంశాలకు, (3) ఉత్పత్తి శక్తుల్లోని పురోగామి అంశాలకు ప్రాతినిధ్యం వహించాలన్నారు. ఆయన చేస్తున్న కొత్త ప్రతిపాదన ప్రకారం కమ్యూనిస్టు పార్టీ కార్మిక వర్గానికేకాక 'సమస్త ప్రజలకు' ప్రాతినిధ్యం వహిస్తుందన్నమాట. ఇకపోతే ఉత్పత్తి రంగంలో 'ఆధునిక శక్తు'లంటే సాంకేతిక నిపుణులు, ప్రైవేటు సంస్థల యజమానులు అవుతారు.

ఈ ప్రతిపాదనపైన పార్టీలోపల, బయటా చాలా తీవ్రంగానే చర్చలు సాగాయి. జెమింగ్ చెప్పినట్టు సభ్యత్వాన్ని విస్తృతపరిస్తే పార్టీ శ్రామిక వర్గ దృక్పథానికి తిలోదకాలిచ్చినట్టేనని వామపక్ష వాదులన్నారు. ఇప్పటికే పార్టీ వ్యాపారస్థుల చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఇక వారికి పార్టీలో సభ్యత్వం ఇస్తే ఎన్నికల్లో డబ్బు ముఖ్యపాత్ర వహిస్తుందని, తత్ఫలితంగా పార్టీ దిగజారిపోతుందని హెచ్చరించారు. ఈ విమర్శలు చేసిన వామపక్ష పత్రిక 'ఇన్‌సర్చ్ ఆఫ్ ట్రూత్'ను పార్టీ నాయకత్వం వెంటనే నిషేధించింది. మితవాదులు జియాంగ్ ప్రతిపాదనను బలపర్చారు. ప్రజల ప్రయోజనాలను గుర్తించి వ్యవహరించే వ్యాపారస్థులను చేర్చుకోవడం వల్ల పార్టీ పని పద్ధతులు మెరుగుపడతాయని, పార్టీకే లాభదాయంగా వుంటుందని వారంటున్నారు. పూర్తిగా ఒక వర్గంపై ఆధారపడే దృక్పథాన్ని విడనాడాలన్నది వారి వాదన. తియనెన్‌మెన్ ఘటనల తర్వాత చైనాలో రాజకీయ సంస్కరణల ప్రస్తావనే రాలేదు. 1978 తర్వాత చైనాలో డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన పార్టీ ఆర్థిక సంస్కరణలు చేపట్టింది. రాజకీయ రంగంలో మాత్రం చెప్పుకోదగిన మార్పులేదు. గ్రామస్థాయి ఎన్నికల్లో మాత్రం పోటీకి అవకాశాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో రాజకీయ స్వేచ్ఛను, హక్కులను డిమాండ్ చేస్తూ తియాన్‌మెన్ స్క్వేర్‌లో విద్యార్థులు, యువకులు ధర్నా చేసారు. కానీ, ఈ ఉద్యమాన్ని డెంగ్ నాయకత్వం పూర్తిగా అణచివేసింది. ఆ తర్వాత చైనాలో రాజకీయ సంస్కరణల ప్రస్తావనే రాలేదు. దాదాపు 12 సంవత్సరాల తర్వాత ఇపుడు పార్టీ స్వభావాన్నే సమూలంగా మార్చగల ప్రణాళికను సిద్ధం చేసారు. జియాంగ్ పథకాన్ని కేంద్రకమిటీ ఆమోదించింది. 'కాలం చెల్లిన పద్ధతులు, సిద్ధాంతాలు, వ్యవస్థ'ల నుండి 'కుహనా మార్క్సిస్టు' అవగాహననుండి పార్టీ సభ్యులు బయటపడాలని కేంద్రకమిటీ పిలుపునిచ్చింది. ఈ నిర్ణయంతో, కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి వ్యాపారస్థులు, పెట్టుబడిదారులు 'అర్హు'లయ్యారు. ఈ పరిణామాల వలన చైనా రాజకీయాలలో చాలా మార్పులు రావచ్చు. చైనాలో ప్రైవేటు సంస్థలు, వ్యాపారస్థులు చాలా బలపడ్డారని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగం పాత్ర గణనీయంగా పెరిగిపోయింది. ముఖ్యంగా తూర్పుతీర ప్రాంతంలో ప్రైవేటు పెట్టుబడిదారులు బాగా ఎదిగిపోయారు. ఉదాహరణకు 1998 నాటికే ఛెజియాంగ్ ప్రావిన్స్‌లో మొత్తం పారిశ్రామికోత్పత్తిలో 45శాతం ప్రైవేటు రంగంలోనే సాగుతున్నది. అలా ఎదిగిన ప్రైవేటు పెట్టుబడిదారుల్లో ఫుచియన్ ప్రావిన్స్‌కు చెందిన హుగాంగ్ అనే పారిశ్రామికవేత్త కూడా ఒకరు. హు గాంగ్ అనే పారిశ్రామికవేత్త కూడా ఒకరు. హు 1987లో కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. ఆ తర్వాత స్వంత ఫ్యాక్టరీని ఏర్పాటు చేసాడు. ఇప్పుడు ఆ కంపెనీ ఆస్తుల విలువ 12 కోట్లడాలర్లు, 570 కోట్ల రూపాయలు, ఇందులో హు గాంగ్ స్వంత వాటా 45శాతం. నిన్న మొన్నటిదాకా హు పార్టీలో కొనసాగాలా వద్దా అన్న చర్చ సాగింది. కేంద్రకమిటీ నిర్ణయానుసారం ఆయన ఇప్పుడు పార్టీ సభ్యుడిగా కొనసాగవచ్చు. హు దృష్టిలో పార్టీ పలుకుబడి, పురోభివృద్ధి పార్టీ సభ్యుల నైపుణ్యం మీద ఆధారపడి వుంటుంది. కనుక పార్టీ ఆధిపత్యం కొనసాగాలంటే పెట్టుబడిదారుల మద్దతు అవసరమన్నది ఆయన సిద్ధాంతీకరణ. అయితే తనను పార్టీలో చేర్చుకోకపోయినా జరిగే నష్టమేమీ లేదని హు ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూయ్యలో అన్నాడు. కాకపోతే పెట్టుబడిదారులంతా దోపిడీ దారులేనన్న ముద్రను చెరిపివేసి వారిని పార్టీలో చేర్చుకుని గౌరవప్రద స్థానం కల్పిస్తే ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం లభిస్తుందంటాడు హు. ఈ వ్యాఖ్య రాబోయే పరిణామాలకు సంకేతం. చైనా కమ్యూనిస్టు పార్టీలో జరుగుతున్న ఈ మార్పు, ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలపైన ఎటువంటి ప్రభావాన్ని చూపగలవన్నది ఎంత ఆసక్తికరమైన ప్రశ్నో అంత కీలకమైనది కూడా. ❑

# 15వ రాష్ట్ర మహాసభ తక్షణ కర్తవ్యాలు

1. వ్యూహాత్మక ప్రాంతాలపై కేంద్రీకరిస్తూ, సరైన ఎత్తుగడలను అవలంభిస్తూ గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా శత్రు దాడిని ఓడిద్దాం. ప్రజాయుద్ధాన్ని గుణాత్మకంగా ఉన్నత స్థాయికి పురోగమింప జేద్దాం. విప్లవోద్యమానికి అవసరమైన మూడు సాధనాలను బలోపేతం చేద్దాం.

2. డి.కె., ఏ.ఓ.బి.లను విముక్తి చేసే లక్ష్యంతో స్వీయాత్మక శక్తుల్ని పెంపొందించి పంపిద్దాం. దక్షిణ తెలంగాణా గెరిల్లాజోన్‌ను సంఘటిత పరచి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం. నల్లమల రీజియన్‌ను రాయలసీమ డివిజన్‌ని గెరిల్లాజోన్ ప్రాంత లక్ష్యంతో అభివృద్ధి చేద్దాం.

3. కింది స్థాయి నుండి పార్టీని నిర్మించి పటిష్టపరుద్దాం.

4. గ్రామగ్రామాన ప్రజా మిలీషియాను నిర్మిద్దాం. ప్రజా గెరిల్లా సైన్యాన్ని (ప్లాటూన్స్, యస్.జి.యస్.లను) బలోపేతం చేద్దాం.

5. బలమైన గ్రామాలన్నింట గ్రామరాజ్య కమిటీలను రాజ్యాధికార అంగాలను నిర్మించి ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపిద్దాం.

6. అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుదాం. పార్టీని మదింపుగా పటిష్టపరుద్దాం. పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుదాం. స్త్రీ పురుష సంబంధాల్లో, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుందాం.

7. కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా సమిష్టి పని విధానాన్ని పెంపొందిద్దాం. కమిటీల పని విధానాన్ని మెరుగుపర్చుకుందాం.

8. సిద్ధాంత అధ్యయనాన్ని నిర్దిష్ట అధ్యయనాన్ని అన్ని స్థాయిల్లోనూ అభివృద్ధి చేసుకుందాం. స్వీయాత్మకతను విడనాడుదాం.

9. భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాస్వామిక సంస్థలు వ్యక్తులతో ఐక్య సంఘటనను నిర్మించి పోరాడుదాం.

10. వర్గ విశ్లేషణను చేపడుదాం. భూపోరాటాలపై కేంద్రీకరించి వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.

11. పట్టణోద్యమాన్ని నిర్మిద్దాం. విద్యార్థి, యువజన మహిళా మేధావి రంగాలపై శ్రద్ధపెట్టి బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దాం.

12. బలమైన పట్టణ గ్రామీణ మహిళా ఉద్యమాన్ని నిర్మిద్దాం.

13. నూతన పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా బలమైన కార్మికోద్యమాన్ని నిర్మిద్దాం.

14. సాహిత్య సాంస్కృతిక రంగాలపై కేంద్రీకరిద్దాం. నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విలువల కోసం పోరాడుదాం.

15. ప్రాంతీయ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుదాం. ప్రజాస్వామ్య తెలంగాణా సాధనకై ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దాం. అసమానతలకు గురవుతున్న రాయలసీమ ఉత్తరాంధ్రల అభివృద్ధికై పోరాడుదాం.

16. తూర్పు రీజియన్ నల్లమల అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసుల అభివృద్ధికై పోరాడుదాం. అడవిపై ఆదివాసులకే సర్వాధికారాలు సాధించే లక్ష్యంలో కృషి చేద్దాం.

17. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుదాం. కులతత్వాన్ని పారదోలుదాం. మైనారిటీలపై హిందూ మతోన్మాదుల దాడులకు వ్యతిరేకంగా అన్ని రకాల హిందూ ఫాసిస్టీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం.

## నినాదాలు

1. డి.కె., ఏ.ఓ.బి.లను విముక్తి ప్రాంతాలను చేసే లక్ష్యంలో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

   ఉత్తర దక్షిణ తెలంగాణా గెరిల్లాజోన్స్‌లో విప్లవ యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

   నల్లమల రీజియన్ రాయలసీమ, డివిజన్‌లను గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేద్దాం!

2. పార్టీని శక్తివంతం చేద్దాం - నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం!

3. పి.జి.ఏ.ను నిర్మిద్దాం! ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

4. అధ్యయనాన్ని పెంచుకుందాం-స్వీయాత్మకతను వదిలించుకుందాం!

5. గ్రామరాజ్య కమిటీలను నిర్మిద్దాం! గ్రామస్థాయి నుండి ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పుదాం!

6. బలమైన ఐక్య సంఘటనను నిర్మిద్దాం! ప్రజా పోరాటాలు తీవ్రతరం చేద్దాం! ❑

**"ఒక వార్తాపత్రికను బాగా నడపడం, దాన్ని ఆసక్తిదాయకంగానూ, మనస్సుకు హత్తుకునేట్టుగానూ రూపొందించటం, వార్తా పత్రికల్లో పార్టీ సాధారణ, నిర్దిష్ట విధానాలకు సరైన ప్రచారం ఇవ్వటం, వార్తాపత్రికల ద్వారా పార్టీకి ప్రజలతోటి సంబంధాలను పటిష్టం చేయటం-మన పార్టీ పనిలో యిది ఒక ముఖ్యమైన సూత్రపరమైన సమస్య. దీన్ని తేలిగ్గా తీసుకోగూడదు."**

**- మావో**

# ప్రైవేటీకరణను అడ్డుకోవటంలో సాపేక్షికంగా గణనీయ విజయం సాధించిన ఏ.పి.యస్.ఆర్.టి.సి. కార్మికుల సమ్మె

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణలు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని లక్షా 30 వేల మంది ఆర్టీసి కార్మికులు 24 రోజులపాటు చేసిన సుదీర్ఘ సమ్మె కార్మికోద్యమాలకు స్ఫూర్తిదాయకంగా విజయవంతమైంది. భారత కార్మిక వర్గపు అతిపెద్ద విభాగాల్లో ఒకటైన ఆర్.టి.సి. కార్మికవర్గం ఐక్య కార్యాచరణతో వివిధ రాజకీయ పక్షాల సంఘీభావంతో, ప్రజల మద్దతుతో సాగించిన సమ్మె కార్మికోద్యమ చరిత్రలో గుర్తుంచుకోదగ్గ విజయాన్ని లిఖించుకుంది. ఏ.పి.యస్.ఆర్.టి.సి.లోని అన్ని కార్మిక సంఘాలూ అపూర్వ సంఘీభావంతో కలిసికట్టుగా 24 రోజులపాటు జరిపిన సమ్మె ట్రేడ్ యూనియన్ పరిధులను అధిగమించి ప్రభుత్వ వ్యూహాన్ని తిప్పికొట్టింది. ట్రేడ్ యూనియన్ పోరాటాలకు సహజమైన సాధారణ డిమాండ్లతో (వేతనాల పెంపు, బోనస్‌లు వగైరా) కాక ప్రభుత్వం తలపెట్టిన 'సంస్థ ప్రైవేటీకరణ' లక్ష్యంకి వ్యతిరేకంగా ఆర్.టి.సి. కార్మికవర్గం బాణం గురిపెట్టి మరీ విజయం పొందింది. ఈ ఘన విజయానికి మూలం ట్రేడ్ యూనియన్ల సాధారణ విధానాలు కావు. పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచమని కోరడమేకాక, తమకు అన్నం పెడుతున్న సంస్థను విచ్ఛిన్నం చేసే శక్తులను ఎదుర్కొనేందుకు ఎంతటి పోరాటాలకైనా వెనుదీయబోమంటూ ఈ సమ్మె సందర్భంగా కార్మికవర్గం అవలంభించిన వినూత్న ఎత్తుగడల్లోనే ఈ సమ్మె విజయం, ఘనత దాగి వుంది. రాష్ట్ర పబ్లిక్ రంగ సంస్థలపై ప్రపంచబ్యాంకు ఐదేళ్ళకు ముందే మరణ శాసనం రాసి వున్నప్పటికీ, అది అమలయ్యే క్రమం వేగవంతమవనున్న దశలో ప్రైవేటీకరణ లక్ష్యంపైనే గురిపెడుతూ ఆర్.టి.సి. కార్మికులు సాధించిన సమ్మె విజయం ప్రపంచబ్యాంకు, చంద్రబాబుల కూటమిని సాపేక్షికంగా ఎదుర్కొడ్డి నిలిచింది. ప్రపంచబ్యాంకు దన్నుతో ఏ ఉద్యమాన్నైనా ఉక్కుపాదంతో అణచేస్తాననే ధీమాతో సమ్మెపైనా, కార్మికులపైనా తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించిన ప్రభుత్వం ఆర్టీసి కార్మికుల సమిష్టి సంఘటిత పోరాటం వల్ల ఘోరంగా భంగపడింది.

### నిరవధిక సమ్మెకు దారితీసిన పరిస్థితులు

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగా సంస్థను సంక్షోభంలోకి నెట్టివేసే చరిత్ర గత కొన్నేళ్ళుగా మొదలైంది. కేవలం ప్రభుత్వ విధానాల వల్లే నష్టాల్లో కూరుకుపోయిన సంస్థను పరిరక్షించుకునేందుకు ఆర్టీసీ కార్మికులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నప్పటికీ వారి సంక్షేమం గురించి పట్టించుకోకుండా యాజమాన్యం కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నాలకు దిగింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయాణీకుల రవాణా సంస్థగా (19,000 బస్సులు) రికార్డు సృష్టించిన; అతి తక్కువ ప్రమాదాలు, వాహన, ఇంధన వినియోగం, పని సామర్థ్యంలో దేశంలోకెల్లా పేరెన్నికగన్న సంస్థగా వరుసగా 18 సం॥లు జాతీయ స్థాయిలో అవార్డు సాధించుకు వస్తున్న ఏ.పి.యస్.ఆర్.టి.సి.ని ప్రపంచబ్యాంకు, ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం ముప్పేటగా ''సహజ మరణా''నికి గురిచేస్తూ వచ్చారు. విద్యుత్ బోర్డుని నిలువునా చీల్చినట్లు, ఆల్విన్ కంపెనీని టోకున అమ్మినట్లు ఆర్టీసీని కూడా లేకుండా చేసి పెద్ద పెద్ద ప్రైవేట్ యజమానులకు రవాణా రంగాన్ని అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తూ వచ్చింది. ప్రపంచబ్యాంకు షరతుల అమలులో భాగంగా అన్ని ప్రభుత్వరంగ సంస్థల మాదిరే ఆర్.టి.సి.ని కూడా ప్రైవేట్ పరం చేసే కుట్రలో భాగంగా అయిదేళ్ళ క్రితం దాకా 100 కోట్ల రూ॥లుపైగా లాభంతో వున్న సంస్థలో ప్రభుత్వం 'కృత్రిమ నష్టాలు' సృష్టించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాల పేరిట అద్దె బస్సులను, ప్రైవేట్ బస్సులను విచ్చలవిడిగా అనుమతించటమేకాక, మోటారు వాహనాల పన్నులను ప్రత్యేకంగా ఆర్టీసీ నుంచి అదనంగా వసూలు చేయటం, వివిధ వర్గాల ప్రయాణీకులకు ప్రభుత్వం ప్రకటించే రాయితీల భారాన్ని మొత్తంగా ఆర్టీసీ మీద నెట్టడం. ఆర్టీసీ రూట్లలో తిరుగుతూ, సంస్థ ఆదాయాన్ని కొల్లగొడుతున్న ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణాను యధేచ్ఛగా అనుమతించటం వంటి ఉద్దేశ్యపూర్వక చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈ 'ఉద్దేశిత చర్యలు' 1997 వరకు లాభాల్లో వున్న సంస్థను కేవలం ఐదేళ్ళ కాలంలోనే 620 కోట్ల మేర భారీ నష్టాల వైపుకు తోసేశాయి. దీనికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అటెండరుకన్నా తక్కువ వేతనంతో దాదాపు 70 వేలకు పైగా ఆర్టీసీ కార్మికులు పనిచేస్తున్నప్పటికీ వారితో కుదుర్చుకున్న వేతనపు ఒప్పందాలను సైతం ప్రభుత్వం కాలరాచి అన్ని రకాలుగా కార్మికులను నిలువుదోపిడీ చేస్తూ వచ్చింది. వేతన ఒప్పందం ప్రకారం 2001 ఏప్రిల్ 1 నుండి పెరగాల్సిన నామమాత్రపు వేతనాలను కూడా ప్రభుత్వం అమలు చేయకుండా 1-4-2002 నుంచి మాత్రమే జీతాలు పెంచుతామని, ఇంతవరకు ఒక బస్సుకి 6.9 నిష్పత్తిలో వున్న సిబ్బందిని 6.2 కి తగ్గిస్తామని, పనిగంటలు పెంచుతామని, డ్రైవర్లే టిక్కెట్లు ఇవ్వాలని, మల్టీగ్రేడ్ సిబ్బందిని నియమిస్తామని, రూట్‌లో వుండగా బస్సులు దెబ్బతింటే నష్టాన్ని వసూలు చేస్తామని షరతులు విధించింది. ఈ రకంగా ఒకవైపు సంస్థను ఉద్దేశ్య పూర్వకంగా 'సహజమరణానికి' గురిచేయటం, మరోవైపు కార్మికుల డిమాండ్లకు ప్రభుత్వమే కౌంటర్ డిమాండ్లు పెట్టి షరతులు విధించి కావాలనే కష్టాలకు గురిచేయడమన్నదే వారిని ఈ సమ్మెకు పురిగొల్పింది.

ఈ సమ్మెకు దిగబోయేముందు గత ఆరు నెలలుగా కార్మికులు సాగించిన దశలవారీ పోరాటంపట్ల ప్రభుత్వం, యాజమాన్యాల నిర్లక్ష్యమే కార్మికుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. కార్మికులు ప్రకటించిన ప్రధాన డిమాండ్లు ఏవంటే 1-4-2001 నుండే పెరగాల్సిన వేతనాలను నూతన ఒప్పందం ప్రకారం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి; కార్మికులకు, సంస్థకు నష్టం కల్గించే సర్వీస్ కండిషన్లను మార్చాలి. ప్రైవేటు వాహనాలు, ప్రభుత్వ రాయితీలు, పన్నుల బెడదనుండి ఆర్టీసీని కాపాడాలి అనేవే. ఇంకా సంస్థలో కాంట్రాక్ట్ విధానాన్ని ఎత్తివేయడం, అన్నిచోట్ల పర్మనెంట్ ఉద్యోగులనే పెట్టడం, సింగిల్ సిబ్బంది విధానం, టికెట్లను జారీచేసే యంత్ర విధానం (టిమ్స్), రీ క్యాటగిరైజేషన్ వంటివి చేపట్టరాదంటూ మొత్తం 68 డిమాండ్లతో కార్మికులు సమ్మెకు దిగారు. ఈ 68 డిమాండ్లలో కార్మికులు తమ సొంతానికి అడిగింది కేవలం వేతన సవరణ మాత్రమే. మిగతా 67 డిమాండ్లు 'ప్రైవేటీకరణకు, కృత్రిమ నష్టాలకు' వ్యతిరేకంగా సంస్థను పరిరక్షించు కోవడానికి సంబంధించినవే. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విడివిడిగాను, సంయుక్తంగాను ఆగస్ట్ నెలలోనే ప్రభుత్వానికి, యాజమాన్యానికి ఆర్టీసీలోని గుర్తింపు సంఘాలు నోటీసులు సమర్పించాయి. పలు పర్యాయాలు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని స్వయంగా కలిసి డిమాండ్లను పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోవడంతో సంస్థలోని గుర్తింపు సంఘాలన్నీ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్టీసీలోని మూడు ప్రధాన యూనియన్‌లు ఎంప్లాయిస్ యూనియన్,

నేషనల్ మజ్దూర్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్లు కార్మికుల డిమాండ్లపై ఏకాభిప్రాయానికి రావటంతో మొత్తం సమ్మెలో మంచి పరిణామాలకు అది దారి తీసింది. ప్రైవేటీకరణ దిశగా ఆఘుమేఘాలపైన పరుగెడుతున్న సంస్థ మనుగడను నిలబెట్టుకోవడమే అన్నిటికంటే ప్రధానమై పోయిన నేపథ్యంలో ఆర్టీసీలోని కార్మికులు, యూనియన్లు అందుకు అనుగుణంగానే స్పందించారు. తన 'ప్రైవేటీకరణ' మార్గానికి తిరుగులేదనే గర్వాతిశయంతో ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్నపుడు, ఐక్యంగా వుంటే తప్ప వున్న హక్కులను కాపాడుకోవడం సాధ్యంకాని పరిస్థితిలో సంస్థ వుండటం వల్ల, కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యాచరణ కమిటీగా ఒకే గొడుగు కిందికి వచ్చాయి. పోరాటంలో ఐక్యత పరంగా కార్మిక సంఘాలు ప్రాథమికంగా సాధించిన ఈ విజయమే అక్టోబర్ 15 నుండి 24 రోజులపాటు అవిచ్ఛిన్నంగా సమ్మె సాగడానికి, తాత్కాలికంగా అయినా ప్రభుత్వాన్ని అన్నిరకాలుగా శృంగ భంగం చేయడానికి మూలకారణమైంది.

## ఆర్టీసీ ప్రైవేటుపరం ప్రజల అభిమతమట

రాష్ట్ర కార్మిక రంగం చరిత్రలో మున్నెన్నడూ లేనంత స్థాయిలో ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపై నిలబడి, ప్రతిపక్షాల పూర్తిస్థాయి మద్ధతుతో ప్రజల సంఘీభావంతో సమ్మెను కొనసాగిస్తుండగా మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా దన్నుతో ఆర్టీసీ ప్రైవేటీకరణ తప్ప మరోమార్గం లేదనే తీరులో ప్రజాభిప్రాయాన్నే తనకనుకూలంగా కబ్జా చేసుకోవాలని పడరాని పాట్లు పడ్డాడు. కుటిల పాలనకు సంబంధించి మాకియవెల్లీ ప్రవచించిన ఆధునిక చాణక్యతంత్రాలన్నీ వుపయోగించి, ఆర్టీసీ ప్రైవేటీకరణ లక్ష్యాన్ని సఫలం చేసుకోడానికిగాను ఇతగాడు పాలకవర్గ రాజనీతిలో ఎన్ని మొసలి ప్రేమలుంటే అన్నింటినీ ఈ సమ్మెకాలంలో ప్రయోగించాడు. సమ్మె కారణంగా పడరానిపాట్లు పడుతున్నారంటూ ప్రజలపై సానుభూతి వర్షం కురిపించాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నప్పటికీ కార్మిక సోదరులకు ప్రభుత్వపరంగా ఎన్ని సౌకర్యాలు కల్పించగలమో అన్నీ సమకూర్చామని, వారి డిమాండ్లను కూడా చాలా వరకు ఆమోదించామని, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వున్న రాష్ట్ర పరిస్థితులను ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు అర్థం చేసుకోవడం లేదని ఆరోపిస్తూ సమ్మెకు బాధ్యతను పూర్తిగా ఆర్టీసీ కార్మికులకే నెట్టేసే ప్రయత్నం చేశాడు. దసరా పండుగ సీజన్ రద్దీలో సమ్మె మొదలెట్టాం కాబట్టి ప్రభుత్వం మెడలు వంచుతామని కొందరు కార్మిక నాయకులంటున్నారని, ఆర్టీసీలోని మూడు ప్రధాన కార్మిక సంఘాలకూ బయటి వ్యక్తులు నాయకులుగా వున్నందువల్లే ఇదంతా జరుగుతోందని, వాళ్ళు సంస్థలో వుద్యోగులు కారు కాబట్టి ఎన్ని రోజులు సమ్మె చేసినా వారికి పోయేదేమీ లేదని, సమ్మె కారణంగా జీతాలు రాక నిండా మునిగేది తామేనని కార్మికులు గ్రహించాలని చంద్రబాబు హెచ్చరించాడు. బయటి వ్యక్తులు యూనియన్ నేతలుగా వుండకూడదన్నపుడు ఆర్టీసీకి ఇతర ప్రభుత్వరంగ సంస్థలకూ తెలుగుదేశం పార్టీ వారిని, బయటవారినీ మేనేజింగ్ డైరెక్టర్లుగా, అధ్యక్షులుగా ఎందుకు నియమిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం మాత్రం వుండదు. తిమ్మిని బమ్మి చేసే ఈ టక్కుటమార విద్యలన్నీ పాలకవర్గాలకు సహజ లక్షణమే కాబట్టి ఈ ఆరోపణల్లో ప్రత్యేకించి విశేషమేమీ లేదుగానీ, ఈ సమ్మె పొడవునా ఆర్టీసీ కార్మికవర్గాన్ని చీల్చాలని, ఆర్టీసీ కార్మికులకు, ప్రయాణీకులకు మధ్య చిచ్చు రగిలించాలని, ప్రజల మధ్య వైరుధ్యాలను రగుల్కొల్పి 'ప్రజాభిప్రాయం' పేరుతో ప్రపంచబ్యాంకు 'ఆర్టీసీ ప్రైవేటీకరణ' లక్ష్యాన్ని సాధించాలని చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించాడు. సమ్మె మొదలైనప్పటినుండి తెలుగుదేశం కార్యకర్తలను, ప్రైవేట్ వాహనాల యజమానులను ప్రేరేపించి ఆర్టీసీ బస్సులను రోడ్లమీద తిప్పించాలని చూశాడు. 'రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా ఆర్టీసీని ఎందుకు ప్రైవేటుపరం చేయడం లేదని ప్రజలు అడుగుతున్నారు; ఆర్టీసీ కార్మికుల వైఖరితో ప్రజలంతగా విసిగిపోయార'ని వ్యాఖ్యానించాడు. 'ప్రజల ఆకాంక్షలను గౌరవించి ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తారా' అని విలేఖరులడిగితే, సామాన్య ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని ప్రకటించడం ద్వారా తన భవిష్యత్ ప్రైవేటీకరణ లక్ష్యాన్ని చెప్పకనే ప్రదర్శించాడు. ఇంకా 'ముఖ్యమంత్రితో ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా టెలివిజన్‌లో ముందే రికార్డు చేసిన ప్రభుత్వానుకూల వ్యక్తుల, బ్యూరాక్రాట్ల ఫోన్‌కాల్స్ నాటకం నడిపించాడు. తమ ఉద్యోగ జీవితం మొత్తంలో ఏనాడూ ప్రజల పక్షాన నిలబడిన చరిత్ర లేని 'పిడికెడుమంది' బ్యూరాక్రాట్ల 'ప్రైవేటీకరణ అనుకూల' ఫోన్‌కాల్స్‌నే మొత్తం రాష్ట్ర ప్రజల ఆమోదవాణిగా ముద్రించి ప్రజలు తన వెంటే వున్నారంటూ సమ్మె చేస్తున్న కార్మికులను బెదిరించాలని చూశాడు. బెదిరింపులు పనిచేయలేదని అర్థమయ్యాక 'ఎస్మా' వంటి క్రూర చట్టాలను ప్రయోగించి దండోపాయానికి దిగాడు. దండోపాయానికి కూడా కార్మికులు లొంగక పోవడంతో ముసుగులో గుద్దులాట నుంచి బయటపడి ఆర్టీసీ ప్రైవేటీకరణ తప్ప మరొక మార్గం లేదని, ప్రైవేటీకరణ పరిణామాలకు సిద్ధంగా వుండమని తెలుగుదేశం కార్యకర్తలకు పిలుపిచ్చాడు. అయితే సాటిలేని ఐక్యతతో బరిలోకి దిగిన కార్మికులు అడుగడుగునా ప్రజాభిప్రాయాన్ని తమవైపుకు మల్చుకుని ఘన విజయం సాధించారు.

## అవిచ్ఛిన్నంగా అపూర్వంగా సమ్మె

పేపర్ ప్రకటనలు, ఈటీవీ, గీటీవీలలో విన్యాసాలు, ఫోన్‌కాల్స్ రాజకీయాలు వంటి హైటక్కుటమారాలతో ప్రజాభిప్రాయాన్ని ఎప్పటిలాగే కబ్జా చేయాలని చంద్రబాబు చేసిన అడ్డగోలు ప్రయత్నాలు ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఘోరంగా బెడిసి కొట్టాయి. రాజకీయపక్షాలూ, వివిధ ప్రజా విభాగాలూ అందించిన సంపూర్ణ మద్ధతుతో ఆర్టీసీ కార్మికులు తమ చరిత్రలో ఎన్నడూ లేనంత ఉధృత స్థాయిలో సమ్మె సాగించి గెలుపొందారు. వేతనాల హెచ్చింపు విషయంలోనే కాకుండా ప్రభుత్వం ఆరోపిస్తున్న 'సంస్థ నష్టాల' నుంచి గట్టెక్కించేయటమే ప్రధాన ధ్యేయంగా కార్మికులు పోరాటం సాగించటం వల్ల అది అన్ని వర్గాల ప్రజల మద్ధతును కూడగట్టుకునేందుకు దోహద పడింది. ప్రపంచంలోనే పనిసామర్థ్యంలో ప్రతిష్టాత్మకమైన సంస్థ నష్టాల బారిన పడిందంటే బాధ్యులెవరో చెప్పమని కార్మికులు ప్రజల్లోకి వెళ్ళి వారి సంఘీభావాన్ని, మద్ధతును కూడగట్టు కోవటంలో సఫలీకృతులైనారు. 24 రోజుల సుదీర్ఘ సమ్మెలో రాష్ట్ర రవాణా వ్యవస్థ స్తంభించిపోయి తీవ్రమైన ఇక్కట్లపాలైనప్పటికీ ప్రజలు ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల న్యాయమైనవని విశ్వసిస్తూ వచ్చారు. సంస్థ నష్టాల గురించి పట్టింపులేకుండా కార్మికులు వేతనాల కోసం ఆందోళన చేస్తున్నారన్న ప్రభుత్వ ప్రచారాన్ని ప్రజలు ఏ మాత్రం విశ్వసించలేదు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో వుంటున్నప్పటికీ తనంతతాముగా 89 కోట్ల రూ॥ల వేతనాన్ని అదనంగా కార్మికులకు చెల్లించడానికి ముందుకొస్తున్నామని ఇంతకు మించి నయాపైసా ఎక్కువ అంగీకరించేది లేదని ప్రభుత్వం మొండికేసింది. పైగా దేశంలో ప్రభుత్వ రవాణా సంస్థలు ఎలా ఆర్థిక దివాళాలో కూరుకుపోయాయో వివరిస్తూ గణాంకాల లెక్కలు చూపించింది. కార్మికుల వేతనాలే సంస్థల మూలుగులను పీల్చేస్తున్నాయన్న ప్రపంచబ్యాంకు చిలకపలుకులను ప్రభుత్వం అడుగడుగునా వల్లిస్తూ కార్మికులపై నేరారోపణ చేసింది. అయితే ఆర్టీసీని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించిందీ, ప్రైవేటీకరణ పేరుతో అంధకారంలోకి నెడుతున్నదీ ప్రభుత్వమే అనే వాస్తవాన్ని కార్మికులు, ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు సమర్థవంతంగా ముందుకు తీసుకురావటం ద్వారా ప్రజాభిప్రాయాన్ని కబ్జా చేయటం కాక చిత్తశుద్ధితో తమవైపుకు తిప్పుకున్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధుల జీతభత్యాలను విపరీతంగా

పెంచివేసిన ప్రభుత్వాన్ని, గ్రేట్ (డ)మాల్ పేరుతో హైదరాబాద్‌లో విదేశీ వ్యాపార సంస్థల ప్రయోజనాల కోసం కోట్లాది రూ॥ల ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టి వృథాపర్చిన ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలో అలాగే అర్థం చేసుకున్నారు. ఈ కోణంలోనే ప్రభుత్వం బాగా అభాసుపాలయింది. జె.ఏ.సి. నాయకత్వంలో కేవలం కార్మికులు, ఉద్యోగులు మాత్రమే సమ్మెలో పాల్గొంటారనే ప్రభుత్వ అంచనాలు ఇక్కడే తలకిందులైనాయి. ప్రభుత్వం ఎన్ని గారడీలు చేసినా లక్షా 30 వేలమంది కార్మికులు ఒక్కత్రాటిన నిలబడ్డారు. పైగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టుకున్నారు. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వందలాది ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. సమ్మెపట్ల ఉదాసీన వైఖరి పనిచేయలేదని అర్థమైనాక ప్రభుత్వం బెదిరింపులు మాని ప్రత్యక్ష చర్యలకు దిగింది. కార్మిక నాయకులపై క్రూరమైన 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించింది. సమ్మె మధ్యలో ప్రతిరోజూ వందలాది ఆందోళనకారులను అరెస్టు చేసి పాశవికంగా లాఠీచార్జీ జరిపించింది. అత్యవసర సర్వీసుల చట్టం కింద 120 మంది ఉద్యోగులను సర్వీస్‌నుండి తొలగించింది. 1000 మందిని సస్పెన్షన్‌కి గురిచేసింది. వేలాదిమంది కార్మికులను అరెస్ట్ చేసి నిర్బంధించింది. కార్మికులపై నిర్బంధ ప్రయోగం జరిగాక అఖిలపక్ష రాజకీయ నాయకులు సమ్మెకు మద్దతుతెల్పి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాక ప్రభుత్వ హింసాకాండ అవధులు మీరింది. చివరకు తెలుగుదేశం కార్యకర్తలను కూడా కార్మికులపై దాడులకు ప్రభుత్వం ప్రేరేపించింది. అయితే ప్రభుత్వ అణచివేత చర్యలను ఆర్టీసీ సిబ్బందితోపాటు వేలాదిమంది ఆందోళనకారులు కలిసి ఎదుర్కోవడంతో విస్తృత ప్రజానీకం సమ్మెకు మద్దతు ప్రకటించడంతో అంతవరకూ చర్చలే అనవసరం అన్న ప్రభుత్వం మెట్టు దిగింది. (ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ దమననీతికి, నిర్బంధకాండకు నిరసనగా ప్రతిపక్షాలు ఇచ్చిన బంద్ 'పిలుపు' ప్రభుత్వంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది మొదటినుండి ఆర్టీసీ కార్మికుల సమ్మెకు, చివర్లో తలపెట్టిన ఈ బంద్‌కి పీపుల్స్‌వార్ పార్టీ, రాడికల్ విద్యార్థి యువజన సంఘాలు మద్దతును, సంఘీభావాన్నీ ప్రకటించాయి). ఈ రకంగా విద్యుత్ సమ్మె కాలంలో కంటే మించిన అప్రతిష్టను ప్రభుత్వం మూటగట్టుకుంది. ఇది ప్రభుత్వం మెట్టుదిగటం మాత్రమే కాదు. సంస్కరణల అమలులో చచ్చినవారు చావగా బతికి వున్నవారు చేసే సంస్కరణల వ్యతిరేక పోరాటాలను అణిచేందుకుగాను ప్రపంచబ్యాంకు ఏదైతే అవసరమని తేల్చి చెప్పిందో అట్టి 'ప్రభుత్వ రాజకీయ దృఢచిత్తా'నికి జరిగిన పరాభవమే ఇది. కార్మికులు ఒంటరిగా లేకపోవటం వారికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతు లభించడమే ఈ పరాభవానికి కారణం. అంతిమ ఫలితం ఆర్టీసీ కార్మికుల విజయం. ఇది తాత్కాలికం, సాపేక్షికమే కావచ్చు. కానీ ప్రపంచబ్యాంకుకు, దాని తైనాతీలకు రెక్కల కష్టంతో బతికే ఆర్టీసీ కార్మికుల, రాష్ట్ర ప్రజల ఛీత్కరింపు ఇది. ఈ విధంగానే అంటే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్బంధానికి వ్యతిరేకంగా, కార్మికుల్లో చీలికలు తేవడానికి వ్యతిరేకంగా ఆర్టీసీ కార్మికులు సాధించుకున్న విజయంగానే ఈ సమ్మె చరిత్రకెక్కుతుంది.

నవంబర్ 7 అర్ధరాత్రి ప్రభుత్వానికి, జె.ఏ.సి.కి కుదిరిన ఒప్పందం ప్రకారం కార్మికుల 68 డిమాండ్లలో 35 అంశాలపై అంగీకారం కుదిరింది. అలవెన్సులు, బత్తాలకు కలిపి వేతన సవరణ కింద 125 కోట్ల రూ॥లు ఇవ్వడానికి ప్రభుత్వ అంగీకారం; 2001 నుండి 2005 మార్చి వరకు ఈ ఒప్పందం అమలులో వుండటం; మోటారు వాహనాల పన్నును సిటీ సర్వీసులకు 10 శాతానికి, గ్రామీణ సర్వీసులకు 12.5 శాతానికి తగ్గింపు; ఆర్టీసీ రాయితీల్లో 50 శాతం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకారం; అక్రమ రవాణా చేసే వాహనాల నియంత్రణకు చర్యలు వీటిలో ముఖ్యమైనవి. ఈ డిమాండులను రాతపూర్వకంగా అంగీకరించాల్సినంతగా రాష్ట్ర ప్రభుత్వం తన విశ్వసనీయతను కోల్పోయింది. ఈ ఒక్క విషయంలోనే కాదు. ఇదే కాలంలో జరిగిన జూనియర్ డాక్టర్ల సమ్మెలో కూడా ప్రభుత్వం ఇలాగే భంగపడింది. ఇస్తానన్న స్టైయిఫండ్‌ని ఇవ్వక పోవటం, గతంలో అంగీకరించిన డిమాండ్లకు కొర్రిబెట్టడం ప్రతిచోటా ఇదే తంతు. చివరకు ప్రభుత్వం మెడలువంచి డిమాండ్లు సాధించుకున్న జూనియర్ డాక్టర్లు ఆ డిమాండ్లను రాతపూర్వకంగా అంగీకరిస్తే తప్ప వూరికే మాటలను నమ్మేదిలేదని చెప్పి ఆ రకంగానే సాధించుకున్నారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం తన ప్రజల విశ్వసనీయతను ఇంతగా కోల్పోయిన వైనం మున్నెన్నడూ జరగలేదు.

## ప్రభుత్వ యత్నాలను ప్రతిఘటించండి!

*ఆర్టీసీ కార్మికులు కొనసాగిస్తున్న న్యాయమైన సమ్మెను అణిచేసేందుకు ప్రభుత్వం చేస్తున్న అన్ని ప్రయత్నాలను ప్రతిఘటించి కార్మికులకు పూర్తి మద్దతు తెలుపాలని సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ రాష్ట్రకమిటీ ప్రజలకు పిలుపిచ్చింది. ఈ మేరకు రాష్ట్రకమిటీ కార్యదర్శి కా॥ రామకృష్ణ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టింది. మొట్టమొదటిసారిగా ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపై నిలబడటం, ప్రతిపక్షాలన్నీ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించడం, అధికార పక్షంలోని కొందరు ప్రజాప్రతినిధులు కూడా సమ్మె సమంజసమేనని వ్యాఖ్యానించటం లాంటి పరిణామాలు ఉద్యమానికి పూర్తి అనుకూల వాతావరణాన్ని కల్పించాయని ఆ ప్రకటన పేర్కొంది. అయితే ఈ ఉద్యమానుకూల పరిణామాలు మింగుడు పడకే పోలీసు జులుంతో సమ్మెను అణిచేందుకు ముఖ్యమంత్రి కుట్రలు పన్నుతున్నాడని, అయినప్పటికీ ఎన్నో ప్రతిబంధకాలను ఎదుర్కొంటూనే కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారంటూ ఆ ప్రకటన కార్మికులకు అభినందనలు తెలిపింది.*

*ఆర్టీసీ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె, వారి డిమాండ్లు పూర్తిగా న్యాయపూరితమైనవని, ఆర్టీసీని తెగనమ్మాలనే దురుద్దేశంతో చంద్రబాబే దాన్ని నష్టాలబాట పట్టించాడని పేర్కొంటూ, పై వాస్తవాన్ని మరుగునపెట్టి కార్మికులు డిమాండు చేస్తున్న న్యాయమైన కోర్కెలను గొంతెమ్మ కోర్కెలుగా ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఆ ప్రకటన విమర్శించింది. ఆర్టీసీ సిబ్బందికి ఎన్.జి.వో.లతో సమానంగా వేతనాలు చెల్లించాలని, ఆర్టీసీ నుంచి వసూలు చేస్తున్న వాహన పన్నును 15 శాతం నుంచి ఏడు శాతానికి తగ్గించాలని, రాయితీల భారాన్ని ప్రభుత్వమే మోయాలని డిమాండు చేస్తూ ప్రజలు, ప్రజాస్వామికవాదులు సమ్మెకు మద్దతునివ్వాలని ఆ ప్రకటన విజ్ఞప్తి చేసింది.*

### 'సూత్రరీత్యా విజయం'

ఈ సమ్మె సాధించిన విజయానికి రెండు ముఖాలున్నాయి. కార్మికుల జీతభత్యాలు, బస్సులపై పన్ను తగ్గింపు, రాయితీల సొమ్ము సంస్థకు చెల్లింపు, ప్రైవేట్ సర్వీసుల నిరోధం వంటివన్నీ విస్తృతార్థంలో ఆర్థిక

సంబంధమైన అంశాలు. ఈ అంశాలన్నింటిపైనా ప్రభుత్వం మెట్టు దిగివచ్చి ఒడంబడిక చేసుకోవటం ద్వారా ఆర్థిక కోణంలో కార్మికులు అర్ధ విజయం సాధించగా మరో కోణం సంస్థ ప్రైవేటీకరణ ప్రమాదానికి, దానిపైన కార్మికుల వాదనలకు సంబంధించినది. కార్మికుల వేతన పెంపు డిమాండ్లే సంస్థను తినేస్తున్నాయంటూ ప్రభుత్వం మొదట్నుండి మీడియా ద్వారా ప్రచార దాడికి దిగటం, సమ్మెవల్ల అక్షరాలా ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిపోయి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా ఇక్కట్ల పాలవడం అనే రెండు అంశాలూ మామూలు పరిస్థితుల్లో సమ్మెదార్ల వ్యతిరేక, ప్రభుత్వానుకూల వాతావరణాన్నే సృష్టించి వుండేవి. కానీ ముఖ్యమంత్రి హైటెక్కు టమార విద్యలన్నీ ఈ కోణంలో ఈ సందర్భంలో ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఆర్టీసీ దెబ్బతింటుండటానికి పన్ను, రాయితీలు, ప్రైవేట్ బస్సులు అనే మూడు ప్రధాన కారణాలపై కార్మికుల వివరణలు ఎంత బలంగా వ్యక్తమయ్యాయంటే వీటిపై ప్రభుత్వ జవాబులు పలుచబారి పోవడం, సమ్మెసాగేకొద్దీ ఎక్కువమంది ప్రజల దృష్టికి రావటం మొదలైంది. ఆర్టీసీ కార్మికుల వాదన, వివరణ ప్రజల్లో చర్చలకు దారితీసి అవి ప్రజామోదాన్ని పొందే క్రమానికి దారితీశాయి. ప్రభుత్వాలకైనా, సమ్మెలకైనా సమాజ ఆమోదనీయతే కీలకం కాబట్టి ఇక్కడే ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందగా కార్మికులకు సూత్రరీత్యా పెను విజయం దక్కింది. ప్రైవేటీకరణ విష ఫలితాల రుచిని ఇటీవల కాలంలో ప్రజా విభాగాలన్నీ ఎదుర్కొంటున్నందువల్ల ఆర్టీసీ కార్మికుల వాదనల వెనుక వాస్తవం ప్రజలకు అర్థమైంది. ఎంతమందికి అర్థమైంది, ఎంతమంది ప్రజలు ఆమోదించారు అనే శాతాల లెక్కల్లోకి పోనవసరం లేదు కానీ ప్రభుత్వం ఈసారికి మటుకు ప్రజాభిప్రాయాన్ని కబ్జా చేయలేక పోయింది. ప్రజామోదాన్ని క్రమంగా తమకు అనుకూలంగా తిప్పుకోగలిగారు కాబట్టే కార్మికులు ఆర్టీసీ నష్టాలకు కారకులెవ్వరు; సంస్థ ప్రైవేటీకరణ ప్రమాదం అనే విషయాల్లో సూత్రరీత్యా విజయం సాధించారు. అందుకే ప్రధాన దినపత్రికలు సైతం ఆర్టీసీ సమ్మెలో ఆర్థికాంశాల రీత్యా, సూత్రరీత్యా కూడా కార్మికులదే 'ముప్పాతిక గెలుపు' అని వ్యాఖ్యానించక తప్పలేదు.

అయితే సాపేక్షికమే అయినా గొప్పదైన ఈ విజయం వెనుక కార్మికవర్గం అంతర్మథనం చేసుకోవాల్సిన అంశాలు చాలా వున్నాయి. ఈ సమ్మె ఆర్టీసీకే గాక మొత్తం కార్మికవర్గానికే గుణపాఠాలు నేర్పుతోంది. కార్మికుల యూనియన్ల అపూర్వ ఐక్యత, వివిధ రాజకీయ పక్షాల, వివిధ సెక్షన్ల ప్రజల మద్దతు, సంఘీభావం లేకుంటే ఆర్టీసీ సమ్మె ఫలితాలను సాధించేది కాదు. తమ ఇళ్ళపైకి అర్ధరాత్రి దాడులుకు దిగి, తమ భర్తలను, బిడ్డలను పోలీసులు పట్టుకెళ్లి నిర్బంధిస్తున్నప్పటికీ ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు, స్త్రీలు, వెరవక వీధుల్లోకి వచ్చి ధర్నాలకు, ఆందోళనలకు కూడా దిగకుండా వుండివుంటే ఈ సమ్మె విజయం పొందేది కాదు. సమ్మె సందర్భంగా కార్మికులపై ప్రయోగించిన దారుణమైన ఫాసిస్ట్ నిర్బంధం, హింసాకాండలు సైతం కార్మిక కుటుంబాల దృఢచిత్తాలను దెబ్బతీయలేక పోయాయి. విద్యుత్ ఛార్జీల భారీ పెరుగుదలకు వ్యతిరేకంగా సం॥రం క్రితం నడిచిన ఆందోళనలోని బలహీనతలను ఆర్టీసీ కార్మికుల సమ్మె పోరాటం సునాయాసంగా అధిగమించేందుకు దోహదపడిన అంశాలలో ఇదే ముఖ్యమైంది. చివరగా, ఈ సమ్మె వేతనాల డిమాండ్‌కే పరిమితమై ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా రాజకీయ రూపం తీసుకోనట్లయితే, దాంతో భాగంగా అన్ని ప్రతిపక్షాల, ప్రజా విభాగాల మద్దతు సాధించలేక పోయినట్లయితే ప్రభుత్వ కుటిల ఎత్తుగడల ముందు నీరుగారిపోయి వుండేది. ఆర్థిక డిమాండ్లతో కూడినప్పటికీ ప్రధానంగా ఇది రాజకీయ సమ్మె, ఆ రకంగానే ఇది విజయవంతమైంది. ఆర్టీసీ కార్మికులు సాధించిన ఈ ప్రజామద్ధతే ప్రైవేటీకరణ రాజకీయ ఎత్తుగడలను ప్రస్తుతానికి ఛిద్రం చేయించింది. ఆర్థిక డిమాండ్లతో కూడిన రాజకీయ సమ్మె సాధించిన విజయమిది.

ఈ అనుకూలాంశాలను మినహాయించి చూస్తే, ఈ సమ్మె విజయం తదనంతర పరిణామాలేమిటి? ముందే చెప్పినట్లుగా ఇది ఆర్టీసీ కార్మికులు సాపేక్షికంగా సాధించిన గొప్ప విజయమే కానీ ప్రభుత్వ విధానాలను ఇది ప్రభావితం చేయలేదు. ఎందుకంటే ఐదేళ్ల క్రితమే ఆర్టీసీ వంటి కీలకమైన ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు సంబంధించి ప్రపంచబ్యాంకు జారీచేసిన ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మార్లూ కట్టుబడిపోయి వుంది. ఆర్టీసీ, సింగరేణిలపై ప్రపంచబ్యాంకు మరణ శాసనం రాసేసింది. వీటిలో దేన్ని ముందుగా ప్రైవేటీకరిస్తారన్నది ప్రభుత్వం సమయానుకూలత మీదే ఆధారపడి వుంది. కుదుర్చుకున్న వేతన ఒప్పందం అమలుకు కూడా రకరకాలుగా 'కొర్రీ'లు పెడుతున్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులు సాధించిన 'సంస్థ ప్రైవేటీకరణ' వ్యతిరేక డిమాండ్లను చిత్తశుద్ధితో ఆమోదించలేదన్నదే నేటి పరమ వాస్తవం. ఈ నేపథ్యంలో ఆర్టీసీని 13 విభాగాలుగా వేరుచేసి అధికార పార్టీలో ప్రముఖులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని, రాష్ట్రంలో 70 శాతం పైగా తెలుగుదేశం నాయకుల యాజమాన్యంలో వుండే ప్రైవేట్ బస్సు సర్వీసులను నియంత్రించి వాటిపై వాహన పన్నులను గరిష్టంగా విధించి అమలుచేయటాన్ని, సంస్థకు ఉద్దేశ్యపూర్వక, కృత్రిమ నష్టాలు కల్గించడాన్ని ఇంకా ఇలాంటి సవాలక్ష ప్రైవేటీకరణ మార్గాల నుండి ప్రభుత్వం వైదొలుగుతుందని ఆశించడం పెను భ్రమే అవుతుంది. అన్నింటికంటే మించి వచ్చే 6 నెలల్లోగా స్వచ్ఛంద పదవీ విరమణ (వి.పి.యస్.) తదితర పథకాలతో 25వేలమంది కార్మికుల ఉద్యోగాలను వూడబెరకబోతున్న ప్రమాదం కార్మికుల జీవితాలపై పొంచుకొని వుంది.

అందుకే ప్రస్తుత సమ్మె విజయం ముందు ముందు ఆర్టీసీ కార్మికులు చేయాల్సి వున్న కీలక పోరాటాలకు ప్రారంభమే కానీ ఇదే ముగింపు కాదు. ప్రపంచబ్యాంకు కారుమేఘాలు రాష్ట్రం మొత్తాన్ని ఆవరించుకుని వున్న పరిస్థితుల్లో కేవలం ట్రేడ్ యూనియన్ డిమాండ్లు, వేతనాలు కాస్త పెరగ్గానే చప్పబడిపోయే కేవల ట్రేడ్ యూనియన్ పోరాట రూపాలు ఏ సంస్థ కార్మికులకైనా పరిష్కార మార్గం కావు. ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాలు వేతన వ్యవస్థను మెరుగుపర్చుకునే పరిమిత ప్రాతిపదికన కాక ప్రపంచబ్యాంకు వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ చైతన్యంతోనే కొనసాగించాల్సిన అవసరముంది. రివిజనిస్టులు దశాబ్దాలుగా ఊడలు దింపిన ట్రేడ్ యూనియన్ ఆర్థికవాద పోరాటాలు ఇకముందు పనికిరావు. ఫలితాలు రావు కూడా. కార్మికవర్గం తన పోరాటంలో నేడు ఒంటరిగా లేదనేందుకు ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వ దమననీతికి, అణచివేతకు వ్యతిరేకంగా అన్నివర్గాల ప్రజలూ గళమెత్తి ఆర్టీసీ కార్మికులకు మద్ధతు ప్రకటించడమే కారణం. ఏ రకంగా అయినా సరే ఆర్టీసీని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం పొంచుకుని కూర్చున్న సందర్భంగా ఆర్టీసీ కార్మికవర్గం తన పోరాటాన్ని తదుపరి ఇతర శ్రమజీవుల పోరాటంతో సమైక్యం చేయాలి. ఆర్టీసీ కార్మికుల సమ్మె చాటుతున్న సత్యం, ఇస్తున్న సందేశం ఇదే. ❑

**''మనం ప్రతిరోజు ముఖం కడుక్కుంటాం. కొందరం ఎక్కువసార్లు కూడా కడుక్కుంటాం. ఆ తర్వాత, ''పరిశీలన, అధ్యయనం'' పద్ధతిలో మనల్ని మనం అద్దంలో తనిఖీ చేసుకుంటాం (పెద్దగా నవ్వులు). ఏదైనా సవ్యంగా లేదేమోనన్న భయంతో అలా చేస్తాం. ఎంత బాధ్యతాయుతమైన ప్రవర్తన! మనం వ్యాసాలు రాయడం, ఉపన్యాసాలివ్వడంలో కూడా అంతే బాధ్యతాయుతంగా వుంటే, పొరపాట్లు చెయ్యం. సరిగా చెప్పలేనివి చెప్పకండి. అది ఇతరుల ఆలోచనలపై, చర్యలపై ప్రభావం చూపగలదని ఎప్పుడూ గుర్తుంచుకోండి.''**

**– మావో**

(చివరి పేజీ తరువాయి...)

అందిస్తూ వస్తున్నారు. జటిలమైన భాష, స్థానిక పద ప్రయోగాలు, దీర్ఘవాక్యాలు, అనువాద శైలీ లోపాలు స్థానిక-(రాష్ట్ర), సమస్యలపై తగినంత సమాచారం కొరవడటం, సకాలంలో పత్రిక శ్రేణులకు అందకపోవటం వంటివి క్రాంతి పాఠకులు పత్రికలో గుర్తించిన ప్రధానాంశాలు. క్రాంతి పత్రిక కేవలం రాజకీయ, సిద్ధాంత పత్రికలా వుండటంకాక వుద్యమ పత్రికగా వుండాలని రాష్ట్ర, స్థానిక స్థాయిలలో ప్రజాపోరాటాలను మరింత విస్తృతంగా ప్రతిబింబించే పత్రికగా ప్రధానంగా వుండాలని కొన్ని విమర్శలూ, సూచనలు వచ్చాయి. రెండు నెలల పత్రికను కూడా సకాలంలో తేవాలని, ప్రజాపోరాటాలు ముగిసిపోయాక వాటిని వ్యాఖ్యానించేలాగ కాక, ప్రభుత్వ విధానాలను, అవి తేగల సామాజిక పరిణామాలను ఊహించి కేడర్‌కి, ప్రజలకు గైడెన్స్ అందించే సమిష్టి ఆర్గనైజర్‌గా క్రాంతి వేగం పుంజుకోవాలని కూడా వ్యాఖ్యలు క్రాంతికి అందాయి. అలాగే క్రాంతి శైలి, తయారీ, మేకప్, ప్రూఫ్‌రీడింగ్ లోపాలు, అర్థభేదాలు వంటి రూపానికి సంబంధించిన అంశాలపై కూడా కొద్దిమంది పాఠకుల నుంచి అభిప్రాయాలు క్రాంతికి అందాయి.

రాయటం, పాఠకులు చదవటం, విషయ పరిశీలన, గుణదోషాలను ఎత్తి చూపటం-అవి తిరిగి, రచనలపై, రాసే ప్రక్రియపై ప్రభావం చూపి పత్రిక నిర్వహణను మరింతగా మెరుగుపర్చటం, ఆ రచనలూ, భావాలూ తిరిగి పాఠకుల వద్దకు చేరి భౌతికశక్తిగా మారటం అనే ఈ క్రమమంతా ప్రజాపంథాకి సంబంధించినదే. ఈ అవగాహనతోనే పాఠకుల నుంచి పరిమితంగానే అయినా వచ్చిన పై విమర్శలను, సూచనలను క్రాంతి వినమ్రంగా స్వీకరిస్తోంది. పాఠకుల అభిప్రాయాల మేరకు తక్షణం ఆచరణకు సాధ్యమయ్యే అంశాలను అమలు చేయటం, వెంటనే ఆచరణ సాధ్యంకాని అంశాలను సమీక్షించుకుని భవిష్యత్ ఆచరణకోసం వాటిని స్మృతిలో వుంచుకోవటం క్రాంతి ప్రాథమిక బాధ్యత. పదేళ్ల క్రితం, అంతకుముందూ క్రాంతి ఎలా వుండిందో, అయిదేళ్ల క్రితం ఎలా నడిచిందో ఇపుడెలా నడుస్తుందో బేరీజు చేసుకుని దాని కనుగుణంగా కూడా పని తీరును క్రాంతి మెరుగుపర్చుకోవలసి వుంది.

పత్రిక గుణ దోషాలపై స్వీయపరిశీలన, స్వీయ విమర్శలతో క్రాంతి తనదైన ఈ అంతర్మథనాన్ని కల్గివుంటూనే రెండో కోణం నుంచి అంటే పాఠకుల నుంచి నిజమైన, విస్తృతమైన సహకారానికై విజ్ఞప్తి చేస్తోంది. పత్రిక నిర్వహణలో సిబ్బందికి ఎంత బాధ్యత వుందో, పాఠకులకు కూడా అంతే బాధ్యత వుంది. పాఠకులు తమకు ఏది నచ్చిందో, ఏది నచ్చలేదో వివరిస్తూ సూచనలు, చిన్న చిన్న వుత్తరాలు, వ్యాసాలు, పత్రికకు పంపాలనీ, పత్రికను విజయవంతంగా నడపడానికి ఇదొక్కటే మార్గమని కా॥ మావో చాలా స్పష్టంగా చెప్పారు. పత్రికలను నడపడంలో మన పార్టీకి ముప్పై సంవత్సరాల సుదీర్ఘ అనుభవం వుంది. ప్రజల, కేడర్ల రాజకీయ చైతన్యం పెంచడంలో పత్రికల బాధ్యత ముఖ్యమైనది. కానీ పోరాటరంగంలోని మన పార్టీ సభ్యులకు, గెరిల్లా బలగాలకే సకాలంలో పత్రిక అందకపోవడం, పత్రికను ప్రజలకు అందించటం ఇప్పటికీ నామమాత్రంగానే వుండటం అన్నది ఒక ముఖ్య పరిమితికాగా, పాఠకుల అభిప్రాయాలు సేకరించి పత్రికా సంపాదక బృందానికి పంపే పద్ధతి అమలు జరగటం చాలా తక్కువ. పోరాట ప్రాంతాల నుంచి రిపోర్టులు రావటంతప్ప పత్రికకు, పాఠకులకి మధ్య సజీవ సంబంధం కొనసాగటం లేదు. అరుదుగానైనా పత్రికకు ఒకటో అరో వుత్తరాలు, అభిప్రాయాలు అందుతున్నా, అవి సరిపోవు. పత్రికకూ పాఠకులకు ఏదైతే ప్రాణ సదృశంగా వుంటుందో, అలాంటి సజీవ సంబంధం మనకు తగినంతగా లేదు. పోరాటవార్తలు, ఉద్యమ రిపోర్టులు, సమీక్షలను అందించటం వరకే పార్టీ వివిధ స్థాయి కమిటీలకు పత్రికతో సంబంధం అంతో ఇంతో వుంటున్నది కాని, వున్నత కమిటీయే కాక వివిధ స్థాయి కమిటీలు, సాధారణ సభ్యులు, పాఠకులు సైతం క్రమంతప్పకుండా పత్రికకు అభిప్రాయాలు పంపాల్సిన అవసరాన్ని తగుమేరకు ఇప్పటికీ పట్టించుకోవటం లేదు.

అందుకే పత్రిక సమిష్టి ఆర్గనైజర్‌గా బాధ్యతను ప్రస్తుత పరిస్థితుల్లో సరిగా నిర్వర్తించాలంటే వివిధ స్థాయి పాఠక కామ్రేడ్స్ తప్పనిసరిగా కింది అంశాలను పట్టించుకోవాలని క్రాంతి విజ్ఞప్తి చేస్తోంది.

- క్రాంతిలో వెలువడుతున్న వ్యాసాలు, నివేదికలు, విషయమై దిద్దుకోవలసిన అంశాలపై పార్టీకి చెందిన అన్ని యూనిట్లు తమ అభిప్రాయాలను తప్పనిసరిగా పంపాలి.
- పత్రికను మరింత మెరుగుపర్చటానికి సంబంధించిన నిర్మాణాత్మకమైన విమర్శలు, సలహాలు, సూచనలను క్రాంతి పాఠకులు క్రమం తప్పకుండా క్రాంతి ఎడిటోరియల్ బోర్డు (కె.ఇ.బి)కి అందించాలి.
- ఫీల్డులోని కామ్రేడ్స్ అక్కడ మారుతున్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు కమిటీ అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించేలా విశ్లేషణాత్మక వ్యాసాలు, రిపోర్టులు, వ్యాఖ్యానాలు క్రాంతికి పంపించాలి. వివిధ ప్రాంతాల పాఠకులకు లోతైన విద్య గరపడానికి ఇదితప్ప వేరు మార్గం లేదు.
- పాఠకుల అభిప్రాయాలు సేకరించి పత్రికా సంపాదక బృందానికి చేరవేయటంపై వివిధ స్థాయి కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని సీరియస్‌గా పట్టించుకోవాలి.
- పత్రికపై సరైన అభిప్రాయాలు రాకపోతే భాష శైలి రచనల పరిధి మొదలైన అంశాలు మెరుగుదల పొందక పత్రిక ''మూసపోత పద్ధతి'కి మారిపోయే ప్రమాదముంది.
- విషయ సమగ్రతతో కూడిన రిపోర్టులను అన్ని ప్రాంతాల నుండి క్రమం తప్పకుండా పంపాలి.
- స్థానిక రాజకీయ, ఆర్థిక, వుద్యమ పరిస్థితులను సరిగా ప్రతిబింబించేలా రిపోర్టులు రాసే పద్ధతిని మెరుగుపర్చుకోవాలి.
- పత్రికను రాజకీయంగా వుద్యమావసరాలకు అనుగుణంగా వుపయోగించు కోవాలంటే ఆయా రీజియన్లలోని వుద్యమాభివృద్ధిని, ఆటుపోట్లను నిర్దిష్టంగా, సమగ్రంగా రాయటంలో మరింత పరిణతి సాధించాల్సి వుంది.
- క్రాంతిలో వస్తున్న రాజకీయ, ఆర్థిక, సిద్ధాంత వ్యాసాలు, రాజకీయ వాదోపవాదాలు, ఇంటర్వ్యూలు తదితర రచనలు ఏ మేరకు అర్థం అవుతున్నాయి, ఏ మేరకు అర్థం కాలేదు? ఏవి సంక్లిష్టంగా వుంటున్నాయి. ఏవి సరళంగా వుంటున్నాయి? భాష, వాక్య నిర్మాణం, పద ప్రయోగాలు, విషయ వ్యక్తీకరణ, అనువాదాల్లో తెలుగుదనం వంటి అంశాలలో దేన్ని ఏమేరకు మెరుగు పర్చుకోవాల్సి వుందో కూలంకషంగా పాఠకుల నుంచి అభిప్రాయాలు రావాలి.
- అన్నిటికంటే ముఖ్యంగా-పత్రిక వ్యాసాలపై రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఒక ఎజెండా అంశంగా పెట్టుకోవాలని, ఆర్.సి, డి.సి.లు పత్రికా వ్యాసాలు, రిపోర్టులపై ఎజెండాలో ఒక అంశంగా పెట్టుకుని చర్చించాలని, పత్రికపై పార్టీ సభ్యుల అభిప్రాయాలను, డి.సి, ఆర్.సి. అభిప్రాయాలను పంపించాలని 1995లో రాష్ట్ర, పి.ఓ.ర్‌లో సమీక్షించుకున్న అంశాలు ఇకనైనా అమలుకావాలి. వీటిని సీరియస్‌గా తీసుకుని మన కమిటీలు పనిచేస్తేతప్ప పత్రిక ప్రజాపంథాలో నడవటం

సాధ్యంకాదు.

## ఏరియా పోరాట వార్తల రిపోర్టింగ్ పై కొన్ని సూచనలు

పత్రిక రూపకల్పనలో మెరుగుదలకి సంబంధించి పత్రికా సిబ్బంది వైఖరి, అవగాహనకే కాక పాఠకుల-కేడర్లు, కమిటీలు-కు కూడా ఎంతో ప్రాధాన్యత వుంది. ముఖ్యంగా ఏరియా పోరాటాల రిపోర్టులను పంపుతున్నపుడు కేడర్లు, కమిటీలు క్రింది సూచనలను తప్పక పాటించాలి. రిపోర్టులు పత్రికలలో సరిగా ప్రచురించటం కోసం ఈ వివరాలను అందరూ తప్పనిసరిగా యివ్వాలని కోరుతున్నాం. అలాగే రిపోర్టులు కూడా రచనలో భాగమే కాబట్టి రిపోర్టులు పంపుతున్నపుడు కొన్ని అవగాహనాపరమైన కీలకాంశాలను కూడా దృష్టిలో వుంచుకోవాలి.

1. మీరు పంపే ప్రతి రిపోర్టుపై జిల్లా, గ్రామం తేదీ తప్పక రాయండి
2. దళం ఏరియా పేరు పొడి అక్షరాలలోకాక పూర్తి పేరు రాయాలి.
3. దళం ఏరియా రిపోర్టులో ఆ జిల్లా పేరు కూడా తప్పనిసరిగా రాయాలి.
4. ఏరియా రిపోర్టుల్లో, తేదీ, నెల మాత్రమేగాక సంవత్సరం కూడా తప్పకుండా రాయాలి.
5. ఒక దళం అనేక రిపోర్టులు పంపేటపుడు, ప్రతి రిపోర్టు మీదా పై వివరాలు రాయాలి.
6. మనం పోరాడిన భూస్వాముల పేర్లు రిపోర్టుల్లో తప్పనిసరిగా సూచించాలి.
7. పోరాటాల రిపోర్టులు సకాలంలో అందించాలి.
8. పోరాటాల రిపోర్టులను, వాటి ఫోటోలను ఒకేసారి పంపాలి. ఫోటోలు ముందు, రిపోర్టు తర్వాత వస్తే ప్రచురణలో సమగ్రత లోపిస్తుంది.
9. ఏరియా పోరాటాలకు సంబంధించి, వివిధ క్యాంపుల సందర్భంగా తీస్తున్న ప్రతి ఫోటోని ఒక సెట్‌గా క్రాంతికి తప్పక పంపించాలి. ఉద్యమానికి, మిలటరీ శిక్షణ, వ్యవహారాలకి సంబంధించి పలురకాల ఫోటోలు క్రాంతికి పెద్దగా అందటం లేదు.
10. కాన్ఫరెన్సులు, పి.జి.ఏ డే, జూలై 28 వంటి ప్రత్యేక సందర్భాలలో వాడేందుకుగాను క్రాంతికి ఫోటోలు చాలా అవసరం. జిల్లా, రీజియన్, రాష్ట్రస్థాయి కార్యక్రమాల, కాన్ఫరెన్సుల ఫోటోలు క్రాంతికి తప్పనిసరిగా పంపాలి.
11. ప్రతిఫోటో వెనుక పోరాటం తారీఖు, సం॥రం వంటి వివరాలు తప్పనిసరిగా పంపాలి. మిలటరీ శిక్షణ ఫోటోలయితే ఆ క్యాంపు సందర్భాన్ని రాయాలి. అమరుల ఫోటోలయితే ఆ సంఘటన, తేదీ, సం॥రం, వారి స్థాయి వంటి వివరాలు వెనుకవైపు రాసి పంపాలి. ఫైల్ ఫోటో అయితే వారి పేర్లు, స్థాయి, జిల్లా దళం వగైరా వివరాలు రాసి పంపాలి.
12. ఒక్కమాటలో చెప్పాలంటే వుద్యమాచరణ క్రమంలో మిలటరీ శిక్షణ క్రమంలో తీస్తున్న, దళాలు, డి.సి, డివిసిల వద్ద వుంటున్న ప్రతి ఫోటోని ఒక 'సెట్'గా తప్పనిసరిగా క్రాంతి కోసం తీసి పంపడం, దాన్ని కమిటీలు తమ బాధ్యతగా చూడటం అవసరం.
13. రిపోర్టును కేవలం రిపోర్టుగా కాక వ్యాసం రూపంలో కూడా రాసి పంపాలి. ఒక జిల్లాలో, డివిజన్‌లో, రీజియన్‌లో జరుగుతున్న పోరాటాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ విధానంలో నిర్బంధంలో మార్పులు వంటి అన్ని విషయాలను వ్యాసం రూపంలోనూ వ్యాఖ్యానించొచ్చు.
14. కొన్ని ప్రత్యేక అంశాలపై రిపోర్టును సాదా శైలిలోకాక వర్ణనాత్మకంగా కూడా రాయొచ్చు. ఉదా॥ మహిళలకు భూమి పట్టాలివ్వడం, బాలగెరిల్లాలు, అమరుల కుటుంబాలతో భేటీ వంటి విశిష్ట అంశాలను కథకథన పద్ధతిలో కూడా రాసి పంపొచ్చు. ఉదా॥కు గత రెండేళ్ల క్రాంతులు చూడండి.
15. ఏరియాలలో తీస్తున్న ప్రతి కరపత్రాన్ని, పంపుతున్న ప్రతి పత్రికా ప్రకటనని పత్రిక కోసం పంపాలి. సమాచార సేకరణలో ఇవీ ఓ భాగం. కీలకాంశాలపై ప్రకటనలు పత్రికలో రికార్డు కావాల్సిన అసరముంది.
16. అమరుల జీవిత చరిత్రల రిపోర్టులు పంపడంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. అమరులలో దాదాపు సగం మందికిపైగా జీవిత వివరాలు ప్రచురణ కావటం లేదు. ఉదా॥ సిటీలో కా॥రామేశ్వర్ తర్వాత ఇద్దరు సిటీకమిటీ కార్యదర్శులు స్వల్పకాలంలో అమరులయినారు. కాని వారి జీవిత వివరాలు క్రాంతికి ఈనాటికీ అందలేదు. అమరుల చరిత్ర పత్రికలో నమోదు కావలసిన అవసరం ఎంతైనా వుంది.
17. అమరుల రిపోర్టింగ్‌కి సంబంధించి వారి వ్యక్తిగత, ఉద్యమ జీవిత చరిత్ర వివరాలను వరుస క్రమంలో రాయటం అవసరం. అమరుల జీవిత వివరాల రిపోర్టును అరకొరగా కాక సమగ్రంగా రాయాలి.
18. శత్రువు దళాలకు దళాలనే దెబ్బ తీసినపుడు, ఇంత ప్రాధాన్యత కల్గిన సంఘటనపై కూడా రిపోర్టు కొన్ని సందర్భాలలో రావటం లేదు. వచ్చినా అది సకాలంలో చేరని సందర్భాలే ఎక్కువ. అమరుల జీవిత వివరాలలో ఆ ఎన్‌కౌంటర్ వివరాలు కూడా క్లుప్తంగా వర్ణించాలి.
19. ప్రభుత్వ పథకాల తీరుతెన్నులు ఏరియాలలో ఎలా అమలవు తున్నాయో నిర్దిష్టంగా రాసి పంపాలి. ఉదా॥ దక్షిణ తెలంగాణాలో కొన్నిచోట్ల శత్రువు అమలు చేసిన 'త్రీటెంట్ విధానం' తీరుతెన్ను ఇంతవరకూ క్రాంతికి అందలేదు. క్రాంతికున్న పరిమిత వనరుల (సోర్సెస్) రీత్యా ఇలాంటి సమాచారం ఏరియాల నుంచే రావాలి. అట్లే మైత్రి సంఘాలు వంటివి.
20. నిర్బంధ పరిస్థితులు, చెకింగుల రీత్యానే కాక ఒకచోట నుండి మరోచోటకు ఉద్యమ సమాచారం (పార్టీ ఆధ్వర్యంలోనే) పంపిణీ అవుతున్న క్రమంలో కూడా పలు కారణాలతో సమాచారం తప్పిపోవటం, ఏదో ఒకచోట 'డంప్' అయిపోవటం జరుగుతోంది. అందుకని క్రాంతికి పంపే ఏ సమాచారాన్ని అయినా మరోసెట్ చేసి ఆయా చోట్ల భద్రపర్చటం అవసరం.
21. ఊర్లు, గ్రామాలు, వ్యక్తుల పేర్లను రిపోర్టు తయారీ సమయంలో స్పష్టంగా అర్థమయ్యేలా రాయడంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి. లేక, తుదిప్రతిని-ఫైనల్ కాపీ-సాపు చేయిస్తున్న సమయంలో రాసే వారికి ఈ విషయమై ప్రతిసారీ సూచనలు ఇవ్వాలి.
22. వివిధ పోరాటాల్లో మహిళల సంఖ్యను నిర్దిష్టంగా పేర్కొనాలి. ఉదా॥ విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో మహిళలు 'ఫలానా' గ్రామంలో కూలీరేటును పెంచుకున్నారు; అమరుల సంస్మరణలో 3000 మంది స్త్రీ పురుషులు పాల్గొన్నారు; ఫలానా ఊరేగింపులో,

2000 మంది ప్రజలు పాల్గొన్నారు. – ఈ విధమైన రిపోర్టులు అనిర్దిష్టమైనవి. మహిళల సంఖ్య ఎంత? ఒకరా, ఇద్దరా, పదిమందా, 50మందా అని సంఖ్యను నిర్దిష్టంగా రాయటం ద్వారానే ఏ పోరాటంలో అయినా మహిళల భాగస్వామ్యాన్ని నమోదు చేయగలం. సభలు, సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బంద్‌లలో ఎంత మంది స్త్రీలు హాజరైనారో, నిర్దిష్టంగా పేర్కొనాలి. పోరాట కమిటీలలో ఒకే ఒక్క మహిళ వున్నా ఆ వివరం నిర్దిష్టంగా పేర్కొనాలి. ఏ చిన్న, పెద్ద పోరాటంలో అయినా మహిళల ఉనికి, గుర్తింపుని ఏరియా రిపోర్టులు కూడా గుర్తించాల్సిన అవసరముంది.

చివరగా క్రాంతి పత్రికలోని వారికి దళ ఏరియాల మండలాలకు సంబంధించిన అన్ని వివరాలు పత్రిక తయారీ సమయంలో గుర్తుండటం చాలా కష్టమన్న విషయం, ఆయా ఏరియాలకు సంబంధించిన పరిజ్ఞానం తగుమాత్రంగా లేనివారు కూడా పత్రిక పనిలో వుంటారన్న విషయం దళాల స్థాయిలో అర్థమైతేతప్ప, ఏరియా రిపోర్టులు సమగ్రంగా రావటం కష్టం. ఆయా కమిటీలు ఈ సమస్యను ఎంత సీరియస్‌గా పట్టించుకుంటే అంత త్వరగా ఈ సమస్య పరిష్కారమౌతుంది.

క్రాంతి రాష్ట్ర విప్లవోద్యమ పత్రిక. ఇది రాష్ట్రకమిటీ అధికార పత్రిక, పైగా యిది పార్టీ సభ్యుల, పార్టీ వెన్నంటి నడుస్తున్న ప్రజల పత్రిక. పత్రిక బాగోగుల పరిశీలన పత్రిక పాఠకులదే. 'ప్రజల నుండి-ప్రజల వద్దకు' అనే ప్రజాపంథాలో క్రాంతి నడవాలంటే పార్టీకి చెందిన అన్ని యూనిట్లు, సభ్యులూ సానుభూతిపరులూ, ప్రజలూ పత్రికపై తమ అభిప్రాయాలను తప్పనిసరిగా పంపించాలి. 'ఎద్దుల దోవ ఎద్దులది, బండిదోవ బండిది' అనే తీరు ప్రజాపంథాకి భిన్నమైంది. అందుకే ఇటీవలే జరిగిన రాష్ట్రకమిటీ సమావేశం కూడా క్రాంతి 25వ వార్షికోత్సవ సందర్భంగా జరపాల్సిన కార్యక్రమాల గురించి ఒక తీర్మానం చేసింది. క్రాంతిని పథకం ప్రకారం మరింత విస్తృతంగా విప్లవ ప్రజానీకంలోకి తీసుకుపోవాలని, క్రాంతి అమ్మకాల్ని, చందాదారుల్ని పెంచాలని, విప్లవ సాహిత్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని, మన పార్టీకి చెందిన అన్ని యూనిట్లు 'క్రాంతి'పైనా, విప్లవ సాహిత్యంపైనా సభ్యుల నుండి, ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి పైకమిటీలకు పంపాలని రాష్ట్రకమిటీ తన శ్రేణులకు కార్యక్రమాల నిచ్చింది. ఈ సందర్భంగానే 2002 సం॥రం ఏప్రిల్ 22 నుండి మే 22 వరకు నెల రోజులపాటు పార్టీకి చెందిన అన్నియూనిట్లు క్రాంతి 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించాలని రాష్ట్రకమిటీ పిలుపిచ్చింది. పార్టీ శ్రేణులూ, పాఠకులు క్రాంతి వార్షికోత్సవ కార్యక్రమాల మాసంలోనే కాక ఆ తరువాత కూడా క్రాంతితో సజీవసంబంధాన్ని పలురూపాలలో కొనసాగిస్తారని, క్రాంతి ప్రజాపంథాకి అనుగుణంగా నడవటంలో తమవంతు ప్రోత్సాహ, సహకారాలను క్రమం తప్పకుండా అందిస్తారని 'క్రాంతి' ఆశిస్తోంది. ❑

---

(15వ పేజీ తరువాయి...)

వహిస్తున్న కమ్యూనిస్టు విప్లవకారులను, మన దేశంలో సి.పి.ఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] లను ఎం.సి.సి.కి చెందిన విప్లవకారులను ఉగ్రవాదులుగా చిత్రిస్తూ ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు. కాశ్మీర్ జాతి విముక్తి పోరాటాన్ని; అస్సాం, నాగా, మణిపూర్, బోడో తదితర ఈశాన్య రాష్ట్రాల జాతుల పోరాటాలను ఉగ్రవాద ఉద్యమాలంటూ అత్యంత పాశవికంగా అణచివేస్తున్నారు. 'ఉగ్రవాదాని'కి మూలం రాజకీయార్థిక సామాజిక పరిస్థితుల్లోనే వుంది. ప్రజల, జాతుల ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేయడం వల్లనే 'ఉగ్రవాదం' అనే రూపం తీసుకుంటుంది. రాజకీయార్థిక సామాజిక పరిస్థితుల్లో మౌలికమైన మార్పు తీసుకరాకుండా; పీడిత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను పరిపూర్తి చేయకుండా 'ఉగ్రవాదం' సమసిపోదు. 'ఉగ్రవాదం'గా చెప్పబడుతున్న ఉద్యమాలు ఉగ్రవాదులుగా వర్ణించబడే శక్తులు వాస్తవానికి సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ పాలకవర్గ వ్యతిరేక ఉద్యమాలే శక్తులే! సామ్రాజ్యవాద దోపిడీ పీడన అణచివేతలకు వ్యతిరేకంగా తలెత్తినదే ఈ 'ఉగ్రవాదం'.

నేడు ప్రపంచ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్య వ్యక్తులు పాల్పడే 'ఉగ్రవాదం' కాదు. అసలు సమస్య రాజ్యహింస, రాజ్యం పాల్పడుతున్న ఉగ్రవాదాలే! నేడు ప్రపంచ ప్రజల ప్రధాన శతృవు, నంబర్‌వన్ శతృవు, అతిపెద్ద ఉగ్రవాది అమెరికన్ సామ్రాజ్యవాదమే!

ప్రపంచీకరణకు కేంద్రంగా నిలుస్తున్న ప్రపంచ వాణిజ్య కేంద్రం కుప్పకూలడం; అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్యానికి ప్రతీకగా నిలుస్తున్న పెంటగన్ ధ్వంసం కావడం అమెరికన్ సామ్రాజ్యవాదానికి తగిలిన పెద్ద దెబ్బ కనుకనే ఈ దాడులు ప్రపంచ దేశాల్లో ఆనందోత్సాహాలను కలిగించాయి. సైనికంగా, ఆర్థికంగా శక్తి సంపన్నమైనదిగానూ, అజేయమైనదిగానూ కనబడుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదం కాగితపు పులేనని రుజువు చేస్తూ దాన్ని దెబ్బ తీయగలమనే విశ్వాసాన్ని ఈ దాడులు ప్రజల్లో కలిగించాయి.

(గణపతి)

సెక్రటరీ,

భారత కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు-లెనినిస్టు)[పీపుల్స్‌వార్]

---

**"రాసిన ప్రతిసారి, మాట్లాడిన ప్రతిసారి, పార్టీ శ్రేణులను దృష్టిలో పెట్టుకోండి. వాళ్ళు నిన్ను అర్థం చేసుకోవాలి. నీ పిలుపును విశ్వసించాలి. నిన్ను అనుసరించడానికి సిద్ధపడాలి. నువ్వు ఎవరి కోసమైతే రాస్తున్నావో, ఎవరికోసమైతే మాట్లాడుతున్నావో, వారిని ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకోవాలి." "మనం ప్రజలకు అర్థమయ్యే భాషలో మాట్లాడటం నేర్చుకోకపోతే ప్రజలు మన నిర్ణయాలను జీర్ణం చేసుకోలేరు."**

**- జార్జి డిమిట్రొవ్**

**"అన్నిరకాల విషయాలపై అత్యంత శ్రద్ధ వహించండి; ఎక్కువగా గమనించండి; కొంచెమే గమనించివుంటే రాయకండి." "చెప్పవలసిందేమీ లేనపుడు బలవంతంగా రాయకు" . "రాసిన తర్వాత దాన్ని కనీసం రెండుమార్లు చదివి పనికిరాని పదాలను, వాక్యాలను పేరాలను ఏమాత్రం దిగులు పడకుండా కొట్టివేయాలి. నవలకు సరిపడే విషయాన్ని స్కెచ్ స్థాయికి తగ్గించుకోండిగాని, ఎప్పుడుకూడా స్కెచ్‌కి సరిపోయే విషయాన్ని నవలగా అల్లకండి." "నీకుతప్ప మరెవ్వరికీ అర్థంకాని విశేషణాలను (అబ్జెక్టివ్స్) ఇతర పదాలను సృష్టించకు."**

**- లూసన్**

# పాఠకులకు విజ్ఞప్తి

'క్రాంతి' 25వ సం॥రంలోకి అడుగుపెట్టింది. ఒక మామూలు పత్రిక పాతికేళ్లు కొనసాగటం గొప్పేమీ కాకపోవచ్చు. విప్లవోద్యమానికి చిత్రిక పట్టే ఒక పత్రిక నిర్బంధ నిషేధాల పాలవుతూ కూడా పాతికేళ్లుగా కొనసాగుతుండటం మాత్రం ఏరకంగా చూసినా విశేషంగానే చెప్పాలి. రాష్ట్ర విప్లవోద్యమ సాధికారిక పత్రికగా క్రాంతి ఆ ఉద్యమంలోని ఆటుపోట్లకు తానూ గురైంది. దృఢంగా నిలబడింది కూడా. పార్టీ చరిత్రలో రెండు కీలక సంక్షోభ సమయాల్లో కాని, 1985లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన అప్రకటిత యుద్ధం నుండి కొనసాగుతున్న తీవ్ర నిర్బంధాల క్రమంలో కాని క్రాంతి దెబ్బతినకపోగా అవిచ్ఛిన్నంగా కొనసాగింది. చివరకు బెంగుళూరు కోవర్ట్ చర్యలో కేంద్రకమిటీ సభ్యులతోపాటు రాష్ట్రకమిటీ కార్యదర్శి అమరుడై పోయిన పిడుగుపాటు క్షణాల్లో కూడా క్రాంతి, దాని విభాగాలు చెక్కుచెదరకుండా కొనసాగడమేగాక పత్రికను యధావిధిగా వెనువెంటనే తేగలిగాయి. విప్లవోద్యమ వాణిగా వున్న ఈ కీలక విభాగాన్ని జాడపట్టి నలిపేయాలని, శత్రువు గత రెండున్నర దశాబ్దాలుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఒకరో, ఇద్దరో, వ్యక్తులను అరెస్టు చేయటం, ఒకే ఒక్క విభాగాన్ని గతంలో పట్టుకుని మూసివేయడం చేసారేతప్ప 'క్రాంతి' యంత్రాంగపు జాడ కూడా కనుక్కోలేకపోయాడు. మన రహస్య యంత్రాంగం సాధించిన ఘన విజయాలలో ఇదీ ఒకటి.

ఈ నిరంతర కొనసాగింపు క్రమానికి పాతికేళ్లు అయిన సందర్భంగా 'క్రాంతి' మరోసారి తన లక్ష్యాలు, కర్తవ్యాల గురించి అంతర్మథనం చేసుకుంటూ తన పాఠకులకు విజ్ఞప్తి రూపంలో ముందుకొస్తోంది. లక్ష్యంలేని పత్రికలు ఏవీ వుండవు. లక్ష్యంలేని రచనలు అంతకన్నా వుండవు. దోపిడీని నిలిపి వుంచాలన్నది వ్యవస్థానుకూల పత్రికల అంతిమలక్ష్యం. దోపిడీ వ్యవస్థను తొలగించాలన్నది వ్యవస్థా వ్యతిరేక పత్రికల లక్ష్యం. క్రాంతి రెండో కోవకు చెందిన పత్రిక. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించటం, నూతన ప్రజాస్వామిక వ్యవస్థకోసం జరిగే పోరాటాన్ని బలపర్చటమే క్రాంతి ప్రధాన లక్ష్యం. ఇది పార్టీపంథా, విధానాలు, కార్యక్రమాలను ప్రతిబింబించే పత్రిక. ఈ ప్రాతిపదికతోనే క్రాంతి అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులను, పరిణామాలను, సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశాధికార బూర్జువాలకు మధ్య దోపిడీ బంధాన్ని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విశ్లేషిస్తూ, విమర్శిస్తూ వస్తోంది. దేశంలోనూ ప్రపంచవ్యాప్తంగానూ జరుగుతున్న జాతుల పోరాటాలకు సంఘీభావం ప్రకటిస్తూ ఆ పోరాటాలను పరిచయం చేస్తోంది. రాష్ట్రంలో విప్లవోద్యమ తీరుతెన్నులను ప్రజాపోరాటాలను నమోదు చేయటంలో భాగంగా ఆయా పోరాటరంగాల రిపోర్టులను క్రమంతప్ప కూడా అందినమేరకు క్రాంతి ప్రచురిస్తూ వస్తోంది. విప్లవ సిద్ధాంత రాజకీయ బోధన, ప్రచారాలు వేదికగా పీడిత ప్రజా పోరాటాల వాణిగా పార్టీ చేతిలోని ఒక శక్తివంతమైన ఆయుధంగా క్రాంతి' గడచిన 25 సం॥లుగా గురుతరమైన పాత్ర పోషిస్తూ వస్తోంది.

విప్లవోద్యమ పురోగమన క్రమంలో చట్టబద్ధ, చట్ట వ్యతిరేక పని పరిస్థితుల నిర్బంధ వాతావరణంలో క్రాంతి పక్షపత్రిక నుండి, మాసపత్రికగా మాసపత్రిక నుండి రెండునెలల పత్రికగా కొన్ని తప్పనిసరి అనివార్యతలకు గురైంది. అదే సమయంలో నిర్బంధాలు, సంక్షోభాల ఆటుపోట్లలో క్రాంతి సొంత శక్తులను అవిచ్ఛిన్నంగా నిలుపుకోలేకపోయింది. పైగా రాష్ట్ర విప్లవోద్యమ చరిత్రలో ఏ పత్రిక మీదా లేనంత తీవ్ర నిర్బంధానికి క్రాంతి గత పదిహేను సంవత్సరాలుగా గురవుతూ వస్తున్నందువల్ల పత్రిక నిర్వహణలో తయారీలో, పంపిణీలో పరిమితులు ఏర్పడ్డాయి. గత పదేళ్ల నుంచి శత్రువు మన పార్టీని నిషేధించటం వల్ల క్రాంతి అక్షరాలా రహస్య పత్రికే అయింది. 1985లో ఎన్టీఆర్ ప్రభుత్వం విప్లవోద్యమంపై అప్రకటిత నిషేధం ప్రకటించేంత వరకు రాష్ట్రం నలుమూలలకూ, పోస్టు ద్వారా క్రాంతి అచ్చయిన మరుక్షణం శరవేగంగా బట్వాడా అయిన చరిత్రను, క్రాంతిని బహిరంగంగా షాపుల్లో పెట్టి అమ్మిన చరిత్రను ఈ సందర్భంగా అందరం గుర్తుంచుకోవాలి. విప్లవోద్యమం పురోగమించటం ద్వారా భౌతిక పరిస్థితులు అనుకూలంగా మారితే అది పత్రిక నిర్వహణలో మౌలికంగా మంచి మార్పులు తీసుకొస్తుంది. ఇవి క్రాంతి నిర్వహణను మొత్తంగా ప్రభావితం చేస్తూ వస్తున్న బాహ్య పరిస్థితులు.

ఇక అంతర్గతంగా, క్రాంతి సొంత శక్తుల విషయానికొస్తే అది అంతర్మథనం చేసుకోవాల్సిన అంశాలు చాలానే వున్నాయి. ఇవి క్రాంతికీ - పాఠకులకీ, మధ్య ప్రజాపంథాని నిగ్గుదేల్చే అంశాలు. ఈ విషయానికి సంబంధించినంత వరకు, నూటికి నూరుపాళ్లు తాను సవ్యంగానే వున్నాననే స్వోత్కర్షకు, అతిశయానికి 'క్రాంతి' ఎన్నడూ గురికాలేదు. గురికాదు కూడా. 'ప్రజలకు, లేదా పాఠకులకు నేర్పాలంటే వార్తా పత్రిక సిబ్బంది ముందుగా తాము ప్రజల నుండి నేర్చుకోవాలి' అనే మావో సూక్తి క్రాంతికి ఎప్పటికీ మార్గదర్శకమే. వ్యాసాలను నిర్దిష్టంగానూ, స్పష్టంగానూ జీవం వుట్టిపడే విధంగానూ రాయటం, రాయటానికి ప్రయత్నించటం 'క్రాంతి' కర్తవ్యం, బాధ్యత కూడా. ఈ విషయంలో, మూడో ఇంటర్నేషనల్ తరఫున కా॥డిమిత్రొవ్ కాని, పలు సందర్భాల్లో కా॥మావో కాని ప్రతికా రచన, శైలి, వస్తువుకి సంబంధించి పేర్కొన్న పలు అంశాలను, సూచనలను క్రాంతి పూరించుకోవాల్సిందీ, పట్టించుకుని మెరుగుపర్చుకోవాల్సిందీ చాలానే వుంది. పత్రికను సాపు చేయటంలో, నిర్దిష్ట కాల వ్యవధిలో, (అంటే రెండు నెలల కొకసారైనా) రచనలు పూర్తి చేసి ప్రచురించటంలో జరుగుతున్న లోపాలకు, ఒక సుదీర్ఘమైన, తీవ్రమైన నిర్బంధపు అడ్డంకులనే సాకులుగా చూపించి తప్పుకునే యోచన క్రాంతికి లేదు. స్పష్టంగానే తన లోపాలపట్ల, సవరించుకోవాల్సిన, మెరుగు పర్చుకోవాల్సిన అంశాల పట్ల తనదైన అంతర్మథనం క్రాంతికి వుంది. నిర్దిష్టత, స్పష్టత, సజీవతలను రచనలలో, పాటించటం, అర్థవంతమైన సులువైన రచనా శైలిని పెంపొందించుకోవటం, రాతలో ప్రజాపంథాను అమలుపర్చడం వంటి పలు అంశాలలో దొర్లుతున్న లోపాలను క్రాంతి గుర్తించటమేగాక, ఆ లోపాలను చిత్తశుద్ధితో సవరించుకోవాలని భావిస్తోంది.

గత కొన్నేళ్లుగా క్రాంతికి పాఠకుల నుంచి వస్తున్న వుత్తరాలు రాసిలో చాలా తక్కువే అయినా, పత్రిక లోపాలను గుర్తింపజేయటంలో ప్రోత్సాహాన్ని, ప్రేరణను అందించి సూచనలు చేయటంలో ఆ వుత్తరాలు ఓ మేరకు మంచి పాత్ర నిర్వహిస్తున్నాయి. పైగా రాత రూపంలో కంటే, వివిధ క్యాంపుల సందర్భంగా క్రాంతికి, పాఠక కామ్రేడ్స్‌కి మధ్య సంబంధమేర్పడిన సమయాల్లో, పలువురు కామ్రేడ్స్ మౌఖికంగా విలువైన అభిప్రాయాలను

(తరువాయి 41వ పేజీలో...)